

'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 76

శుక్రవారం 1-12-2023



సిరీస్ వేటలో బౌలర్లపై భారం

నేడు భారత్, ఆస్ట్రేలియా మధ్య నాలుగో టీ20 మ్యాచ్ - 13లో



టాటా టెక్.. సూపర్ హిట్

ఈ ఏడాది లిస్టింగ్ రోజే అత్యధిక లాభాలు పంచిన షేరుగా రికార్డు -13లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



హెన్రీ కిసింజర్ కన్నుమూత

అమెరికా విదేశాంగ శాఖ మాజీ మంత్రి, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత హెన్రీ కిసింజర్ అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు.

వివరాలు 6లో ▸



'రక్షణ' ప్రాజెక్టులకు ఆమోదం

రూ.2.23 లక్షల కోట్ల విలువైన రక్షణ సంబంధిత కొనుగోలు ప్రాజెక్టులకు డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

వివరాలు 6లో ▸



గుజరాత్‌లో ఘోర ప్రమాదం

గుజరాత్‌లోని సూరత్‌లో ఓ రసాయనాల ఫ్యాక్టరీలో పేలుడు. ఘోర అగ్ని ప్రమాదం వల్ల ఏడుగురు సజీవ దహనమయ్యారు.

వివరాలు 6లో ▸



రేపు అఖిలపక్ష భేటీ

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు మొదలుకానున్న నేపథ్యంలో కేంద్రం ఈ నెల 2వ తేదీన అఖిలపక్ష భేటీ ఏర్పాటు చేసింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

ఉద్యోగులకు కలిసొచ్చిన సెలవులు



ఉద్యోగులకు వచ్చే ఏడాది పండుగలు, పర్వదినాల సెలవులు కలిసొచ్చాయి. 2024కు రాష్ట్ర ప్రభుత్వం 20 సాధారణ సెలవులను ప్రకటించగా.. అందులో 11 సెలవులు వారాంతం లేదా వారం ప్రారంభంలోనే వచ్చాయి.

వివరాలు 3లో ▸

ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు



ఇంటర్ మొదటి, రెండో ఏడాది జనరల్, ఒకేషనల్ పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువును ఇంటర్మీడియట్ విద్యా మండలి పొడిగించింది. ఆలస్య రుసుం లేకుండా ఫీజు చెల్లించేందుకు నవంబర్ 30తో గడువు ముగియగా.. దానిని మరో ఐదు రోజులు పొడిగిస్తూ ఉత్తర్వులిచ్చింది.

వివరాలు 10లో ▸

సొరంగాలు దాటిన కృష్ణా తరంగం

అవుకు టన్నెల్‌తో రాయలసీమ సస్యశ్యామలం

రెండో సొరంగాన్ని జాతికి అంకితం చేసిన సీఎం జగన్

- గోరుకల్లు నుంచి టన్నెల్ ద్వారా దిగువకు నీటి విడుదల
- పైలాన్‌ను ఆవిష్కరించి కృష్ణమ్మ ప్రవాహాన్ని సంతోషంతో తిలకించిన ముఖ్యమంత్రి
- తుది దశకు చేరుకున్న మూడో టన్నెల్ పనులు



అవుకు టన్నెళ్ల నుంచి ప్రవహిస్తున్న నీళ్లు

సాక్షి ప్రతినిధి, కర్నూలు: సొరంగాలు దాటుతూ.. సుడులు తిరుగుతూ పరవళ్లతో కృష్ణమ్మ 'సీమ'ను ముద్దాడిన సుందర ఘట్టం సాక్షాత్కారమైంది. పండితుల వేద మంత్రోచ్చారణల నడుమ గాలేరు–నగరిలో అంతర్భాగమైన అవుకు రెండో టన్నెల్‌ను గురువారం రోజు ఘనంగా ప్రారంభించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాతికి అంకితం చేశారు. ప్రస్తుత డిజైన్ మేరకు గాలేరు–నగరి వరద కాలువ ద్వారా 20 వేల క్యూసెక్కులను తరలించేందుకు మార్గం సుగమం చేశారు. ఈ సందర్భంగా కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ పాయలుగా చీలి రెండు టన్నెళ్ల ద్వారా దిగువకు వేగంగా ప్రవహిస్తున్న దృశ్యాన్ని సీఎం సంతోషంతో కొద్దిసేపు అలాగే చూస్తుండిపోయారు. ఈ నీటితో రాయలసీమ సస్యశ్యామలం కానుందనే

మిగతా 2వ పేజీలో ▶

ఇదో అదృష్టం

- కడప పెద్ద దర్గాలో సీఎం వైఎస్ జగన్ ప్రార్థనలు
- ప్రభుత్వ లాంఛనాలతో మజర్ల వద్ద పూల చాదర్ సమర్పణ..
- ప్రార్థనలు, ఫాతెహ నిర్వహించిన దర్గా పీఠాధిపతులు

2లో


కడప అమీన్‌పీర్ దర్గాలో ప్రార్థన చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

'సాగర్'లో సగం ఏపీ స్వాధీనం..

హెడ్‌రెగ్యులేటర్ సహా 13 గేట్లు రాష్ట్ర ఆధీనంలోకి..

కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కుల పరిరక్షణలో సీఎం కీలక నిర్ణయం

- శ్రీశైలంలో 30 టీఎంసీలను అక్టోబరు 6న రాష్ట్రానికి కేటాయించిన కృష్ణా బోర్డు
- అందులో 15 టీఎంసీలను ఎడమ గట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ సాగర్‌కు తరలించిన తెలంగాణ
- వాటిని విడుదల చేయాలన్న ఏపీ విజ్ఞప్తిని తోసిపుచ్చిన తెలంగాణ
- ఇదే అంశాన్ని సీఎం జగన్‌కు వివరించిన జలవనరుల శాఖ ఉన్నతాధికారులు
- రాష్ట్ర భూభాగంలోని సాగర్ స్పిల్ వే 13 గేట్లతోపాటు కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను స్వాధీనం చేసుకోవాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం
- రాష్ట్రానికి కేటాయించిన నీటిని విడుదల చేయాలని కూడా ఆదేశం
- దీంతో వాటిని తమ అధీనంలోకి తీసుకున్న రాష్ట్ర అధికారులు
- గుంటూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో తాగునీటి అవసరాల కోసం కుడి కాలువ ద్వారా 2,300 క్యూసెక్కులు విడుదల

10లో


సాగర్‌లో 13వ క్రస్ట్‌గేటు వరకు స్వాధీనం చేసుకొని కంచె ఏర్పాటు చేసిన ఏపీ పోలీసులు

- కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కుల పరిరక్షణలో చిత్తశుద్ధికి ఇది మరో తార్కాణమంటూ సాగునీటిరంగ నిపుణుల ప్రశంసలు
- విభజన చట్టంలో శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణ ఏపీకి, సాగర్ బాధ్యత తెలంగాణకు అప్పగించిన కేంద్రం
- తమ భూభాగంలో ఉందని శ్రీశైలం ఎడమ గట్టు కేంద్రాన్ని, సాగర్‌ను పూర్తిగా, పులిచింతల విద్యుదుత్పత్తి కేంద్రాన్ని అధీనంలోకి తీసుకున్న తెలంగాణ
- 2 కళ్ల సిద్ధాంతం, ఓటుకు కోట్లు కేసుతో అప్పట్లో చోద్యం చూసిన చంద్రబాబు

జేఈఈ మెయిన్ దరఖాస్తు గడువు పొడిగింపు



సాక్షి, అమరావతి: జేఈఈ మెయిన్ దరఖాస్తు గడువును నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పొడిగించింది. నవంబర్ 30తో గడువు ముగియగా డిసెంబర్ 4వ తేదీ రాత్రి 9 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం కల్పించింది. డిసెంబర్ 6 నుంచి 8 వరకు సవరణలు చేసుకోవచ్చు. ఏప్రిల్ సెషన్ పరీక్షకు ఫిబ్రవరి 2వ తేదీ నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ప్రారంభమవుతాయని సమాచారం.


అమలాపురం కోర్టుకు కాపు ఉద్యమ నేతలు


- ముద్రగడ సహా 30 మంది హాజరు
- గతంలోనే కేసులు ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో
- జీవోను పరిశీలించి కేసు కొట్టివేసినట్టు వెల్లడించిన కోర్టు

3లో

ఇదండీ సంగతి


ఏమో సార్ గుర్తులేదు! తొందరెందుకు రేపు మూడో తేదీన తెలుస్తుంది కదా!!





కాంగ్రెస్–2, బీజేపీ–2, హంగ్–1

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై ఎగ్జిట్‌పోల్స్ జోస్యం

6లో

పోలింగ్ 76.66 శాతం!

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ శాసనసభ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. అభ్యర్థుల భవితవ్యం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో (ఈవీఎం) నిక్షిప్తమైంది. గురువారం సాయంత్రం 5 గంటల సమయానికి రాష్ట్రవ్యాప్తంగా సుమారుగా 76.66 శాతం పోలింగ్ నమోదైందని కేంద్ర ఎన్నికల సంఘం అంచనా వేసింది. కచ్చితమైన గణాంకాలను ఆ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ శుక్రవారం ప్రకటిస్తారని ఆయన కార్యాలయం తెలిపింది. తెలంగాణ శాసనసభకు 2014లో జరిగిన ఎన్నికల్లో 69.5 శాతం, 2018 ఎన్నికల్లో 73.2 శాతం పోలింగ్ నమోదైంది. తాజా పోలింగ్‌లో కడపటి వార్తలు అందేసరికి 76.66 శాతంగా నమోదైంది. ఇది మరింత పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ నెల 3న (ఆదివారం) ఓట్ల లెక్కింపు నిర్వహించి, ఫలితాలను ప్రకటించనున్నారు.

అత్యధికంగా జనగామలో..

గురువారం సాయంత్రానికల్లా అత్యధికంగా.. మునుగోడు 91.51, ఆలేరు 90.16, భువనగిరి 89.9 శాతం పోలింగ్ నమోదైంది. అత్యల్పంగా యాకుత్‌పురలో 39.69 శాతం, మలక్‌పేట 41, నాంపల్లిలో 42.76, చార్మినార్‌లో 43.26 శాతం పోలింగ్ నమోదైంది.

జిల్లాల వారీగా పోలింగ్ శాతాలను పరిశీలిస్తే.. అత్యధికంగా యాదాద్రి భువనగిరిలో 90.03 శాతం, మెదక్‌లో 86.69శాతం జనగామలో 85.74, నల్లగొండలో 85.49శాతం పోలింగ్ నమోదైంది. అత్యల్పంగా హైదరాబాద్‌లో 46.65 శాతం, రంగారెడ్డిలో 59.94 శాతమే ఓట్లు వేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం ఆందోళనకర స్థాయికి తగ్గిపోయినట్టు ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మొత్తం 119 నియోజకవర్గాలకుగాను 13 వామపక్ష తీవ్రవాద ప్రభావిత స్థానాల్లో సాయంత్రం 4 గంటలకు, మిగతా 106 చోట్ల సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసింది. అయితే పోలింగ్ ముగిసే సమయానికల్లా.. పోలింగ్ కేంద్రాలకు చేరుకుని, క్యూలైన్లలో ఉన్న ఓటర్లందరికీ ఓటేసే అవకాశం కల్పించారు. కొన్నిచోట్ల ఇలా రాత్రి వరకు పోలింగ్ సాగింది. ఈ క్రమంలోనే పోలింగ్ శాతాలపై శుక్రవారం ఉదయమే స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు చెప్తున్నాయి.


హైదరాబాద్‌లోని భౌరంపేటలో ఓటు వేయడానికి బారులుదీరిన ప్రజలు

పలుచోట్ల గంట, 2 గంటలు ఆలస్యంగా..

అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 5.30 గంటలకే మాక్ పోలింగ్ నిర్వహించారు. ఉదయం 7 గంటలకే పోలింగ్ మొదలుకావాలి. అయితే పలుచోట్ల ఈవీఎంలు, ఓటర్ వెరిఫయబుల్ ఆడిట్ ట్రయల్ (వీవీ ప్యాట్) యంత్రాలు మొరాయించడంతో గంట నుంచి రెండు గంటలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని పోలింగ్ కేందాల్లో ఈవీఎంలు మొరాయించాయి? ఎన్నింటిని రిప్లేస్ చేశారన్న అంశంపై సీఈఓ కార్యాలయం ఎలాంటి ప్రకటన జారీ చేయలేదు.

ఉదయమే బారులు తీరిన ఓటర్లు

రాష్ట్రవ్యాప్తంగా చాలాచోట్ల ఓటర్లు ఉదయమే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. దీనితో వడివడిగా ఓటింగ్ సాగింది. మధ్యాహ్నం కొంత మందగించినా తర్వాత పుంజుకుంది. ఉదయం 9 గంటల వరకు 7.78 శాతం, 11 గంటల వరకు 20.64 శాతం, మధ్యాహ్నం 3 గంటల సమయానికి 51.89 శాతం, సాయంత్రం 5 గంటలకు 64.42 శాతం పోలింగ్ నమోదైంది. కడపటి వార్తలు అందేసరికి 76.66 శాతంగా నమోదైంది. రాత్రి వరకు పలుచోట్ల ఓటింగ్ కొనసాగిన నేపథ్యంలో ఆ లెక్కలన్నీ క్రోడీకరించాల్సి ఉంది. దీనితో ఓటింగ్ శాతం పెరగనుందని ఎన్నికల సంఘం అంచనా వేసింది. అక్కడక్కడా చెదురుమదురు ఘటనలు తప్ప పోలింగ్ ప్రక్రియ సజావుగా ముగియడంతో యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.

తగ్గిన ఓట్ల గల్లంతు ఫిర్యాదులు

గత శాసనసభ ఎన్నికల సందర్భంగా భారీ సంఖ్యలో ఓట్లు గల్లంతైనట్టు ఆరోపణలు వచ్చాయి. ప్రధానంగా హైదరాబాద్ జంట నగరాల్లో లక్షల ఓట్లు తొలగించినట్టు విమర్శలు వచ్చాయి. అయితే ఈసారి ఎన్నికల్లో ఓట్ల గల్లంతుపై ఫిర్యాదులు నామమాత్రంగానే వచ్చాయి.

వివరాలు వెల్లడించని ఎన్నికల ప్రధానాధికారి

శాసనసభ ఎన్నికల పోలింగ్ ముగిసిన వెంటనే కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధిగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) విలేకరుల సమావేశం నిర్వహించి.. వివరాలను వెల్లడించడం ఆనవాయితీ. అంతేకాదు.. పోలింగ్ కొనసాగుతున్న సమయంలోనూ సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించేవారు. అయితే సీఈఓ వికాస్‌రాజ్ గురువారం శాసనసభ ఎన్నికల పోలింగ్ ముగిశాక ఎలాంటి వివరాలు వెల్లడించలేదు.

65.33 లక్షల మందికి రూ.1,800.96 కోట్లు

- వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీకి నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- నేటి తెల్లవారుజాము నుంచే వలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేత
- 5 రోజుల్లో 100% పింఛన్ల పంపిణీ పూర్తి చేస్తాం
- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు వెల్లడి

2లో





ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

బతుకు పంట పండింది

పచ్చటి పంట చేలో నీళ్లు పెడుతూ.. పంటను సంరక్షించుకుంటూ పొలం పనిలో నిత్యం నిమగ్నమై పోవాలనేది నా కల. నేను గిరిజన రైతుని. నాకు నాలుగు ఎకరాల 20 సెంట్ల భూమి ఉంది. మా భూమి పూర్తిగా వర్షాధారం. వర్షం నీటిపై ఆధారపడి పంటలు పండించాల్సిన పరిస్థితి. నీరు సరిపోక పత్తి పంట వేసినప్పుడల్లా నష్టాలపాలయ్యేవాడిని. ఆదాయం అంతంతమాత్రంగా ఉండడంతో కుటుంబ పోషణ కష్టంగా ఉండేది. గతేడాది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జలకళ పథకంలో భాగంగా నా పొలంలో బోరు వేయించింది. ఉచిత కరెంటు కనెక్షన్ కూడా ఇచ్చింది. దీంతో ఈ ఏడాది ఎకరం భూమిలో మొక్కజొన్న, 1.20 ఎకరాల్లో వైట్ బార్లీ వేశాను. మిగిలిన పొలంలో పొగాకు పంట సాగు చేశాను. జలకళ బోరు వల్ల పంటలకు పుష్కలంగా నీరందింది. నాలుగు డబ్బులు చేతికందే అవకాశముంది. దీంతో నా బతుకు పంట పండినట్లే. మాది ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం కాకులవారిగూడెం గ్రామం. నాకు భార్య, ఓ బాబు. ఏటా రైతు భరోసా కింద



రూ.13,500 వస్తోంది. ఈ సొమ్ము పంట పెట్టుబడికి సరిపోతుంది. రైతు భరోసా కేంద్రం నుంచి ఎరువులు తీసుకున్నాను. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ ప్రభుత్వ హయాంలో రైతులకు వ్యవసాయం పండుగైంది. నాలాంటి గిరిజన రైతులు ఎంతో మంది జీవితాలు బాగుపడ్డాయి.

– కమ్మే శ్రీనివాసరావు, కాకులవారిగూడెం
(కోడూరి ఆనంద్, విలేకరి, బుట్టాయగూడెం)

నాలుగు ముద్దలు నోట్లోకెళ్తున్నాయి..

గత ప్రభుత్వ హయాంలో రూ.200 చాలీచాలని పింఛను ఇచ్చేవారు. నా భర్త శ్రీమోను కాలం చేశారు. కుమార్తెకు పెళ్లి చేసి పంపాను. ఇక ఇంట్లో ఉండేది నేను ఒక్క దాన్నే. నేను కూలికి వెళితే 200 రూపాయలు వస్తుంది. ఆరోగ్యం బాగోలేని రోజు ఆ డబ్బులు కూడా ఉండవు. పింఛనే నాకు ఆధారం. ఇటువంటి సమయంలో అవసరాలు తీరడానికి అప్పులు చేసేదాన్ని. అయితే, నిత్యం ఏ మోహం పెట్టుకుని అప్పులోళ్ల దగ్గరకు వెళ్లగలను? దీంతో తరచూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనేదాన్ని. ఈ ప్రభుత్వం పుణ్యమా అని ప్రస్తుతం పింఛన్ రూ.2,750 వస్తుండడంతో ఆనందంగా జీవిస్తున్నాను. వలంటీరే ప్రతి నెలా ఒకటవ తేదీన ఇంటికి వచ్చి పింఛను ఇస్తున్నారు. ఇప్పుడు నేను ఇంటి అవసరాల కోసం అప్పులు చేయడం లేదు. మానసిక ఒత్తిడి లేకుండా జీవిస్తున్నాను. సంతోషంగా



నాలుగు ముద్దలు నోట్లోకి వెళ్తున్నాయి. ఈ ప్రభుత్వం నాకు మరో మేలు చేసింది. లేఅవుట్ వేసి, సెంటున్నర ఇంటి స్థలం కూడా మంజూరు చేసింది. అద్దె ఇంట్లో ఉన్న నాకు ఇంటి స్థలం ఇవ్వడం సంతోషంగా ఉంది. తొందరలో అక్కడ ఇల్లు కట్టుకుంటాను.

– పరదేశి రత్నమ్మ, మిట్నాల, నంద్యాల.
(కె.చంద్రవరప్రసాద్, విలేకరి, నంద్యాల న్యూటౌన్)

భిక్షాటన మానేశాం..

నేను, మా ఆయన సింహాద్రి రోజూ ఊరూరా తిరిగి భిక్షాటన చేసేవాళ్లం. మేం బుడగ జంగాలం. భిక్షాటన మా కులవృత్తి. ఆ విధంగా వచ్చిన ఆదాయంతో ఎలాగోలా ఇద్దరు ఆడ పిల్లలు, ఇద్దరు మగ పిల్లలను నెట్టుకొస్తుండేదాన్ని. ఏమాత్రం ఆరోగ్యం సహకరించకపోయినా ఆరోజు గడప దాటి వెళ్లలేకపోయేవాళ్లం. అప్పుడు పస్తులుండాల్సి వచ్చేది. కిందా మీదా పడి అందరికీ పెళ్లిళ్లు చేశాం. ఒక బ్బాయి తాపీ పని చేస్తుండగా... మరో కొడుకు ఆరోగ్యం అంతంత మాత్రమే. ఇద్దరబ్బాయిలు వారి భార్యలతో కలిసి మాతో పాటే ఉంటున్నారు. ఈ పరిస్థితిలో కుటుంబ పోషణ ఎలా.. అని దిగులు పడుతుండేవాళ్లం. ఆ తరుణంలో ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వైఎస్సార్ చేయూత పథకం కింద ఏటా రూ.18,750 నా ఖాతాలో వేసింది. గత మూడే



ళ్లుగా పైకం అందింది. దానితోపాటు మూడేళ్లుగా ఆసరా పథకం ద్వారా కూడా డబ్బు అందుతోంది. ఆ వచ్చిన మొత్తంతో మా సొంతూరైన శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం మహర్తాపురంలో పాన్‌షాపు పెట్టుకున్నాను. నా భర్తకు పింఛన్ వస్తోంది. మనవళ్లకు అమ్మ ఒడి కింద డబ్బులొస్తోంది. తద్వారా మేము ఇప్పుడు కుటుంబాన్ని చక్కగా పోషించుకుంటున్నాం. భిక్షాటన మానేసి గౌరవంగా బతుకుతున్నాం.

– ప్రసాదం యల్లమ్మ, మహర్తాపురం
(అల్లు నర్సింహరావు, విలేకరి, కొత్తూరు)

65.33 లక్షల మందికి రూ.1,800.96 కోట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 65,33,781 మంది అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వివిధ రకాల చేతి వృత్తిదారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు డిసెంబర్ 1న ఠంచన్‌గా వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1,800.96 కోట్లు విడుదల చేసింది. ఈ విషయాన్ని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు గురువారం పేర్కొన్నారు. పింఛన్ నగదును ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాలకు పంపించినట్లు చెప్పారు. సచివాలయాల వలంటీర్లు శుక్రవారం తెల్లవారుజాము నుంచే లబ్దిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ సొమ్మును అందజేస్తారని తెలిపారు. ఇందుకోసం 2.66 లక్షల మంది వలంటీర్లు సిద్ధంగా ఉన్నారన్నారు. లబ్ధిదారులకు పింఛన్ అందజేసే సందర్భంలో గుర్తింపు కోసం ఆధార్ నిర్ధారిత బయోమెట్రిక్, ఐరిస్ తదితర విధానాలను అమలు చేస్తున్నామన్నారు. సాంకేతిక కారణాల వల్ల ఏ ఒక్కరికీ పింఛన్ అందలేదనే ఫిర్యాదు రాకుండా.. అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. ఐదు రోజుల్లోనే నూరు శాతం పింఛన్ల పంపిణీ పూర్తి అయ్యేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. పెన్షన్ల పంపిణీ ప్రక్రియలో 15 వేల మంది సంక్షేమ, విద్య అసిస్టెంట్, వార్డు సంక్షేమ అభివృద్ధి కార్యదర్శులు భాగస్వాములు అవుతారని వివరించారు. రాష్ట్రంలోని అన్ని డీఆర్‌డీఏ కార్యాలయాల్లోని కాల్ సెంటర్ల ద్వారా పింఛన్ల పంపిణీని పర్యవేక్షిస్తామని తెలిపారు.



సీఎం వైఎస్ జగన్‌కు మెడలో షేలా, ఇలాచి వేసి పేటా అలంకరణ చేస్తున్న దర్గా పీఠాధిపతులు



పీరుల్లా మాలిక్ జీవ సమాధి వద్ద ఫాతెహా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



పెద్ద దర్గాలోని మజార్ల వద్ద పూల చాదర్‌ను సమర్పిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఇదో అదృష్టం

కడప పెద్ద దర్గాలో ముఖ్యమంత్రి జగన్ ప్రార్థనలు

సాక్షి ప్రతినిధి, కడప: మత సామరస్యానికి ప్రతీకగా, మహిమాన్విత సూఫీగా వెలుగొందుతున్న కడప అమీన్‌పీర్ దర్గాను సందర్శించడంతో తన జన్మ చరితార్థం అయిందని, ఇది తన అదృష్టం, పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. సీఎం జగన్ గురువారం మధ్యాహ్నం కడప అమీన్‌పీర్ (పెద్ద దర్గా) దర్గాను సందర్శించి ప్రభుత్వ లాంఛనాలతో పూల చాదర్ సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మేయర్ కె.సురేష్‌బాబు, జిల్లా కలెక్టర్ వి.విజయ్‌రామరాజు, జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, కడప నగర పాలక సంస్థ కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు. ప్రజల ఐకమత్యతతో దర్గా ఖ్యాతి, మహిమలు, ప్రపంచవ్యాప్తంగా పరిమళిస్తున్నాయని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ పేర్కొన్నారు. తాను పుట్టి పెరిగిన జిల్లాలో ఇంత మహత్తరమైన, మహిమాన్వితమైన దర్గా ఉండడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అమీన్‌పీర్ దర్గాను అత్యంత భక్తి శ్రద్ధలతో ఆదరిస్తున్న జిల్లా ప్రజలు ఎంతో అదృష్టవంతులన్నారు. ఆ భగవంతుడి ఆశీస్సులతో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాల ఫలాలను అందివ్వగలుగుతున్నామన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రాభివృద్ధిలో పాలు పంచుకుంటూ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా మైనారిటీల సేవలో తరిస్తున్న మిత్రుడు ఎస్‌బీ అంజద్‌బాషాకు అభినందనలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.

సంప్రదాయ పేటా, షేలా ధరించి..

కడప విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గాన అమీన్ పీర్ దర్గా ప్రాంగణానికి చేరుకున్న ముఖ్యమంత్రి జగన్‌కు దర్గా ప్రతినిధులు సంప్రదాయ లాంఛనాలతో ఘనంగా స్వాగతం పలికారు. ముఖ్యమంత్రిని ముందుగా పెద్ద దర్గా ప్రధాన మందిరంలోకి పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేని, దర్గా కమిటీ సభ్యులు సాదరంగా ఆహ్వానించారు. దర్గా సేవలో నిరంతరం నిమగ్నమైన ముజావర్లు, కమిటీ సభ్యులు, చౌదరీ కలీఫాలను దర్గా పీఠాధిపతులు హజరత్ ఖాజా సయ్యద్ షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ముఖ్యమంత్రికి పరిచయం చేశారు. దర్గా పీఠాధిపతులచే 'సూఫీ సర్మస్త్ సానీ షిలాక్' సంప్రదాయం ప్రకారం ముఖ్యమంత్రికి తలపాగా (పేటా) అలంకరించి మెడలో షేలా (కండువా), ఇలాచి (దండ) ధరింపజేశారు. అనంతరం పీఠాధిపతులతో కలిసి ముఖ్యమంత్రి జగన్ అమీన్‌పీర్ దర్గా గుమ్మం వద్దకు చేరుకుని నారికేళి రాతిపై కొబ్బరికాయ కొట్టి స్వామివారికి సమర్పించుకున్నారు. ముజావర్లు అందించిన పూలు, వస్త్ర చాదర్, సుగంధ పరిమళాల అత్తరుతో కూడిన తట్టను ముఖ్యమంత్రి తలపై పెట్టుకుని భక్తి పారవశ్యంతో ప్రధాన దర్గా లోపలికి ప్రవేశించారు. అక్కడ పీరుల్లా మాలిక్ జీవ సమాధి వద్ద చాదర్, పూలమాల, అత్తరు సమర్పించిన అనంతరం ఫాతెహా నిర్వహించి ప్రార్థనలు చేశారు. అక్కడి నుంచి నేరుగా అరీఫుల్లా మాలిక్, అమీన్ స్వామి మొదలైన 16 మంది పూర్వపు పీఠాధిపతుల మజార్ల వద్దకు చేరుకుని గంధం, చాదర్, పూలు సమర్పించారు. పూర్వ పీఠాధిపతుల మజార్లకు పూలు సమర్పించి గురువులతో ప్రార్థనలు చేశారు. అమీన్‌పీర్ దర్గా గ్రంథాలయం వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రికి దర్గా విశిష్టత, ప్రాశస్త్యాన్ని, చారిత్రక వైభవాన్ని పీఠాధిపతి వివరించారు. దర్గా మేనేజర్ ఎస్ఎండీ అలీఖాన్, ముజావర్ అమీర్, దర్గా కో ఆర్డినేటర్ కుతుబుద్దీన్, హజ్ హౌస్ చైర్మన్ గౌసుల్లాజం, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్, వేర్‌హౌస్ కార్పొరేషన్ చైర్మన్ కరీముల్లా, స్టేట్ మైనారిటీ కమిషన్ మెంబర్ హిదయతుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ సోహేల్, అఫ్జల్‌ఖాన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆధ్వర్యంలో అమీన్‌పీర్ దర్గా ప్రాంగణం వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

ఘన స్వాగతం

పెద్దదర్గాను దర్శించుకునేందుకు నంద్యాల నుంచి కడప విమానాశ్రయానికి చేరుకున్న సీఎం జగన్‌కు అధికారులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, కలెక్టర్ వి.విజయ్‌రామరాజు, ఎస్పీ సిద్ధార్థ్‌కౌశల్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మేయర్ కె.సురేష్‌బాబు, శాసన మండలి వైస్ చైర్మన్ జకియాఖానం, ఎమ్మెల్సీలు పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, సి.రామచంద్రయ్య, ఎం.రామచంద్రారెడ్డి, డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యేలు పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి, శెట్టిపల్లె రఘురామిరెడ్డి, దాసరి సుధ, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మేడా వెంకట మల్లికార్జునరెడ్డి, మూలే సుధీర్‌రెడ్డి, నవాజ్‌బాషా తదితరులు స్వాగతం పలికారు. సీఎం జగన్ వెంట ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్‌బాషా, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి హెలికాప్టర్‌లో కడప చేరుకున్నారు.



అవుకు టన్నెల్2 శిలాఫలకం వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు



అవుకు రెండో టన్నెల్ ముఖ్యాంశాలను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సొరంగాలు దాటిన కృష్ణా తరంగం

▶ మొదటి పేజీ తరువాయి

ఆనందం ముఖ్యమంత్రి ముఖంలో స్పష్టంగా కనిపించింది. చిరు నవ్వుతో నీటిపారుదల శాఖ అధికారులను అభినందించిన సీఎం జగన్ ప్రజాప్రతినిధులను ఆత్మీయంగా పలకరించారు. ఈ టన్నెల్ ద్వారా గోరుకల్లు నుంచి అవుకు రిజర్వాయర్‌కు 20 వేల క్యూసెక్కుల జలాలు పరవళ్లు తొక్కనున్నాయి. టన్నెల్‌ను ప్రారంభించేందుకు విజయవాడ నుంచి నంద్యాల జిల్లా అవుకు మండలం మెట్టుపల్లికి చేరుకున్న సీఎం జగన్ తొలుత ఎగ్జిబిషన్‌ను తిలకించారు. నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఇతర అధికారులు టన్నెల్ ముఖ్యాంశాలను వివరించారు. అనంతరం సీఎం జగన్ అక్కడి నుంచి వేదమంత్రాల మధ్య టన్నెల్ వద్దకు చేరుకుని నీటిని దిగువకు విడుదల చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆవిష్కరించారు. టన్నెల్ ప్రారంభించిన తర్వాత వైఎస్సార్ సీపీ ముఖ్య నేతలు, కార్యకర్తలను కలిసి ఆత్మీయంగా పలకరించారు.

వస్నె తెచ్చిన టన్నెల్!

గాలేరు నగరి సుజల స్రవంతిలో భాగంగా అవుకు సొరంగాల పనులకు శ్రీకారం చుట్టిన దివంగత వైఎస్సార్ రూ.340.53 **కోట్లు వెచ్చించి ఆయన** హయాంలోనే సింహ**భాగం పూర్తి చేయగా** 2014–19 మధ్య చంద్ర**బాబు సర్కారు** రూ.81.55 కోట్లు మాత్ర**మే వ్యయం** చేసి ఫాల్ట్ జోన్‌లో పను**లు చేయ**కుండా చేతులెత్తేసింది. **సీఎం** జగన్ అధికారంలోకి వ**చ్చాక** రూ.145.86 కోట్లు ఖ**ర్చు** చేసి టన్నెల్ 2 పనుల**ను** దిగ్విజయంగా పూ**ర్తి** చేశారు. మరోవైపు టన్నెల్ 3 పనుల కోసం ఇప్పటివరకు మరో రూ.934 కోట్లు వెచ్చించి దాదాపు తుదిదశకు తెచ్చారు. మొత్తం 5.801 కి.మీ. పొడ**వైన మూడో టన్నెల్‌లో ఇ**ప్పటికే 4.526 కి.మీ. మేర **పను**లను పూర్తి చేయడం గమ**నార్హం.** మూడు టన్నెళ్లతో పా**టు ఇతర** అనుబంధ పనులకు **కలిపి ఇప్పటి** వరకు మొత్తం రూ.**1,501.94 కోట్లు** **వ్యయం** చేశారు. ఎస్ఆర్‌బీసీ (శ్రీశైలం కుడిగట్టు **కాలువ)** కింద 1.5 లక్షల ఎకరాలకు సాగు నీటి **సరఫరాతో**పాటు గాలేరు నగరి సుజల స్రవంతి **పథకం** కింద గండికోట, వామికొండ, సర్వరాయ **సాగర్,** మైలవరం, పైడిపాలెం తదితర రిజర్వాయ**ర్లకు రో**జుకు ఒక టీఎంసీ చొప్పున అదనంగా **నీరు** అందించే వెసులుబాటు ఉంది.

తుది దశలో అవుకు టన్నెల్–3

కృష్ణాలో వరద ప్రవాహం రోజులు తగ్గిపోతున్నాయి. దీంతో శ్రీశైలానికి వరద నీరు వచ్చినప్పుడే ఒడిసి పట్టుకుని నిల్వ చేసుకోవాలి. రోజూ 20 వేల క్యూసెక్కులను తరలిస్తే రిజర్వాయర్లను నింపే వీలుంటుంది. గాలేరు–నగరి వరద కాలువ ద్వారా 15 రోజుల్లోనే గండికోట రిజర్వాయర్‌ను నింపవచ్చు. **సీ**మను సస్యశ్యామలం చేయవచ్చు. ఈ **క్ర**మంలో 10 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో **చేపట్టి**న అవుకు మూడో టన్నెల్, డిస్ట్రిబ్యూటరీ **పనులు** కూడా పూర్తయ్యే దశకు చేరుకున్నాయి. **రూ.1,297**.78 కోట్ల వ్యయంతో చేపట్టిన మూడో **టన్నెల్ ప**నుల్లో ఇప్పటికే రూ.934 కోట్ల విలువైనవి **విజయవం**తంగా పూర్తయ్యాయి. వచ్చే ఏడాది రెండో **త్రైమాసికా**నికి ఇవి కూడా పూర్తి కానున్నాయి. దీంతో **మొత్తం 30** వేల క్యూసెక్కుల నీటిని తరలించవచ్చు.

హాజరైన మంత్రులు, ప్రజాప్రతినిధులు

కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజద్ బాషా, నీటిపారుదలశాఖ మంత్రి అంబటి రాంబాబు, కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బిజేంద్రారెడ్డి, ఎమ్మెల్సీలు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఇసాక్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

కరువు సీమ దాహార్తి తీర్చేలా

- రూ.253 కోట్లతో లక్కసాగరం వద్ద హెచ్ఎన్ఎస్ఎస్ పంప్ హౌస్‌ను ఇప్పటికే పూర్తి చేసిన సీఎం జగన్ కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 77 చెరువులకు సాగునీటిని అందించి 10వేల ఎకరాలకు పైగా సస్యశ్యామలం చేశారు.
- గత సర్కారు నిర్లక్ష్యం చేసిన బ్రహ్మంసాగర్ రిజర్వాయర్ లీకేజి సమస్యను ఇప్పుడు డయాఫ్రమ్ వాల్ ద్వారా అరికట్టడంతో పూర్తి సామర్థ్యం మేరకు 17 టీఎంసీల నీరు నింపుతున్నారు.
- ఎస్ఆర్‌బీసీ, జీఎన్ఎస్ఎస్ కలిపి సామర్థ్యం 30 వేల క్యూసెక్కులకు పెంచేలా పనులు చురుగ్గా జరుగుతున్నాయి.
- కుందూ నది, నిప్పులవాగు సామర్థ్యాన్ని 35 వేల క్యూసెక్కులకు పెంచి సోమశిలకు నీటిని సరఫరా చేయనున్నారు.
- పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని 44 వేల నుంచి 80 వేల క్యూసెక్కులకు పెంచడంతో పాటు కాలువల వెడల్పు, లైనింగ్ పనులు, టన్నెళ్లు వేగంగా నిర్మించడం ద్వారా గోరుకల్లు, అవుకు రిజర్వాయర్ల ద్వారా తక్కువ సమయంలో సరిపడా నీటిని తీసుకునేలా చర్యలు చేపట్టారు. రూ.600 కోట్ల వ్యయంతో తెలుగు గంగ లింక్ కెనాల్ ప్రవాహ సామర్థ్యాన్ని 15 వేల క్యూసెక్కులకు విస్తరించారు.

వేగంగా ఒడిసిపట్టేలా..

గోరుకల్లు నుంచి 20 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో 60 కి.మీ. పొడవున వరద కాలువతో పాటు టన్నెళ్ల పనులు అన్ని అవాంతరాలను అధిగమించి విజయవంతంగా పూర్తయ్యాయి. ఫాల్ట్ జోన్‌లో 180 మీటర్ల సొరంగం నిర్మాణంతో పాటు లైనింగ్ పనులు కూడా పూర్తి చేశారు. కుడి, ఎడమ టన్నెల్‌లో సిమెంట్, కాంక్రీట్ లైనింగ్ పనులు పూర్తయ్యాయి. తద్వారా దుర్భిక్ష ప్రాంతమైన రాయలసీమ తాగు, సాగునీటి కష్టాలను తీర్చడంతో పాటు పారిశ్రామిక అవసరాలకు నీటిని వినియోగించవచ్చు. శ్రీశైలంలో 875 అడుగులు మించితే గానీ మనకు కేటాయించిన పూర్తి నీటిని తీసుకోలేని పరిస్థితి నెలకొంది. సీఎం వైఎస్ జగన్ దీన్ని చక్కదిద్దుతూ ఓవైపు కాలువల సామర్థ్యం పెంచుతూనే మరోవైపు 797 అడుగుల నుంచే నీటిని తీసుకునేలా, ప్రాజెక్టులు వేగంగా నిండేలా రోజుకు 3 టీఎంసీల జలాలను కరువు ప్రాంతాలకు తరలించి దుర్భిక్ష ప్రాంతాలకు న్యాయం చేసేందుకు చురుగ్గా రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు తలపెట్టారు.

మనసున్న మారాజు సీఎం వైఎస్ జగన్

- అనారోగ్యంతో బాధపడుతున్న వారికి తక్షణ సాయం
- సీఎం జగన్ ఆదేశించిన 15 నిమిషాల్లోనే బాధితులకు చెక్కులు
- సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన బాధితులు

సాక్షి, నంద్యాల: పేదల పక్షపాతినని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి నిరూపించుకున్నారు. ఆపదలో ఉన్నామని ఆయన దగ్గరికి వచ్చిన బాధితులకు తక్షణ సాయం అందజేసి మంచి మనసును చాటుకున్నారు. సీఎం జగన్ గురువారం అవుకు రెండో టన్నెల్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన్ని కొంతమంది అభాగ్యులు కలిశారు. అనారోగ్యంతో బాధపడుతూ, చికిత్సకు ఆర్థిక స్థోమత లేక ఇబ్బంది పడుతున్నామని ఆయన వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం స్పందించిన సీఎం జగన్ వారిలో ఒకరికి రూ.లక్ష, మరొకరికి రూ.5 లక్షల ఆర్థిక సాయం వెంటనే అందజేయాలని నంద్యాల కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌ను ఆదేశించారు. సీఎం ఆదేశాలతో 15 నిమిషాల్లోనే బాధితులకు కలెక్టర్ చెక్కులు అందజేశారు.

జీవితాంతం రుణపడి ఉంటాం

ఈ చిత్రంలో చెక్కు తీసుకుంటున్న వ్యక్తి నారా పుల్లారెడ్డి (53). ఈయనది నార్పల మండలం బొమ్మకుంట గ్రామం. ఒక్క కిడ్నీతోనే పుట్టారు. ప్రస్తుతం ఆ కిడ్నీ కూడా సరిగా పనిచేయడంలేదు. కిడ్నీ ల్యాడర్ మందుల కోసమే నెలకు రూ.26 వేల వరకు ఖర్చవుతోంది. తన ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో మందులు కొనేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తన బాధను సీఎం జగన్‌కు తెలియజేశారు. తక్షణం స్పందించిన ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ కింద బాధితునికి సాయం చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. సీఎం ఆదేశించిన నిమిషాల్లోనే కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి బాధితునికి రూ.5 లక్షలు అందజేశారు. తన సమస్య విన్న వెంటనే సీఎం జగన్ స్పందించి, సాయం చేసినందుకు ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటానని పుల్లారెడ్డి చెప్పారు. ఆర్థిక సాయం కోసం ఎంతో మందిని వేడుకున్నా ఉపయోగం లేకపోయిందని, వెంటనే సాయం చేసిన సీఎం జగన్ దేవుడంటూ భావోద్వేగానికి లోనయ్యారు.

మా పాపకు కొత్త జీవితాన్ని ఇచ్చారు

ఈ చిత్రంలో చెక్కు అందుకుంటున్న గుర్రప్ప, సౌమ్య దంపతులకు ఇద్దరు సంతానం. గుర్రప్ప ఆటో డ్రైవర్. వీరిది అవుకు మండలం గోకులదిన్నె గ్రామం. ఈ దంపతులకు రెండో సంతానంగా పాప హర్షిత జన్మించింది. పాపకు మూడు నెలలున్నప్పుడు అనారోగ్యానికి గురైంది. గుండెలో రంధ్రం ఉన్నట్లు వైద్యులు తెలిపారు. అప్పటి నుంచి పాపను ఆస్పత్రుల చుట్టూ తిప్పుతున్నారు. ప్రస్తుతం పాపకు 20 నెలలు. ఆపరేషన్ చేయిస్తే నయమవుతుందని వైద్యులు చెప్పడంతో ఆర్థిక సాయం కోసం ఆ తల్లిదండ్రులు తిరగని చోటు లేదు. చివరికి గురువారం సీఎం వైఎస్ జగన్‌ను కలిసి వారి బాధను వివరించారు. స్పందించిన ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం అందజేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. కలెక్టర్ తక్షణ సాయం కింద రూ.లక్ష చెక్కును బాధితులకు అందజేశారు. తమ చిన్నారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కొత్త జీవితాన్ని ఇచ్చారని ఆ దంపతులు హర్షం వ్యక్తంచేశారు. తమ బాధను పూర్తిగా విని వెంటనే సాయం చేసిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.



చిన్నారి హర్షిత అనారోగ్య సమస్యను సీఎం జగన్‌కు వివరిస్తున్న గుర్రప్ప, సౌమ్య దంపతులు



హర్షిత తల్లిదండ్రులకు రూ.లక్ష చెక్కును అందజేస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్



నారా పుల్లారెడ్డి సమస్యను వింటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



నారా పుల్లారెడ్డికి రూ.5 లక్షల చెక్కును అందజేస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

క్లుప్తంగా...

ఎంపీ సురేష్‌ను బెదిరించిన కేసులో ముగ్గురు అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఆనందరావు

తాడికొండ: బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌ను బెదిరించి, అసభ్య పదజాలంతో దూషించిన కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు తుళ్ళూరు సీఐ ఎం. ఆనందరావు తెలిపారు. సీఐ వెల్లడించిన వివరాల ప్రకారం.. గుడివాడకు చెందిన చోరగుడి రవికాంత్ ఎంపీ నందిగం సురేష్‌కు ఫోన్ చేసి బూతులు తిడుతూ బెదిరించాడు. ఎంపీ పీఏ రాజేంద్రకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారించగా మద్యం మత్తులో ఉండి తన స్నేహితులు విజయ్, నాగబాబు ప్రమేయంతో బూతులు తిట్టి బెదిరించినట్లు రవికాంత్ ఒప్పుకున్నాడు. దీంతో రవికాంత్, విజయ్, నాగబాబుని అరెస్టు చేసినట్లు సీఐ ఆనందరావు తెలిపారు.

తిరుమలకు చంద్రబాబు

నేటి ఉదయం కుటుంబసమేతంగా శ్రీవారి దర్శనానికి బాబు..



అలిపిరి వద్ద బస్సుల్లో తీసుకొచ్చిన వారికి డబ్బులు పంపిణీ

సాక్షి, తిరుపతి: శ్రీవారి దర్శనార్థం టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు గురువారం కుటుంబ సమేతంగా తిరుమలకు చేరుకున్నారు. ఇటీవల తిరుమలలో ప్రధాని మోదీ బస చేసిన రచన అతిథి గృహాన్ని గురు, శుక్రవారాలు చంద్రబాబు దంపతులకు టీటీడీ కేటాయించింది. ఆ అతిథి గృహం ఓ టీవీ చానల్ వారిది కావడంతో అందులో ఉండటానికి చంద్రబాబు తిరస్కరించారు. ఆ తరువాత అప్పటికప్పుడు మరో అతిథి గృహాన్ని ఆయనకు టీటీడీ కేటాయించింది. గురువారం రాత్రి చంద్రబాబు దంపతులు శ్రీవరాహస్వామిని దర్శించుకున్నారు. నేడు శ్రీవారిని దర్శించుకోనున్నారు.

స్వాగత ఏర్పాట్ల కోసం తమ్ముళ్ల తంటాలు

గురువారం తిరుపతికి వచ్చిన చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు టీడీపీ శ్రేణులు పెద్దగా రాకపోవటంతో స్థానిక టీడీపీ నేతలు విద్యార్థులకు డబ్బులు ఇచ్చి స్వాగతం చెప్పించారు. ఒక్కొక్కరికి రూ.500 చొప్పున ఇస్తామని చెప్పి 10 బస్సుల్లో విద్యార్థులను తరలించారు. చంద్రబాబు ఘాట్ రోడ్డు మీదుగా తిరుమలకు పయనమయ్యాక టీడీపీలోని ఓ బ్యాచ్..విద్యార్థులు ఉన్న బస్సుల్లోకి వెళ్లి ఒక్కొక్కరికి రూ.500 చొప్పున పంపిణీ చేశారు.

ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్

కాగా, అలిపిరి వద్ద 30 నిమిషాలకుపైగా చంద్రబాబు కాన్వాయ్‌ని కార్యకర్తలు ఆపారు. ఆ సమయంలో లీలామహల్ కూడలి వద్ద 108 వాహనం కూడా ఆగిపోయింది. అందులో ఉన్న ఎమెర్జెన్సీ రోగి బంధువులు క్షణక్షణం భయంభయంగా గడిపారు. 45 నిమిషాల తరువాత ట్రాఫిక్ క్లియర్ కావడంతో 108 వాహనం ముందుకు కదలింది.

టీడీపీ బీసీ వ్యతిరేక పార్టీ

ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారేష్



సాక్షి, అమరావతి: కుల గణనను వ్యతిరేకిస్తున్న టీడీపీ బీసీ వ్యతిరేక పార్టీ అని మరోసారి రుజువైందని, బీసీలంతా ఐక్యంగా టీడీపీకి బుద్ధి చెప్పాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మారేష్ పిలుపునిచ్చారు. విజయవాడలో గురువారం నిర్వహించిన బీసీ సంఘాల ఆత్మీయ సమావేశానికి అధ్యక్షత వహించి ఆయన మాట్లాడారు. తొలి నుంచి బీసీలను ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకుని కరివేపాకులా పారేయడం చంద్రబాబు నైజమన్నారు. బీసీల పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో కుల గణన ప్రక్రియను చేపడుతుంటే టీడీపీ నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని మారేష్ తెలిపారు.

ప్రభుత్వోద్యోగులకు కలిసొచ్చిన వచ్చే ఏడాది సెలవులు

2024లో మొత్తం 20 ప్రభుత్వ సెలవులు

- ఇందులో 11 సెలవులు సోమ, శుక్ర, శనివారాల్లోనే
- ఆదివారం సెలవులో కలిసిపోయిన భోగి, విజయదశమి, అంబేడ్కర్ జయంతి
- 2024 సెలవుల క్యాలెండర్‌ను విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగులకు వచ్చే ఏడాది (2024) పండుగలు, పర్వదినాల సెలవులు కలిసొచ్చాయి. 2024కు రాష్ట్ర ప్రభుత్వం 20 సాధారణ సెలవులను ప్రకటించగా అందులో 11 సెలవులు వారాంతం లేదా వారం ప్రారంభంలోనే వచ్చాయి. 2024కు సంబంధించి ప్రభుత్వ సాధారణ సెలవులు, ఐచ్ఛిక సెలవులను ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్ రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 2024 సంవత్సరానికి 20 సాధారణ సెలవులతో పాటు 17 ఐచ్ఛిక సెలవులను ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఏడాదిలో గరిష్టంగా అయిదు ఐచ్ఛిక సెలవులను వినియోగించుకోవచ్చని స్పష్టం చేశారు. చంద్ర దర్శనం బట్టి మారే రంజాన్, బక్రీద్, మొహర్రం,, మిలాద్ ఉల్ నబీ వంటి పర్వదినాలతో పాటు తిథుల ప్రకారం మారే హిందూ పండుగల వివరాలను తరువాత ఆయా పరిస్థితులకు అనుగుణంగా ప్రకటిస్తామని పేర్కొన్నారు. అటువంటి సందర్భాల్లో సాధారణ ఉత్తర్వులు వచ్చే వరకు ఆగకుండా ఆయా శాఖాధిపతులు తగు నిర్ణయం తీసుకోవచ్చని స్పష్టం చేశారు.

2024 ఐచ్ఛిక సెలవులు

పండుగ/పర్వదినం	తేదీ	వారం
న్యూ ఇయర్	01-01-2024	సోమ
హజరత్ అలి జయంతి	25-01-2024	గురు
షాబ్ ఈ మీరాజ్	07-02-2024	బుధ
షహదత్ హజరత్ అలి	01-04-2024	సోమ
జముతుల్ వేదా	05-04-2024	శుక్ర
బసవ జయంతి	10-05-2024	శుక్ర
బుద్ధ పూర్ణిమ	23-05-2024	గురు
ఈద్ ఏ గదీర్	25-06-2024	మంగళ
తొమ్మిదవ మొహర్రం	16-07-2024	మంగళ
పార్సీ కొత్త సంవత్సరాది	15-08-2024	గురు
వరలక్ష్మీ వ్రతం	16-08-2024	శుక్ర
మహాలయ అమావాస్య	02-10-2024	బుధ
యజ్ దహమ్ షరీఫ్	15-10-2024	మంగళ
కార్తీక పౌర్ణమి/ గురునానక్ జయంతి	15-11-2024	శుక్ర
హజరత్ సయ్యద్‌మహ్మద్ జువన్పుర్ జయంతి	16-11-2024	శని
క్రిస్మస్ ఈవ్	24-12-2024	మంగళ
బాక్సింగ్ డే	26-12-2024	గురు

2024 సాధారణ సెలవులు

పండుగ/పర్వదినం	తేదీ	వారం
మకర సంక్రాంతి	15-01-2024	సోమ
కనుమ	16-01-2024	మంగళ
రిపబ్లిక్ డే	26-01-2024	శుక్ర
మహాశివరాత్రి	08-03-2024	శుక్ర
హోళి	25-03-2024	సోమ
గుడ్ ఫ్రైడే	29-03-2024	శుక్ర
జగజ్జీవన్‌రామ్ జయంతి	05-04-2024	శుక్ర
ఉగాది	09-04-2024	మంగళ
రంజాన్	11-04-2024	గురు
శ్రీరామ నవమి	17-04-2024	బుధ
బక్రీద్	17-06-2024	సోమ
మొహర్రం	17-07-2024	బుధ
స్వాతంత్ర్య దినోత్సవం	15-08-2024	గురు
శ్రీ కృష్ణాష్టమి	26-08-2024	సోమ
వినాయక చవితి	07-09-2024	శని
మిలాద్ ఉన్ నబి	16-09-2024	సోమ
గాంధీ జయంతి	02-10-2024	బుధ
దుర్గాష్టమి	11-10-2024	శుక్ర
దీపావళి	31-10-2024	గురు
క్రిస్టమస్	25-12-2024	బుధ

శని, ఆదివారాల్లో వచ్చిన పండుగలు/పర్వదినాలు

పండుగ/పర్వదినం	తేదీ	వారం
భోగి	14-01-2024	ఆది
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి	14-04-2024	ఆది
విజయదశమి	12-10-2024	రెండో శనివారం

అమలాపురం కోర్టుకు కాపు ఉద్యమ నేతలు

- ముద్రగడ సహా 30 మంది హాజరు
- గతంలోనే కేసులు ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో
- జీవోను పరిశీలించి కేసు కొట్టివేసినట్టు వెల్లడించిన కోర్టు



కోర్టు నుంచి బయటకు వస్తున్న కాపు ఉద్యమ నేతలు పద్మనాభం తదితరులు

అమలాపురం టౌన్: కాపు ఉద్యమ సమయంలో పట్టణ పోలీస్‌స్టేషన్ ముట్టడికి సంబంధించి టీడీపీ ప్రభుత్వం నమోదు చేసిన కేసులో రాష్ట్ర కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభంతో పాటు 30 మంది కాపు నేతలు గురువారం అమలాపురంలోని జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టుకు హాజరయ్యారు. ముద్రగడతో పాటు రాష్ట్ర కాపు ఉద్యమ నాయకులు నల్లా విష్ణుమూర్తి, కల్వకొలను తాతాజీ, నల్లా పవన్‌కుమార్, సూదా గణపతి, ఆకుల రామకృష్ణ తదితరులు కోర్టుకు వచ్చారు. టీడీపీ ప్రభుత్వం కాపులపై పెట్టిన అక్రమ కేసులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 2022 ఫిబ్రవరిలో ఎత్తివేయించారు. అక్రమ కేసులతో అవస్థలు పడుతున్న కాపు నాయకులకు విముక్తి కల్పించారు. అప్పట్లో ప్రభుత్వం జీవో నంబర్ 120 ద్వారా ఈ కేసులకు ఫుల్‌స్టాప్ పెట్టింది. ముద్రగడ పద్మనాభం గతంలో చట్టసభలకు ప్రాతినిధ్యం వహించిన నేత కావడంతో ఈ కేసును తొలుత విజయవాడ ప్రజా ప్రతినిధులు కేసుల కోర్టుకు బదిలీ చేశారు. ప్రస్తుతం తాను మాజీ మాత్రమేనని, ఈ కేసును అమలాపురం కోర్టుకు బదిలీ చేయాల్సిందిగా హైకోర్టును అభ్యర్థించారు. దీంతో కేసు అమలాపురం జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టుకు బదిలీ చేశారు. మేజిస్ట్రేట్ ఎ.హిమబిందు ఎదుట ఆ 30 మంది కాపు ఉద్యమ నాయకులు గురువారం హాజరయ్యారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం కేసులు ఎత్తివేసిన జీవోను మేజిస్ట్రేట్ పరిశీలించి కేసును కొట్టేసినట్టు వెల్లడించారని అమలాపురం పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీహెచ్ రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా కాపు నాయకులు అమలాపురం కోర్టుల సముదాయం ఎదుట హర్షం వ్యక్తం చేశారు. అప్పట్లో కేసులు ఎత్తివేస్తూ జీవో జారీ చేసి, ఇప్పుడు తమను కేసుల నుంచి విముక్తి కల్పించిన సీఎం జగన్‌కు కాపు ఉద్యమ నేత సూదా గణపతి కృతజ్ఞతలు తెలిపారు.

విభజన హామీలపై ఏనాడైనా కేంద్రాన్ని అడిగారా?

పురందేశ్వరికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వేణుంబాక విజయసాయి రెడ్డి ప్రశ్న



సాక్షి,అమరావతి: విభజన సమస్యలు పరిష్కరించమని, ఏపీకి ఇచ్చిన హామీలు నెరవేర్చమని కేంద్రాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఏనాడైనా డిమాండ్ చేశారా అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వేణుంబాక విజయసాయి రెడ్డి ప్రశ్నించారు. గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో కేంద్ర మంత్రిగా, ప్రస్తుతం బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉన్నత పదవులు చేపట్టి ఏమి వెలగబెట్టారని నిలదీశారు. నాగార్జున సాగర్‌లో ఏపీ నీటి వాటా కోసం ఏపీ ప్రభుత్వం ప్రయత్నిస్తే పోలీసులను ఎందుకు పంపారని పురందేశ్వరి ప్రశ్నించడం ఆమె అవివేకానికి నిదర్శనమన్నారు. చంద్రబాబు మాదిరి ఏపీ రైతులంటే పురందేశ్వరికి ఎందుకంత కోపమని ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ నేత సుబ్బిరామిరెడ్డి ఇంటికి ఎన్టీఆర్, లక్ష్మీపార్వతి కేవలం భోజనానికి వెళితేనే.. టీడీపీని కాంగ్రెస్‌లో కలిపేస్తున్నారంటూ చంద్రబాబు, పురందేశ్వరి ప్రచారం చేశారని గుర్తుచేశారు. అటువంటి వీరిద్దరూ ఇప్పుడు అటు తెలంగాణలోనూ, ఇటు ఏపీలోనూ కాంగ్రెస్ పార్టీతో ఎలా అంటకాగుతున్నారని, కాంగ్రెస్ పార్టీలో కలిసిపోయారా అని ప్రశ్నలు సంధించారు. చిత్తూరు జిల్లా పుంగనూరు వద్ద ప్రపంచంలోనే అతిపెద్ద ఎలక్ట్రిక్ బస్సు, ట్రక్ క్లస్టర్‌ను పెప్పర్ మోషన్ సంస్థ ఏర్పాటు చేస్తోందన్నారు. అత్యాధునిక పరిజ్ఞానంతో అవుకు రెండో సొరంగం పూర్తి చేసి సీఎం జగన్ జాతికి అంకితం చేశారని, దీంతో రాయలసీమ, నెల్లూరు జిల్లాల్లో 2.60 లక్షల ఎకరాలు సస్యశ్యామలం కానున్నాయన్నారు.

గ్రామాల్లో నీటి నాణ్యత పరీక్షలు

- సురక్షిత తాగునీటినే ప్రజలు వినియోగించేలా ప్రభుత్వం చర్యలు
- పరీక్షలకు నిర్వహణకు గాను ప్రతి గ్రామంలో మహిళలతో కమిటీలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గ్రామీణ ప్రాంత వాసులకు సురక్షితమైన తాగునీటి సరఫరా చేయడానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా గ్రామాల్లో మహిళా కమిటీ ఆధ్వర్యంలో నీటి నాణ్యత పరీక్షలను నిర్వహించనుంది. నీటిలో హానికర లోహాలు, బ్యాక్టీరియాలు పరిమితికి మించి ఉన్నాయా? అనే దాన్ని గుర్తించడానికిగాను నీటి నాణ్యత పరీక్షలను నిర్వహించడానికి ప్రభుత్వం గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) ద్వారా ప్రతి గ్రామానికి ప్రత్యేక నీటి నాణ్యత పరీక్షల కిట్‌లను పంపిణీ చేసింది. ఒక్కో కిట్ ద్వారా 100 వరకు నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా 18,781 గ్రామాల్లో నీటి నాణ్యత పరీక్షల నిర్వహణకు ఒక్కో గ్రామంలో ముగ్గురు పొదుపు సంఘాల మహిళలతో పాటు ఆ గ్రామ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్, ఆశ కార్యకర్త లేదా ఏఎన్ఎంలతో మొత్తం 5 మందితో ఓ కమిటీని నియమించింది. ఈ కమిటీలు కిట్‌ల ద్వారా నీటి వనరుల వద్ద ఏడాదికి 2 సార్లు నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించి నీటిలో లోపాలు గుర్తిస్తే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు తెలియజేస్తాయి. ఈ కమిటీ గుర్తించిన లోపాలు ఉన్న నీటిని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ల్యాబ్‌కు పంపి అక్కడ పూర్తిస్థాయి పరీక్షలు నిర్వహిస్తారు. అనంతరం ఆ నీటి వనరును తాత్కాలికంగా మూసివేసి కలుషితాల నివారణకు చర్యలు చేపడతారు. నీటి నాణ్యత పరీక్షల నిర్వహణపై డిసెంబర్‌లో మహిళా కమిటీలకు ప్రభుత్వం శిక్షణ ఇవ్వనుంది. ఇందుకుగాను రాష్ట్ర వ్యాప్తంగా 100 మంది మాస్టర్ ట్రైనర్లను ఎంపిక చేసి వారికి ఆర్‌డబ్ల్యూఎస్, సెర్ప్ అధికారులు శిక్షణ ఇవ్వనున్నారు. వీరి ఆధ్వర్యంలో డిసెంబర్ 20 నుంచి మండలాల వారీగా మహిళా కమిటీలకు శిక్షణ ఇస్తారు. నీటి నాణ్యత పరీక్షలు నిర్వహణ విధివిధానాలను సెర్ప్ కార్యాలయం ఖరారు చేసి, అన్ని జిల్లాలకు తెలియజేసింది. ఒక్కో గ్రామ పరిధిలో ఏయే నీటి వనరుల వద్ద నీటి నాణ్యత పరీక్షల నిర్వహించాలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా ఆయా గ్రామ కమిటీలకు ఇప్పటికే సమాచారం ఇచ్చింది. నిర్ణీత సమయంలో ఆ నీటి వనరుల వద్ద నీటి నాణ్యత పరీక్షలను నిర్వహించిన అనంతరం మహిళ కమిటీలు ఆ వివరాలను ఆ ప్రాంత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారికి తెలియజేస్తే.. మండల స్థాయి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఆ వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లోనూ నమోదు చేయనున్నారు.

ఇక కాళ్ల బేరమే!

- తెలంగాణ ఎన్నికల్లో జనసేనకు బాబు ఝలక్
- ఏపీలో పవన్ ఎక్కువ సీట్లు అడగకుండా కట్టడి
- రాజకీయ అపరిపక్వతతో అవకాశాన్ని జారవిడుచుకున్నామంటున్న జనసేన నేతలు

సాక్షి, అమరావతి: కరివేపాకు రాజకీయాల్లో ఆరితేరిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మరోసారి తన నైజాన్ని చాటుకున్నారు. పొత్తుల కోసం అర్రులు చాస్తున్న జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు గట్టి షాకిచ్చారు. ఏపీలో జనసేన ఎక్కువ సీట్లు డిమాండ్ చేసే అవకాశం లేకుండా తెలంగాణ ఎన్నికలను చంద్రబాబు వినియోగించుకున్నారు. తెలంగాణలో జనసేన ఎక్కడా గెలవకుండా, వీలైతే డిపాజిట్లు కూడా రాకుండా చంద్రబాబు తన ఎత్తుగడ అమలు చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఒకపక్క బీజేపీతో అంటకాగుతూనే టీడీపీతో కలసి పోటీ చేస్తానంటూ రాజమహేంద్రవరం జైలు వద్ద పవన్ ప్రకటించిన విషయం తెలిసిందే. తెలంగాణ ఎన్నికల్లో బీజేపీతో పొత్తులో భాగంగా జనసేన 8 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసింది. అక్కడ ఎన్నికలకు దూరంగా ఉంటూ అస్త్ర సన్యాసం చేసిన టీడీపీ లోపాయికారీగా కాంగ్రెస్‌కు సహకారం అందించిన విషయం బహిరంగ రహస్యమే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌కు స్నేహహస్తం సాచిన టీడీపీ శ్రేణులు బీజేపీ-జనసేన కూటమికి దూరంగా నిలిచేలా చంద్రబాబు పావులు కదిపారు.

60 సీట్లు అడుగుదామని..

చంద్రబాబు స్కిల్ స్కామ్ కేసులో అరెస్టై జైలుకు వెళ్లినప్పుడు పవన్ తన రాజకీయ అపరిపక్వతతో సీట్ల కోసం గట్టిగా డిమాండ్ చేసే అవకాశాన్ని జారవిడుచుకున్నట్లు జనసేన కార్యకర్తలు నిర్వేదం వ్యక్తం చేస్తున్నారు. పొత్తుల్లో భాగంగా జనసేనకు కనీసం 60 సీట్లకు తగ్గకుండా ఇవ్వాల్సిందిగా పవన్ డిమాండ్ చేస్తారని భావించారు. అయితే తెలంగాణ ఎన్నికలు, తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో జనసేనకు అతి స్వల్ప సంఖ్యలో 15–20 సీట్లను మాత్రమే కేటాయించే యోచనలో చంద్రబాబు ఉన్నట్లు సమాచారం. తెలంగాణలో జనసేన పోటీ చేసిన స్థానాల్లో ఆ పార్టీ ఓట్ల శాతాన్ని కట్టడి చేయడం ద్వారా పవన్ కాళ్ల బేరానికి వచ్చేలా పావులు కదిపినట్లు చర్చ సాగుతోంది. సమన్వయ కమిటీ సమావేశాల్లో టీడీపీ నేతలు తమను చులకనగా చూస్తూ కించపరిచే వ్యాఖ్యలు చేస్తున్నారని జనసేన కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు సీట్ల సంఖ్య ఖరారు కాకుండానే తమ అధినేత పొత్తుల గురించి తొందరపడి మాట్లాడారని పేర్కొంటున్నారు.

నాడు బీజేపీకి వెన్నుపోటు

2014 ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకున్న చంద్రబాబు ఇదే తరహా ఎత్తుగడ అమలు చేసిన విషయాన్ని జనసేన నేతలు ప్రస్తావిస్తున్నారు. నాడు బీజేపీకి 15 అసెంబ్లీ సీట్లు, నాలుగు ఎంపీ స్థానాలను కేటాయిస్తున్నట్లు చెప్పిన చంద్రబాబు.. తరువాత 11 అసెంబ్లీ, మూడు లోక్‌సభ స్థానాలకు పరిమితం చేశారు. చివరకు బీజేపీ అభ్యర్థులు నామినేషన్లు వేసిన స్థానాల్లో మూడు చోట్ల తమ పార్టీ అభ్యర్థులను నిలబెట్టి స్నేహపూర్వకంగా పోటీ చేద్దామంటూ వెన్నుపోటు రాజకీయాలకు తెర తీశారు.

అసలేదో.. నకిలీ ఏదో..!

సోషల్ మీడియాలో 25 శాతం నకిలీ వీడియోలే అంటున్న 30% మంది

- వీటిపై ఫిర్యాదు చేసిన 24 గంటల్లో స్పందన ఉండాలని 56 శాతం మంది డిమాండ్
- డీప్ ఫేక్ వీడియోలపై లోకల్ సర్కిల్ సంస్థ సర్వేలో వెల్లడి
- దేశవ్యాప్తంగా 319 జిల్లాల్లో సర్వేలో పాల్గొన్న 32 వేల మంది

సాక్షి, అమరావతి: డీప్ ఫేక్.. సోషల్ మీడియాను కుదిపేస్తున్న అంశమిది. మార్ఫింగ్ టెక్నాలజీ ద్వారా నకిలీ ఫొటోలు, వీడియోలు రూపొందించినట్టు.. ప్రస్తుతం కృత్రిమ మేధ సాయంతో మరింత మెప్పించేలా, ఒరిజినల్‌కు ఏ మాత్రం తీసిపోకుండా నకిలీ వీడియోలు సృష్టిస్తున్నారు. దీంతో సోషల్ మీడియాలో వస్తున్న వీడియోల్లో అసలేదో, నకిలీ ఏదో గుర్తించడం కష్టంగా ఉంటోంది. ఈ క్రమంలో 30 శాతం మంది భారతీయులు తాము సోషల్ మీడియాలో చూసిన వీడియోల్లో 25 శాతం నకిలీవిగా గుర్తించినట్టు అభిప్రాయపడుతున్నారు. లోకల్ సర్కిల్ సంస్థ నిర్వహించిన సర్వేలో ఈ అంశం వెల్లడైంది. దేశవ్యాప్తంగా 319 జిల్లాల్లో 32 వేల మందికి పైగా పౌరులను సర్వేలో భాగస్వామ్యం చేశారు. వీరిలో 64 శాతం మంది పురుషులు, 36 శాతం మంది మహిళలు ఉన్నారు.

25% నకిలీలేనట!

సర్వేలో భాగంగా సోషల్ మీడియాలో చూసిన వీడియోల్లో నకిలీవి ఏ మేరకు ఉంటున్నాయని 10,838 మందిని ప్రశ్నించగా.. 17 శాతం మంది తాము చూసిన వీడియోల్లో దాదాపు 10 శాతం నకిలీవే ఉంటున్నాయని తెలిపారు. 6 శాతం తాము చూసిన వాటిలో 10–25 శాతం, 24 శాతం మంది 25–50, మరో 6 శాతం మంది 50 శాతానికిపైగా నకిలీ వీడియోలను గుర్తిస్తున్నట్టు వెల్లడించారు. 37 శాతం మంది చాలా అరుదుగా నకిలీ వీడియోలను చూస్తున్నట్టు తెలపగా.. 10 శాతం మంది ఏమీ చెప్పలేకపోయారు. ఈ లెక్కన 30 శాతం మంది 25 శాతం అంతకంటే ఎక్కువ నకిలీ వీడియోలను చూస్తున్నట్టు అభిప్రాయపడ్డారు.

24 గంటల్లో తొలగించాలి

సోషల్ మీడియాలో డీప్ ఫేక్ నకిలీ వీడియో ఫిర్యాదులపై వెంటనే స్పందన ఉండాలని 56 శాతం మంది డిమాండ్ చేస్తున్నారు. ఫిర్యాదు చేసిన 24 గంటల్లో స్పందించి సంబంధిత ఫేక్ వీడియోలను తొలగించాలని కోరుతున్నారు. మీరు, మీ కుటుంబ సభ్యులపై నకిలీ వీడియోలు సర్క్యులేట్ అయిన సందర్భాల్లో ఫిర్యాదులపై ఏవిధమైన స్పందన ఉండాలని 10,790 మందిని ప్రశ్నించగా.. 56 శాతం మంది ఒక రోజులోపే ఆ వీడియోలను తొలగించాలన్నారు. 6 శాతం మంది 35 గంటల్లో, మరో 6 శాతం మంది 48 గంటల్లో వాటిని తొలగించాలని అభిప్రాయపడ్డారు. 72 గంటల నుంచి వారం రోజుల్లో వీడియోలను తొలగించాలని 13 శాతం మంది చెప్పగా.. 19 శాతం మంది ఏమీ స్పందించలేదు. ఇక సర్వే ప్రారంభంలో రోజుకు మీరు ఎన్ని షార్ట్ రీల్స్ చూస్తుంటారని 11,173 మందిని ఆరా తీయగా.. 43 శాతం మంది సగటున రోజుకు మూడు, అంతకంటే ఎక్కువ రీల్స్ చూడటంతోపాటు ఫార్వర్డ్ చేస్తున్నట్టు వెల్లడించారు.

జనాలు లేరు..‘జెండాలూ’ లేవు

కోనసీమలో నీరసంగా లోకేశ్ యువగళం



విద్యార్థినిలతో సెల్ఫీ తీసుకుంటున్న లోకేశ్

తాళ్లరేవు: టీడీపీ నేత నారా లోకేశ్ నిర్వహిస్తోన్న యువగళం పాదయాత్ర డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో నీరసంగా సాగుతోంది. లోకేశ్ బస చేసిన తాళ్లరేవు మండలం సుంకరపాలెం శిబిరం నుంచి ఉదయం 10 గంటలకు పాదయాత్ర ప్రారంభమైంది. లచ్చిపాలెం, బాపనపల్లి, పి.మల్లవరం, తాళ్లరేవు, కోరంగి, పటవల, జి.వేమవరం మీదుగా చొల్లంగి చేరుకుంది. షెడ్యూల్ ప్రకారం లచ్చిపాలెం, బాపనపల్లి గ్రామాల మధ్య టీడీపీ నేతలు పలు సంఘాలు, రైతులతో సమావేశాలను ఏర్పాటు చేశారు. అయితే జనం లేకపోవడంతో వాటిని రద్దు చేశారు. పాదయాత్రకు ప్రజల నుంచి స్పందన ఎంతకీ రాకపోవడంతో చేసేదిలేక స్థానిక టీడీపీ నేతలు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి విద్యార్థులను పంపాలని యాజమాన్యాలను అభ్యర్థించారు. దీంతో మండల పరిధిలోని పలు కళాశాలలు, పాఠశాలలకు చెందిన పలువురు విద్యార్థులు రహదారి వద్ద లోకేశ్‌కు స్వాగతం పలికారు. కోరంగిలో లోకేశ్ మాట్లాడుతూ..టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకువస్తామని చెప్పారు. లిక్కర్ వేలంపాటలో కల్లు గీత కార్మికులకు ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. కాగా, పాదయాత్రలో ఎక్కడా జనసేన కార్యకర్తలు, జెండాలు కనిపించకపోవడం గమనార్హం.

ఏఏజీ పొన్నవోలుపై సీఎస్‌కు టీడీపీ ఫిర్యాదు

కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేయాలని డిమాండ్

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వ్యవహరించిన తీరు, చంద్రబాబునాయుడి బెయిల్ తీర్పుపై చేసిన వ్యాఖ్యలు న్యాయ వ్యవస్థను కించపరిచేలా ఉన్నాయంటూ టీడీపీ బృందం గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కేఎస్ జవహర్‌రెడ్డికి ఫిర్యాదు చేసింది. టీడీపీ బృందంలో ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, అధికార ప్రతినిధి సయ్యద్ రఫీ, రాష్ట్ర కార్యదర్శి దేవతోటి నాగరాజు, రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి కంభంపాటి శిరీష, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కోడూరి అఖిల్ ఉన్నారు. పొన్నవోలు తీరు చూస్తుంటే బానిసలు సైతం ఆశ్చర్యపోయేలా ఉందని, విచారణాధికారులు ఏర్పాటు చేసే పత్రికా సమావేశాల్లో ప్రభుత్వ న్యాయవాదులు మాట్లాడటం ఏపీలోనే చూస్తున్నామని వారు సీఎస్ వద్ద వ్యాఖ్యానించారు. హైకోర్టు తీర్పుపై అభ్యంతరం ఉంటే సుప్రీం కోర్టులో అప్పీలు చేసుకోవాలిగానీ, న్యాయమూర్తులను కించపరిచేలా మాట్లాడటం సరికాదన్నారు. పొన్నవోలు కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని, ఆయనను సస్పెండ్ చేసి కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. అధికారులు పరిధి దాటి వ్యవహరించకూడదని హెచ్చరించారు.

ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సుల్లో సీట్ల కేటాయింపు

ఉస్మానియా యూనివర్సిటీ: ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశాలకు మొదటి విడత కౌన్సెలింగ్‌లో 5912 మంది అభ్యర్థులకు సీట్లను కేటాయించారు. గురువారం మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులో ప్రవేశాలకు 3589, అయిదేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులో ప్రవేశాలకు 1579, ఎల్ఎల్ఎం పీజీ కోర్సులో ప్రవేశాలకు 744 మందికి మొదటి విడత కౌన్సెలింగ్‌లో సీట్లు కేటాయించినట్లు టీఎస్‌సెట్-2023 అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ రమేష్‌బాబు వివరించారు. సీట్లు సాధించిన విద్యార్థులు డిసెంబరు 1 నుంచి 6 వరకు ఆయా కళాశాలల్లో రిపోర్టు చేయాలని సూచించారు.

ఓటేసేందుకు వచ్చి మృత్యుఒడికి

కైలాస్‌నగర్: ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓ వృద్ధుడు మృత్యువాత పడ్డాడు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. పట్టణంలోని భుక్తాపూర్ కాలనీకి చెందిన చంద్రగిరి రాజన్న (65) ఓటు వేసేందుకు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రానికి వచ్చాడు. క్యూలో నిల్చున్న సమయంలో కళ్లు తిరిగి కింద పడ్డాడు. వెంటనే స్థానికులు హుటాహుటిన రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వృద్ధుడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు.

ఆకాశాలకూ, భూమికీ మరియు వాటి మధ్యనున్న సమస్తానికీ ఆయనే ప్రభువు. కావున మీరు ఆయననే ఆరాధించండి, ఆయన ఆరాధనలోనే స్థిరంగా వుండండి.

– ఇస్లాం ధర్మం

ఫోకస్

సాక్షి

శుక్రవారం, 1 డిసెంబర్ 2023

అమెరికా నిందలో నిజమెంత?

ఖండాంతరాలు దాటి వెళ్లి శత్రువుగా భావించినవారిని చడీచప్పుడూ లేకుండా అంతం చేయటం అంతర్జాతీయంగా ఎప్పటినుంచో వినిపిస్తున్న కథే. ఈ విషయంలో తరచుగా ఇజ్రాయెల్, రష్యాల పేర్లు వస్తుంటాయి. ప్రచ్ఛన్నయుద్ధకాలంలో ఎక్కువగా అమెరికా గూఢచార సంస్థ సీఐఏ పేరు వినబడేది. దాని లక్ష్యాలన్నీ దేశాధినేతలే. అది సాగించిన హత్యలపై ఆ సంస్థనుంచి రిటైరైనవారు ఎన్నో పుస్తకాలు రాశారు. సీఐఏ సాగించిన ఆపరేషన్లు ఇతివృత్తంగా 30కి పైగా చలనచిత్రాలొచ్చాయి. టీవీ సీరియల్స్ కూడా తక్కువేం కాదు. చిత్రమేమంటే ఈమధ్య కొత్తగా వెలుగులోకొచ్చిన సీఐఏ ఫైళ్ల ఆధారంగా 'ది లుముంబా ప్లాట్' అనే పేరుతో అప్పటి కాంగో ప్రధాని పాట్రిస్ లుముంబాను 1961లో హతమార్చిన తీరుపై స్టువార్ట్ ఏ. రీడ్ అనే ఆయన ఒక పుస్తకాన్ని వెలువరించాడు. అలాంటి అమెరికా గడ్డపై ఖలిస్తానీ ఉద్యమకారుణ్ణి హతమార్చటానికి జరిగిన కుట్రలో భారత ప్రభుత్వ అధికారి ప్రమేయం వున్నదని అమెరికా ఆరోపిస్తోంది. మొన్న జూన్‌లో ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా సందర్శించిన తర్వాత ఈ కుట్ర గురించి మన ప్రభుత్వాన్ని అమెరికా హెచ్చరించిందని నవంబర్ 22న బ్రిటన్‌కు చెందిన 'ద ఫైనాన్షియల్ టైమ్స్' వెల్లడించింది. బుధవారం న్యూయార్క్ సిటీ కోర్టులో ప్రభుత్వ అటార్నీ విలియన్స్ 15 పేజీల అభియోగపత్రాన్ని కూడా దాఖలు చేశారు. అందులో ఈ కుట్ర లక్ష్యం ఎవరన్న పేరు ప్రస్తావించకపోయినా సిఖ్స్ ఫర్ జస్టిస్ సంస్థ నాయకుడు పత్వంత్‌సింగ్ పన్నూన్ అని అక్కడి మీడియా అంటున్నది. ఇటీవల కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో సైతం ఇటువంటి ఆరోపణే చేశారు. అక్కడ దుండగుల కాల్పుల్లో మరణించిన ఖలిస్తాన్ వేర్పాటువాది హర్‌దీప్ సింగ్ నిజ్జార్ హత్యలో భారత్ పాత్ర వున్నదని ఆయన అభియోగం. ఇందుకు సంబంధించి మన దౌత్యవేత్తను బహిష్కరించింది కూడా. నిరాధారమైన ఆరోపణ చేయడాన్ని మన దేశం తప్పుబట్టి ప్రతీకారంగా ఢిల్లీలోని కెనడా దౌత్యవేత్తను బహిష్కరించింది. దౌత్య సిబ్బందిని తగ్గించుకోమని కెనడాను కోరింది. ఆ అంకం ముగియకుండానే తాజాగా అమెరికా సైతం ఆ మాదిరి ఆరోపణే చేయటం సహజంగానే అందరినీ ఆశ్చర్యపరుస్తుంది.

సాధారణంగా మిత్ర దేశాలమధ్య ఈ తరహా పొరపొచ్చాలు రావు. ప్రచ్ఛన్నయుద్ధకాలంలో మనం సోవియెట్ యూనియన్‌తో సన్నిహితంగా వుండటాన్ని జీర్ణించుకోలేక అమెరికా పాకిస్తాన్‌కు అండదండలందించేది. ప్రపంచీకరణ తర్వాత అంతా మారింది. ఇప్పుడు మనకు అమెరికాతో ద్వైపాక్షిక సంబంధాలు బలంగా వున్నాయి. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో చైనాను కట్టడి చేసేందుకు భారత్ సహాయసహకారాలు అవసరమని అమెరికా విశ్వసిస్తోంది. తన ఆరోపణను నిర్ద్వంద్వంగా రుజువుచేసే సాక్ష్యాధారాలు అమెరికా దగ్గరున్నాయా? భారత ప్రభుత్వ అధికారి ఒకరు నిఖిల్ గుప్తా అనే భారత పౌరుడి ద్వారా ఒక కిరాయి హంతకుణ్ణి వినియోగించి పన్నూన్‌ను హతమార్చటానికి కుట్ర చేశారని అటార్నీ దాఖలు చేసిన అభియోగపత్రం చెబుతోంది. అయితే నిఖిల్ గుప్తా అమెరికా మాదకద్రవ్య నిరోధక సంస్థ తాలూకు ఏజెంట్‌ను కిరాయి హంతకుడిగా పొరబడి పన్నూన్ హత్యకు లక్షన్నర డాలర్లు చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడని, అడ్వాన్స్‌గా 15,000 డాలర్లు అందజేశాడని అటార్నీ ఆరోపణ. దీనికి సంబంధించిన ఫొటోలు కూడా అభియోగపత్రానికి జత చేశారు. ఈ హత్య చేయించగలిగితే అతనిపై గుజరాత్‌లో వున్న క్రిమినల్ కేసును రద్దు చేయిస్తానని భారత అధికారి వాగ్దానం చేశారని ఎఫ్‌బీఐ చెబుతోంది. మాదకద్రవ్యాలు, మారణాయుధాల విక్రయం కేసులో నిందితుడైన నిఖిల్ గుప్తా చెక్ రిపబ్లిక్‌కు వెళ్లిన సమయంలో అతన్ని అరెస్టు చేయాలంటూ ఎఫ్‌బీఐ కోరటంతో మొన్న జూన్ 30న అక్కడి పోలీసులు అదుపులోనికి తీసుకుని అమెరికాకు అప్పజెప్పారు. కెనడాలో జరిగిన నిజ్జార్ హత్యలో తమ హస్తమున్నదని గుప్తా ఎఫ్‌బీఐ ఏజెంట్ దగ్గర అంగీకరించాడంటున్నారు.

ఖలిస్తాన్‌పై రిఫరెండమ్ జరగాలని పత్వంత్ సింగ్ డిమాండ్ చేస్తున్నారు. ఆయనకు అమెరికా, కెనడా పౌరసత్వాలున్నాయి. ఖలిస్తాన్ వాదాన్ని మన ప్రభుత్వం ఎప్పుడూ అంగీకరించలేదు. 80, 90 దశకాల్లో ఖలిస్తాన్ పేరిట పంజాబ్‌లో ఉగ్రవాదులు సాగించిన మారణకాండను కఠినంగా అణిచేసింది. 1985 జూన్ 23న 329మంది ప్రయాణికులతో కెనడానుంచి ఢిల్లీ వస్తున్న ఎయిరిండియా కనిష్క విమానాన్ని ఉగ్రవాదులు బాంబులతో పేల్చివేశారు. ఆ విషయంలో కెనడా ప్రభుత్వం భారత్‌కు ఎలాంటి సహకారమూ అందించలేదు సరిగదా...కీలకమైన సాక్ష్యాధారాలను పోలీసులు ధ్వంసం చేశారని కూడా ఆరోపణలొచ్చాయి. ఈనాటికీ ఈ కేసు అతీగతీ లేకుండాపోయింది. అమెరికా చేసిన ఆరోపణలపై మన దేశం ఇప్పటికే ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటుచేసింది. అది అందించే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపింది. నిఖిల్ గుప్తాతో ఒప్పందం కుదుర్చుకున్న వ్యక్తి నిజంగానే ప్రభుత్వాధికారా? అధికారే అయితే అత్యుత్సాహంతో అతను పరిధి దాటి ప్రవర్తించాడా? వేరే దేశాల్లో వ్యక్తులను లక్ష్యంగా చేసుకోవటం తమ విధానం కాదని నిజ్జార్ కేసు సందర్భంగా మన దేశం చెప్పింది. పైగా పకడ్బందీ వ్యవస్థలు అమల్లోవున్న అమెరికాలో అలాంటి పనికి ఎవరైనా సాహసిస్తారా అన్నది సందేహాస్పదం. పంజాబ్‌లో కనుమరుగైన ఖలిస్తాన్ ఉద్యమాన్ని మన దేశం ఇంత సీరియస్‌గా తీసుకుంటుందా అన్నది కూడా అనుమానమే. అమెరికా దగ్గరున్న సాక్ష్యాలు నిజంగా అంత బలంగా వున్నాయా, వుంటే దీన్ని తెగేదాకా లాగుతుందా అన్నది చూడాలి. ఈ కేసు సంగతెలావున్నా మన ప్రభుత్వం భవిష్యత్తులో ఈ మాదిరి ఆరోపణలకు తావు లేకుండా చూసుకోవాల్సిన అవసరం వుంది.

వాస్తవ రూపంలో 'దున్నేవాడిదే భూమి'

'ఎవరెన్ని చెప్పినా పేద ప్రజల ప్రయోజనాలకు మాత్రం రక్షణ లేదు. మన ప్రభుత్వం నమ్రతతో ఈ సత్యాన్ని అంగీకరించి తీరాలి' అని ఒకప్పుడు కఠోర సత్యం చెప్పారు మహాత్మా గాంధీ. కానీ స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా కూడా ఆ ధోరణిలో మార్పు రాలేదు. తరాలుగా పేద ప్రజలు కాయకష్టం చేసి సంపద సృష్టిస్తున్నారు. అలాంటి పేద ప్రజలకు నిర్ణయాధికారం లేదు. వారి యాజమాన్య హక్కులకు ఏపీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రాణం పోశారు. అసైన్డ్ భూముల మీద వారికి పూర్తి హక్కులు కల్పించడం ఒక చారిత్రక నిర్ణయం. దశాబ్దాలుగా పోరాటాల రూపంలో వెల్లడైన పేదల కాంక్షలకు నేటి ఈ నిర్ణయం అంతిమ విజయంగా భావించుకోవాలి.



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

"కోట్లాది దేశ ప్రజలకు ఆహార పంటలు అందించే రైతులకన్నా దేశంలోని పెట్టుబడిదారులకే ప్రభుత్వాలు సర్వ సౌకర్యాలు కల్గిస్తున్నాయి. ఇది కంటికి కన్పించే నగ్న సత్యం. నేను పెట్టుబడిదారులకు వ్యతిరేకిని కాదు. నిజం చెప్పాలంటే, నేను ఒక పెట్టుబడిదారుడికి చెందిన ఇంట్లోనే ఉంటున్నాను. కానీ పెక్కుమంది పెట్టుబడిదారుల వైఖరి ఎలా ఉంటుందో నాకు తెలుసు. ప్రభుత్వాలు మాత్రం తాము పేద ప్రజలకు చేయవలసిందంతా చేస్తున్నామని పైకి చెప్పొచ్చుగాక. ఆ మాటకొస్తే వలస పాలకులైన బ్రిటిష్ వాళ్ళు కూడా అలాగే చెబుతూండేవాళ్లు. అసలు సత్యం ఏమంటే – ఎవరెన్ని చెప్పినా పేద ప్రజల ప్రయోజనాలకు మాత్రం రక్షణ లేదు. మన ప్రభుత్వం నమ్రతతో ఈ సత్యాన్ని అంగీకరించి తీరాలి. అంతేగాదు, ఏ ప్రయివేట్ ఆస్తి అయినా సరే, అది సిగ్గుఎగ్గూ లేకుండా దొంగిలించిన ఆస్తిగానే నేను పరిగణిస్తాను. ఎవరైనా సరే తన కాయకష్టం ద్వారా సంపాదించని ఆస్తి, లేదా బతుకుతెరువుకు అవసరమైన కనీస శ్రమ ఫలితంగా దక్కని సొమ్ము... సిగ్గూ ఎగ్గూ లేని సంపాదన అవుతుంది."

– మహాత్మా గాంధీ (11.12.1947). వి. రామ్మూర్తి 'హిందూ' పత్రిక తరపున ఎడిటర్‌గా సంకలనం చేసి 'కస్తూరి అండ్ సన్స్ లిమిటెడ్ (చెన్నై) తరఫున 2003లో ప్రచురించిన గ్రంథం నుంచి.

తరాలుగా పేద ప్రజలు కాయకష్టం చేసి సంపద సృష్టిస్తున్నారు. ఆ బడుగు, బలహీన వర్గాలకు చెందిన హక్కులను మొట్టమొదటి సారిగా సాధికారికంగా క్రోడీకరించి... 'దున్నేవాడిదే భూమి' అన్న దశాబ్దాల వామపక్ష ఉద్యమాల స్ఫూర్తిని కొలది రోజుల నాడు ఆచరణలోకి తెచ్చారు ఏపీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి. పేద ప్రజల సాగు హక్కులకు ప్రాణం పోశారు. దీనితో పది రకాల వ్యాఖ్యానాల ద్వారా పేదల భూమి హక్కులను, సాగు హక్కులను తారుమారు చేసే మోతుబరుల ప్రయత్నాలకు స్వస్తి పలికారు. రాష్ట్రంలో మరే ప్రభుత్వం వచ్చినా, దీన్ని చెదరగొట్టే ప్రయత్నాలు చెల్లవు. ఆ ప్రయత్నాల్ని తిప్పికొట్టే శక్తినిచ్చేదే ఈ ముందడుగు.

రెండో మాట



వామపక్షాలు దశాబ్దాల తరబడిగా ఆంధ్ర, తెలంగాణలలో కౌలుదారీ చట్టాల కోసం చేస్తూ వచ్చిన పోరాటాలతో సాధించిన పాక్షిక విజయాలకు... నేటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేదలకు అసైన్డ్ భూములపై హక్కులు ఇచ్చిన తీరు భూ చరిత్రలో అంతిమ విజయంగా భావించుకోవాలి. పేదలకు ఈ యాజమాన్య హక్కులు రావడం వలన వారు అవసరం అయితే తమ భూమిని విక్రయించుకోవచ్చు.

ఇక, ఇంతకుపూర్వం కౌలు రైతులకు రుణాలు పొందే అర్హత కార్డులు ఉండేవి కావు. ఈ కార్డులు లేకనే బ్యాంకులు రుణాలివ్వలేదు. ఎంతసేపూ భూములకు పట్టాలున్న రైతుల్నే గుర్తిస్తారు. కౌలు రైతులను గుర్తించేది లేదన్న వైఖరిని కేసీఆర్ లాంటి నాయకులు కనబరిచారు. ఏదైనా ఇంట్లో అద్దెకు ఉంటే, ఆ ఇంటిపై హక్కు అతనికి ఇవ్వగలమా అని కూడా ప్రశ్నించారు. కానీ ఒకప్పుడు వై.ఎస్. రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిత్వంలో నాలుగు లక్షల మందికి పైగా కౌలు రైతులు రుణ అర్హత కార్డులు పొందారు. తద్వారా అనేకమంది బ్యాంకు రుణాలు పొందగలిగారు.

కౌలుదారులకు విధిగా వర్తించాల్సిన రక్షణ చట్టాల కోసం సుదీర్ఘ పోరాటాలు జరిగిన చరిత్ర ఉంది. ఆంధ్ర–తెలంగాణ వామపక్ష నాయకులు ఆ యా ప్రాంతాలలో విడివిడిగానూ, ఉమ్మడిగానూ కలిసి పోరాటం జరిపారు. చంద్రరాజేశ్వరరావు, చలసాని వాసుదేవరావు, రావి నారాయణరెడ్డి, భీమిరెడ్డి నరసింహారెడ్డి, మగ్దుం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి, ఎస్వీకే ప్రసాద్–సుగుణ దంపతులు లాంటివాళ్లు ఇందులో ఉన్నారు. ఉభయ రాష్ట్రాల చరిత్రలో తొలి భూపోరాటాలు, పాక్షిక విజయాలన్నీ వామపక్షాల నేతృత్వంలోనే సాధ్యమయ్యాయి. ఒక్క ముక్కలో, పాత ఫ్యూడల్ శక్తులకు ముగుదాడు వేసి సాధించిన విజయాలన్నీ వామపక్షాలు బలంగా ఉన్నప్పటివే. అవి ఎప్పుడు బలహీనపడ్డాయో అప్పటినుంచీ పటిష్ఠమైన పార్టీగా ఉమ్మడి వామపక్షాల మాట గతకాలపు 'ముచ్చట'గానే మిగిలిపోయింది.

కానీ ప్రస్తుత దశ వేరు. కార్పొరేట్ శక్తుల చేతిలో దేశం నడుస్తున్నది. చాలక, వారి ఆధ్వర్యంలో ప్రసార మాధ్యమాలు కూడా లొంగిపోతున్నాయి. దేశీయ, విదేశీయ ఆశ్రిత పెట్టుబడుల పెత్తనం స్వతంత్ర భారత రాజ్యాంగ మౌలిక లక్ష్యాలను పాతి పెట్టింది. ఈ దుస్థితిని కనిపెట్టిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్, 'రానున్న రోజుల్లో ప్రజలు పార్లమెంట్‌ను కూల్చేస్తా'రని ముందుగానే హెచ్చరించారు. గత పదేళ్లుగా ప్రతియేటా భారత పరిశోధనా సంస్థ 'ఏడీఆర్' నివేదికలు విషాద వాస్తవాన్ని చెబుతున్నాయి. అటు పార్లమెంట్ సభ్యులలో (అన్ని రకాల పార్టీల వాళ్ళు), ఇటు రాష్ట్రాల శాసన సభ్యులలో, మంత్రులలో ఎంత భారీ స్థాయిలో అవినీతి పేరుకు పోయిందో, సవరణకు వీలుకాని స్థాయిలో అవినీతి ఎలా రాజ్యమేలుతోందో ఏడీఆర్ నివేదికలు వెల్లడిస్తున్నాయి.

అందుకే మన పాలకుల్ని ఉద్దేశించి ఒక మహాకవి ఇలా హెచ్చరించాడు:

'విజ్ఞానం వికసించదు విదేశాలు తిరిగొస్తేనే
పరిణతమతి ప్రసరించదు పురాణాలు తిరగేస్తేనే!'

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

పడని శిక్ష



హెన్రీ కిసింజర్ (అమెరికా విదేశాంగ శాఖ మాజీ మంత్రి; తన నూరో ఏట మరణించారు) కోసం ఇండియా, బంగ్లాదేశ్‌లో కన్నీళ్లు కార్చేవారెవరూ లేరు. యుద్ధ నేరాలకు విచారణ ఎదుర్కోకుండానే ఆయన చనిపోయారు. అదే చింత.

– సునందా వశిష్ట్, రాజకీయాంశాల వ్యాఖ్యాత

వాళ్ల సంగతేమిటి?



పాకిస్తాన్! పాలస్తీనా కోసం పోరాడు. కానీ బలోచిస్తాన్ గురించి కూడా ఆలోచించు. అది నీ దేశంలోనే ఉంది. పైగా ఆ ప్రాంతంలో జరుగుతున్న వ్యవస్థీకృత హింసకు నిజానికి రాజ్యమే జవాబుదారీ.

– నిదా కిర్‌మానీ, యాక్టివిస్ట్

అందమైన వివాహం



రణదీప్ హుడా (హరియాణా; నటుడు). లిన్ లైశరామ్ (మణిపుర్; మోడల్) దంపతులకు శుభాకాంక్షలు. ఈ అద్భుతమైన జంట ఇంఫాల్‌లో జరిగిన అందమైన మైతేయి సంప్రదాయ వివాహ వేడుక ద్వారా ఒక్కటైంది. సంవత్సరాలు గడిచే కొద్దీ మీ ప్రేమ బలోపేతం కావాలి.

– కిరణ్ రిజిజు, కేంద్ర మంత్రి

చారిత్రక సాక్ష్యం



రెండు వేల ఏళ్ల కిందట బెత్లేహేములో జన్మించిన ఒక యూదు జన్మదిన వేడుకను ప్రపంచవ్యాప్తంగా ఉన్న 260 కోట్లమంది త్వరలో జరుపుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. కానీ ఇప్పటికీ కొంతమంది జనాలు ఆ ప్రాంతంలో యూదులు ఎవరూ 1948 కంటే ముందు లేరని అనుకుంటున్నారు.

– డేనియల్ ల్యూకోవిట్జ్, సెక్యూరిటీ ఇవాంజెలిస్ట్

బాధ్యతా రాహిత్యం



'నెట్‌ఫ్లిక్స్'లో 'రైల్వేమెన్' (వెబ్ సిరీస్) చూస్తున్న వాళ్లు తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే, యూనియన్ కార్బైడ్ కంపెనీకి హెన్రీ కిసింజర్ సలహాదారు. ఘోరమైన భోపాల్ గ్యాస్ దుర్ఘటనకు ఆ కంపెనీ బాధ్యత వహించకుండా తప్పుకోవడంలో ఆయన సాయపడ్డారు.

– ఆదిల్ హొస్సేన్, అసిస్టెంట్ ప్రొఫెసర్

గొప్ప దౌత్యవేత్త



ప్రేమించండి, ద్వేషించండి (రెండింటికీ బలమైన కారణాలున్నాయి), కానీ హెన్రీ కిసింజర్ సంక్లిష్టమైన, అద్భుతమైన దౌత్య, రాజనీతి ప్రపంచాన్ని ఆవిష్కరించారు... ముఖ్యంగా నాలాంటి అంతర్జాతీయ సంబంధాల విద్యార్థుల కోసం! ఆయన రాసిన 'డిప్లొమసీ' పుస్తకం అత్యుత్తమం, నా ఫేవరెట్. ఇది దౌత్యం, చరిత్ర, రాజకీయాలు, రాజనీతిల మేలు కలయిక.

– హేపీమాన్ జాకబ్, ప్రొఫెసర్

ఇంత నిర్లక్ష్యమా?



నిజ్జార్ నుంచి పన్నూ వరకు అన్నింటా మోదీ ప్రభుత్వపు నిర్లక్ష్యం జాతీయ ప్రయోజనాలకు నష్టం కలిగిస్తోంది. న్యూయార్క్‌లో ఒక హత్యకు పథకం రచిస్తున్నారని ఓ భారత అధికారికి వ్యతిరేకంగా మూడు యూఎస్ ఏజెన్సీలు తెచ్చిన ఆరోపణలు ఒకవేళ నిజమైతే, దేశ భద్రతా నాయకత్వపు ఇమేజ్ పడిపోతుంది.

– ప్రశాంత్ భూషణ్, న్యాయవాది

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఈ పిల్లలకు ఏమైంది?

అభిప్రాయం



డా॥ మహ్మద్ హసన్

'విద్య అనేది వ్యక్తిలోని మంచిని బయటకు తీసుకు రావడానికి కృషి చేస్తుంది' అంటాడు గ్రీకు తత్త్వవేత్త ప్లేటో. అయితే విద్యార్జన కాలంలో పిల్లలు పక్కదోవ పట్టకుండా ఆహ్లాదకర వాతావరణంలో చదువు కున్నప్పుడే ఇది సాధ్యమ వుతుంది. కానీ ఇప్పుడు సెల్‌ఫోన్ వంటి ఆధునిక డివైస్‌లు విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్నా యనీ, వీటి పట్ల జాగ్రత్తగా ఉండాలనీ నిపుణులు హెచ్చరిస్తున్నారు. పిల్లల చేతిలో పాఠ్యపుస్తకం స్థానంలో సెల్ ఫోన్ చేరింది. ఆ మధ్య కాలంలో కేంద్రం చేసిన ఓ సంచలన ప్రకటన ఈ సందర్భంగా ప్రస్తావించాలి. 'మరుగు దొడ్డి' లేని ఇంట్లో విలువైన 'సెల్ ఫోన్' చేరింది అనేది ఆ ప్రకటన సారాంశం. అంటే మొబైల్ ఫోన్ జనానికి ఎంతగా అందుబాటులోకి వచ్చిందో అర్థం చేసుకోవచ్చు.

మూడేళ్ల క్రితం కరోనా రూపంలో ఓ భయంకరమైన విపత్తు ప్రపంచాన్ని చుట్టుముట్టడంతో సెల్‌ఫోన్ వాడకం విద్యార్థులకు అనివార్యం అయ్యింది. కరోనా పోయినా దానికి అలవాటు పడిన పిల్లలు మాత్రం దాన్ని వదల్లేకుండా ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా యువతపై సెల్‌ఫోన్ చూపిస్తున్న దుష్ప్రభావాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఇటీవలే హైదరాబాద్‌లో జరిగిన సంఘటనలోని అంశాలు భయం గొలిపే విధంగా వున్నాయి. నలుగురు మైనర్ విద్యార్థులు 'సెల్ ఫోన్'లోని అశ్లీల వీడియోలు చూస్తూ వారు కూడా అలానే చేసి వీడియో తీసి 'ఫేస్‌బుక్'లో అప్‌లోడ్ చేయాలని నిర్ణయించుకొని ఓ మైనర్ అమ్మాయిని ఎంచుకోవటం, ఆ తరువాత జరిగిన పరిణా మాలూ మనందరికీ తెలిసిన విషయమే.

తరగతి గదిలో గురువు చెప్పే అంశాలపై శ్రద్ధ పెట్టాల్సిన విద్యార్థులు ఏకాగ్రత కోల్పోయి నిత్యం 'సెల్‌ఫోన్'పై దృష్టిపెట్టి విలువైన సమయం వృథా చేస్తున్నారనేది పరిశోధకుల అభిప్రాయం. 'సెల్ ఫోన్' చూడడం వల్ల విద్యార్థుల దృష్టి మందగిస్తుంది. ఆందోళనకు గురి అవుతారు. ఒంటరితనానికి అలవాట వుతారు. సరిగా నిద్రపోలేరు. అనైతిక కార్యకలాపాలూ, తద్వారా ఆరోగ్య సమస్యలూ వస్తాయని శాస్త్రీయ నివేదిక ఒకటి వెల్లడించింది. మొబైల్ ఫోన్ వల్ల 'నోమోఫోబియా' అనే మానసిక వ్యాధికి పిల్లలు గురౌతారని వైద్యులు హెచ్చరించడం ఆలోచించాల్సిన విషయం.

ఆ మధ్యకాలంలో మలేసియన్ ఆన్‌లైన్ జర్నల్ వారు చేసిన అధ్యయనంలో విద్యార్థులు సుమారు 3–6 గంటల విలువైన సమయాన్ని సెల్‌ఫోన్‌తో కాలక్షేపం చేస్తున్నారని తేలింది. ఇక ఈ సందర్భంగానే ఇక్కడ మరొక విషయం ప్రస్తావించాలి. మనిషి జీవితంలో అత్యంత క్రియాశీలక పాత్ర పోషించేది 'కౌమారం' (13–21 ఏళ్ల మధ్య వయసు). ఈ దశలోనే విద్యార్థికి సరైన మార్గదర్శకత్వం చేయాలి. అధ్యాపకులు, తల్లితండ్రులు పిల్లల్లో వస్తున్న శారీరక మానసిక పరమైన మార్పులను పసిగట్టి సానుకూల దృక్ప థంతో దిశానిర్దేశం చేయాలి. విద్య పరమావధి వ్యక్తిత్వ వికాసం. వ్యక్తిలో మూర్తిమత్వ వికాసం సమగ్రంగా, సంపూర్ణంగా సమర్థంగా జరగడానికి బాల్యం నుంచి... తరగతి గది నుండి వీడ్కోలు తీసుకొనే స్థాయి వరకు ఒక క్రమ పద్ధతిలో పిల్లవాడికి లభించే సలహా, సహాయం ఎంతగానో తోడ్పడతాయి. కాబట్టి విద్యార్థి క్రియాశీలక భవిష్యత్తుకు ఆటంకంకల్పించే వస్తువుల పట్ల (సెల్‌ఫోన్, ఇతర మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు) జాగరూకత లేకపోతే పిల్లల భవిష్యత్తు చీకటిమయం అయిపోతుంది. డిగ్రీ లోపు విద్యార్థులకు తరగతి గదిలోకి సెల్‌ఫోన్ అనుమతించకుండా కఠిన ఆంక్షలు విధించాలి. లేనిపక్షంలో విద్యార్థి ఏకాగ్రత దెబ్బతిని మధ్యలోనే చదువు నుండి నిష్క్రమించే అవకాశం కూడా ఉంటుంది.

వ్యాసకర్త రాజనీతి శాస్త్ర అధ్యాపకులు ၊ 99080 59234

ఎయిడ్స్ విధ్వంసాన్ని నివారిద్దాం!

సందర్భం



డాక్టర్ యనమదల మురళీకృష్ణ

మానవ చరిత్రలో ఎయిడ్స్ వ్యాధి సృష్టించిన విధ్వంసం, బీభత్సం, విషాదాలతో ఏ ఒక్క ఇతర అంశాన్నీ సరిపోల్చలేము. 1981 జూన్‌లో బయటపడిన ఎయిడ్స్ అత్యధిక కాలంగా కొనసాగుతున్న ప్రపంచ పీడ. 42 ఏళ్ల కాలంలో ఎనిమిది కోట్ల 56 లక్షల మంది ఎయిడ్స్ జబ్బుకు దారి తీసే హెచ్‌ఐవీ క్రిమి బారిన పడ్డారు. ఇప్పటికే నాలుగు కోట్ల నాలుగు లక్షల మంది ఎయిడ్స్ జబ్బుతో మరణించారు.

చాలా ప్రపంచ పీడలు పరిమిత కాలంలోనే కల్లోలాన్ని సృష్టించి పోతుంటాయి. కానీ ఎయిడ్స్ జీవితకాలపు సాంక్రమిక జబ్బు. అందువల్ల హెచ్‌ఐవీ సోకిన వారు, వారి కుటుంబాలు నిరంతర చికిత్సతో, అప్పుడప్పుడు తలెత్తే అనారోగ్యాలతో ఆర్థికంగా కష్టాల పాలవుతుంటారు. సకాలంలో తగిన చికిత్స అందనిచో వారి కథ విషాదాంతమవుతుంది. ఎయిడ్స్ జబ్బుకి కారణమైన హెచ్‌ఐవీ క్రిమి ప్రధానంగా లైంగికంగా వ్యాప్తి చెందుతుంది. అన్ని సాంక్రమిక వ్యాధుల వలెనే... హెచ్‌ఐవీ వ్యాప్తికి అవగాహన లేమి, పేదరికం, ఆరోగ్య వైద్య సదుపాయాల కొరత, చదువు లేకపోవడం ముఖ్యమైన కారణాలు. ఈ పరిస్థితులు నెలకొని ఉన్న ఆఫ్రికా, ఆసియా దేశాలలో హెచ్‌ఐవీ ప్రబలంగా వ్యాపించింది.

2022 నాటికి ప్రపంచవ్యాప్తంగా మూడు కోట్ల 90 లక్షల మంది ఎయిడ్స్‌తో బాధపడుతున్నారు. వీరిలో 15 లక్షల మంది 15 సంవత్సరాల లోపువారే. ప్రపంచవ్యాప్తంగా 2022లో ఆరు లక్షల 30 వేల మంది ఎయిడ్స్ జబ్బుతో చనిపోయారు. 17 లక్షల మంది కొత్తగా హెచ్‌ఐవీ బారిన పడ్డారు. భారతదేశంలో అందుబాటులో ఉన్న 2019 వివరాల మేరకు 23 లక్షల 49 వేల మంది హెచ్‌ఐవీ సంక్రమించిన వారున్నారు. వీరిలో పది లక్షల మంది మహిళలు. అదే ఏడాది దేశంలో దాదాపుగా 60 వేలమంది ఎయిడ్స్‌తో మరణించారు. తెలుగు రాష్ట్రాలలో దాదాపు 5 లక్షల మంది హెచ్‌ఐవీ బాధితులున్నారని అంచనా.



సహారా ఎడారికి దిగువన ఉన్న దక్షిణాది ఆఫ్రికాలోని బోట్స్‌వానా, ఉగాండా, జింబాబ్వే, జైరి, స్వాజిలాండ్, ఇథియోపియా, కాంగో, మలావి వంటి దేశాలలో హెచ్‌ఐవీ బయటపడిన మొదటి దశకంలో 15 నుండి 49 సంవత్సరాల మధ్య వయసు వారిలో 40 శాతం మంది వరకూ హెచ్‌ఐవీ బారిన పడ్డారు. వారు అనారోగ్యంతో ఫ్యాక్టరీలకు, పనులకు వెళ్లలేక పోవడంతో ఆ యా దేశాలలోని ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలాయి.

వైద్యశాస్త్రంలో అనేక కొత్త విధానాలకు హెచ్‌ఐవీ / ఎయిడ్స్ దారులు చూపింది. ఒక జబ్బు కోసం పరిశోధన చేసి రూపొందించిన మందును వేరే జబ్బుకు వాడే ప్రక్రియ (రీపర్పసింగ్ డ్రగ్)ను మొదట హెచ్‌ఐవీ చికిత్సలోనే ప్రవేశపెట్టారు. ప్రస్తుతం జిడోవుడిన్‌గా పిలుస్తున్న అజిడోథైమిడిన్ మందును క్యాన్సర్ చికిత్స కోసం రూపొందించారు. కాగా జిడోవుడిన్ ఔషధం హెచ్‌ఐవీ వృద్ధిలో పాత్ర ఉన్న ఒక ఎంజైము పనిని అడ్డుకొని, దాని వృద్ధిని నిరోధిస్తుంది. అందువల్ల అజిడోథైమిడిన్‌ని హెచ్‌ఐవీ పీడ ప్రారంభమైన ఐదు సంవత్సరాల తర్వాత, 1987 మార్చిలో హెచ్‌ఐవీ చికిత్సకు మొదటి ఫలవంతమైన చికిత్సగా ప్రవేశపెట్టారు. హెచ్‌ఐవీ చికిత్సలో వాడే కొన్ని మందులను ఈ క్రిమి సోకే అవకాశం ఉన్న వారికి ముందుగానే ఇవ్వడం మూలంగా సంక్రమణను అడ్డుకునే విధానాన్ని నిపుణులు రూపొందించారు. దీనినే 'ప్రీఎక్స్‌పోజర్ ప్రొఫైలాక్సిస్' అంటారు. ఇది హెచ్‌ఐవీకే పరిమితమైన కొత్త నిరోధక విధానం.

ప్రపంచ వ్యాప్తంగా హెచ్‌ఐవీ–ఎయిడ్స్ అవగాహన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించడంతో హెచ్‌ఐవీ వ్యాప్తిని చాలా వరకు తగ్గించగలిగాము. ఎయిడ్స్ జబ్బుకి దారి తీసే హెచ్‌ఐవీ క్రిమి ప్రధానంగా ఆ క్రిమి సోకిన వారితో లైంగిక చర్యలో పాల్గొన్నందు వల్లనే వ్యాప్తి చెందుతుంది. హెచ్‌ఐవీ బాధితురాలు అయిన తల్లి నుండి గర్భస్థ శిశువుకి కూడా వచ్చే అవకాశం ఉంది. ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులు, ఎయిడ్స్ వల్ల తమ వారిని కోల్పోయిన బాధితులు, హెచ్‌ఐవీకి గురయ్యే ప్రమాదం ఉన్నవారు– ఈ సమూహాలకు చెందినవారు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడానికి ముందుండాలని 'యూఎన్ ఎయిడ్స్' పిలుపునిచ్చింది.

వ్యాసకర్త సాంక్రమిక వ్యాధుల నిపుణులు
మొబైల్: 94406 77734

(నేడు ప్రపంచ ఎయిడ్స్ డే)

మాటే మధురం

'నోరు మంచిదైతే ఊరు మంచిదౌతుంద'నే నానుడి తెలుగునాట ప్రసిద్ధమైనది. సందర్భం ఏదైనా అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా మాట్లాడగలిగే నైపుణ్యం కలిగిన వ్యక్తులను 'సంభాషణా చాతుర్యం' కలిగిన వాళ్ళుగా జనం మెచ్చుకోవడం చూస్తుంటాం. అలాంటి వ్యక్తులు అందరికీ స్నేహితులుగా ఉండటం, సాధారణంగా వారంటే గిట్టనివాళ్ళు ఎవరూ ఉండకపోవడం కూడా గమనిస్తూ ఉంటాం. నోటి మంచి



తనంలో ఉండే మహత్తు అది అని అలాంటి వ్యక్తులను చూసినప్పుడు మనకు అర్థమౌతుంది. అటువంటి 'సంభాషణా చాతుర్యం' మనం కూడా నేర్వగలిగితే ఎంతో బాగుంటుందని అనిపిస్తుంది.

సహజంగా వచ్చినా లేక ప్రయత్నపూర్వకంగా సాధించినా, మాటనేర్పరితనం అనే లక్షణం మనిషికి ఒక కనపడని అలంకారం వంటిది. ఆ కారణం చేతనే సంకుసాల నృసింహకవి తాను రచించిన 'కవికర్ణ రసాయనము' అనే కావ్యం ద్వితీయాశ్వాసంలోని ఈ కంద పద్యంలో ఇలా అన్నాడు:

కాకేమి తన్ను దిట్టెనె?
కోకిల తనకేమి ధనము కోకొమ్మనెనే?
లోకము పగయగు బరుసని
వాకున జుట్టమగు మధుర వాక్యము వలనన్.

రోజువారీ జీవితంలో సర్వసాధారణంగా అనుభవానికి వచ్చేటువంటి ఉదాహరణలను ప్రస్తుతించి, నోటి మంచితనం లేదా మాట మంచితనంలోని మహత్తును గురించి సులభంగా అర్థమయ్యే మాటలతో చాలా హృద్యంగా ఈ పద్యంలో చెప్పడం జరిగింది. కాకి 'కావుకావు' మనే దాని కరకు అరుపుతో ఎవరినైనా నిందిస్తుందా? నిందించదు. ప్రకృతి సహజంగా వచ్చిన దాని అరుపుతో, కాకి ఒకరికి చేసే హాని ఏమీ ఉండదు. అలాగే, మరోవైపు కోకిల దాని విన సొంపైన 'కుహూ కుహూ' అనే పాటవంటి కూతతో ఎవరికీ ఏమీ ప్రత్యేకంగా సంపదలను తెచ్చి పెట్టదు. కర్ణపేయమైన దాని స్వరం వలననే కోకిల అందరికీ ప్రియమైన దయ్యింది. కాబట్టి పరుషపు మాటల వలన ఏ లోకమైతే ఒకనికి దూరమైపోతుందో, అదే లోకం మధురమైన మాటతో దగ్గరదై చెలిమిని పాటిస్తుంది అని దీని సారాంశం.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** బ.చవితి ప.3.06 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** పునర్వసు సా.5.06 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** రా.1.46 నుండి 3.26 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.28 నుండి 9.16 వరకు, తదుపరి ప.12.11 నుండి 12.59 వరకు, **అమృతఘడియలు:** ప.2.34 నుండి 4.15 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.17, **సూర్యాస్తమయం:** 5.20.

ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. వివరించే కార్యక్రమంలో భాగంగా..


కృష్ణాజిల్లా మల్లేశ్వరం సచివాలయం వద్ద వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు


కాకినాడ 47వ డివిజన్‌లో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు కన్నబాబు, పద్మశ్రీ తదితరులు


అనంతపురం జిల్లా నెరిమెట్లలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి


అనకాపల్లి జిల్లా మెలిపాకలో ప్రభుత్వ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న యలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు


చిత్తూరు జిల్లా గుంతూరులో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఎం.ఎస్. బాబు, నాయకులు


వైఎస్సార్ జిల్లా ఉప్పరపల్లిలో సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి


పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత డాక్టర్ గీతాహసంతి


శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం సోమరాజుపురం గ్రామ సచివాలయం వద్ద పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి


పశ్చిమగోదావరి జిల్లా తణుకులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు


తూర్పు గోదావరి జిల్లా పెండ్యాలలో సంక్షేమ పథకాల బోర్డును అవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏపీలో తగ్గిన నిరుద్యోగం

రాష్ట్రాల వారీగా నిరుద్యోగితపై నివేదిక విడుదల చేసిన ఆర్‌బీఐ

- ఏపీలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తగ్గిన నిరుద్యోగుల సంఖ్య
- చంద్రబాబు హయాం(2018–19)లో గ్రామాల్లో ప్రతి వెయ్యి మందికి 45 మంది నిరుద్యోగులు
- 2022–23లో 33 మందే..
- బాబు హయాం(2018–19)లో పట్టణాల్లో ప్రతి వెయ్యి మందికి 73 మంది నిరుద్యోగులు
- 2022–23లో 65 మందే..
- సత్ఫలితాలనిస్తున్న వైఎస్ జగన్ సర్కార్ చర్యలు
- ప్రభుత్వ ఉద్యోగాల కల్పన, పరిశ్రమలకు ప్రోత్సాహం, స్వయం ఉపాధి పథకాల అమలే కారణం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో నిరుద్యోగిత రేటు తగ్గింది. ఈ విషయాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గణాంకాలు స్పష్టం చేశాయి. వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీచేస్తూనే.. మరోవైపు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు పెద్ద పీట వేస్తూ ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తోంది. ఈ కృషి ఆర్‌బీఐ గణాంకాల్లో స్పష్టంగా కనిపించింది. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో నిరుద్యోగితపై ఆర్‌బీఐ నివేదిక విడుదల చేసింది. చంద్రబాబు హయాం(2018–19)లో నిరుద్యోగుల సంఖ్యతో పోల్చి చూస్తే 2022–23లో నిరుద్యోగుల సంఖ్య తగ్గిందని ఆర్‌బీఐ వెల్లడించింది.

వైఎస్సార్‌సీపీ పాలనలో ఉద్యోగాలు, ఉపాధే లక్ష్యంగా..

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే సీఎం వైఎస్ జగన్ గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేయడమే కాకుండా.. గ్రామ సచివాలయాల్లో పది మంది చొప్పున, పట్టణ సచివాలయాల్లో 11 మంది చొప్పున శాశ్వత ఉద్యోగాలను కల్పించింది. వైఎస్ జగన్ ప్రభుత్వం ఇప్పటి వరకు 4.93 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తే.. ఇందులో శాశ్వత ఉద్యోగాలే 2.13 లక్షలు ఉన్నాయి. మరోవైపు స్థానిక యువతకు ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 2.5 లక్షల ఎంఎస్ఎంఈ యూనిట్లు ఏర్పాటయ్యాయి. తద్వారా కొత్తగా 16.5 లక్షల మందికి ఉపాధి లభించింది. దీనికి తోడు వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, కాపు నేస్తం వంటి పథకాల ద్వారా మహిళలకు ఆర్థిక సాయం అందిస్తూ చిన్నచిన్న వ్యాపారాలతో పాటు పెద్దపెద్ద మార్ట్‌ల ద్వారా వ్యాపారాలను ప్రోత్సహిస్తోంది. దీంతో లక్షలాది మంది మహిళలు తాము జీవనోపాధి పొందడంతో పాటు ఇతరులకు ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నారు. అలాగే క్యాంపస్ ఉద్యోగాలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిచ్చింది. ఆ ఉద్యోగాలకు ఎంపికయ్యేలా విద్యార్థులకు తగిన శిక్షణ అందజేస్తోంది. దీంతో ఇప్పటివరకు 1.2 లక్షల మందికి క్యాంపస్ ఉద్యోగాలు లభించాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యల ఫలితంగా చంద్రబాబు పాలనలోని 2018–19లో గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి వెయ్యి మందికి 45 మంది నిరుద్యోగులుండగా.. 2022–23లో ఆ సంఖ్య 33కు తగ్గింది. అలాగే 2018–19లో పట్టణ ప్రాంతాల్లో ప్రతి వెయ్యి మందికి 73 మంది నిరుద్యోగులుండగా.. 2022–23లో ఆ సంఖ్య 65కు తగ్గిందని ఆర్‌బీఐ నివేదిక తెలిపింది. అలాగే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళలు, పురుషుల్లోని నిరుద్యోగుల సంఖ్యలో 2018–19 కంటే 2022–23లో తగ్గిందని ఆర్‌బీఐ వెల్లడించింది.

టీడీపీ పాలనలో ఉపాధి కల్పన శూన్యం..

గత టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని యువతకు ఉపాధి అవకాశాల కల్పన, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీని అసలు పట్టించుకోలేదు. ఇతర రాష్ట్రాలు, దేశాలకు చెందిన కన్సల్టెంట్లు, ఏజెన్సీల నియామకంపైనే దృష్టి సారించింది. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో కేవలం 34 వేల ఉద్యోగాలనే భర్తీ చేశారు. దీంతో ఆయన హయాంలో గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లోని నిరుద్యోగుల సంఖ్య ఎక్కువగా ఉంది. 2018–19లో గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి వెయ్యి మందికి 45 మంది నిరుద్యోగులు, పట్టణ ప్రాంతాల్లో ప్రతి వెయ్యి మందికి 73 మంది నిరుద్యోగులు ఉన్నట్లు ఆర్‌బీఐ తెలిపింది.

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళలు, పురుషుల్లోని నిరుద్యోగుల వివరాలు (ప్రతి వెయ్యి మందికి)

ఆర్థిక సంవత్సరం	గ్రామీణ నిరుద్యోగుల సంఖ్య		పట్టణ నిరుద్యోగుల సంఖ్య	
	పురుషులు	మహిళలు	పురుషులు	మహిళలు
2018–19	49	39	62	102
2022–23	35	30	60	75



క్లుప్తంగా...

త్వరలో ఎఫ్ఆర్వో వాకింగ్ టెస్ట్

సాక్షి, అమరావతి: ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ (ఎఫ్ఆర్వో) పోస్టుల భర్తీలో భాగంగా ఈ ఏడాది సెప్టెంబర్‌లో నిర్వహించిన రాత పరీక్ష ఫలితాలను ఏపీపీఎస్సీ గురువారం వెల్లడించింది. వాకింగ్, వైద్య పరీక్షలకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్ https://psc.ap.gov.inలో అందుబాటులో ఉంచినట్టు కార్యదర్శి ప్రదీప్ కుమార్ తెలిపారు. వాకింగ్, వైద్య పరీక్ష షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు

సాక్షి, అమరావతి: యువతకు శిక్షణతో పాటు దీర్ఘకాలిక ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా 'లీడింగ్ టూవార్డ్స్ నెక్స్ట్ ఏజ్ ప్రోగ్రామ్స్' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించినట్లు స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర యువత ప్రతిభను విప్లవాత్మకంగా మార్చే విధంగా ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నైపుణ్య శిక్షణకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం ఇప్పటి వరకు 14,42,134 మందికి నైపుణ్య శిక్షణ ఇవ్వగా..అందులో 3,57,334 మంది 20 రంగాలకు చెందిన పరిశ్రమల్లో 98కిపైగా కెరీర్ రోల్స్‌లో ఉద్యోగ అవకాశాలను పొందారని వివరించారు.

'ఎస్ఆర్ఎం'కు ఫిక్కీ అవార్డు


అవార్డు అందుకుంటున్న అకడమిక్ డీన్ డాక్టర్ కల్లూరి వినాయకర్ తదితరులు

మంగళగిరి: గుంటూరు జిల్లా నీరుకొండలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి ప్రతిష్టాత్మక ఫిక్కీ అవార్డు లభించినట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. ఢిల్లీలోని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) ఏటా విద్యా సంబంధిత అంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచే ఉన్నత విద్యాసంస్థలను గుర్తించి జాతీయ అవార్డులను ప్రదానం చేస్తుంటుంది. దీన్లోభాగంగా బుధవారం రాత్రి న్యూఢిల్లీలోని ఇంటర్నేషనల్ ఫిక్కీ తొమ్మిదో ఉన్నత విద్యా పురస్కారాల ప్రదానం జరిగింది. ఎస్ఆర్ఎంను ఉత్తమ వర్సిటీగా ప్రకటించగా, అకడమిక్ అఫైర్స్ డీన్ డాక్టర్ కల్లూరి వినాయకర్, డాక్టర్ కార్తీక్ రాజేంద్ర అవార్డును అందుకున్నారు. అదే విధంగా తిరువనంతపురంలోని బయోటిక్ రీసెర్చ్ సొసైటీ 2022 గాను పరిశోధన రంగంలో విశేష సేవలు అందించిన శాస్త్రవేత్తలకు అవార్డులు ప్రకటించింది. ఎస్ఆర్ఎం వర్సిటీ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్ సైన్స్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కార్తీక్ రాజేంద్ర యంగ్ సైంటిస్ట్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రెసిడెంట్ సత్యనారాయణన్, నిర్వాహకులు అవార్డులు అందుకున్న వారికి అభినందనలు తెలియజేశారు.

పట్టా అందుకున్న రోజే పాము కాటు..

యువ వైద్యుడు మృతి



తుమకూరు: స్నాతకోత్సవంలో ఎంబీబీఎస్ పట్టా అందుకుని రోగులకు ఉత్తమ సేవలందిస్తానని ప్రమాణ స్వీకారం చేసిన యువ వైద్యుడు.. ఆ కొద్ది సేపటికే పాము కాటుకు గురై మృతి చెందాడు. ఈ విషాద సంఘటన కర్ణాటకలోని తుమకూరు నగరంలో జరిగింది. ఆదిత్ బాలకృష్ణన్ (26) తుమకూరులోని ఒక ప్రముఖ ప్రైవేటు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసి బుధవారం జరిగిన స్నాతకోత్సవంలో పట్టా అందుకున్నాడు. ఈ సందర్భంగా స్నేహితులు అందరూ సంతోషంగా గడిపారు. కాలేజీ ఆవరణలో నుంచి కారులో హాస్టల్‌కు వెళ్లిపోయారు. గదిలోకి వెళ్లిన కొంతసేపటికే ఆదిత్ కుప్పకూలిపోయాడు. సహచరులు ఆస్పత్రికి తరలించగా చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. శరీరంపై పరిశీలించగా పాము కాటు కనిపించింది. కారు పార్కింగ్ ప్రాంతంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా అతడు కారు ఎక్కుతున్నప్పుడు పాము కాటేసినట్లు తేలింది. ఈ ఘటనపై తుమకూరు నగర పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎస్ఐ అభ్యర్థుల ఎత్తు పరీక్షపై

4న విచారణ

హైకోర్టు ధర్మాసనం

సాక్షి, అమరావతి: ఎస్ఐ పోస్టుల నియామక ప్రక్రియలో భాగమైన 'ఎత్తు' పరీక్షపై హైకోర్టు సోమవారం విచారణ జరపనుంది. మరోసారి ఎత్తు పరీక్షకు తాము సిద్ధంగా ఉన్నామని పిటిషన్ దాఖలు చేసిన అభ్యర్థులు హైకోర్టుకు వివరించారు. దీంతో ఈ వ్యవహారంపై సోమవారం విచారణ జరుపుతామని న్యాయమూర్తులు జస్టిస్ గుహనాథన్ నరేంద్ర, జస్టిస్ న్యాపతి విజయ్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఎస్ఐ నియామక ప్రక్రియలో భాగమైన దేహదారుఢ్య పరీక్షలకు సంబంధించి ఎత్తు, ఛాతి చుట్టు కొలతను హైకోర్టు ఆదేశాల మేరకు మాన్యువల్ కొలిచిన అధికారులు.. అందులో తమను అనర్హులుగా ప్రకటించారని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలంటూ ఆరుగొళ్ల దుర్గాప్రసాద్‌తో పాటు మరో 23 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2018 నోటిఫికేషన్‌లో అర్హులుగా ప్రకటించిన తమను ఎత్తు విషయంలో తాజా నోటిఫికేషన్‌లో అనర్హులుగా ప్రకటించారని కోర్టుకు తెలిపారు. వాదనలు విన్న సింగిల్ జడ్జి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్. ఎస్ఐ నియామకాల కోసం గత నెలలో నిర్వహించిన రాత పరీక్షకు సంబంధించిన ఫలితాలను తదుపరి ఉత్తర్వులిచ్చేంత వరకు వెల్లడించవద్దంటూ మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు నియామక బోర్డు ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశాయి. ఈ అప్పీల్‌పై గత వారం విచారణ జరిపిన జస్టిస్ నరేంద్ర నేతృత్వంలోని ధర్మాసనం.. తమ పర్యవేక్షణలో హైకోర్టు ప్రాంగణంలోనే మరోసారి ఎత్తు పరీక్ష నిర్వహిస్తామని స్పష్టం చేస్తూ తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసిన సంగతి తెలిసిందే. అయితే 29న న్యాయమూర్తి సెలవులో ఉండటంతో కేసు విచారణకు రాలేదు. దీంతో అభ్యర్థుల తరపు న్యాయవాది ఈ కేసు గురించి గురువారం ధర్మాసనం ముందు ప్రస్తావించారు. దీంతో ధర్మాసనం నాలుగో తేదీ సోమవారం ఈ వ్యవహారంపై విచారణ జరుపుతామంది.

ఫిషరీస్ వర్సిటీ ఉద్యోగుల పదోన్నతుల కోసం

డిపార్ట్‌మెంటల్ కమిటీ

- ఉద్యోగుల కరువు భత్యం పెంపుదలకు ఆమోదం
- యూజీసీ నిబంధనల మేరకు గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం
- రూ.19.64 కోట్ల బడ్జెట్ ప్రతిపాదనలకు ఆమోదం
- ఏపీ మత్స్య యూనివర్సిటీ తొలి మేనేజ్‌మెంట్ బోర్డు నిర్ణయాలు



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ మత్స్య విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది పదోన్నతుల కోసం డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీని నియమిస్తూ విశ్వవిద్యాలయం తొలి మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం నిర్ణయం తీసుకుంది. కమిటీ సమావేశం గురువారం వర్సిటీ ప్రత్యేకాధికారి ఇన్‌చార్జి వీసీ, మత్స్యశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగింది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వర్సిటీ రిజిస్ట్రార్ ఓ సుధాకర్ మీడియాకు వెల్లడించారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి రూ.12.69 కోట్ల సవరించిన బడ్జెట్ ప్రతిపాదనలతో పాటు 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.19.64 కోట్ల బడ్జెట్ ప్రతిపాదనలకు సమావేశం ఆమోదం తెలిపింది. వర్సిటీ ఉద్యోగులకు ఇవ్వాల్సిన కరువు భత్యాన్ని 2022 జనవరి 1వ తేదీ నుంచి 20.02 శాతం నుంచి 22.75 శాతానికి, జూలై 1వ తేదీ వరకు 22.75 శాతం నుంచి 26.39 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. విశ్వవిద్యాలయంలోని కళాశాలలు, పరిశోధన కేంద్రాలలో బోధనా సిబ్బంది కొరతను అధిగమించేందుకు యూజీసీ నిబంధనల మేరకు తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ ఫ్యాకల్టీలను నియమించడానికి కమిటీ ఆమోదం తెలిపింది. కొత్తగా ఏర్పాటైన మత్స్య యూనివర్సిటీకి పూర్తిస్థాయిలో నియమ, నిబంధనలు రూపొందించేంత వరకు వర్సిటీకి మాతృసంస్థ అయిన శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం నియమ నిబంధనల ప్రకారమే పరిపాలన కార్యకలాపాలు జరిపేందుకు ఆమోదం తెలిపారు. సమావేశంలో మత్స్యశాఖ కమిషనర్ కె.కన్నబాబు, ఆర్థిక శాఖ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఎల్.నరసింహమూర్తి పాల్గొన్నారు.

వలలో చిక్కి.. చెట్టుకు వేలాడిన చిరుత

- విశాఖ జూ రెస్క్యూ టీం వచ్చినా దక్కని ఫలితం
- మత్తు ఇచ్చి రక్షించాక మరణించిన చిరుత


వల నడుముకు చుట్టుకోవడంతో చెట్టుకు వేలాడుతున్న చిరుత

అడ్డతీగల: కోతుల బెడద నివారణ కోసం వరి చేను చుట్టూ అమర్చిన వలలో చిక్కిన చిరుత పులి తప్పించుకుపోవడానికి చెట్టు పైకి ఎక్కి.. దానికి వేలాడుతూ రాత్రంతా అవస్థ పడింది. అటవీ అధికారులు వచ్చి రక్షించినా.. తీవ్ర గాయంతో చివరకు ప్రాణాలు విడిచింది. అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల మండలం ఎల్లవరం శివారున రేగులపాడు వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బుధవారం ఉదయం రేగులపాడు వద్ద చెట్టుకు వేలాడుతున్న చిరుతను చూసిన స్థానికులు అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే రంపచోడవరం డీఎఫ్‌వో జీజీ నరేంద్రన్, అడ్డతీగల సబ్ డీఎఫ్‌వో బి.శ్రీరామారావు, అడ్డతీగల రేంజి అధికారి షేక్ షెహన్షా, ఎస్ఐ అప్పలరాజు ఇతర సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. వల నడుముకు చుట్టుకుపోయి వేలాడుతున్న చిరుతను రక్షించేందుకు వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. విశాఖపట్నం జూ నుంచి రెస్క్యూ టీంని రప్పించి రాజమహేంద్రవరం నుంచి బోను తెప్పించారు. రాత్రి నుంచి చెట్టుకు వేలాడడంతో చిరుత అలసిపోయిన విషయం గమనించి.. ట్రాక్టర్‌లో నిచ్చెన ఉంచి దాని మీద ఆధారపడి చిరుత సేదతీరేలా చేశారు. మంచినీటిని అందించారు. అనంతరం రెస్క్యూ టీం సభ్యులు మత్తు ఇంజెక్షన్ ఇచ్చి చిరుతను బోనులోకి చేరవేశారు. అయితే కొద్దిసేపటి అనంతరం చిరుత మరణించింది. దీంతో అటవీ అధికారులు పోస్ట్‌మార్టం నిర్వహించి ఘటనా స్థలంలోనే చిరుతను దహనం చేశారు. కొన్నిగంటల పాటు వల నడుం చుట్టూ చుట్టుకుపోవడంతో చిరుత పెనుగులాడటం, ఆహారం లేక నీరసించి పోవడంతో మృతి చెందిందని డీఎఫ్‌వో నరేంద్రన్ చెప్పారు. ఈ ప్రాంతంలో చిరుతలు మరిన్ని ఉండవచ్చని, ప్రజలు రాత్రి సమయాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. వన్యప్రాణులకు ఎటువంటి హాని తలపెట్టకుండా అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

మారిటైం బోర్డు చైర్మన్‌గా కేవీ రెడ్డి బాధ్యతల స్వీకారం



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డు చైర్మన్‌గా రెండోసారి కాయల వెంకటరెడ్డి విజయవాడలోని బోర్డు కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. వెంకటరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రానికి అపారమైన పెట్టుబడి అవకాశాలను కల్పించే బృహత్తర మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులో భాగమైనందుకు ఆనందంగా ఉందన్నారు. నాలుగు కొత్త గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లను ఏపీఎంబీ అభివృద్ధి చేస్తోందన్నారు. రామాయపట్నం ఓడరేవు ఈ ఏడాది చివరి నాటికి సిద్ధమవుతుందని, జువ్వలదిన్నెలో ఫిషింగ్ హార్బర్‌ను ప్రారంభించనున్నట్టు వెంకటరెడ్డి తెలిపారు. డిప్యూటీ సీఈవో బి.ఆర్.రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన బాలల సైన్స్ కాంగ్రెస్

జాతీయ పోటీలకు 20 ప్రాజెక్టుల ఎంపిక


ఫలితాలను వెల్లడిస్తున్న డాక్టర్ అపర్ణ చిత్రంలో ప్రతాప్‌రెడ్డి తదితరులు

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యార్థులు తమ సైన్స్ ఆలోచనలకు పదునుపెట్టేలా రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్–2023 పోటీలు గురువారం ముగిశాయి. జిల్లాల నుంచి వచ్చిన 182 ఉత్తమ ప్రాజెక్టులతో గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో ఈ ప్రదర్శన నిర్వహించారు. వీటి నుంచి 17 బెస్ట్ ప్రాజెక్టులు, ప్రత్యేక కేటగిరిలో మరో మూడు ప్రాజెక్టులను జాతీయ పోటీలకు ఎంపిక చేసినట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర, సాంకేతిక మండలి (అప్‌కాస్ట్) మెంబర్ సెక్రటరీ డాక్టర్ వై.అపర్ణ తెలిపారు. పాఠశాల స్థాయిలోని 10 నుంచి 17 ఏళ్ల లోపు విద్యార్థుల్లో హేతుబద్ధత, పరిశోధనలపై అవగాహన పెంచడంతో పాటు, స్థానిక సమస్యలకు పరిష్కారాలు చూపుతూ ఈ ప్రాజెక్టులను రూపొందించారన్నారు. కార్యక్రమంలో ఏపీ సైన్స్ సిటీ సీఈఓ జయరామిరెడ్డి, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ బీ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

యువతతోనే సమాజాభివృద్ధి

- ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి
- కృష్ణా వర్సిటీలో కృష్ణా తరంగ్–2023 పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న హేమచంద్రారెడ్డి, చిత్రంలో వీసీ జ్ఞానమణి తదితరులు

కోనేరుసెంటర్: విద్యార్థులు సమాజానికి ఉపయుక్తంగా ఉండాలని ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య హేమచంద్రారెడ్డి సూచించారు. మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయంలో మూడు రోజులపాటు జరగనున్న కృష్ణా తరంగ్–2023 పోటీలు గురువారం ప్రారంభం అయ్యాయి. పోటీలను హేమచంద్రారెడ్డి, యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య జి.జ్ఞానమణితో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడేలా ఆలోచన చేసే విద్యార్థులే మంచి భవిష్యత్తును ఆస్వాదించగలుగుతారన్నారు. ఎత్తుపల్లాలు జీవితంలో భాగమేనని వాటినుంచి తప్పించుకుని నడవగలిగిననాడే విజయాల వైపు వెళ్లగలుగుతారని చెప్పారు. ఆచార్య జి.జ్ఞానమణి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఐక్యత, స్నేహభావం పెంచేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. మాజీ శాసనసభ్యుడు ఎస్ శేషరెడ్డి , రెక్టార్ ఆచార్య డి.సూర్యచంద్రరావు, రిజిస్ట్రార్ పి.వీరబ్రహ్మచారి, కృష్ణా తరంగ్ – 2023 కన్వీనర్ డాక్టర్ ఎం.కోటేశ్వరరావు ప్రసంగించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుందరకృష్ణ, విశ్వ విద్యాలయం సభ్యులు మాధవి, సుభాషిణి, దినేష్, డాక్టర్ విజయకుమారి, డాక్టర్ శ్రావణి పాల్గొన్నారు.

'హృదయాలయ'కు రూ.1.51 కోట్ల

వైద్య పరికరాలు విరాళం


ఈవో ఏవీ ధర్మారెడ్డికి విరాళం అందిస్తున్న హిందుస్థాన్ ఏరోనాటిక్స్ సంస్థ ప్రతినిధులు

తిరుపతి (అలిపిరి): తిరుపతిలోని శ్రీపద్మావతి చిన్నపిల్లల ఆసుపత్రికి బెంగళూరుకు చెందిన హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సంస్థ రూ.1.51 కోట్ల విలువైన వైద్య పరికరాల కొనుగోలుకు విరాళం అందించింది. ఈ మేరకు గురువారం టీటీడీ పరిపాలన భవనంలో ఈవో ఏవీ ధర్మారెడ్డి ఆధ్వర్యంలో ఆ సంస్థ ప్రతినిధులు, ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథరెడ్డితో ఎంవోయు కుదుర్చుకున్నారు. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సంస్థ సీఎండీ సీబీ అనంతకృష్ణన్‌మాట్లాడుతూ టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయ అద్భుతమైన సేవలు అందిస్తోందని, ఎంతోమంది పేదలు మెరుగైన గుండె వైద్యసేవలు పొందుతున్నారని కొనియాడారు. ఈ ఆసుపత్రికి అవసరమైన 3 ఆపరేషన్ థియేటర్లు, అనస్తీషియా వర్క్ స్టేషన్, వెంటిలేటర్స్, మానిటర్స్ కొనుగోలుకు సామాజిక బాధ్యతగా విరాళం అందించినట్లు తెలిపారు. జేఈవో సదా భార్గవి, సీవీఎస్వో నరసింహ కిశోర్, సంస్థ హెచ్ఆర్ డైరెక్టర్ ఏబీ ప్రదాన్, సీనియర్ మేనేజర్ సొమెన్ చౌధురి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

2023.. అత్యంత వేడి సంవత్సరం !

ఐక్యరాజ్యసమితి వాతావరణ సంస్థ అంచనా

దుబాయ్: నెల రోజుల్లో ముగిసిపోనున్న 2023 ఏడాది.. చరిత్రలోనే అత్యంత వేడి సంవత్సరంగా రికార్డులకెక్కనుందని ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రపంచ వాతావరణ సంస్థ(డబ్ల్యూఎంఓ) గురువారం నివేదించింది. నివేదిక తాలూకు వివరాలు నేచర్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. పారిశ్రామిక విప్లవం ముందునాటి కాలంతో పోలిస్తే ఈ ఏడాది 1.4 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత పెరిగిందని డబ్ల్యూఎంఓ ప్రధాన కార్యదర్శి పీటేరీ టాలస్ చెప్పారు. ''ఈ ఏడాది తొలినాళ్లలో పసిఫిక్ మహాసముద్ర ఉపరితర జలాలు వేడెక్కి సంభవించిన 'ఎల్ నినో' పరిస్థితి కారణంగా వచ్చే ఏడాది సగటు ఉష్ణోగ్రత 1.5 డిగ్రి సెల్సియస్‌ను దాటనుంది. మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా వచ్చే నాలుగేళ్ల 1.5 డిగ్రీ సెల్సియస్ నమోదయ్యే వీలుంది. ఆ తర్వాత దశాబ్దంలో ఇది సర్వసాధారణ స్థితిగా నిలిచిపోయే ప్రమాదముంది'' అని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు.

వరవరరావు హైదరాబాద్‌కు వెళ్లొచ్చు

ప్రయాణ అనుమతి మంజూరుచేసిన ముంబై కోర్టు

ముంబై: ఎల్గార్ పరిషత్– మావోయిస్టుల తో సంబంధాల కేసులో అరెస్టయి బెయిల్ మీద బయటికొచ్చిన విప్లవకవి వరవరరావు హైదరాబాద్ వెళ్లేందుకు ముంబైలోని ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానం అనుమతి మంజూరుచేసింది. ఎడమ కంటికి చికిత్స నిమిత్తం డిసెంబర్ 5–11 తేదీల మధ్య హైదరాబాద్ వెళ్లేందుకు అనుమతినిస్తూ బుధవారం జడ్జి రాజేశ్ కటారియా ఉత్తర్వులిచ్చారు. హైదరాబాద్‌కు వెళ్లాక ఎక్కడ ఉండేది, చిరునామా, ఫోన్ నంబర్, షెడ్యూల్ తదితర సమగ్ర వివరాలను ముందుగానే ముంబైలో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ)కు సమర్పించాలని ఆదేశించింది. ప్రయాణ అనుమతిని దుర్వినియోగం చేయొద్దని హెచ్చరించింది.

రూ. 2.23 లక్షల కోట్లతో 'రక్షణ' కొనుగోలు ప్రాజెక్టులు

డీఏసీ ఆమోదం

న్యూఢిల్లీ: రూ.2.23 లక్షల కోట్ల విలువైన రక్షణ సంబంధిత కొనుగోలు ప్రాజెక్టులకు భారత రక్షణ శాఖ రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్(డీఏసీ) గురువారం ప్రాథమికంగా ఆమోదం తెలియజేసింది. ఈ ప్రాజెక్టుల్లో భాగంగా 97 తేజస్ తేలికపాటి యుద్ధ విమానాలు, 156 ప్రచండ్ హెలికాప్టర్లను త్రివిధ దళాల కోసం రక్షణ శాఖ కొనుగోలు చేయనుంది. దీనివల్ల భారత సైనిక దళాలు మరింత శక్తివంతంగా మారుతాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. భారత్–పాకిస్తాన్, భారత్–చైనా సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో కొత్తగా పెద్ద సంఖ్యలో యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు సమకూర్చుకోవాలని రక్షణ శాఖ ఇప్పటికే నిర్ణయించింది. రూ.2.23 లక్షల కోట్లతో కొనుగోలు చేస్తే యుద్ధ విమానాలు, హెలికాప్టర్లలో 98 శాతం స్వదేశంలోనే తయారవుతాయని రక్షణ శాఖ పేర్కొంది.

తూర్పు ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణుల వాన

కీవ్: ఉక్రెయిన్‌లోని డొనెట్స్క్ ప్రాంతం లక్ష్యంగా రష్యా మిలటరీ బుధవారం రాత్రి ఎస్–300 దీర్ఘ శ్రేణి క్షిపణులతో విరుచుకుపడింది. ఆ ప్రాంతంలోని పొక్రోవ్స్క్, నోవోహ్రోడివ్కా, మిర్నోహ్రాడ్ నగరాలపై జరిగిన దాడుల్లో ఒకరు చనిపోగా పదుల కొద్దీ భవనాలు నేలమట్టమయ్యాయి. భవనాల శిథిలాల్లో కొందరు చిక్కుకుని ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొద్ది నెలలుగా భీకర పోరాటం కొనసాగుతున్న అవ్‌డివ్కా నగరానికి సమీపంలోనే పై మూడు నగరాలున్నాయి. బఖ్‌ముత్ చుట్టుపక్కల ప్రాంతం, కీలకమైన అవ్‌డివ్కాలపై పట్టుసాధించేందుకు రష్యా బలగాలు వరుస దాడులకు పాల్పడుతున్నట్లు ఉక్రెయిన్ సైన్యం తెలిపింది.

రసాయనాల ఫ్యాక్టరీలో ఘోర అగ్ని ప్రమాదం

ఏడుగురు మృతి, మరో 25 మందికి గాయాలు

సూరత్: గుజరాత్‌లోని సూరత్‌లోని ఓ రసాయనాల కర్మాగారంలో సంభవించిన పేలుడు, ఘోర అగ్ని ప్రమాదంలో ఏడుగురు సజీవదహనమయ్యారు. మరో 25 మంది గాయాలపాలయ్యారు. సచిన్ పారిశ్రామిక ప్రాంతంలోని ఈథర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీలో గురువారం అర్ధరాత్రి దాటాక 2 గంటల సమయంలో రసాయనాలు నిల్వ ఉన్న ట్యాంకులో ఆకస్మాత్తుగా పేలుడు సంభవించింది. అనంతరం చెలరేగిన మంటలు కర్మాగారాన్ని చుట్టుముట్టాయి. అగ్నిమాపక సిబ్బంది సుమారు 9 గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు.

పేద దేశాలకు 'వాతావరణ మార్పుల' నష్టపరిహారం

దుబాయ్: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లోని దుబాయ్ నగరంలో కాప్–28 సదస్సు గురువారం ప్రారంభమైంది. 12 రోజులపాటు సదస్సు జరగనుంది. తొలిరోజు కీలకమైన నిర్ణయం తీసుకున్నారు. శిలాజ ఇంధనాల వాడకం మితిమీరుతుండడం, తద్వారా పెరుగుతున్న కాలుష్యం, సంభవిస్తున్న వాతావరణ మార్పుల వల్ల పేద, అభివృద్ధి చెందుతున్న దేశాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. వాతావరణ మార్పుల్లో ఆయా దేశాల పాత్ర తక్కువే. అయినప్పటికీ నష్టాన్ని మాత్రం భరించాల్సి వస్తోంది. అందుకే వాటికి పరిహారం చెల్లించాలన్న ప్రతిపాదనకు కాప్–28 సదస్సులో ఆమోద ముద్ర వేశారు.

కాంగ్రెస్-2, బీజేపీ-2, హంగ్-1!

5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై ఎగ్జిట్ పోల్స్ జోస్యం | అన్ని రాష్ట్రాల్లోనూ 3న కౌంటింగ్, ఫలితాల వెల్లడి


రాజస్థాన్‌లో బీజేపీ, మధ్యప్రదేశ్‌లోనూ మొగ్గు

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌ల్లో కాంగ్రెస్	మిజోరంలో హంగ్ అసెంబ్లీ

న్యూఢిల్లీ: నెలన్నరకు పైగా సాగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల పోరు ముగింపునకు వచ్చింది. గురువారంతో అన్ని రాష్ట్రాల్లోనూ పోలింగ్ ప్రక్రియ ముగిసింది. మిజోరంలో నవంబర్ 7న, ఛత్తీస్‌గఢ్‌లో నవంబర్ 7, 19 తేదీల్లో రెండు దశల్లో, మధ్యప్రదేశ్‌లో 19న, రాజస్థాన్‌లో 25న పోలింగ్ జరగడం తెలిసిందే. తెలంగాణలో కూడా గురువారం ఒకే దశలో పోలింగ్ ముగిసింది. ఐదు రాష్ట్రాల్లోనూ డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు జరిగి ఫలితాలు వెలువడనున్నాయి. తెలంగాణలో పోలింగ్ ముగియగానే ఐదు రాష్ట్రాల్లోనూ ఎగ్జిట్ పోల్స్ వెలువడ్డాయి. తెలంగాణలో అధికార బీఆర్ఎస్‌ను కాంగ్రెస్ ఓడించనుందని దాదాపుగా అన్ని ఎగ్జిట్ పోల్స్ పేర్కొన్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో అధికారం నిలబెట్టుకుంటుందని పలు పోల్స్ పేర్కొన్నాయి. ఇక కాంగ్రెస్ పాలిత రాజస్థాన్‌లో బీజేపీ గెలుస్తుందని చాలావరకు తేల్చాయి. మధ్యప్రదేశ్‌ను కూడా బీజేపీ నిలబెట్టుకోవచ్చని, మిజోరంలో హంగ్ రావచ్చని తెలిపాయి...


మధ్యప్రదేశ్... బీజేపీకే మొగ్గు!

మధ్యప్రదేశ్‌లో బీజేపీ ఘనవిజయం సాధించనుందని ఇండియాటుడే-యాక్సిస్ మై ఇండియా, టుడేస్ చాణక్య, ఇండియా టీవీ-సీఎన్ఎక్స్ వంటి పలు సంస్థ ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. రాష్ట్రంలో మొత్తం అసెంబ్లీ సీట్లు 230. మెజారిటీ మార్కు 116 కాగా బీజేపీకి ఏకంగా 140 నుంచి 162 సీట్లు వస్తాయని ఇండియాటుడే--యాక్సిస్ మై ఇండియా పేర్కొంది. కాంగ్రెస్ 68 నుంచి 90 సీట్లకు పరిమితం కానుందని చెప్పింది. టుడేస్ చాణక్య కూడా బీజేపీకి 151, కాంగ్రెస్‌కు 74 స్థానాలిచ్చింది. ఇండియా టీవీ-సీఎన్ఎక్స్ ఎగ్జిట్ పోల్స్‌లోనూ బీజేపీకి 140 నుంచి 159 సీట్లు రాగా కాంగ్రెస్ 70 నుంచి 89 సీట్లకు పరిమితమైంది. రిపబ్లిక్ టీవీ కూడా బీజేపీకి 118 నుంచి 130 సీట్లిచ్చింది. కాంగ్రెస్‌కు 97 నుంచి 107 రావచ్చని పేర్కొంది. టైమ్స్ నౌ-ఈటీజీ మాత్రం కాంగ్రెస్‌కు 109–125 సీట్లివ్వగా బీజేపీకి 105–117 వస్తాయని పేర్కొంది. ఏబీపీ-సీవోటర్ కూడా కాంగ్రెస్‌కు 113 నుంచి 137 స్థానాలొస్తాయని, బీజేపీ 88 నుంచి 112కు పరిమితమవుతుందని చెప్పింది. జన్ కీ బాత్ మాత్రం రెండు పార్టీలూ 100 నుంచి 125 సీట్ల మధ్య గెలుచుకుంటాయని జోస్యం చెప్పింది.



రాజస్థాన్‌లో కమల వికాసమే

రాజస్థాన్‌లో బీజేపీ విజయం ఖాయమని చాలా ఎగ్జిట్ పోల్స్ తేల్చాయి. మూడు మాత్రం కాంగ్రెస్ బహుశా రాజస్థాన్‌లో నెగ్గే అవకాశముందని అంచనా వేశాయి. రాష్ట్రంలో మొత్తం 200 అసెంబ్లీ సీట్లు కాగా మెజారిటీకి 101 స్థానాలు రావాలి. టైమ్స్ నౌ సర్వేలో బీజేపీకి 108 నుంచి 128, కాంగ్రెస్‌కు 56 నుంచి 72 సీట్లొచ్చాయి. ఇక బీజేపీ 105 నుంచి 125 స్థానాలు సాధిస్తుందని రిపబ్లిక్ టీవీ పేర్కొంది. కాంగ్రెస్ 69 నుంచి 81కి పరిమితమవుతుందని చెప్పింది. ఏబీపీ-సీవోటర్ బీజేపీకి 94–114, కాంగ్రెస్‌కు 71–91 సీట్లిచ్చింది. జన్ కీ బాత్ సర్వే కూడా బీజేపీ 100 నుంచి 122 సీట్లు గెలుస్తుందని, కాంగ్రెస్ 62 నుంచి 85కు పరిమితమవుతుందని పేర్కొంది. టుడేస్ చాణక్య బీజేపీకి 101, కాంగ్రెస్ 89 సీట్లిచ్చింది. ఇండియాటుడే--యాక్సిస్ మై ఇండియా బీజేపీకి 86 నుంచి 106, కాంగ్రెస్‌కు80 నుంచి 100 సీట్లొస్తాయని అంచనా వేసింది. కాంగ్రెస్ 94 నుంచి 104 సీట్లతో అధికారం నిలుపుకుంటుందని, బీజేపీకి 80 నుంచి 90 స్థానాలొస్తాయని ఇండియా టీవీ-సీఎన్ఎక్స్ పేర్కొంది.



తెలంగాణలో కాంగ్రెస్ పాగా

తెలంగాణలో బీఆర్ఎస్ పాలనకు తెర దించి తొలిసారిగా కాంగ్రెస్ అధికారంలోకి రానుందని ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి. 119 స్థానాల అసెంబ్లీలో మెజారిటీకి 60 స్థానాలు కావాల్సి ఉండగా కాంగ్రెస్‌కు 60 నుంచి 70 దాకా వస్తాయని టైమ్స్ నౌ-ఈటీజీ అంచనా వేసింది. బీఆర్ఎస్ 37 నుంచి 45 సీట్లకు పరిమితమవుతుందని చెప్పింది. బీజేపీకి 6 నుంచి 8, మజ్లిస్‌కు5 నుంచి 7 రావచ్చని పేర్కొంది. రిపబ్లిక్ టీవీ కూడా కాంగ్రెస్‌కు 58 నుంకచి 68 సీట్లిచ్చింది. బీఆర్ఎస్‌కు 46 56, బీజేపీకి 4 నుంచి 9 వస్తాయని, ఇతరులు 5 నుంచి 9 సీట్లు నెగ్గుతారని పేర్కొంది. ఇండియా టీవీ-సీఎన్ఎక్స్ అయితే కాంగ్రెస్‌కు ఏకంగా 63 నుంచి 79 సీట్లిచ్చింది. బీఆర్ఎస్ 31 నుంచి 47తో సరిపెట్టుకుంటుందని చెప్పింది. బీజేపీకి 2 నుంచి 4, మజ్లిస్‌కు5 నుంచి 7 వస్తాయని తెలిపింది. టుడేస్ చాణక్య కూడా కాంగ్రెస్‌కు 71 సీట్లు, బీఆర్ఎస్‌కు 33, బీజేపీకి 7, ఇతరులకు 8 స్థానాలిచ్చింది. కాంగ్రెస్ 49 నుంచి 65 సీట్లొస్తాయని ఏబీపీ-సీవోటర్ సర్వే పేర్కొంది. బీఆర్ఎస్‌కు 38 నుంచి 54, బీజేపీకి 5 నుంచి 13 వస్తాయని, ఇతరులు 5 నుంచి 9 సీట్లు నెగ్గుతారని చెప్పుకొచ్చింది. జన్ కీ బాత్ కూడా కాంగ్రెస్‌కు 48 నుంచి 64, బీఆర్ఎస్‌కు 40 నుంచి 55 సీట్లిచ్చింది. బీజేపీ 7 నుంచి 13, మజ్లిస్ 4 నుంచి 7 సీట్లు నెగ్గుతాయని చెప్పింది.



మిజోరంలో హంగ్



ఈశాన్య రాష్ట్రమైన మిజోరంలో అధికార మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్) ఈసారి ఎదురీదుతోందని ఎగ్జిట్ పోల్స్ తేల్చాయి. ఎంఎన్ఎఫ్‌కు ఈసారి జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పీఎం) గట్టి పోటీ ఇచ్చినట్టు పేర్కొన్నాయి. బహుశా హంగ్ అసెంబ్లీ ఏర్పడవచ్చని జోస్యం చెప్పాయి. కాంగ్రెస్ మూడో స్థానానికే పరిమితమవుతుందని, బీజేపీకి ఒకట్రెండు స్థానాలు దాటకపోవచ్చని తెలిపాయి. మొత్తం 40 స్థానాలకు గాను రిపబ్లిక్ టీవీ మాత్రం ఎంఎన్ఎఫ్‌కు 17 నుంచి 22 దాకా ఇచ్చింది. ఏబీపీ సీవోటర్ కూడా దానికి 15 నుంచి 21 స్థానాలు రావచ్చని పేర్కొంది. మిగతా సర్వేలన్నీ అది మెజారిటీకి కొద్ది దూరంలోనే నిలిచిపోతుందని తేల్చాయి. జెడ్‌పీఎం ఏకంగా 28 నుంచి 35 సీట్లతో ఘనవిజయం సాధిస్తుందని ఇండియాటుడే--యాక్సిస్ మై ఇండియా పేర్కొనడం విశేషం! ఎంఎన్ఎఫ్ కేవలం 3 నుంచి 7 సీట్లకు, కాంగ్రెస్ 2 నుంచి 4 స్థానాలకు పరిమితమవుతాయని అది తేల్చింది. మిగతా సర్వేలన్నీ ఎంఎన్ఎఫ్‌కు 14 నుంచి 18 సీట్లు, జెడ్‌పీఎంకు 10 నుంచి 16 సీట్ల చొప్పున ఇచ్చాయి.

ఛత్తీస్‌గఢ్ 'హస్త'గతం!



ఛత్తీస్‌గఢ్‌లో భూపేశ్ బఘెల్ సర్కారు పనితీరుకు ప్రజలు మరోసారి పట్టం కడుతున్నట్టు పలు ఎగ్జిట్ పోల్స్ పేర్కొన్నాయి. మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకు గాను కాంగ్రెస్‌కు 40 50 దాకా వస్తాయని ఇండియాటుడే-యాక్సిస్ మై ఇండియా పేర్కొంది. బీజేపీ 36 నుంచి 46 దాకా గెలుచుకుంటుందని అంచనా వేసింది. టైమ్స్ నౌ-ఈటీజీ కాంగ్రెస్‌కు 48 నుంచి 56, బీజేపీకి 32 నుంచి 40 సీట్లిచ్చింది. కాంగ్రెస్‌కు 57, బీజేపీకి 33 సీట్లొస్తాయని టుడేస్ చాణక్య పేర్కొంది. ఇండియా టీవీ-సీఎన్ఎక్స్ సర్వే కాంగ్రెస్‌కు 46–56, బీజేపీకి 30–40 సీట్లిచ్చింది. రిపబ్లిక్ టీవీ కూడా కాంగ్రెస్44 నుంచి 52 సీట్లు గెలుస్తుందని, బీజేపీ 35 నుంచి 42 సీట్లకు పరిమితమవుతుందని అభిప్రాయపడింది. ఇక రెండు పార్టీలూ హోరాహోరీగా తలపడ్డట్టు ఏబీపీ-సీవోటర్, జన్ కీ బాత్ తేల్చాయి. కాంగ్రెస్‌కు 41 నుంచి 53, బీజేపీకి 36 నుంచి 48 సీట్లు రావచ్చని ఏబీపీ చెప్పింది. ఇక జన్ కీ బాత్ సర్వే బీజేపీకి 34 నుంచి 45, కాంగ్రెస్‌కు 42 నుంచి 53 స్థానాలిచ్చింది.

2018లో ఎవరికెన్ని?

మిజోరం (మొత్తం స్థానాలు 40)		
పార్టీ	సీట్లు	ఓట్ల శాతం
ఎంఎన్ఎఫ్	26	37.7
కాంగ్రెస్	5	29.98
జెడ్‌పీఎం	8	22.9
బీజేపీ	1	8.09
ఇతరులు	0	1.3

ఛత్తీస్‌గఢ్ (మొత్తం స్థానాలు 90)		
పార్టీ	సీట్లు	ఓట్ల శాతం
బీజేపీ	15	33
కాంగ్రెస్	68	43
ఇతరులు	7	24

రాజస్థాన్ (మొత్తం స్థానాలు 200)		
పార్టీ	సీట్లు	ఓట్ల శాతం
బీజేపీ	73	38.7
కాంగ్రెస్	100	39.3
స్వతంత్రులు	13	9.5
ఇతరులు	14	11.1

మధ్యప్రదేశ్ (మొత్తం స్థానాలు 230)		
పార్టీ	సీట్లు	ఓట్ల శాతం
బీజేపీ	109	41.02
కాంగ్రెస్	114	40.89
బీఎస్పీ	2	5
ఇతరులు	5	9

తెలంగాణ (మొత్తం స్థానాలు 119)		
పార్టీ	సీట్లు	ఓట్ల శాతం
టీఆర్ఎస్	88	46.87
కాంగ్రెస్	19	28.43
టీడీపీ	2	3.51
మజ్లిస్	7	2.71
బీజేపీ	1	6.98
ఇతరులు	1	6

నాలుగు పెద్ద కులాలు.. పేదలు, యువత, మహిళలు, రైతులు

- ఆ నాలుగు కులాల అభివృద్ధే దేశాభివృద్ధి
- ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ సంతృప్త స్థాయిలో అందిస్తాం
- ప్రధానమంత్రి మోదీ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: గత పదేళ్ల తమ పరిపాలన ప్రజల్లో తమ ప్రభుత్వంపై అంతులేని విశ్వాసాన్ని పెంచిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. గత ప్రభుత్వాలు ప్రజల పట్ల నిరంకుశంగా వ్యవహరించాయని, ఓటు బ్యాంకు రాజకీయాలతో అభివృద్ధిని విస్మరించాయని ఆక్షేపించారు. గురువారం 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'లో భాగంగా వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. తన దృష్టిలో పేదలు, యువత, మహిళలు, రైతులు అనే నాలుగు పెద్ద కులాలు ఉన్నాయని, ఆ కులాలు అభివృద్ధి చెందితే దేశం కూడా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. ఈ నాలుగు కులాల సాధికారతే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. ఇచ్చిన హామీలను తాను కచ్చితంగా నెరవేరుస్తాన్న సంగతి ప్రజలకు తెలుసని వెల్లడించారు. ప్రజల ఆశీస్సులు కోరుకుంటున్నానని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ సంతృప్తస్థాయిలో అందిస్తామని ప్రకటించారు. ఇందుకోసమే 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'కు శ్రీకారం చుట్టామని తెలపారు.

భారత్ ఇక ఆగిపోదు.. అలసిపోదు

ప్రజల ఆకాంక్షలు మొదలైన చోటునుంచే 'మోదీ గ్యారంటీ' ప్రారంభమవుతుందని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుకోవాలని ప్రజలు తీర్మానించుకున్నారని, భారత్ ఇక ఆగిపోదు, అలసిపోదు అని తేల్చి చెప్పారు. 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'కు దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుంచి అద్భుతమైన ప్రజా స్పందన లభిస్తోందని హర్షం వ్యక్తం చేశారు.

'డ్రోన్ దీదీ యోజన' ప్రారంభం

మహిళా స్వయం సహాయక సంఘాలకు డ్రోన్లు అందజేసేందుకు ఉద్దేశించిన 'డ్రోన్ దీదీ యోజన'ను ప్రధాని మోదీ గురువారం ప్రారంభించారు. ఈ పథకం కింద 2024–25 నుంచి 2025–26 వరకు ఎంపిక చేసిన 15,000 మహిళా స్వయం సహాయక సంఘాలకు డ్రోన్లు పంపిణీ చేస్తారు. ఆయా సంఘాలు ఈ డ్రోన్లను వ్యవసాయ పనుల కోసం రైతులకు అద్దెకు ఇచ్చి, ఆదాయం ఆర్జించవచ్చు. మహిళలకు వారి గ్రామాల్లో గౌరవ ప్రతిష్టలు దక్కాలని తాను ఆశిస్తున్నానని మోదీ చెప్పారు.

కొత్త శిఖరాలకు భారత ఆర్థిక వ్యవస్థ

తమ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు, నిర్ణయాలతో మన దేశ ఆర్థిక వ్యవస్థ కొత్త శిఖరాలకు చేరిందని ప్రధానమంత్రి మోదీ వివరించారు. ఎన్నెన్నో నూతన ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. గురువారం ఢిల్లీలో రోజ్‌గార్ మేళాలో ఆయన మాట్లాడారు. వివిధ ప్రభుత్వ విభాగాల్లో కొత్తగా నియమితులైన వారికి అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సమాజంలో అట్టడుగు వర్గాలకు సైతం చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

దుబాయ్ వెళ్లిన ప్రధాని మోదీ

వాతావరణ మార్పులు, వాటి ప్రభావాన్ని ఎదుర్కొనే విషయంలో భారత్ తన హామీలకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ప్రధాని మోదీ చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాలు వాతావరణ మార్పులను తట్టుకునేందుకు అవసరమైన ఆర్థిక తోడ్పాటును, సాంకతికతను అభివృద్ధి చెందుతున్న దేశాలకు బదిలీ చేయాలని ఆయన కోరారు. ఐరాస కార్యక్రమం కాప్–28లో భాగంగా శుక్రవారం జరిగే వరల్డ్ క్లైమేట్ యాక్షన్ సమిట్‌లో పాల్గొనేందుకు ప్రధాని మోదీ గురువారం సాయంత్రం ఢిల్లీ నుంచి దుబాయ్‌కి బయలుదేరారు.

హెన్రీ కిసింజర్ కన్నుమూత

వందేళ్ల వయసులో తుదిశ్వాస • శక్తివంతమైన దౌత్యవేత్తగా గుర్తింపు



వాషింగ్టన్: అమెరికా విదేశాంగ శాఖ మాజీ మంత్రి, అంతర్జాతీయ దౌత్య నిపుణుడు, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, అమెరికా విదేశాంగ విధానం రూపశిల్పిగా పేరుగాంచిన హెన్రీ కిసింజర్ తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు వందేళ్లు. చాలా రోజులుగా అనారోగ్యంగో బాధపడుతున్న కిసింజర్ కనెక్టికట్‌లో తన నివాసంలో బుధవారం కన్నుమూశారని ఆయన కన్సల్టెంగ్ కంపెనీ 'కిసింజర్ అసోసియేట్స్' ప్రకటించింది. అమెరికా విదేశాంగ విధానం గురించి ఎక్కడ చర్చ జరిగినా కిసింజర్ పేరు ప్రస్తావనకు రావాల్సిందే. అంతలా ఆయన తనదైన ముద్ర వేశారు. రెండో ప్రపంచ యుద్ధంలో సైనికుడిగా పాల్గొన్న కిసింజర్ 21వ శతాబ్దంలోనూ ప్రపంచ పరిణామాలను ప్రభావితం చేశారు.

ఏకకాలంలో రెండు కీలక పదవులు

కిసింజర్ 1923 మే 27న జర్మనీలోని బవేరియన్ సిటీలో జన్మించారు. యూదు మతస్థుడైన కిసింజర్ 1938లో తన కుటుంబంతో కలిసి అమెరికా చేరుకున్నారు. న్యూయార్క్‌లోని మన్‌హట్టన్‌లో స్థిరపడ్డారు. మాతృభాష జర్మన్. ఇంగ్లిష్ భాష అనర్గళంగా మాట్లాడే స్థాయికి చేరుకున్నప్పటికీ చనిపోయే దాకా జర్మన్ యాస మాత్రం ఆయనను వదల్లేదు. న్యూయార్క్ సిటీలోని జార్జి వాషింగ్టన్ హైస్కూల్‌లో ప్రాథమిక విద్య అభ్యసించారు. తర్వాత అమెరికా సైన్యంలో చేరారు. మాతృదేశం జర్మనీలో అమెరికా తరఫున పోరాడారు. నిఘా విభాగంలో పనిచేశారు. జర్మనీలో నాజీలను ఓడించేందుకు తన వంతు సేవలందించారు. ఆయనకు 'బ్రాంజ్ స్టార్' లభించింది. తర్వాత అమెరికాకు తిరిగివచ్చారు. హార్వర్డ్ యూనివర్సిటీలో చేరారు. అదే యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. అంతర్జాతీయ వ్యవహారాలపై పరిజ్ఞానం పెంచుకున్నారు. రిపబ్లికన్ పార్టీ నేత, న్యూయార్క్ గవర్నర్ నెల్సన్ రాక్‌ఫెల్లర్‌కు సలహాలు ఇచ్చేశారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ప్రైమరీల్లో రిపబ్లికన్ పార్టీ నాయకుడు రిచర్డ్ నిక్సన్ విజయం సాధించారు. దాంతో కిసింజర్.. నిక్సన్ వర్గంలో చేరిపోయారు. నిక్సన్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికయ్యాక కిసింజర్‌ను జాతీయ భద్రతా సలహాదారుగా నియమించారు. 1973లో విదేశాంగ మంత్రిగా బాధ్యతలు అప్పగించారు. ఏకకాలంలో రెండు కీలక పదవుల్లో కిసింజర్ చక్రం తిప్పారు. కిసింజర్ తర్వాత అమెరికాలో ఈ రెండు పదవులను ఒకేసారి ఎవరూ నిర్వర్తించలేదు. వాటర్‌గేట్ కుంభకోణంలో నిక్సన్ రాజీనామా చేయడంతో అధ్యక్షుడైన గెరాల్డ్ ఫోర్డ్ హయాంలోనూ కిసింజర్ అమెరికా విదేశాంగ మంత్రిగా సేవలందించారు. వియత్నాంలో అమెరికా యుద్ధానికి ముగింపు పలికేలా చొరవ తీసుకున్నందుకు 1973లో ఆయనకు నోబెల్ శాంతి బహుమతి లభించింది. ఇజ్రాయెల్–అరబ్ దేశాల మధ్య ఘర్షణలను నివారించడంలో కీలక పాత్ర పోషించారు. అత్యంత శక్తివంతమైన దౌత్యవేత్తగా గుర్తింపు పొందారు. ఆయనకు మొదటి భార్య ద్వారా ఎలిజబెత్, డేవిడ్ జన్మించారు.

భారత వ్యతిరేక వైఖరి

విదేశాంగ మంత్రిగా పదవీ కాలం పూర్తయిన తర్వాత కూడా ఆయన సలహాదారుగా పనిచేశారు. కార్పొరేషన్లకు, రాజకీయనాయకులకు, ప్రపంచ స్థాయి నేతలకు సలహాలు ఇస్తుండేవారు. సభలు, సమావేశాల్లో పాల్గొనేవారు. ప్రపంచ పరిణామాలపై తనఅభిప్రాయాలు వెల్లడించేవారు. పలు చిన్న, దుర్బల దేశాలపై అమెరికా యుద్ధాలు, దాడుల వెనుక కిసింజర్ దుష్ట రాజనీతి ఉందన్న ఆరోపణలు వచ్చాయి. ఆయనను యుద్ధ నేరగాడిగా పలు దేశాలు అభివర్ణించాయి. కిసింజర్ రెండు సార్లు చైనాలో పర్యటించారు. సోవియట్ రష్యాకు చెక్ పెట్టడానికి చైనాతో ద్వైపాక్షిక సంబంధాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. 1971లో భారత్–పాకిస్తాన్ మధ్య భీకర యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో అమెరికా ప్రభుత్వం పాకిస్తాన్‌కు అండగా నిలిచింది. దీని వెనుక కిసింజర్ ఒత్తిడి ఉన్నట్లు వార్తలు వచ్చాయి. అప్పట్లో భారత్‌ను కిసింజర్ తీవ్రంగా వ్యతిరేకించేవారు. తరచూ విమర్శలు చేస్తుండేవారు. భారత్‌ను తప్పుపట్టినందుకు ఆ తర్వాతి కాలంలో ఆయన తన సన్నిహితుల వద్ద పశ్చాత్తాపం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

ఇజ్రాయెల్-హమాస్ ఒప్పందం పొడిగింపు

గాజాస్ట్రిప్/జెరూసలేం: కాల్పుల విరమణ ఒప్పందాన్ని మరొక రోజు పొడిగించేందుకు ఇజ్రాయెల్–హమాస్ గురువారం అంగీకరించాయి. వాస్తవానికి గురువారం ఉదయం 7 గంటలకు ఒప్పందం ముగిసింది. బందీలంతా ఇంకా విడుదల కాకపోవడం, గాజాలోని పాలస్తీనియన్లకు మరింత మానవతా సాయం అందాల్సి ఉండడంతో ఒప్పందం పొడిగింపునకే ఇరుపక్షాలు మొగ్గుచూపాయి. గాజాలోని శాంతి కోసం ఇజ్రాయెల్, హమాస్‌పై అంతర్జాతీయ సమాజం నుంచి ఒత్తిడి పెరుగుతోంది. అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ బుధవారం రాత్రి ఇజ్రాయెల్ చేరుకున్నారు. ఇజ్రాయెల్–హమాస్ మధ్య ఘర్షణలకు తెరదించే దిశగా ఆయన ప్రయత్నాలు ముమ్మరం చేయనున్నట్లు తెలిసింది. కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా హమాస్ మిలిటెంట్లు ఇప్పటిదాకా 73 మంది ఇజ్రాయెలీలను, 24 మంది ఇతర దేశస్తులను విడుదల చేశారు. ఇంకా 126 మంది హమాస్ చెరలో బందీలుగా ఉన్నట్లు అంచనా.

జెరూసలేంలో కాల్పులు.. ముగ్గురి మృతి

జెరూసలేంలో ఉద్రిక్తత పరిస్థితుల నెలకొన్నాయి. బుధవారం ఉదయం 7.40 గంటలకు వీచ్‌మ్యాన్ వీధిలో బస్‌స్టాప్‌లో నిల్చున్న ప్రయాణికులపై ఇద్దరు సాయుధ పాలస్తీనియన్ దుండగులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు ఇజ్రాయెలీలు మృతిచెందారు. మరో ఆరుగురు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు చెప్పారు. భద్రతా సిబ్బంది జరిపిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు దుండగులు హతమయ్యారు. వారిద్దరూ తూర్పు జెరూసలేంకు చెందిన సోదరులని తెలిసింది. గతంలో ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొని జైలుకు వెళ్లొచ్చారు.

రేపు అఖిలపక్ష భేటీ

పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం

న్యూఢిల్లీ: డిసెంబర్ నాలుగో తేదీ నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు మొదలుకానున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష భేటీకి పిలుపునిచ్చింది. డిసెంబర్ రెండో తేదీన(శనివారం) అఖిలపక్ష సమావేశానికి హాజరుకావాలని సంబంధిత రాజకీయ పార్టీలకు కేంద్రం ఆహ్వానం పంపింది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ అధ్యక్షతన జరిగే ఈ భేటీలో కేంద్రం తరఫున రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, వాణిజ్య మంత్రి పియూశ్ గోయల్‌తోపాటు రాజకీయ పార్టీల లోక్‌సభ, రాజ్యసభ పక్ష నేతలు పాల్గొంటారు. ప్రస్తుతం పార్లమెంట్ వద్ద 37 బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సారి సెషన్‌లో ఏడు బిల్లులను ప్రవేశపెట్టాలని, 12 బిల్లులను ఆమోదింపజేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన గ్రాంట్ల తొలి అదనపు బిల్లులను ప్రవేశపెట్టాలని సర్కార్ భావిస్తోంది. లోక్‌సభలో 'నగదుకు ప్రశ్నలు' ఉదంతంలో టీఎంసీ మహిళా ఎంపీ మహువా మొయిత్రాపై బహిష్కరణ వేటు వేయాలంటూ నైతికవిలువల కమిటీ ఇచ్చిన సిఫార్సును ఈసారి సభలో ప్రవేశపెట్టాలని కేంద్రం యోచిస్తోంది. భారతీయ శిక్షా స్మృతి, నేర శిక్షా స్మృతి, సాక్ష్యాధారాల చట్టాల స్థానంలో కొత్త బిల్లులను సభ ముందు ఉంచాలని మోదీ ప్రభుత్వం భావిస్తోంది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఎలక్షన్ కమిషనర్ల నియామక బిల్లునూ ప్రవేశపెట్టే అవకాశముంది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శుక్రవారం । 1 । డిసెంబర్ । 2023

టెక్ లోకం



బెంగళూరు ప్యాలెస్ మైదానంలో జరుగుతున్న టెక్ సమ్మిట్‌లో గురువారం సందడి. వివిధ స్టాళ్లు ఆకట్టుకున్నాయి

న్యూస్‌రీల్

పోలీసులకు రూ.2 కోట్లతో టెంట్ల కాలనీ

- బెళగావి అసెంబ్లీ సమావేశాలకు భారీ భద్రత

శివాజీనగర: బెళగావి నగర సువర్ణ విధానసౌధలో డిసెంబర్ 4 నుంచి 15వ తేదీ వరకు జరగనున్న శాసనసభా శీతాకాల సమావేశాలకు ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. భద్రత కోసం 5 వేలకు పైగా పోలీస్ సిబ్బందిని నియమిస్తున్నట్లు బెళగావి పోలీస్ కమిషనర్ ఎస్.ఎన్.సిద్రామప్ప తెలిపారు. పోలీసులు బస చేసేందుకు నాలుగు పెద్ద జర్మన్ టెంట్‌లతో సమీపంలో అలారవాడ వద్ద కాలనీ వంటిది నిర్మిస్తున్నట్లు గురువారం చెప్పారు. దీనికి రూ. 2 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇందులో పోలీసు ఉన్నతాధికారులకు ప్రత్యేకంగా బస ఏర్పాట్లు ఉంటాయి. బెళగావి సమావేశాల్లో ప్రతిసారీ రైతు,కార్మిక సంఘాల డిమాండ్ల సాధన కోసం ధర్నాలు చేస్తుంటాయి. ఈసారి సౌధ పరిసరాల్లో ఆందోళనలు చేయకుండా అడ్డుకునే అవకాశముంది.

భారీ కొండ చిలువ పట్టివేత



శివమొగ్గ: శివమొగ్గ నగర సమీపంలోని జెహెచ్ పటేల్ లేఔట్‌లో భారీ కొండచిలువ కనిపించింది. కొండచిలువను చూసిన స్థానికులు స్నేక్ కిరణ్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన అక్కడకు చేరుకుని దాదాపు ఎనిమిదిన్నర పొడవుగల కొండ చిలువను చాకచక్యంగా పట్టుకుని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

టోల్ వసూలుపై స్థానికుల కన్నెర్ర

- సిబ్బందితో గొడవ

దొడ్డబళ్లాపురం: 648వ జాతీయ రహదారి (దొడ్డబళ్లాపురం బైపాస్)పై దేవనహళ్లి తాలూకా నల్లూరులో కొత్తగా ప్రారంభమైన టోల్‌గేట్‌లో స్థానికులకు ఉచితంగా అనుమతించాలని డిమాండు చేస్తూ ప్రజలు గొడవకు దిగారు. సర్వీస్ రోడ్డును మూసివేసి తప్పనిసరిగా టోల్ గేట్ గుండానే వెళ్లేలా ఏర్పాటు చేశారు. దీంతో స్థానిక ప్రజలు అటు ఇటు వెళ్లాల్సి వచ్చినప్పుడు టోల్ గేట్ దాటాలి, ఇందుకు ఫీజు చెల్లించాల్సి వస్తోంది. దీంతో విసిగిపోయిన స్థానికులు సర్వీస్ రోడ్డు తెరవాలని లేదా టోల్ గేట్ నుండే ఉచితంగా అనుమతించాలని గురువారం ఉదయం టోల్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. టోల్ సిబ్బంది కూడా రెచ్చిపోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి వచ్చి ఇరువైపుల వారికి నచ్చజెప్పి పరిస్థితిని అదుపుచేశారు.

పొలం గొడవలో చిన్నాన్న హత్య

మైసూరు: పొలం గొడవలో సొంత చిన్నాన్నను హత్య చేసిన సంఘటన జిల్లాలోని నంజనగూడు తాలూకాలోని మరళ్ళిపుర గ్రామంలో జరిగింది. వివరాలు.. పరశివప్ప (65)ను అతని అన్న కుమారుడు ఆదీష్ కొడవలితో నరికి చంపాడు. పొలం గురించి ప్రభుస్వామికి, అతని తమ్ముడు పరశివప్పకు మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం ప్రభుస్వామి కుమారుడు ఆదీష్ ఇంట్లో నుంచి వేట కొడవలిని తీసుకెళ్లి చిన్నాన్నను నరికాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స ఫలించక మృతి చెందాడు. ప్రభుస్వామి, అతని కుమారుడు పరారీలో ఉన్నారు. కవలంద పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది.

ఆస్తుల వివరాలు అంత రహస్యమా?

- లోకాయుక్తకు సమర్పించని 72 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- వీరిలో పలువురు మంత్రులు
- జాబితా విడుదల చేసిన సంస్థ



లోకాయుక్త కార్యాలయం



ఆస్తుల ప్రకటనకు చట్టసభ సభ్యుల తడబాటు ఎందుకో!

శివాజీనగర: సామాన్య పౌరులకు ఆదర్శంగా ఉండవలసిన చట్టసభ సభ్యులు అనేక అంశాల్లో ఉల్లంఘిస్తూ ఉంటారు. అదేరీతిలో లోకాయుక్తకు ఆస్తి వివరాలు సమర్పించేందుకు గడువు ముగిసినా కూడా కొంతమంది మంత్రులతో పాటుగా మొత్తం 72 మంది ఎమ్మెల్యేలు వివరాలను అందజేయలేదు. ఆస్తుల వివరాలు సమర్పించని చట్టసభ సభ్యుల జాబితాను లోకాయుక్త కార్యాలయం విడుదల చేసింది. ఈ జాబితాలో ప్రభుత్వంలోని కొందరు మంత్రులు కలిపి 51 మంది ఎమ్మెల్యేలు, 21 మంది ఎమ్మెల్సీలు ఉండడం గమనార్హం. పదవికి ఎన్నికైన మూడు నెలలలోపు ఉభయ సభల సభ్యులు అందరూ తమ తమ స్థిర చరాస్తుల వివరాలను లోకాయుక్తకు సమర్పించాలని నియమం ఉంది. కానీ ప్రతిసారీ పెద్దసంఖ్యలో చట్టసభ సభ్యులు ఈ నియమాన్ని పాటించడం లేదు. దీంతో వేచిచూసిన లోకాయుక్త అటువంటి ప్రజాప్రతినిధుల జాబితాను తాజాగా విడుదల చేసింది.

నోటీసులు జారీ

జూన్ 30లోగా రాష్ట్రంలోని 224 మంది శాసనసభ్యులూ ఆస్తి వివరాలు సమర్పించాలని లోకాయుక్త చీఫ్ బీ.ఎస్.పాటిల్ ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వందితా శర్మకు కూడా సూచన ఇచ్చారు. గతంలోనే ఇచ్చాం కదా అని అలసత్వంగా ఉండడానికి వీల్లేదు. ఎన్నికైన ప్రతిసారీ సమర్పించాలి. ఇప్పటికీ సమాచారం ఇవ్వని ప్రజాప్రతినిధులకు సెప్టెంబర్ 1నే నోటీస్ జారీ చేశారు. కాగా, ఆస్తుల సమాచారం ఇవ్వడానికి ప్రజాప్రతినిధులకు సమయం లేదా, ఇవ్వడం ఇష్టం లేదా? అనే సందేహాలు ఉన్నాయి.



ఎవరెవరంటే..

- గత ప్రభుత్వంలో మంత్రులుగా ఉండిన శ్రీరాములు, కేసీ నారాయణగౌడ, ఎస్.అంగార ఆస్తి వివరాలు ఇవ్వలేదు.
- ప్రస్తుత మంత్రులైన రహీం ఖాన్, కే.ఎన్.రాజణ్ణ, జమీర్ అహమ్మద్ ఖాన్, రామలింగారెడ్డి, కే.హెచ్.మునియప్ప కూడా ఆస్తుల సమాచారాన్ని సమర్పించలేదు.
- గత శాసనసభా కాలావధిలో 81 మంది ఉల్లంఘించగా, ఈసారి 2023లో ఎన్నికైనవారిలో 51 మంది ఎమ్మెల్యేలు సమాచారం పంపలేదు. ఈసారి 21 మంది పెద్దల సభ సభ్యులు సైతం లోకాయుక్తను తోసిరాజన్నారు.
- మంత్రి మధు బంగారప్ప, మాజీ మంత్రి మురుగేశ్ నిరాణితో పాటుగా పలువురు గడువు ముగిసిన తరువాత అంటే జూన్ 30 తరువాత ఆస్తి వివరాలు సమర్పించారు. కాలావధి ముగిశాక 10 మంది ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ హడావుడిగా వివరాలను అందజేశారు.

పెట్రోల్ బంక్ పేరుతో రూ.41 లక్షలు స్వాహా





- కేజీఎఫ్‌లో సైబర్ మోసగాళ్ల దందా

కేజీఎఫ్: సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మిన ఓ అమాయకుడు రూ. 41.73 లక్షలను కోల్పోయిన ఘటన కేజీఎఫ్‌లో చోటు చేసుకుంది. పెట్రోల్ బంక్ డీలర్‌షిప్ మంజూరైందని చెప్పి మోసానికి పాల్పడ్డారు. వివరాలు.. తాలూకాలోని బేతమంగల ఫిర్కా నేర్నహళ్లి వద్ద పెట్రోల్ బంక్ డీలర్ షిప్ కోసం సంవత్సరం క్రితం ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయం ఎలాగో సైబర్ వంచకులకు తెలిసింది. నవంబరు 14వ తేదీన ఓ అనామక వ్యక్తి ఫోన్ చేసి మహారాష్ట్రలోని భారత్ పెట్రోలియం హెడ్ ఆఫీస్ నుంచి ఫోన్ చేస్తున్నాము, మీరు డీలర్ షిప్ కోసం దరఖాస్తు చేసుకున్నారు కదా, మీకు మంజూరైంది. దరఖాస్తు రుసుము, డీలర్ షిప్ సర్టిఫికెట్, ఎన్‌ఓసి, సెక్యూరిటీ డిపాజిట్, బీమా తదితరాలు చెల్లించాలని చెప్పాడు. ఇలా పలు దఫాలుగా దరఖాస్తుదారు నుంచి రూ. 41.73 లక్షలను వివిధ బ్యాంకు ఖాతాలకు డిపాజిట్ చేయించుకున్నాడు. బాధితుడు ఏ సంస్థకు దరఖాస్తు చేశాడో ఆ సంస్థలోని సిబ్బందే సైబర్ నేరగాళ్లకు ఉప్పందించి ఉంటారని అనుమానాలున్నాయి.

మరో వంచన కేసులో..

అలాగే గ్యాస్ బంక్ డీలర్ షిప్ కోసం దొడ్డపొన్నాండహళ్లి కి చెందిన వ్యక్తి నుంచి 6.69 లక్షల రూపాయలు కట్టించుకుని మోసం చేశారు. ఈ రెండు ఘటనలపై రాబర్ట్‌సన్ పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేయగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.





గురువారం రాష్ట్రమంతటా భక్త కనకదాస జయంతి వేడుకలు ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగాయి. బెళగావిలో కనకదాస విగ్రహానికి పూజలు. కోలారులో శకటం ఊరేగింపు దృశ్యాలు

బంగారం బ్యాగు మహిళకు అప్పగింత

మైసూరు: బస్సులో ఒక మహిళ పోగొట్టుకున్న సుమారు రూ. 4 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలను బ్యాగు ఆర్టీసీ బస్సు డ్రైవర్ వసంత్, కండక్టర్ ఎస్.ఆనంద్‌కు దొరికింది. కానీ వారిద్దరూ ఎంతో నిజాయతీగా దానిని బాధితురాలికి అప్పగించారు. రావందూరు- పిరియా పట్టణ మార్గంలో ఎక్కిన ఒక మహిళ బంగారు నగలతో కూడిన బ్యాగును బస్సులోనే మరిచిపోయి దిగిపోయింది. కొంతసేపటికి దానిని గమనించిన కండక్టర్ ఆనంద్, డ్రైవర్ వసంత్‌తో కలిసి తనిఖీ చేయగా ఓటరు ఐడీ, 40 గ్రాముల మాంగళ్యం చైన్, 20 గ్రాముల చైన్, 15 గ్రాముల చెవి రింగులు, రూ.వెయ్యి నగదు ఉన్నాయి. ఐడీ కార్డులో చిరునామా ఆధారంగా మహిళ ఇంటికే వెళ్లి బ్యాగును ఇచ్చారు. బంగారం పోయిందని బాధలో ఉన్న మహిళకు ఎంతో ఊరట దక్కింది.

కారు, బైక్ ఢీ.. బైకిస్టు మృతి

దొడ్డబళ్లాపురం: చెన్నపట్టణ శివారులోని రామమ్మ చెరువు రైల్వే బ్రిడ్జి వద్ద కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒక బైకిస్టు మరణించాడు. తిట్టమారనహళ్లి గ్రామానికి చెందిన శివరాము (35) మృతుడు. స్థానిక గ్రామపంచాయతీ సభ్యురాలు రేఖ భర్త శివరాము. బుధవారం రాత్రి పని నిమిత్తం చెన్నపట్టణకు వచ్చి స్వగ్రామానికి బైక్‌పై తిరిగి వెళ్తుండగా ఎదురుగా వేగంగా వచ్చిన కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ శివరామును బెంగళూరు విక్టోరియాకు తరలించగా గురువారంనాడు చికిత్స ఫలించక చనిపోయాడు. చెన్నపట్టణ గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు.

రైతులకు త్వరలో రూ.2 వేల కరువు సాయం : సీఎం

బనశంకరి: కరువు వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతులకు రూ.2 వేలు చొప్పున పరిహారం అందజేస్తామని, నాలుగైదు రోజుల్లో ఈ నిధులను విడుదలచేస్తామని సీఎం సిద్దరామయ్య తెలిపారు. కేంద్రం పరిహారం ఇవ్వడం ఆలస్యమైనందున తామే సాయం చేస్తామన్నారు. కలెక్టర్ల నివేదిక ఆధారంగా అర్హులైన రైతులకు పరిహారం అందిస్తామని, కేంద్రం పరిహారం అందిన తరువాత అదనంగా సహాయం చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 236 తాలూకాలకుగాను 223 తాలూకాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించామన్నారు. 48.19 లక్షల హెక్టార్లలో పంట నష్టం ఏర్పడిందని, కేంద్రాన్ని రూ.18,171 కోట్ల పరిహారం అడిగామని తెలిపారు.

అబార్షన్లపై సిట్ విచారణ కోరుతా : మంత్రి చెలువరాయ

మండ్య: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన భ్రూణ హత్యల కేసును సిట్, లేదా పెద్ద విచారణ సంస్థతో దర్యాప్తు చేయించాలని సీఎంను కోరతానని వ్యవసాయ మంత్రి ఎన్. చలువరాయ స్వామి అన్నారు. గురువారం మండ్యలో ఆయన మీడియాతో మాట్లాడారు. బెంగళూరు, మండ్య, మైసూరుల్లో భ్రూణహత్యల కుంభకోణంపై విచారణ జరుగుతోందన్నారు. నిందితుల్లో మండ్యవాసులు నయన్‌కుమార్, నవీన్‌కుమార్ అనేవారు ఉన్నారని తెలిపారు. తమిళనాడుకు చెందినవారూ ఉన్నందున పై స్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని సీఎంను కోరుతానని తెలిపారు.

కామాంతకుడు



- టెక్కీ మొబైల్‌లో 13 వేల అశ్లీల ఫొటోలు
- ప్రియురాలి ఫిర్యాదుతో అరెస్టు



బెంగళూరులో దారితప్పిన టెక్కీ

బనశంకరి: యువతులతో కలిసిన ఏకాంత క్షణాల్లో ఫొటోలు తీసి మొబైల్‌ఫోన్‌లో సేకరించిన ప్రైవేటు కంపెనీ ఉద్యోగిని బెంగళూరు సీసీబీ పోలీసులు బుధవారం రాత్రి అరెస్ట్‌చేశారు. బెళ్లందూరు సమీపంలోని ఓ టీపీఓ కంపెనీలో ఐటీ ఇంజినీరుగా పని చేసే మంగళూరుకు చెందిన ఆదిత్య సంతోష్ (23) నిందితుడు.

వివరాలు.. ఘరానా టెక్కీ ఆదిత్య సంతోష్, అదే ఆఫీసులో పనిచేసే యువతి ప్రేమలో పడ్డారు. ఇద్దరు అప్పుడప్పుడు ఏకాంతంగా గడిపారు. ఈ దృశ్యాలను సంతోష్ తన మొబైల్‌ఫోన్‌లో రహస్యంగా ఫొటోలు, వీడియోలు తీసుకున్నాడు.

కొన్ని రోజుల క్రితం ఈ విషయాన్ని ఆమె గుర్తించి ఆ ఫొటోలను తొలగించాలని సంతోష్ ఫోన్‌ను తీసుకుని గ్యాలరీ ఓపెన్ చేయగా వేలాదిగా యువతులు, మహిళల ఏకాంత చిత్రాలు ఉండడంతో నిశ్చేష్టురాలైంది. ఇందులో తన ఫొటోలే కాకుండా కొందరు మహిళా సహ ఉద్యోగులతో పాటు అనేక మందికి చెందిన 13 వేల నగ్న ఫొటోలు కనిపించాయి.

మార్ఫింగ్ చేసి..

ఆదిత్య సంతోష్ స్త్రీలోలుడు. నిరంతరం యువతులకు తీయని మాయమాటలు చెప్పి వలలో వేసుకుని ఏకాంతంగా గడిపే వ్యసనం కలిగి ఉన్నాడు. ఆ సమయంలో మొబైల్, రహస్య కెమెరా ద్వారా ఫొటోలు, వీడియోలు తీసి మొబైల్‌లో భద్రపరిచేవాడు.

అదేవిధంగా ఐదునెలల క్రితం సదరు అమ్మాయితో కామకలాపాలు నిర్వహించి రికార్డు చేశాడు. సంతోష్ గత ఐదునెలలుగా ఇదే కంపెనీలో పనిచేస్తున్నాడు. కొన్ని ఫొటోలను నెట్ నుంచి సేకరించి ఆఫీసులోని యువతుల ముఖాలతో మార్ఫింగ్, ఎడిట్ చేసినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తు తెలిసింది. ఈ ఫొటోల ద్వారా బాధిత యువతులను బ్లాక్‌మెయిల్ చేశాడా? అనే దానిపై విచారణ చేపడుతున్నామని పోలీసులు తెలిపారు.

మళ్లీ బీజేపీలో చేరను

- ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి



గాలి జనార్దనరెడ్డి

సాక్షి,బళ్లారి: బీజేపీలోకి మళ్లీ చేరాలనే ఆలోచన తనకు లేదని, కలలో కూడా బీజేపీలో చేరాలనుకోనని గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి పేర్కొన్నారు. గురువారం కొప్పళ జిల్లా గంగావతిలో ఆయన కనకదాసు జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎట్టి పరిస్థితులోను తాను బీజేపీలో చేరే ప్రశ్నే లేదని స్పష్టం చేశారు. విజయేంద్ర బీజేపీ అధ్యక్షుడైనందుకు అభినందించానని, ఇందులో రాజకీయ ఉద్దేశం లేదన్నారు. తాను ఎవరికీ తల వంచే వ్యక్తిని కాదని, అప్పట్లో తాను సోనియాగాంధీకే భయపడలేదని అన్నారు. కేఆర్‌పీపీని బలోపేతం చేసి, రాష్ట్రంలో 8 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేస్తామన్నారు. అన్ని స్థానాల్లో గెలుపొందేందుకు ప్రయత్నిస్తామన్నారు. బీజేపీ ఉనికిని కాపాడుకునేందుకు, కాంగ్రెస్ నాయకులు కేసుల నుంచి దొడ్డిదారిన బయట పడేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. శ్రీరాముని పేరు చెప్పుకుని అధికారంలోకి వచ్చిన బీజేపీ నేతలు అంజనాద్రి అభివృద్ధిని పట్టించుకోవడం లేదని అన్నారు.

నీవు లేని జీవితం వద్దనుకుని...

- ఇద్దరు పిల్లల సహా చెరువులో దూకి తల్లి ఆత్మహత్య

తుమకూరు: భర్త మరణం ఆమెను తీవ్రంగా కుంగదీసింది. అతని లేని జీవితాన్ని ఊహించలేకపోయింది. దీంతో తన ఇద్దరు పిల్లలతో తల్లి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన గురువారం తుమకూరు జిల్లా గుబ్బి తాలూకా నిట్టూరులో చోటుచేసుకుంది. నిట్టూరుకు చెందిన విజయలక్ష్మి (38) భర్త నవీన్ కిడ్నీ వైఫల్యంతో నెల రోజుల క్రితం మృతి చెందాడు. వీరికి కుమార్తె (11 నెలలు), బాలుడు (4 నెలలు) ఉన్నారు. భర్త జ్ఞాపకాలను మరిచిపోలేక గురువారం తన ఇద్దరు పిల్లలను తీసుకుని నిట్టూరు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది మృతదేహాలను వెలికితీశారు.



మృతదేహాలను వెలికితీసిన దృశ్యం

బీఎంటీసీ బస్సులకు ఏడీఎస్

బనశంకరి: బెంగళూరు నగరంలో బీఎంటీసీ బస్సులు ప్రజల మీదు దూసుకెళ్లడం పెరుగుతుండటంతో అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. తరచూ వాహనదారులను ఢీకొని ప్రాణనష్టం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బస్సుల్లో అడాస్ (అడ్వాన్స్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్) అమర్చింది. ఈ పరికం ముందుభాగంలో వచ్చే వాహనాలను అలర్ట్ చేయడంతో పాటు డ్రైవర్లను సైతం గమనిస్తుంది. ఇతర వాహనాల మధ్య అంతరం ఎంత ఉంది అనేది రెడ్‌సిగ్నల్ ద్వారా తెలియజేస్తుంది. డ్రైవర్ మొబైల్‌లో మాట్లాడటం, నిద్రలోకి జారుకున్న తక్షణమే మానిటరింగ్ సిస్టమ్ సిగ్నల్ ద్వారా హెచ్చరిస్తుంది. ఇది ఎంతవరకూ విజయవంతం అవుతుందన్నది తేలాల్సి ఉంది.

జోరుగా శిశు వ్యాపారం

- మూడేళ్లలో 250 మంది పసిగుడ్ల అమ్మకం
- ముఠా నాయకురాలి విచారణలో నిజాలు
- గార్మెంట్స్ కూలీ నుంచి కోటీశ్వరురాలైన మహాలక్ష్మి



శిశు విక్రయాల ద్వారా ముఠా కోట్ల రూపాయల్ని వెనకేసుకుంది

బనశంకరి: పసిపిల్లల విక్రయ ముఠా ఇప్పటివరకు 250 మందికి పైగా శిశువులను విక్రయించినట్లు సీసీబీ పోలీసుల దర్యాప్తులో వెలుగుచూసింది. విక్రయ ముఠా 50-60 మంది పిల్లలను కర్ణాటకలో, మిగిలినవారిని తమిళనాడులో అమ్మేసినట్లు తెలిసింది. పోలీసులకు పట్టుబడిన 10 మంది ముఠా సభ్యులను విచారిస్తున్నారు. గత మూడేళ్లలో 250 మందికి పైగా శిశువులు చేతులు మారినట్లు నోరువిప్పారు. కర్ణాటకలో విక్రయించిన పసిపిల్లలు ఎవరెవరనేది సమాచారం రాబడుతున్నారు. ప్రస్తుతం 10 మంది పిల్లల ఆచూకీ లభించగా, ఎవరెవరు కొన్నారు అనేది సస్పెన్స్‌గా మారింది.

ఇదీ మహాలక్ష్మి బాగోతం

- ఈ ముఠా లీడర్ మహాలక్ష్మి నాలుగైదు ఏళ్ల క్రితం బెంగళూరులో అద్దె ఇంట్లో ఉంటూ గార్మెంట్స్‌లో పనిచేస్తుండేది. పిల్లల అమ్మకాల ద్వారా ఇప్పుడు కోటీశ్వరురాలు అయ్యింది.
- 2017 నుంచి ఈ దందా చేస్తున్న మహాలక్ష్మి నేడు సొంత ఇల్లు, కారుతో పాటు పెద్దమొత్తంలో బంగారు ఆభరణాలను కలిగి ఉంది.
- 2015 నుంచి 2017 వరకు గార్మెంట్స్‌లో నెలకు రూ.8 వేల జీతానికి పని చేసేది, ఆ సమయంలో ఒక మహిళ పరిచయమై నెలసరి సమయంలో ఫెర్టిలిటీ సెంటర్లలో అండాలను సేకరిస్తారని, ఇందుకు డబ్బు ఇస్తారని ఆమెకు చెప్పింది. ఒకసారి అండం ఇచ్చిన మహాలక్ష్మికి సుమారు రూ.20 వేలు అందించారు.
- తరువాత మహాలక్ష్మి బ్రోకర్‌గా మారి అండాలను ఇచ్చేందుకు మహిళలను ఆస్పత్రులకు తీసుకొచ్చేదని పోలీసుల దర్యాప్తులో వెలుగుచూసింది. 2021 వరకు అద్దె తల్లి (సరోగసీ)లో ఏజెంటుగా పనిచేసింది.
- 2021 నుంచి గర్భవిచ్ఛిత్తి కోసం ఆసుపత్రికి వచ్చేవారిని గుర్తించి, అబార్షన్ వద్దని నచ్చజెప్పి డబ్బులు ఇచ్చేది, బిడ్డ పుట్టగానే మిగతా డబ్బు ఇచ్చేసి శిశువును తీసుకునేది.
- శిశువు పుట్టిన వెంటనే తల్లితో ఒప్పందం ప్రకారం నగదు ముట్టజెప్పి నిర్దాక్షిణ్యంగా లాక్కునేవారు. వాట్సాప్‌లో పిల్లల ఫొటోలను షేర్ చేసి కస్టమర్లతో బేరం పెట్టేవారు.
- ఆడ, మగ, రంగు తదితరాల ఆధారంగా రూ. 10 లక్షల వరకూ ధర నిర్ణయించేవారు.
- ఆడ శిశువులైతే గరిష్టంగా రూ. 6 లక్షలు, మగ పిల్లలైతే రూ. 10 లక్షలకు అమ్మేసేవారు. ఈ క్రమంలో మహాలక్ష్మికి అనేకమంది వైద్యులు, బ్రోకర్లతో పరిచయం ఏర్పడి వ్యాపారం విస్తరించింది.

క్లుప్తంగా

వేడుకగా వీరభద్రేశ్వరుని రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కంప్లి: హరపనహళ్లి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద నుంచి వీరభద్రేశ్వరుని రథోత్సవం బుధవారం సాయంత్రం 6 గంటలకు జరిగింది. వీరభద్రేశ్వరుని అలంకరించిన పల్లకీలో స్వామిని ప్రతిష్ఠించి సకల వాయిద్యాలతో రథం చుట్టు ప్రదక్షిణలు జరిపి మూర్తిని రథం వద్దకు తీసుకుని వెళ్లి ప్రతిష్ఠించారు. చుట్టు పక్కల గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైభవంగా గంగాంబిక తెప్పోత్సవం



అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

కంప్లి: హగరిబొమ్మనహళ్లి తాలూకా హంపసాగరలో చారిత్రక గంగాంబిక తెప్పోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గంగాంబిక ఉత్సవ మూర్తిని అలంకరించిన తెప్పకు పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు అంబిగర పాలాక్షమ్మ సంప్రదాయక పూజలు జరిపారు. అంతకుముందు వివిధ కళా బృందాలతో గ్రామ శివార్లలోని తుంగభద్ర నది వరకు ప్రముఖ వీధులగుండా ఊరేగించారు.

ఆలయానికి వంట సామగ్రి పంపిణీ



వంట సామగ్రిని అందిస్తున్న మహిళలు

కంప్లి: ప్రభుత్వం అందించిన గృహలక్ష్మి పథకం నుంచి తమ ఖాతాలో పడిన సొమ్ముతో ఏదైనా సహాయం చేయాలని తీర్మానించి కూడ్లిగిలోని 18వ వార్డు అమరదేవరగుడ్డ మహిళలు శారదమ్మ, కొట్రమ్మ, శారద, వి.వీరమ్మ తదితరులు అమరేశ్వర, బసవేశ్వర దేవస్థానానికి కానుక రూపంలో వంట సామగ్రిని సమర్పించారు.

సక్రమంగా విధుల నిర్వహణకు సూచన



దేవేంద్రమ్మకు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న ఆర్టీసీ అధికారులు

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటక రోడ్డు రవాణా సంస్థ రాయచూరు విభాగంలో అధికారులు, సిబ్బంది, కార్మికులు సక్రమంగా విధులు నిర్వహించాలని ఆర్టీసీ డీసీ చంద్రశేఖర్ పేర్కొన్నారు. రాయచూరు ఆర్టీసీ డివిజనల్ కంట్రోలర్ల సంఘం పదాధికారుల పదగ్రహణ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థను లాభాల బాటలో నడిపించేందుకు కృషి చేయాలని కోరారు. ఆర్టీసీ డివిజన్‌లో కంట్రోలర్‌గా విధులు నిర్వహిస్తున్న దేవేంద్రమ్మను సన్మానించారు. ఈసందర్భంగా శ్రీశైలప్ప తదితరులున్నారు.

ఆ ఆరోపణలు అవాస్తవం



మాట్లాడుతున్న డాక్టర్ గంగాధరగౌడ

బళ్లారి రూరల్: తనపై వచ్చిన లైంగిక ఆరోపణలు అవాస్తవమని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ గంగాధరగౌడ స్పష్టం చేశారు. గురువారం శిక్షకర భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. తాను ఓ మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలు నిజం కాదని తెలిపారు. ఇందులో నిజాలు లేవని, ఆసుపత్రిలోని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తే వాస్తవాలు తెలుస్తాయన్నారు. చట్టంపై తనకున్న గౌరవంతో ఎలాంటి విచారణకైనా పూర్తిగా సహకరిస్తానన్నారు.

చిన్నారికి అరుదైన ఆపరేషన్

సాక్షి బెంగళూరు: ఆ శిశువు వయసు కేవలం ఐదు నెలలు. బరువు ఐదు కేజీలు.. పుట్టుకతోనే అతి తక్కువ బరువుతో, తక్కువ వ్యాధి నిరోధక శక్తి జన్మించింది. పది లక్షల్లో ఒకరికి కనిపించే అరుదైన జన్యుపరమైన ఇమ్యూన్ వ్యాధి ల్యూకోసైట్ అధెసిన్ డెఫిసియెన్సీ (ఎల్ఏడీ) ఈ పాపలో కనిపించింది. దీని వల్ల సాధారణ శారీరక జీవ క్రియలన్నీ నెమ్మదిగా జరుగుతున్నాయి. తరచూ జబ్బు చేసేది. చివరికి ఒక ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రిలో చూపించగా, ఎముక మజ్జ మార్పిడి శస్త్రచికిత్స ఒక్కటే పరిష్కారమని గుర్తించి ఆ పాపకు ఆపరేషన్ చేశారు. తల్లి నుంచి ఎముక మజ్జను సేకరించి బిడ్డకు అమర్చారు. ప్రస్తుతం తల్లీ, కూతురు క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

మహనీయుల సిద్ధాంతాలన్నీ ఒక్కటే







కనక జయంతిని కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సురేష్, శ్రీనివాసపురంలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటశివారెడ్డి, కోలారులో కనకదాసు పల్లకీలను ఊరేగిస్తున్న దృశ్యం

- కనకదాసు జయంతిలో మంత్రి భైరతి సురేష్

కోలారు: బసవణ్ణ తన వచనాల ద్వారా సమాజానికి ఏం చాటారో దానినే కనకదాసు కూడా తన కీర్తనల ద్వారా చాటారని, దీనినే అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపరిచారని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి భైరతి సురేష్ తెలిపారు. గురువారం నగరంలోని కనక మందిరంలో నిర్వహించిన కనకదాసు జయంతిలో ఆయన మాట్లాడారు. వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖా మంత్రితో చర్చించి కురుబ సముదాయ విద్యార్థి నిలయం కోసం రూ.కోటి నిధులను విడుదల చేయిస్తానన్నారు. నగరంలో త్వరలో కనకదాసు విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామన్నారు. కోలారు ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ మాట్లాడుతూ జయంతిని ఒక్కరోజుకే పరిమితం చేయరాదన్నారు.

వైభవంగా పల్లకీల ఊరేగింపు

కార్యక్రమానికి ముందు నగరంలో కనకదాసు చిత్రపటాలు కలిగిన సుందరమైన పల్లకీల ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. తాలూకాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పల్లకీలను ఉదయం నగరంలోని గాంధీవనం నుంచి ప్రారంభించి నగరంలోని ప్రముఖ వీధుల్లో నిర్వహించారు. ఎమ్మెల్సీలు ఇంచర గోవిందరాజులు, ఎం ఎల్ అనిల్‌కుమార్, నజీర్ అహ్మద్, మాజీ మంత్రి వర్తూరు ప్రకాష్, కలెక్టర్ అక్రంపాషా, సీఈఓ పద్మా బసవంతప్ప పాల్గొన్నారు.

కనకదాసు కీర్తనలు సర్వకాలీనం

కనకదాసు కీర్తనలు మానవతా విలువలతో సర్వకాలికమై ఉన్నాయని ఎమ్మెల్యే జీకే వెంకటశివారెడ్డి తెలిపారు. గురువారం కనకదాసు జయంతిలో ఆయన మాట్లాడారు. తర్వాత టెన్త్, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన ప్రతిభాన్విత విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించారు. తహసీల్దార్ సుధీంద్ర, బీఈఓ భాగ్యలక్ష్మి, టీపీ ఈఓ శివకుమారి, పురసభ ముఖ్యాధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా కనకదాసు జయంతి

కేజీఎఫ్/మాలూరు: కనకదాసు జయంతి వేడుకలను కేజీఎఫ్, మాలూరులలో వైభవంగా నిర్వహించారు. కేజీఎఫ్ నగరంలో ఎమ్మెల్యే రూపా శశిధర్ నేతృత్వంలో కనకదాసు జయంతిని ఆచరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కనకదాసు తత్వ సిద్ధాంతాలు, ఆదర్శాలను అలవర్చుకోవడం ద్వారా ఆయనకు తగిన గౌరవం అందించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేకు కురుబ సముదాయం ప్రముఖులు గొర్రెను బహూకరించారు. ప్రభుత్వ అధికారులు, సముదాయ ప్రముఖులు పాల్గొన్నారు.

మాలూరులో ....

మాలూరు పట్టణంలో కనకదాసు జయంతిని ఎమ్మెల్యే కెవై నంజేగౌడ నేతృత్వంలో వైభవంగా నిర్వహించారు..పట్టణంలోని అరళేరి రోడ్డులో ఎమ్మెల్యే నంజేగౌడ కనకదాసు విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కనకదాసు మాట్లాడుతూ ఒకే సముదాయానికి చెందినవాడు కాదని అన్ని సముదాయాలు గౌరవించాల్సిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె రమేష్, టీపీ ఈఓ కృష్ణప్ప, కురుబ సంఘం ప్రముఖుడు ఎంవీ హనుమంతయ్య పాల్గొన్నారు.

మండ్యలో కనక జయంతి

మండ్య: సిద్దరామయ్య నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని సముదాయాల అభివృద్ధికి పాటుపడుతోందని ఇన్‌చార్జ్ మంత్రి ఎన్.చెలువరాయ స్వామి అన్నారు. గురువారం మండ్య జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అంబేడ్కర్ భవనంలో కనక జయంతిని నిర్వహించారు. మంత్రి, అధికారులు కనకదాస చిత్రపటానికి నివాళులర్పించారు. అంటరానితనం నిర్మూలన కోసం కనకదాస కృషి చేశారని, ఆయన చూపిన మార్గంలో అందరూ నడవాలని అన్నారు.



కేజీఎఫ్‌లో ఎమ్మెల్యే రూపా శశిధర్‌కు గొర్రెను బహూకరించిన దృశ్యం



మాలూరులో కనకదాసు భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నంజేగౌడ



మండ్యలో కనకదాసు చిత్రపటానికి మంత్రి చెలువరాయస్వామి తదితరుల పుష్పాంజలి

డ్రైవర్, క్లీనర్‌ను ఢీకొన్న లారీ

- డ్రైవర్ మృతి, క్లీనర్‌కు తీవ్రగాయాలు
- గుంతకల్లు వద్ద ప్రమాదం
- బాధితులు బళ్లారివాసులు



సంఘటనా స్థలం, ప్రసాద్ మృతదేహం

గుత్తి రూరల్: గుంతకల్లు పరిధిలో గుత్తి మండలంలోని కొజ్జేపల్లి– రజాపురం గ్రామాల మధ్య 67వ నంబర్ హైవేపై గురువారం వేకువజామున లారీ ఢీకొని ప్రసాద్ (48) అనే లారీ డ్రైవర్ మృతి చెందగా మల్లికార్జున అనే క్లీనర్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన ప్రసాద్, మల్లికార్జునలు లారీ డ్రైవర్, క్లీనర్‌లుగా పనిచేస్తూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలో నెల్లూరు నుంచి బొగ్గు లోడ్‌తో బళ్లారికి బయలుదేరారు. అయితే గుత్తి మండలం కొజ్జేపల్లి గ్రామ శివారులో లారీకి కప్పిన టార్పాలిన్ జారిపోయింది. దీంతో లారీని రోడ్డు పక్కన ఆపి రోడ్డుపై నిలబడి టార్పాలిన్‌ను బిగిస్తున్న సమయంలో గుంతకల్లు వైపు వెళ్తున్న లారీ వీరిద్దరినీ ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ ప్రసాద్ తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందగా క్లీనర్ మల్లికార్జున తీవ్రంగా గాయపడ్డాడు.

లారీని పట్టుకున్న స్థానికులు

వారిని ఢీకొన్న లారీ ఆగకుండా వెళ్లిపోవడంతో గమనించిన స్థానికులు లారీని వెంబడించి గుంతకల్లు మండలం గొల్లలదొడ్డి గ్రామం వద్ద పట్టుకున్నారు. తీవ్రంగా గాయపడిన క్లీనర్ మల్లికార్జునను చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తరువాత అనంతపురం పెద్దాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ స్టేషన్‌కు తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్టేడియం కడితే ఉగ్ర పోరాటమే

మైసూరు: ప్రపంచ పర్యాటక నగరంగా పేరు పొందిన మైసూరు నగరంలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణం చేయడానికి తాము పూర్తి వ్యతిరేకమని రైతు సంఘం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బడగలపుర నాగేంద్ర చెప్పారు. గురువారం మైసూరులో ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ స్టేడియం పేరుతో రైతుల భూములను కబళించే పనులో అధికారులు ఉన్నారని ఆరోపించారు. ఇప్పటికే స్టేడియం కోసం సేకరించిన పొలాలను రైతులకు వెనక్కి ఇచ్చేయాలన్నారు. స్టేడియం కట్టే లాయిలాల గ్రామం చుట్టుపక్కల అడవి జంతువులు కూడా ఆవాసం ఉంటాయన్నారు. స్టేడియం కట్టి రైతులు, జంతువులకు ఇబ్బంది కలిగించరాదన్నారు. స్టేడియం నిర్ణయాన్ని రద్దు చేసుకోకుంటే రైతు సంఘాలతో కలిసి ఉగ్ర పోరాటం చేస్తామని హెచ్చరించారు.

పోలీసులను తోసేసి నిందితుడు పరారీ

హుబ్లీ: నగరంలోని ప్రధాన ఫ్యామిలీ కోర్టుకు నిందితుడిని హాజరు పరిచి తిరిగి హుబ్లీ జైలుకు తీసుకెళుతుండగా నిందితుడు పరారైన ఘటన గురువారం జరిగింది. దాండేలిలోని అంబెవాడికి చెందిన అహమ్మద్ ఖాన్‌ను జడ్జి ఆదేశాల మేరకు పోలీసులు కోర్టుకు తీసుకొచ్చారు. కోర్టు నిందితుడిని డిసెంబర్ 22 వరకు హుబ్లీ జైలులో ఉంచాలని ఆదేశించింది. కాగా విద్యానగర శిరూర్ పార్క్ వద్ద నిందితుడు బందోబస్తుగా ఉన్న పోలీసు సిబ్బందిని తోసేసి పరారైనట్లు విద్యానగర పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కాలువలో దూకి రైతు ఆత్మహత్య

మైసూరు: మైసూరు జిల్లాలో రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. అప్పుల బాధతో అన్నదాత ఒకరు కాలువలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కేఆర్ నగరలోని బీరనహళ్లి గ్రామంలో జరిగింది. కృష్ణమూర్తి (52) అనే రైతు వ్యవసాయం కోసం బ్యాడరహళ్లి వ్యవసాయ పరపతి సహకార సంఘంలో, బయట కలిపి లక్షలాది రూపాయల అప్పులు తీసుకున్నాడు. అయితే అతివృష్టి, అనావృష్టి వల్ల పంటలు పండలేదు. అప్పులు తీర్చే మార్గం కానరాక గ్రామానికి సమీపంలోని పంట కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కేఆర్ నగర పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

డ్రైనేజీలో పడిన బైకు.. పోలీస్, మరొకరు మృతి

తుమకూరు: పెళ్లి చూసుకుని ఊరికి బైకులో వెళుతున్న సమయంలో బైకు డ్రైనేజి కాలువలోకి పడిపోయింది, ఈ ప్రమాదంలో పోలీసు కానిస్టేబుల్, మరొకరు మృతిచెందారు. జిల్లాలోని కొరటగెరె తాలూకాలోని సిద్దరబెట్ట సమీపంలో జరిగింది. మధుగిరి తాలూకాలోని కొడిగేనహళ్లిలో పనిచేసే కానిస్టేబుల్ మహేష్ (28), చిన్నరాయ (35), భరత్ కలిసి బైక్‌పై సిద్ధర బెట్టలో బంధువుల పెళ్లికి బైక్‌లో వెళ్లారు. బుధవారం రాత్రి తిరిగి వస్తుండగా కొరటగెరె సమీపంలో అదుపుతప్పి కాలువలోకి పడిపోయారు. మహేష్, చిన్నరాయ అక్కడికక్కడే మృత్యువాత పడగా, భరత్ తీవ్రంగా గాయపడ్డాడు.

వంచనకు పాల్పడ్డ నిందితుడి అరెస్ట్

హుబ్లీ: స్వైపింగ్ మిషన్ ద్వారా ఆర్థిక మోసానికి పాల్పడిన నిందితుడిని గురువారం నగర సైబర్ క్రైం పోలీసులు మైసూరులో అరెస్ట్ చేశారు. పరారైన నిందితుడు స్వైపింగ్ మిషన్లను సరఫరా చేసే మంగళూరుకు చెందిన మహమ్మద్ ఆసీఫ్ కాగా ఇటీవల స్వైపింగ్ మిషన్ ద్వారా వంచించిన కేసులో సీఐ బీకే.పాటిల్ సారథ్యంలోని బృందం నిందితుడిని గాలిస్తూ మైసూరుకు వెళ్లింది. వంచనకు వినియోగించిన రెండు భారత్ పే స్వైపింగ్ మిషన్లు, రెండు మొబైళ్లు, ఒక ఏటీఎం కార్డును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వైపింగ్ మిషన్ తీసుకున్న నిందితుడు దాని ద్వారా విదేశీయుల ఏటీఎం కార్డుల రహస్య వివరాలను వినియోగించి కార్డుదారుల యజమానులే వస్తువులను కొనుగోలు చేసినట్లు మోసం చేసి డబ్బులను బదలాయించుకొని పరారయ్యాడు. కాగా ఈ కేసులో పరారీలో ఉన్న ఇతర నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డయాలసిస్ కేంద్రాల సిబ్బంది సమ్మె బాట

- డిమాండ్ల సాధనకు ధర్నా

దొడ్డబళ్లాపురం: దీర్ఘ కాలంగా హామీలుగానే మిగిలిన డిమాండ్ల సాధన కోసం డయాలసిస్ సిబ్బంది రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం నుండి సేవలు బంద్ చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు డయాలిసిస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చేతన్ ఆధ్వర్యంలో గురువారం భారీ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు చేతన్ మాట్లాడుతూ.. తమ సమస్యలకు సంబంధించి అనేకసార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నా పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం కరోనా పేరుతో తమ వేతనాల్లో కోత పెట్టిందన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి సిబ్బంది విధులు బహిష్కరించాలని నిర్ణయించుకున్నామన్నారు. కరోనా సమయంలో తగ్గించిన వేతనాలు ఇప్పటి వరకూ పెంచలేదని, రెండున్నరేళ్లుగా సగం వేతనాలతో జీవితం గడుపుతున్నామంటున్నారు. మంత్రి దినేష్ గుండూరావ్ తమ సమస్యలకు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా గత రెండున్నర నెలలుగా వేతనాలు ఇవ్వలేదన్నారు. 202 డయాలసిస్ సెంటర్లు రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం నుంచి పూర్తిగా మూతబడనున్నాయని సమాచారం.

ఘనంగా రాజ్యోత్సవం



చిత్రపటాలకు కరవే పదాధికారుల పుష్పాంజలి

బళ్లారిఅర్బన్: జయ కరునాడు వేదిక జిల్లా అధ్యక్షులు యూసుఫ్ ఆధ్వర్యంలో గురువారం మోతి బ్రిడ్జిపైనున్న పార్కు పక్కన వేదికపై జెండాను ఆవిష్కరించి రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఏటా నవంబర్ 1 నుంచి 30 వరకు కన్నడిగులు రాజ్యోత్సవం జరుపుకోవడం సహజమేనన్నారు. అంతకు ముందు భువనేశ్వరి దేవి, మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూజలు నిర్వహించి కన్నడ పతాకాన్ని ఎగరవేశారు. వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఎన్.సతీష్, జిల్లా పదాధికారులు దేవరాజు, మోకా ఆది, మోకా హొన్నూరుస్వామి, నంజుండయ్య, రాజశేఖర్ యాదవ్, పద్మ, శారద, శోభారాణి, ఎస్.ఏంజలిన్, రామాంజిని, శంకర్ పాల్గొన్నారు.

సముదాయ భవనం నిర్మించరూ..



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: తాలూకాలోని వడ్లూరులో సముదాయ భవనం నిర్మించాలని జైభీమ్ నవ చైతన్య సంఘం డిమాండ్ చేసింది. గురువారం జెడ్పీ కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో అధ్యక్షుడు రాజు మాట్లాడారు. గ్రామంలో నివసిస్తున్న 70 కుటుంబాలు శుభకార్యాలు చేసుకోడానికి సముదాయ భవనం నిర్మించాలని కోరుతూ జెడ్పీ అధికారి ప్రకాష్‌కు వినతిపత్రం సమర్పించారు.

వైద్య శిబిరాల లబ్ధి పొందండి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నిజాముద్దీన్

రాయచూరు రూరల్ : గ్రామాల్లో నిర్వహించే ఉచిత దంత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని యరగేర సహకార సంఘం అధ్యక్షుడు నిజాముద్దీన్ పేర్కొన్నారు. ఆయన గురువారం యరగేరలో ఏఎంఈ దంత వైద్య కళాశాల, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, యరగేర సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దంత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి శిబిరాల ద్వారా దంత రక్షణ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

కోలారు వార్తలు...

అందరినీ కలిపేవి పండుగలు



నివృత్త ప్రభుత్వ ఉద్యోగులను సన్మానించిన దృశ్యం

శ్రీనివాసపురం: పండుగలు కుటుంబ సభ్యులందరినీ ఒక్కటి చేసేవని, పండుగల్లో ఆచార విచారాలు రెండింటిలోను సమన్వయత ఉండాలని యోగా గురు బాబణ్ణ తెలిపారు. గురువారం పట్టణంలోని పతంజలి యోగా కేంద్రంలో నిర్వహించిన ఇంటింటా పున్నమి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సేవల నుంచి నివృత్తి పొందిన వారు ప్రశాంతంగా, ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలన్నారు. ఆరోగ్య రక్షణ కోసం ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలన్నారు. పతంజలి ముద్రా యోగా సభ్యులు జయరామణ్ణ, రంగణ్ణశెట్టి, శంకరేగౌడ, చంద్రణ్ణ, శ్రీనివాస్, గేట్ లక్ష్మణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ కట్టడికి జాగ్రుతి అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ జగదీష్

కోలారు: ఎయిడ్స్, హెచ్ఐవీ వైరస్ నియంత్రణకు ప్రజలను జాగృతపరచాల్సిన అవసరం ఉందని జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖాధికారి డాక్టర్ జగదీష్ తెలిపారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైరస్ నుంచి ప్రబలే హెచ్ఐవీ వ్యాధి కష్టపడి పని చేసే యువత, గర్భిణులకు ఎక్కువగా సోకే అవకాశం ఉందన్నారు. జిల్లాలో 2023–24లో ఏప్రిల్ 2023 నుంచి అక్టోబర్ 2023 వరకు 60,333 మందిని పరీక్షించి 229 మంది హెచ్ఐవీ బాధితులను కనుగొన్నట్లు తెలిపారు. 16,296 మంది గర్భిణులను పరీక్షించగా, వారిలో 13 మందికి హెచ్ఐవీ సోకినట్లు తేలిందన్నారు. విశ్వ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని డిసెంబర్ 1న ప్రభుత్వ అతిథిగృహం నుంచి జాగృతి జాతాను ప్రారంభించి 11.30 గంటలకు టి.చెన్నయ్య రంగమందిరంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు కాళమ్మదేవి సర్కిల్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తారన్నారు. హెచ్ఐవీ నియంత్రణకు ఆరోగ్య శాఖ నుంచి పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ జి.ప్రసన్న కుమార్, ఐసీటీసీ జిల్లా సూపర్‌వైజర్ డీఎం హేమలత పాల్గొన్నారు.

లాకప్‌డెత్ కేసులో ఎస్ఐతో సహా ముగ్గురిపై ఎఫ్ఐఆర్

శ్రీనివాసపురం: ముళబాగిలు తాలూకా నంగలి పోలీస్ స్టేషన్‌లో జరిగిన లాకప్‌డెత్ కేసులో ఎస్ఐతో సహా ముగ్గురు పోలీస్ సిబ్బందిని సస్పెండ్ చేసి వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వివరాలు..ఓ చోరీ కేసుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లికి చెందిన బాలాజీ అనే వ్యక్తిని విచారణ కోసం సెప్టెంబర్ 17న స్టేషన్‌కు తీసుకు వచ్చారు. సీనియర్ అధికారుల దృష్టికి కూడా తేకుండా వేర్వేరు ప్రాంతాల్లో ఉంచి విచారణ చేశారు. అయితే పోలీస్ కస్టడీలో ఉండగానే అక్టోబర్ 1న బాలాజీ మరణించాడు. ఉన్నతాధికారుల దృష్టికి తేకుండా నిందితుడిని విచారణకు పిలుచుకు రావడం, కర్తవ్య లోప ఆరోపణలపై ఎస్పీ ఎం.నారాయణ నంగలి స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ సింగ్, కానిస్టేబుళ్లు మంజునాథ్, మహంతేష్ పూజారి అనే ముగ్గురిని సస్పెండు చేసి వీరిపై ఎఫ్ఐఆర్ కూడా దాఖలు చేశారు.

సమృద్ధ భారత్ కోసమే సంకల్పయాత్ర



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి వీరేంద్రకుమార్

కోలారు: కేంద్రప్రభుత్వం సమృద్ధ భారత్ కోసమే వికసిత భారత్ సంకల్ప యాత్రను ప్రారంభించిందని కేంద్ర సామాజిక న్యాయ, సబలీకరణ శాఖ మంత్రి వీరేంద్రకుమార్ తెలిపారు. గురువారం తాలూకాలోని అరాభికొత్తనూరులోని సోమేశ్వర స్వామి కళ్యాణ మంటపంలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ప్రారంభించి ఆయన మాట్లాడారు. దేశంలోని 11 వేల గ్రామ పంచాయతీల్లో ఏక కాలంలో ఈ యాత్రను ప్రారంభించారన్నారు. కేంద్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా దేశంలోని 80 కోట్ల మందికి ఉచిత రేషన్‌ను అందిస్తోందన్నారు. 11 కోట్ల మంది రైతులకు యేటా తలా రూ.6 వేల చొప్పున అందిస్తున్నామన్నారు. 55 లక్షల మంది రైతులకు యేటా ఆయుష్మాన్‌భవ పథకంలో తలా రూ.5 లక్షల వరకు ఉచిత చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్ అందిస్తున్నామన్నారు. దేశంలో 13.5 కోట్ల ఇళ్లకు కొళాయి కనెక్షన్ ఇచ్చామన్నారు. 4 కోట్ల ఇళ్ల నిర్మాణం చేపట్టామన్నారు. ప్రతి ఇంటికీ గ్యాస్ సిలిండర్ అందించిన ఘనత బీజేపీదేనన్నారు. కేంద్ర ప్రభుత్వ సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీ ఎస్ మునిస్వామి, ఉపవిభాగ అధికారి వెంకటలక్ష్మి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్, దిశా సమితి సభ్యుడు అప్పి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.





● ఉత్సాహంగా రాజ్యోత్సవం

మైసూరు: మైసూరు నగరంలో ఉన్న విద్యావర్థక సాంకేతిక మహా విద్యాలయంలో కన్నడ రాజ్యోత్సవం వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు సాగే ఉత్సవాలు తొలిరోజు కోలాహలంగా జరిగాయి. కన్నడ సంస్కృతిని చాటి చెప్పే కన్నడనాడిన సాంస్కృతిక కళలను కళాకారులు ప్రదర్శించారు. 10కి పైగా జానపద కళా బృందాల ఆధ్వర్యంలో నంది కంభం, వీరగాసె, గొరవన కుణిత, డొల్లు కుణిత, నాగరి, బొంబె కుణిత, పులి వేశం తదితర నృత్య ప్రదర్శనలు ప్రజలను అలరించాయి.

క్లుప్తంగా

హోసకోటెలో కనకదాస జయంతి


వీరగాసె కళాకారులతో ఎమ్మెల్యే

కృష్ణరాజపురం: బెంగళూరు గ్రామీణ జిల్లా పరిధి హోసకోటె వినాయక నగరలో ఉన్న కనక సమృద్ధి క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ ఆవరణంలో గురువారం శ్రేష్ఠ శ్రీ కనక దాస జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ పాల్గొని కనక దాస చిత్రపటానికి పూలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా జానపద కళాకారుల బృందాలతో కనకదాస చిత్రపటాన్ని ఊరేగించారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి

మైసూరు: కబిని నదిలో ఈతకు దిగిన యువకుడు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందిన ఘటన మైసూరు జిల్లా సరగూరు తాలూకా తెరణిముంటె గ్రామం వద్ద కబిని జలాశయం వెనుక నీటిలో చోటుచేసుకుంది. చామరాజనగర జిల్లా గుండ్లుపేటె పట్టణానికి చెందిన హర్షవర్ధన్ (25) నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. ఇతను తన ముగ్గురు స్నేహితులతో కలిసి బ్యాక్‌వాటర్‌లో ఈతకు దిగాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందినట్లు స్నేహితులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఘనంగా చిగురు వేడుకలు


చిత్ర గీతాలు ఆలపిస్తున్న గాయకులు

కృష్ణరాజపురం: విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను గుర్తించి నిరూపించుకోవడానికి ఇటువంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని కన్నడ నటుడు ప్రేమ్ అన్నారు. బుధవారం రాత్రి నగరంలోని కృష్ణరాజపురంలో ఉన్న కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయం ఆఫ్ టెక్నాలజీలో కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ఉత్సవం చిగురు–2023 వేడుకలను ప్రారంభించి మాట్లాడుతూ...విద్యార్థుల్లో ఏదో ఒక గొప్ప ప్రతిభ ఉంటుందని, దాన్ని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని అన్నారు. ఈ సందర్భంగా చిగురు కార్యక్రమంలో విద్యార్థుల నృత్యాలు విశేషంగా అలరించాయి. దాదాపు 66 కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారని కళాశాల అధ్యక్షుడు డీకే మోహన్ తెలిపారు.

ఇంగ్లిష్ ప్రచార ఫ్లెక్సీలు చించివేత

దొడ్డబళ్లాపురం: బెళగావి సిటీలో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఇంగ్లిషు ప్రచార ఫ్లెక్సీలను కర్ణాటక రక్షణ వేదిక కార్యకర్తలు తొలగించారు. మొదట బెళగావి సిటీలోని రాణి చెన్నమ్మ సర్కిల్‌లో ఇంగ్లిషు ప్రచార ఫలకాల ఏర్పాటు, కన్నభాష పట్ల నిర్లక్ష్యాన్ని వ్యతిరేకిస్తూ ధర్నా చేసిన కరవే కార్యకర్తలు అనంతరం ఇంగ్లిషు ఫ్లెక్సీలను తొలగించారు. ఈ సమయంలో అడ్డుకున్న పోలీసులతో కరవే కార్యకర్తలు వాగ్వాదానికి దిగారు.

కనకదాస తత్వాలను ఆదర్శంగా తీసుకోవాలి


కనకదాస చిత్రపటానికి హోం మంత్రి పూజలు

తుమకూరు: కనక దాస తత్వాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని హోం మంత్రి పరమేశ్వర్ అన్నారు. గురువారం తుమకూరు నగరంలో పాలికె, కురుబ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కనకదాస జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ...వందల ఏళ్ల క్రితమే కనకదాస తన కీర్తనల ద్వారా సామాజిక న్యాయం, సమానత బోధించారని, నేడు దేశంలో కుల, మతాలతో కొట్టుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంతకు ముందు ఆయన కనకదాస చిత్రపటానికి పూజలు చేశారు. కనకదాసను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

ఘనంగా కన్నడ రాజ్యోత్సవం


వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే తదితరులు

బొమ్మనహళ్లి: నగరంలోని బొమ్మనహళ్లి పరిధి బన్నేరుఘట్ట రోడ్డులో ఉన్న బిళ్లెకహళ్లి వార్డు హులిమావులో కర్ణాటక రక్షణ వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కన్నడ రాజ్యోత్సవంలో ఎమ్మెల్యే ఎం. సతీష్ రెడ్డి, బీజేపీ నాయకుడు మురళీధర్ పాల్గొని కన్నడ జెండా ఎగురవేసి భువనేశ్వరమాతకు పూజలు చేశారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలు అందించిన వారిని కర్ణాటక రక్షణ వేదిక ఆధ్వర్యంలో సన్మానించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలందాలి

- పేదల పట్ల వైద్యులు శ్రద్ధ చూపాలి: సీఎం సిద్దు

శివాజీనగర: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేదల పట్ల మానవత్వంతో నడుచుకొని తారతమ్యం లేకుండగా ఉత్తమ ఆరోగ్య సేవలందించాలని సీఎం సిద్ధరామయ్య వైద్యసిబ్బందికి సూచించారు. గురువారం విధానసౌధ ముందు భాగంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 108 ఆరోగ్య కవచ కింద 262 అంబులెన్స్ వాహనాలను ప్రారంభించారు. ప్రైవేటు ఆసుపత్రిలో లభించే నాణ్యమైన ఆరోగ్య సేవలు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో దొరకాలన్నది తమ లక్ష్యమన్నారు. ఆ దిశలో ఆరోగ్య రంగంలో వైద్య సేవలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకొందన్నారు.

త్వరలో మరిన్ని అంబులెన్స్‌లు

చికిత్స లభించక ఎవరూ చనిపోరాదని, రాష్ట్రంలో ప్రతి తాలూకాలో కూడా 4 అంబులెన్స్‌లు పనిచేస్తూ అత్యవసర ఆరోగ్య సేవలు అందిస్తున్నాయని సీఎం చెప్పారు. రాష్ట్రంలో 840కు పైగా అంబులెన్స్‌ల అవసరముంది. రానున్న రోజుల్లో ఏర్పాటు చేస్తామన్నారు. ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్‌లలో ఖర్చులను పేదలు భరించలేరు, ఇందుకు ముఖ్యమంత్రి పరిహార నిధి సహాయం కోరుతూ వేలాది దరఖాస్తులు వస్తున్నాయి. అందుచేత ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ఉత్తమ చికిత్సలు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, అధికారులు పాల్గొన్నారు.


సౌధ ముందు కొత్త అంబులెన్స్‌లు

కనకదాసను ఆదర్శంగా తీసుకోవాలి

గౌరిబిదనూరు: సమాజంలో నెలకొన్న ఒడిదొడుకులను అరికట్టేందుకు కనకదాస తన కీర్తనల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ తెలిపారు. గురువారం తాలూకా కార్యాలయం సభాభవనంలో జాతీయ పండుగల కమిటీ ఆధ్వర్యంలో కనకదాస జయంతి కార్యక్రమంలో మాట్లాడారు. మూఢాచారాలను, జాతి వ్యవస్థను ఖండించిన వారిలో కనకదాసు కూడా ఒకరని అన్నారు. ప్రధాన ఉపన్యాసకులుగా విచ్చేసిన ప్రొఫెసర్ నారాయణప్ప మాట్లాడుతూ... విజయనగర సామ్రాజ్యంలో ఉత్తమ పాలనలో తిమ్మప్ప చివరకు కనకదాసుగా పేరు గడించారని ఆయన చరిత్రను వివరించారు. కార్యక్రమంలో తహసీల్దారు మహేశ్ పత్రి, ఈఓ హరీశ్, విద్యాశాఖ అధికారి శ్రీనివాసమూర్తి, కమిషనర్ ఎండి గీత, వనజాక్షి, లెంకప్ప, మైలారప్ప తదితరులు పాల్గొన్నారు.


కనకదాసు జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే తదితరులు

సమసమాజ స్థాపకుడు కనకదాస

చిక్కబళ్లాపురం: సమ సమాజ నిర్మాణం కోసం దాసశ్రేష్ఠులు కనకదాస ఆనాడే తన కీర్తనల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని మంత్రి డాక్టర్ సుధాకర్ అన్నారు. గురువారం నగరంలోని గురురాజ కల్యాణ మంటపంలో కనక దాస జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు కనకదాస చిత్రపటానికి పూజలు చేశారు. ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ మాట్లాడుతూ... కనకభవన నిర్మాణం కోసం కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా విద్యలో ఉత్తమ ప్రతిభ చూపిన ఆ సముదాయం విద్యార్థులను సన్మానించారు. అంతకు ముందు కనకదాస చిత్రపటాన్ని పల్లకీలో ఉంచి వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో కలెక్టర్ రవీంద్ర, జెడ్పీ సీఈఓ ప్రకాశ్, ఎస్పీ నాగేశ్, కురుబ సంఘం అధ్యక్షుడు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

భార్యను కత్తితో పొడిచి.. భర్త ఆత్మహత్య

- వెంటాడిన అనుమాన భూతం
- మైసూరు జిల్లాలో ఘటన

దొడ్డబళ్లాపురం: అన్ని వేళల్లో తోడుగా ఉంటానని ప్రమాణం చేసిన భర్త.. అనుమానంతో హంతకునిగా మారాడు, భార్య శీలాన్ని శంకించి ఆమెపై హత్యాయత్నం చేసి ఆపై ఆత్మహత్య చేసుకున్న సంఘటన మైసూరు జిల్లా పిరియాపట్టణ తాలూకా ముత్తినముళ్లుసోగె గ్రామంలో చోటుచేసుకుంది.

వివరాలు.. గ్రామం నివాసి ప్రసన్న (36), భార్య శ్వేత (30) ఏడాదిన్నర క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. క్రమంగా ఆమెపై అనుమానం పెంచుకుని నిత్యం వేధించేవాడు. అనేకసార్లు పోలీస్‌స్టేషన్‌లో రాజీ పంచాయితీలు జరిగాయి.

మరదలితో పెళ్లి చేయాలని

మరోవైపు శ్వేత చెల్లెలిపై మనసు పడ్డ ప్రసన్న ఆమెను తనకిచ్చి పెళ్లి చేయాలని భార్యను ఒత్తిడి చేసేవాడు. దీంతో విసిగిపోయిన శ్వేత నెల రోజుల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో గురువారం ఉదయం శ్వేత పనికి వెళ్తుండగా మార్గం మధ్యలో అడ్డగించి ఇంటికి రమ్మని బలవంతం చేసాడు. శ్వేత నిరాకరించడంతో ఆమెను కత్తితో ఇష్టానుసారం పొడిచి పారిపోయాడు. ఇంటికి వెళ్లిపోయి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తీవ్రక్త స్రావంతో రోడ్డుపై విలవిలలాడుతున్న శ్వేతను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం శ్వేత ఐసీయూలో చికిత్స పొందుతోంది. పిరియాపట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.


భర్త ప్రసన్న

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

తుమకూరు: బడి ఈడు పిల్లలను బాల కార్మికులుగా మార్చడం నేరమని కార్మిక శాఖ అధికారిణి తేజోవతి అన్నారు. గురువారం

బాల కార్మిక శాఖ, టాస్క్‌ఫోర్స్, కిషోర్ కార్మిక ట్రస్టు, జిల్లా కార్మి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో తుమకూరు నగరంలోని పలు ప్రాంతాల్లో జాగృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలన్నారు. అంతకు ముందు నగరంలోని గ్యారేజీలు, వివిధ దుకాణాలు, హోటళ్లు, బేకరీలను పరిశీలించారు. అదే విధంగా గుడిసెల వద్దకు వెళ్లి విద్యాహక్కు చట్టంపై వివరించారు. అనంతరం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్మిక శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా కనక జయంతి


కనకదాస చిత్రపటాన్ని పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

చింతామణి: నేటి యువత కనకదాస తత్వాలను ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి సుధాకర్ అన్నారు. గురువారం పట్టణంలో కరుబ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కనకదాస జయంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు పట్టణంలో కనకదాస చిత్ర పటాలను ఊరేగించారు. అనంతరం అంబేడ్కర్ భవన్‌లో కార్యక్రమాన్ని తహశీల్దార్ సుదర్శన్ ప్రారంభించి మాట్లాడారు.

చైన్ స్నాచర్ అరెస్ట్

మండ్య: మండ్య జిల్లా మద్దూరు పోలీసులు చైన్ స్నాచర్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద 435 గ్రాముల బంగారం, కారు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 27 లక్షలకు పైగా ఉంటుందని ఎస్పీ యతీశ్ తెలిపారు. బీదర్‌కు జావిద్ బాలి పట్టుబడ్డాడని, ఇతను నవంబర్ 6న మరో వ్యక్తితో కలిసి ఎస్ బీఎం రోడ్డులో కెంపమ్మ అనే మహిళ మెడలో ఉన్న బంగారు చైన్‌ను లాక్కొని ఉడాయించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేయగా ఇతను పలు చోట్ల స్నాచింగ్‌లకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.


నిమ్హాన్స్‌లో శిశువు మృతి కలకలం

బనశంకరి: నగరంలో నిమ్హాన్స్ ఆసుపత్రి వైద్యసిబ్బంది నిర్లక్ష్యంతో ఏడాది వయసు గల పసికందుకు సరైన చికిత్స అందక చనిపోయిందని ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఆస్పత్రి వివరణ ఇస్తూ పసికందును ఆసుపత్రికి తీసుకువచ్చేటప్పటికి పరిస్థితి విషమంగా ఉంది, తలకు తీవ్రగాయమైంది. బెడ్ లేదని ఆసుపత్రి సిబ్బంది చెప్పారు. మధ్యాహ్నం 3 గంటలకు పసికందుకు గుండెపోటు రావడంతో డాక్టర్లు బతికించడానికి తీవ్రంగా ప్రయత్నించారు. కానీ సాయంత్రం 4 గంటలకు చనిపోయింది అని తెలిపింది. కాగా బెడ్ లేదని వైద్యానికి నిరాకరించడం వల్లే ప్రాణాలు పోయాయని శిశువు సంబంధీకులు ఆరోపించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మండ్య: మండ్య జిల్లా పంచాయతీ సీఈఓ షేక్ తన్వీర్ ఆసీఫ్ గురువారం మండ్య తాలూకాలో పర్యటించారు. సోనగహళ్ళి మంగళ, సంతెకసలగెరె గ్రామ పంచాయతీల పరిధిలో ఆయన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. సోనగహళ్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి అక్కడ సౌకర్యాలపై ఆరా తీశారు. నరేగా పథకంలో పాఠశాలలో మరుగుదొడ్లు, ఇతర నిర్మాణ పనులు, తాగునీటి పైప్‌లైన్ పనులను పరిశీలించారు. అక్కడి నుంచి కమ్మనాయకనహళ్లి గ్రామానికి వచ్చి కాలువ పూడికతీత పనులను పరిశీలించారు. పనులు ఎంత మేరకు జరిగాయని సంబంధిత అధికారులతో చర్చించారు.

అధికారులకు అభినందనలు



గౌరిబిదనూరు: నగరంలో గురువారం పరమజ్యోతి అమ్మా భగవాన్ మానవ సేవా సమితి ముఖ్యస్తురాలు డా మమత నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి వారి ఉత్తమ కార్యవైఖరిపై అభినందనలు తెలిపారు. ప్రోత్సహించినప్పుడు వారు మరింత మెరుగ్గా ప్రజలకు సేవలు అందించగలరని మమత అన్నారు. దంత వైద్యుడు హెచ్ ఎస్ శ్రీధర్ మాట్లాడుతూ.. అభినందనలు తెలపడం అధికారుల ఉత్తమ కార్యవైఖరిని ప్రోత్సహించినట్లవుతుందన్నారు. జ్యోతి కల్కి తదితరులు ప్రతి కార్యాలయానికి వెళ్లి అధికారులను అభినందించారు.

అదనంగా 188 ఇందిరా క్యాంటీన్లు

శివాజీనగర: సామాన్య ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు ఈ ఏడాది అదనంగా 188 ఇందిరా క్యాంటీన్‌లను ఆరంభించనున్నట్లు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తెలిపారు. గురువారం దాసశ్రేష్ఠ కనకదాస జయంతి సందర్భంగా గురువారం ఎమ్మెల్యేల భవన్ ఆవరణంలో ఉన్న కనకదాస విగ్రహానికి పూజలు చేసి విలేకరులతో మాట్లాడారు. అవసరమున్న చోట్ల ఇందిరా క్యాంటీన్లను ఏర్పాటు చేస్తామని, ఇందిరా క్యాంటీన్లకు స్థలం కొరత ఉన్న చోట్ల మొబైల్ క్యాంటీన్లు ఆరంభిస్తామన్నారు. ఇందిరా క్యాంటీన్‌లు సక్రమంగా జరగటం లేదనే ప్రశ్నకు సమాధానమిచ్చిన ఆయన, క్యాంటీన్లలో ఉత్తమమైన నాణ్యమైన ఆహారం కల్పించేందుకు దృష్టి పెట్టాం. సామాన్య ప్రజల అనుకూలం కోసం ఈ సంవత్సరం అదనంగా 188 ఇందిరా క్యాంటీన్‌లు ఆరంభిస్తామన్నారు.

కనకదాసులు దాసశ్రేష్ఠులు:

రాష్ట్రంలో జన్మించిన దాసశ్రేష్ఠులైన కనకదాస సమ సమాజం కోసం కలలు కన్నారు. ఆయన సాహిత్యం ద్వారా మానవత్వాన్ని చాటారని ఇదే సందర్భంలో కనకదాసను సీఎం సిద్ధరామయ్య స్మరించుకొన్నారు. ప్రజలకు అర్థమయ్యే భాషలో సాహిత్యాన్ని రచించారని తెలిపారు. కార్యక్రమంలో కన్నడ సంస్కృతి మంత్రి శివరాజ తంగడగి, మాజీ మంత్రులు హెచ్.ఎం.రేవణ్ణ, హెచ్.ఆంజనేయ, మాజీ మేయర్ రామచంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

చింతామణిలో భారీ వర్షం


వర్షం కురుస్తున్న దృశ్యం

చింతామణి: చింతామణి పట్టణంలో గురువారం ఉదయం భారీ వర్షం కురిసింది. రోడ్లపై భారీ ఎత్తున నీరు చేరడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మురుగు కాలువలు పొంగి ప్రవహించాయి.

పెళ్లికి నిరాకరణ, యువతి కిడ్నాప్

దొడ్డబళ్లాపురం: వివాహానికి నిరాకరించిన యువతిని కిడ్నాప్ చేసిన సంఘటన హాసన్ పట్టణ శివారులోని బిట్టగౌడనహళ్లి వద్ద గురువారం ఉదయం చోటుచేసుకుంది. టీచర్‌గా పనిచేస్తున్న అర్పిత (25) కిడ్నాప్‌కు గురైన యువతి. అర్పిత సమీప బంధువు రాము కిడ్నాప్ చేసిన వ్యక్తి. 15 రోజుల క్రితం నిందితుడు రాము తల్లితండ్రులతో కలిసి పెళ్లిచూపులకు అర్పిత ఇంటికి వచ్చాడు. అయితే అర్పిత, ఆమె తల్లితండ్రులు సంబంధం నిరాకరించడంతో అవమానంగా భావించిన రాము గురువారం ఆమె విధులకు వెళ్తుండగా కారులో వచ్చి కిడ్నాప్ చేసాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని యువతి కోసం గాలిస్తున్నారు.

అదుపుతప్పి కిందపడ్డ బైక్

- బస్సు దూసుకెళ్లి మహిళ మృతి

దొడ్డబళ్లాపురం: అదుపుతప్పిన బైక్‌ను వెనుక వచ్చిన బస్సు దూసుకెళ్లడంతో ఒక మహిళ మృతి చెందిన మరొకరు తీవ్రంగా గాయపడ్డ సంఘటన బెళగావి బస్టాండు వద్ద చోటుచేసుకుంది. రోడ్డుపక్కన నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఢీకొన్న బైక్ కిందపడడంతో వెనుక నుండి వచ్చిన బస్సు బైక్‌మీద వెళ్తున్న వారిపై నుండి వెళ్లింది. దీంతో ధారవాడకు చెందిన విద్యాశ్రీ (32) అనే మహిళ మృతి చెందింది. విద్యాశ్రీ వెనుక కూర్చోగా భర్త బైక్ నడుపుతున్నాడు. భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. ధారవాడ నుండి బెళగావిలోని బంధువుల ఇంటికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం దృశ్యాలు సమీపంలోని సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యాయి. బెళగావి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

హోసూరు వార్తలు..

ఆర్థికసాయం అందజేత


సాయం అందుకున్న లబ్ధిదారులు

కెలమంగలం: ఆడపిల్లల రక్షణ పథకం ద్వారా గురువారం తళి బీడీవో కార్యాలయంలో 22 మంది లబ్ధిదారులకు యూనియన్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి ఆర్థిక సాయాన్ని అందజేశారు. క్రిష్ణగిరి జిల్లాలో సామాజిక సంక్షేమ, మహిళా హక్కుల శాఖ ద్వారా తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి దివంగత కరుణానిధి శతజయంతోత్సవాలను పురస్కరించుకొని ఆడపిల్లల రక్షణ పథకం ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక సాయాన్ని అందజేస్తుంది. అందులో భాగంగా తళి యూనియన్‌లో 22 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఆర్థిక సాయం అందజేసే కార్యక్రమానికి యూనియన్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని తలా రూ. 25 వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో బీడీవో బాలాజి, అధికారులు పాల్గొన్నారు.

ఏనుగు దాడిలో యువకుని మృతి

కెలమంగలం: ద్విచక్రవాహనంలో వెళుతున్న యువకునిపై ఏనుగు దాడి చేసి హతమార్చింది. ఈ ఘటన అంచెట్టి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు అంచెట్టి సమీపంలోని ఏరికొడిగుట్ట గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్ (23). బుధవారం సాయంత్రం డెంకణీకోట నుంచి అంచెట్టివైపు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా రోడ్డుపక్కన పొదలో దాగి ఉన్న ఒంటి ఏనుగు దాడి చేసింది. తొండంతో కొట్టి, కాళ్లతో తొక్కడంతో యువకుడు అక్కడే మరణించాడు. విషయం గమనించిన స్థానికులు అంచెట్టి పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే అటవీ శాఖ సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని స్వాధీనపరుచుకొని డెంకణీకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఏనుగు దాడితో స్థానిక ప్రజల్లో భయం ఆవరించింది. బయటకు రావాలంటే భయపడుతున్నారు. బన్నేరుఘట్ట నుంచి వలస వచ్చిన ఏనుగులు విడిపోయి గ్రామాల సమీపంలో తిరుగుతూ భయోత్పాతానికి కారణమవుతున్నాయి.

2న కువెంపు కళాక్షేత్రంలో జానపద గీతాలు

బనశంకరి: బీఇఎల్ ఆంధ్ర మహాసభ నెలవారి కార్యక్రమంలో భాగంగా 2 తేదీ శనివారం సాయంత్రం 5.30 గంటలకు బీఇఎల్ కవి కువెంపు కళాక్షేత్రంలో అంతర్జాతీయ గాయకులు, టీవీ కళాకారులు నందిఅవార్డు గ్రహీత దామోదర గణపతి రావ్ బృందంచే రేలా రేరేలా జానపద గీతాలు, నృత్యాలు నిర్వహించనున్నట్లు బీఇఎల్ మహాసభ అధ్యక్షుడు వెంకట లోకేశ్వరరావు తెలిపారు. గురువారం వివరాలను వెల్లడిస్తూ..దామోదర గణపతి రావ్ బృందంతో జానపదగీతాలు, నృత్యాలు కార్యక్రమంలో బెళగల్లకిశోర్ ఏకపాత్రాభినయం ఉంటుందన్నారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రవాసాంధ్రులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దోపిడీ దొంగల ముఠా అరెస్టు

క్రిష్ణగిరి: క్రిష్ణగిరి ప్రాంతంలో దారిదోపిడీలకు పాల్పడుతున్న నలుగురు దొంగలను పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద ఓ కారుతో పాటు, నగదు, నగలను స్వాధీనపరుచుకొన్నారు. జిల్లా కేంద్రం క్రిష్ణగిరి, బర్గూరు, పోచ్చంపల్లి తదితర ప్రాంతాల్లో దోపిడీలు, దొంగతనాలు జోరుగా సాగుతుండడంతో బర్గూరు డీఎస్పీ మనోహరన్ నేతృత్వంలో నాగరసంబట్టి పోలీసులతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి క్రిష్ణగిరి సమీపంలోని సెల్లంబట్టి ప్రాంతంలో గస్తీ తిరుగుతుండగా ఇద్దరు యువకులు బైక్‌పై వెళ్తుండగా పోలీసులు పట్టుకుని విచారించారు. పోచ్చంపల్లికి చెందిన వినాయకప్రియన్ (22), సెల్లంబట్టికి చెందిన దండపాణి (20) అని తెలిసింది. నాగరసంబట్టికి చెందిన సుమన్ (21), సేలం మేచ్చేరికి చెందిన సురేష్(25)లు కలిసి దారి దోపిడీలకు పాల్పడుతున్నట్లు తేలింది. నలుగురినీ అరెస్టు చేశారు.

ఏనుగు మృతి కేసులో ఒకరు అరెస్టు

హోసూరు: గత 26వ తేదీ డెంకణీకోట సమీపంలోని తావరకెరె వద్ద విద్యుతాఘాతానికి గురై ఏనుగు మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు తీవ్ర విచారణ జరిపి ఒకరిని అరెస్టు చేశారు. వివరాలు.. డెంకణీకోట తాలూకా తావరకెరె సమీపంలో హోసూరుకు చెందిన కార్పొరేటర్ పాల్‌నారాయణన్‌కు సొంతమైన పొలం, కోళ్లఫాం ఉంది. గత ఎనిమిదేళ్లుగా పొలాన్ని సేలంకు చెందిన కార్తీక్ (25) నిర్వహిస్తున్నాడు. పొలంలో వెళ్లుతున్న విద్యుత్ స్తంభం నుంచి డ్రిప్ కోసం కరెంటు కనెక్షన్ తీసుకున్నాడు. ఏనుగు సంచరిస్తూ విద్యుత్ తీగలను తాకడంతో మృత్యువాత పడింది. కార్తీక్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

ఇసుక, కంకర లారీలు సీజ్

క్రిష్ణగిరి: అనుమతి లేకుండా కంకర, ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్ లారీలను స్వాధీనపరుచుకొన్నారు. వివరాల మేరకు ఖనిజ శాఖ తహసీల్దార్ గోకుల్‌కణ్ణన్, అధికార్లు మూంగిల్ పుదూర్ ప్రాంతంలో గస్తీ తిరుగుతుండగా రెండు ఇసుక లారీలు వస్తుండగా పట్టుకున్నారు. సమీప ప్రాంతంలో మరో రెండు కంకర లారీలను గుర్తించి సీజ్ చేసి మహారాజగడ పోలీసులకు అప్పగించారు.

కేఆర్ పురంలో కనకదాస జయంతి

కృష్ణరాజపురం: జాతీయ పండగల ఆచరణ సమితి ఆధ్వర్యంలో నగరంలోని కృష్ణరాజపురంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం కనక జయంతి వేడుకలను నిర్వహించారు. వేడుకల్లో తహసీల్దార్ రవికుమార్ పాల్గొని కనకదాస చిత్రపటానికి పూజలు చేశారు. కనకదాస వచనాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య


దొడ్డబళ్లాపురం: తాను కట్టిస్తున్న ఇంట్లోనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన దొడ్డ పట్టణ పరిధిలోని కచేరిపాళ్యలో చోటుచేసుకుంది. వెంకటేశ్ (44) ఆత్యహత్య చేసుకున్న వ్యక్తి. మరమగ్గం కార్మికుడైన వెంకటేశ్ కచేరిపాళ్యలో కొత్తగా ఇల్లు కట్టిస్తున్నాడు. సగం ఇల్లు పూర్తయింది. అయితే అనూహ్యంగా గురువారం కొత్త ఇంట్లోని బాత్రూంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు కారణాలు తెలిసిరాలేదు. మృతుడి భార్య, పిల్లలు యలహంకలో నివసిస్తున్నారు. దొడ్డ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సీసీబీ పోలీసుల దాడి

బనశంకరి: బెంగళూరులో బ్రాండెడ్ దుస్తుల పేరుతో నకిలీ వాటిని విక్రయిస్తున్న దుకాణాలపై సీసీబీ పోలీసులు దాడి చేశారు. బొమ్మనహళ్లి, కేఆర్.మార్కెట్ వద్ద గార్మెంట్స్ తరహాలో నకిలీ బ్రాండెడ్ పేరుతో విక్రయిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి దుస్తులు స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

ఉచిత విద్యుత్ కనెక్షన్‌లు అందజేయాలి

హోసూరు: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ ద్వారా వ్యవసాయ ఉత్పత్తి, సమస్యల పరిష్కార సమావేశం గురువారం కలెక్టర్ శరయు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయ, ఉద్యానవన, వ్యవసాయ ఇంజనీరింగ్, వ్యవసాయ వాణిజ్య, పశుసంవర్ధక, పట్టు అభివృద్ధి శాఖ, మత్స్యశాఖ, విద్యుత్ శాఖ, ధర్మపురి సహకార సంఘ బ్యాంకు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, రైతు సంఘ నాయకులు మాట్లాడుతూ రైతులకు సహకార సంఘాల ద్వారా వేపపిండిని సరఫరా చేయాలని, వ్యవసాయ ఇంజనీరింగ్ శాఖ ద్వారా యూనియన్‌కు ఓ ట్రాక్టర్ చొప్పున, 10 యూనియన్‌లకు 10 ట్రాక్టర్‌లను అద్దెకు వదలాలని, బిందుసేద్య పథకం ద్వారా నాలుగేళ్లకు ఒకసారి రైతులకు బిందుసేద్య ఉపకరణాలు మార్పిడి చేయాలని, నాటు పశువుల పెంపకానికి రైతులను ప్రోత్సహించాలని, పూల సాగు రైతులకు ఉచిత విద్యుత్ కనెక్షన్‌లు అందజేయాలని తదితర రైతుల సమస్యలపై డిమాండ్లను అధికారుల ముందుంచారు. కార్యక్రమంలో అధికారులు పచ్చయప్పన్, శ్రీనివాసన్, ఏకాంబరం, రవి, కాళిముత్తు, మారియసుందర్ షణ్ముగప్రియ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్

ఏసీ పేరుతో రైతుకు రూ.90 వేలు టోకరా

దొడ్డబళ్లాపురం: రామనగర ఏసీ పేరుతో రైతును మోసం చేసి రూ.90 వేలు డబ్బులు కాజేసిన సంఘటన కనకపురలో వెలుగు చూసింది. మైసూరు తాలూకా హాలనహళ్లి లేఔట్ నివాసి శివలింగయ్య (76) మోసపోయిన వ్యక్తి. శివలింగయ్య సాతనూరు వద్ద ఉన్న తన భూమిని రిజిస్ట్రేషన్ చేయించాలని తాలూకా కార్యాలయానికి వెళ్లిన సమయంలో ఇద్దరు వ్యక్తులు అతడి వద్దకు వచ్చి నేరుగా ఏసీని పరిచయం చేస్తామని ఆయన వద్ద నీ పనికి సంబంధించి మాట్లాడమని ఒక మొబైల్ నంబర్ ఇచ్చారు. వారి మాటలు నమ్మిన శివలింగయ్య ఆ నంబర్‌కు ఫోన్ చేయగా ఏసీ మాట్లాడుతున్నానని, ఏం పని కావాలని అడిగాడు అపరిచిత వ్యక్తి. పని గురించి చెప్పగా నా నంబర్ ఇచ్చిన వ్యక్తికి రూ.90 వేలు ఇవ్వాలని ఆ మొత్తం ప్రభుత్వానికి కట్టాలని నమ్మబలికాడు. అపరిచిత వ్యక్తి మాటలు నమ్మిన శివలింగయ్య రూ.90 వేలు ఇచ్చాడు. నగదు తీసుకున్న వ్యక్తి మంగళవారం ఏసీ కార్యాలయానికి రావాలని చెప్పి వెళ్లిపోయాడు. చెప్పిన ప్రకారం శివలింగయ్య మంగళవారం ఏసీ కార్యాలయానికి వెళ్లి ఏసీ బినోయ్‌ను కలిసి తన పని గురించి అడగ్గా అసలు సంగతి తెలిసింది. ఏసీ సలహా ప్రకారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసాడు.

రైల్వే క్రాసింగ్ వద్ద మరమ్మతులు


మరమ్మతులు చేస్తున్న రైల్వే సిబ్బంది

దొడ్డబళ్లాపురం: నైరుతి రైల్వే పరిధిలోని దొడ్డ తాలూకా వడ్డరహళ్లి, మాకళిదుర్గ రైల్వేస్టేషన్‌ల మార్గం మధ్యలోని తిరుమగొండనహళ్లి రైల్వే క్రాసింగ్‌లో మరమ్మతులు జరుగుతున్నందున ఈ క్రాసింగ్‌లో రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకూ వాహనాల రాకపోకలను నిషేధించినట్టు నైరుతి రైల్వే ప్రకటించింది. రైల్వే గేట్ వద్ద రైలు పట్టాల మరమ్మతులు జరుగుతున్నాయని వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గంలో ప్రయాణించాలని సూచించారు. తిరుమగొండనహళ్లి క్రాసింగ్ మీదుగా ఘాటి సుబ్రమణ్య పుణ్యక్షేత్రానికి, తూబుగెరె, హాడోనహళ్లి గ్రామాలకు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.

కన్నడ జెండాలకు అనుమతివ్వండి

తుమకూరు: కన్నడ రాజ్యోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసే జెండాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లకు సుంకాన్ని తగ్గించాలని, నగరంలో కన్నడ జెండాలను ఎగుర వేయాల్సిన అవసరం ఉన్నందున, అనుమతి ఇవ్వాలని కన్నడ పోరాట సంఘాలకు చెందిన పలువురు నాయకులు హోం మంత్రి పరమేశ్వర్‌కు విజ్ఞప్తి చేశారు. నగరంలోని పర్యాటక మందిరంలో ఉన్న మంత్రితో వారు మాట్లాడారు.

‘సాగర్’లో సగం ఏపీ స్వాధీనం

హెడ్‌రెగ్యులేటర్ సహా 13 గేట్లు ఏపీ ఆధీనంలోకి.. • కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కుల పరిరక్షణలో సీఎం కీలక నిర్ణయం

సాక్షి, అమరావతి/సాక్షి, నరసరావుపేట/మాచర్ల/విజయపురిసౌత్ :కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కుల పరిరక్షణలో నాలుగున్నరేళ్లుగా రాజీలేని పోరాటం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. రాష్ట్రానికి హక్కుగా దక్కిన జలాల వినియోగం విషయంలో ఇప్పుడు సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర భూభాగంలో ఉన్న నాగార్జునసాగర్ స్పిల్ వే 13 గేట్లతో సహా కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను ఆధీనంలోకి తీసుకుని, నీటిని విడుదల చేయాలని అధికారులకు సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం చేశారు. దీంతో గురువారం తెల్లవారుజామున సీఈ మురళీనాథ్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర పోలీసులు, జలవనరుల శాఖాధికారులు నాగార్జునసాగర్‌కు చేరుకున్నారు. అక్కడ బందోబస్తు నిర్వహిస్తున్న తెలంగాణ పోలీసులకు వాస్తవాలను వివరించి.. రాష్ట్ర భూభాగంలోని సాగర్ స్పిల్ వే 13 గేట్లతో పాటు కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. తాగునీటి అవసరాల కోసం కుడి కాలువకు 2,300 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కుల పరిరక్షణలో సీఎం జగన్ రాజీలేని పోరాటం చేస్తున్నారనడానికి ఇది మరో తార్కాణమని సాగునీటిరంగ నిపుణులు ప్రశంసిస్తున్నారు.

తెలంగాణ తొండాట..

నిజానికి.. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి అక్టోబరు 6న కృష్ణా బోర్డు రాష్ట్రానికి 30 టీఎంసీలు కేటాయించింది. ఇందులో ఎడమ గట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 15 టీఎంసీలను నాగార్జునసాగర్‌కు తెలంగాణ సర్కార్ తరలించింది. మాకు కేటాయించిన ఆ 15 టీఎంసీలను గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల తాగునీటి అవసరాల కోసం సాగర్ కుడి కాలువ ద్వారా విడుదల చేయాలని ఏపీ అధికారుల విజ్ఞప్తులను తెలంగాణ సర్కార్ పట్టించుకోవడంలేదు. ఇదే అంశాన్ని సీఎం వైఎస్ జగన్‌కు రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ సి. నారాయణరెడ్డిలు వివరించారు. వాస్తవానికి.. శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతను కేంద్రం రాష్ట్రానికి అప్పగిస్తే.. తమ భూభాగంలో ఉందని ఎడమ గట్టు విద్యుత్కేంద్రాన్ని తెలంగాణ సర్కార్ తన ఆధీనంలోకి తీసుకుంది. ఇదే తరహాలో ఏపీ భూభాగంలో ఉన్న నాగార్జునసాగర్ స్పిల్ వే 13 గేట్లతో సహా కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను సీఎం జగన్ ఆదేశాలతో అధికారులు స్వాధీనం చేసుకున్నారు.


సాగర్ కుడికాలువ ఐదో గేటు ద్వారా విడుదలవుతున్న నీరు

రాష్ట్ర హక్కులు తెలంగాణకు చంద్రబాబు తాకట్టు..

- విభజన నేపథ్యంలో కృష్ణా జలాల వినియోగంలో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య విభేదాలు తలెత్తకుండా చేసేందుకు విభజన చట్టం ద్వారా 2014లో కేంద్రం కృష్ణా బోర్డును ఏర్పాటుచేసింది. దీని పరిధిని నోటిఫై చేసేదాకా ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలంను ఆంధ్రప్రదేశ్, నాగార్జునసాగర్‌ను తెలంగాణ సర్కార్ నిర్వహించాలని నిర్దేశించింది.
- దీంతో సాగర్‌ను 2014–15లో పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకున్న తెలంగాణ సర్కార్.. శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్కేంద్రం తమ భూభాగంలో ఉందనే సాకు చూపి దాన్ని తన ఆధీనంలోకి తీసుకుంది. అదే సాకు చూపి పులిచింతల విద్యుత్కేంద్రాన్ని సైతం తన ఆధీనంలోకి తీసుకుంది. అయినాసరే.. నాటి సీఎం చంద్రబాబు ఇటు రాష్ట్రంలో.. అటు తెలంగాణలో టీడీపీని బతికించుకోవాలన్న రెండు కళ్ల సిద్ధాంతంతో కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను తెలంగాణకు తాకట్టు పెట్టారు.
- ఇక శ్రీశైలం ప్రాజెక్టులో 881 అడుగుల స్థాయిలో నీటి మట్టం ఉన్నప్పుడు మాత్రమే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా ప్రస్తుత డిజైన్ మేరకు 44 వేల క్యూసెక్కుల నీటిని రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు తరలించవచ్చు. నీటి మట్టం 854 అడుగుల స్థాయిలో ఉంటే ఆరేడు వేల క్యూసెక్కులు మాత్రమే తరలించడానికి సాధ్యమవుతుంది. అంతకంటే తగ్గితే.. శ్రీశైలంలో నీటి కోటా ఉన్నా సరే సీమ అవసరాల కోసం నీటిని వినియోగించలేని దుస్థితి. కానీ, శ్రీశైలం ప్రాజెక్టులో 796 అడుగుల నుంచే రోజుకు 4 టీఎంసీలను తరలించే సామర్థ్యం తెలంగాణకు ఉంది. దిగువన నీటి అవసరాలు లేకున్నా.. కృష్ణా బోర్డు అనుమతి తీసుకోకుండానే ఎడమ గట్టు కేంద్రం నుంచి యథేచ్ఛగా విద్యుదుత్పత్తి చేస్తూ.. శ్రీశైలంలో నీటిమట్టం తగ్గేలా తెలంగాణ సర్కార్ చేస్తోంది. తద్వారా శ్రీశైలంలో రాష్ట్ర వాటా జలాలు వినియోగించుకోకుండా చేస్తోంది.
- శ్రీశైలం నుంచి 2015లో ఇదే రీతిలో సాగర్‌కు తెలంగాణ తరలించిన నీటిని.. కుడి కాలువ కింద సాగు అవసరాల కోసం విడుదల చేయాలని అప్పటి రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ చేసిన విజ్ఞప్తిని తెలంగాణ అధికారులు తోసిపుచ్చారు. దీంతో రాష్ట్ర భూభాగంలోని సాగర్ స్పిల్ వేలో 13 గేట్లతోపాటు కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను స్వాధీనం చేసుకునేందుకు 2015, ఫిబ్రవరి 13న ఆదిత్యనాథ్ దాస్ పోలీసులతో కలిసి సాగర్‌కు చేరుకున్నారు. కానీ, తక్షణమే వెనక్కి రావాలని ఆదిత్యనాథ్ దాస్‌ను చంద్రబాబు ఆదేశించారు. తద్వారా కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను ఆయన తెలంగాణకు తాకట్టు పెట్టారు.
- శ్రీశైలం నుంచి 800 అడుగుల నుంచే రోజుకు రెండు టీఎంసీలు తరలించేలా పాలమూరు–రంగారెడ్డి, డిండి ఎత్తిపోతలతోపాటు కల్వకుర్తి, నెట్టెంపాడుల సామర్థ్యం పెంచి.. సుంకేశుల బ్యారేజ్ జలవిస్తరణ ప్రాంతంలో తుమ్మిళ్ల ఎత్తిపోతల, భక్తరామదాస ఎత్తిపోతలను తెలంగాణ సర్కార్ అక్రమంగా చేపట్టింది. కృష్ణా జలాలపై ఏపీ హక్కులను హరించి వేస్తున్నా ఓటుకు కోట్లు కేసు నుంచి తప్పించుకునేందుకు వాటిని తెలంగాణ సర్కార్‌కు చంద్రబాబు తాకట్టు పెట్టారు.

సాగర్ నుంచి నీరు విడుదల

గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో తీరనున్న తాగునీటి కష్టాలు రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల వలన తాగునీరు లేక మూడు జిల్లాల చెరువులు, భూగర్భ జలాలు తగ్గిపోయి ప్రజలు మంచినీటికి అల్లాడుతున్న నేపథ్యంలో.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న సాహసోపేత నిర్ణయం గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు ఊపిరిపోసింది. ఏపీ భూభాగంలోని 13 గేట్లను, కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను రాష్ట్ర జలవనరుల శాఖాధికారులు స్వాధీనం చేసుకుని కుడికాలువ రెండు గేట్ల ద్వారా 2,300 క్యూసెక్కుల నీటిని గురువారం విడుదల చేశారు. అంతకుముందు.. భారీ స్థాయిలో ఏపీ పోలీసులు అక్కడ మోహరించారు. కుడికాలువపై పట్టు సాధించే క్రమంలో డ్యాంపై ఘర్షణ వాతావరణం ఏర్పడింది. తెలంగాణ పోలీసులు ఏపీ జలవనరుల శాఖ అధికారులపై దౌర్జన్యానికి దిగారు. దీంతో ఏపీ పోలీసులు శాంతియుత వాతావరణంలోనే వారిని అక్కడి నుంచి పంపించి వేశారు. అనంతరం.. సాగర్ డ్యాంపై ఏపీకి చెందిన భూభాగంలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటుచేసిన గేట్లను దాటి సగభాగం వరకు స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఏపీ పరిధిలోని 13 క్లస్టర్ గేట్ల వరకు బారికేడ్లు ఏర్పాటుచేశారు. ఈ చర్యలతో నాగార్జునసాగర్‌లో ఏపీ హక్కులను రాష్ట్ర ప్రభుత్వం పరిరక్షించినట్లయ్యింది. మరోవైపు.. నీరు విడుదల చేసి ప్రజల దాహార్తిని తీర్చేందుకు సీఎం జగన్ సర్కార్ తీసుకున్న నిర్ణయంపై ఆ జిల్లాల ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

హక్కుల పరిరక్షణకు సీఎం జగన్ రాజీలేని పోరాటం..

ఇక వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక కృష్ణా జలాల విషయంలో రాష్ట్ర హక్కుల పరిరక్షణ కోసం రాజీలేని పోరాటం చేస్తున్నారు. తెలంగాణ సర్కార్ అక్రమ ప్రాజెక్టులను నిలిపేయాలని కేంద్రానికి ఫిర్యాదు చేశారు. రాయలసీమ, నెల్లూరు జిల్లాల సాగు, తాగునీటి అవసరాల కోసం తెలంగాణ తరహాలోనే శ్రీశైలంలో 800 అడుగుల స్థాయిలో నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌లోకి రోజుకు 3 టీఎంసీలు ఎత్తిపోసేలా రాయలసీమ ఎత్తిపోతలను చేపట్టారు. దీనిపై రెండు రాష్ట్రాల మధ్య వివాదం తలెత్తడంతో.. దాన్ని పరిష్కరించడానికి 2020, అక్టోబర్ 6న కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రానికి హక్కుగా దక్కిన నీటిని వినియోగించుకోవడం కోసమే రాయలసీమ ఎత్తిపోతలను చేపట్టామని స్పష్టంచేసిన సీఎం జగన్.. తెలంగాణ అక్రమ ప్రాజెక్టులను నిలుపుదల చేయాలని డిమాండ్ చేయడమే కాక.. సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ కూడా దాఖలు చేశారు.

- శ్రీశైలానికి ఎగువ నుంచి వరద ప్రవాహం ప్రారంభం కాకుండానే 2021లో తెలంగాణ జెన్‌కో విద్యుదుత్పత్తి ప్రారంభించి.. సాగర్‌కు తరలిస్తూ శ్రీశైలాన్ని ఖాళీచేస్తూ రాష్ట్ర హక్కులను హరిస్తుండటంతో సీఎం వైఎస్ జగన్ న్యాయపోరాటానికి దిగారు. కృష్ణా బోర్డు పరిధిని నోటిఫై చేయడం ద్వారా అక్రమంగా విద్యుదుత్పత్తి చేయకుండా తెలంగాణను కట్టడి చేయాలని కోరుతూ సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు.
- దీంతో కృష్ణా బోర్డు పరిధిని నిర్దేశిస్తూ 2021, జూలై 15న కేంద్ర జల్‌శక్తి శాఖ నోటిఫికేషన్ జారీచేసింది. ఉమ్మడి ప్రాజెక్టులను ఏడాదిలోగా బోర్డుకు అప్పగించాలని కేంద్రం ఆదేశించింది. శ్రీశైలం, సాగర్‌లలో రాష్ట్ర భూభాగం పరిధిలోని ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధం కాగా.. తెలంగాణ నిరాకరించింది. ఈ నేపథ్యంలో.. రాష్ట్ర భూభాగంలోని సాగర్ స్పిల్ వే 13 గేట్లతోపాటు కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను రాష్ట్రానికి అప్పగించాలని.. లేదంటే ఉమ్మడి ప్రాజెక్టులను బోర్డు పరిధిలోకి తీసుకోవాలని జగన్ డిమాండ్ చేస్తూ వస్తున్నారు.

1,311 మంది పోలీసులతో బందోబస్తు

ఇక నాగార్జునసాగర్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొనే అవకాశమున్న నేపథ్యంలో.. ఏపీ పోలీసు శాఖ భారీ సంఖ్యలో పోలీసులను మోహరించింది. గుంటూరు రేంజ్ ఐజి పాల్‌రాజ్, పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, ఎస్పీ రవీంద్రబాబుల ఆధ్వర్యంలో 1,311 మంది సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు. సాగర్ వద్ద పరిస్థితులు చక్కబడే వరకు వీరు అక్కడే ఉండే అవకాశముంది.


అర్ధరాత్రి సాగర్ డ్యాం కుడికాలువ గేట్ల వద్ద భారీగా మోహరించిన ఆంధ్రా పోలీసు అధికారులు, పోలీసులు

క్లుప్తంగా...

ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

- 5వ తేదీ వరకు అవకాశం
- ఆలస్య రుసుంతో 15 వరకు చాన్స్

సాక్షి, అమరావతి: వచ్చే ఏడాది మార్చిలో జరిగే ఇంటర్ మొదటి, రెండో ఏడాది జనరల్, ఒకేషనల్ పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపునకు ఇంటర్ విద్యా మండలి గడువు పొడిగించింది. వాస్తవానికి ఆలస్య రుసుం లేకుండా ఫీజు చెల్లించేందుకు నవంబర్ 30తో గడువు ముగిసింది. అయితే, ఈ గడువును మరో ఐదురోజులు పొడిగిస్తూ గురువారం ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి సౌరభ్‌గౌర్ ఉత్తర్వులిచ్చారు. రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు ఆలస్య రుసుం లేకుండా డిసెంబర్ 5 వరకు, రూ.1000 ఆలస్య రుసుంతో 15 వరకు చెల్లింపునకు అవకాశం కల్పించినట్టు ప్రకటించారు. మొదటి/ రెండో సంవత్సరం థియరీ పరీక్షలకు రూ.550, రెండో ఏడాది జనరల్, ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు రూ.250, బ్రిడ్జి కోర్సులకు రూ.150 చెల్లించాలి. ఇంటర్ రెండేళ్ల థియరీ పరీక్షలకు రూ.1100, ఒకేషనల్ రెండేళ్ల ప్రాక్టికల్స్‌కు రూ.500, ఒకేషనల్ బ్రిడ్జి కోర్సుకు రూ.300 చెల్లించాలి. ఇప్పటికే ఇంటర్ పాసై ఇంప్రూవ్‌మెంట్ రాసేవారు రెండేళ్లకు ఆర్ట్స్ కోర్సులకు రూ.1240, సైన్స్ కోర్సులకు రూ.1440 ఆయా కళాశాలల్లో చెల్లించాలి.

ఎన్‌ఎస్‌యూకు విలువైన 34 మాతృక గ్రంథాలు


మాతృక గ్రంథాలు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీ (ఎన్‌ఎస్‌యూ)కి అత్యంత విలువైన ప్రాచీన మాతృక గ్రంథాలను రాజమహేంద్రవరానికి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్‌వీవీ గోపాలాచార్యులు అందజేశారు. గురువారం ఎన్‌ఎస్‌యూ వర్సిటీలో ఆయన 34 మాతృకా గ్రంథాలను వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆర్‌జే రమాశ్రీకి అందజేశారు. ఆయన మాట్లాడుతూ..సంస్కృత భాషలోని ప్రాచీనమైన ఆగమ శాస్త్రానికి సంబంధించిన మాతృక గ్రంథాలను సంరక్షించి, వాటిని ఈ రోజు వర్సిటీ సెంట్రల్ లైబ్రరీకి డొనేట్ చేసినట్లు చెప్పారు.

సాగరమాల ప్రాజెక్టులు త్వరగా పూర్తవ్వాలి

పోర్టుల శాఖ జాయింట్ సెక్రటరీ సుశీల్‌కుమార్ సింగ్

సాక్షి, విశాఖపట్నం: సాగరమాల ప్రాజెక్టుల్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కేంద్ర పోర్టులు, జలవనరుల శాఖ సంయుక్త కార్యదర్శి సుశీల్‌కుమార్ సింగ్ విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) అధికారుల్ని ఆదేశించారు. గురువారం విశాఖ చేరుకున్న ఆయన పోర్టును సందర్శించారు. అక్కడ జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. పీపీపీ పద్ధతిలో చేపడుతున్న ప్రాజెక్టుల పురోగతితో పాటు, పోర్టు కార్యకలాపాలు, ఇటీవల ప్రారంభమైన క్రూయిజ్ టెర్మినల్ నిర్మాణానికి సంబంధించిన వివరాలపై డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే, సెక్రటరీ వేణుగోపాల్, ట్రాఫిక్ మేనేజర్ రత్నశేఖర్, ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఏపీఈఆర్‌సీకి విద్యుత్ సంస్థల నివేదిక

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పంపిణీ సంస్థ (డిస్కం)లు 2024–25 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాల నివేదిక (ఏఆర్‌ఆర్), బహుళ వార్షిక కాల వ్యవధి 2024–29కి సంబంధించి నెట్‌వర్క్ ఆదాయ అవసరాల నివేదికలను ఏపీఈఆర్‌సీకి గురువారం గుంటూరులో అందించాయి. ఐదేళ్లకు సంబంధించిన నెట్‌వర్క్ ఆదాయ అవసరాల నివేదికను ఏపీట్రాన్స్‌కో కూడా ఏపీఈఆర్‌సీకి నివేదించింది. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ సమక్షంలో ట్రాన్స్‌కో జేఎండీ కేవీఎన్ చక్రధర్ బాబు, ఏపీఈపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్‌ల సీఎండీలు తమ సంస్థల ఏఆర్‌ఆర్ నివేదికలను ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, సభ్యులు ఠాకూర్ రామసింగ్‌కు అందజేశారు. నివేదికలపై ఏపీఈఆర్‌సీ పబ్లిక్ హియరింగ్ నిర్వహించనుంది.

శభాష్..‘వీఆర్వీ’

అమెరికాకు ద్రవ ఆక్సిజన్ నిల్వ ట్యాంకుల ఎగుమతి


అమెరికాకు తరలిస్తున్న ద్రవ ఆక్సిజన్

వరదయ్యపాళెం (తిరుపతి జిల్లా): శ్రీసిటీలోని తొలి పరిశ్రమ అయిన వీఆర్వీ ఆసియా పసిఫిక్ ప్రైవేట్ పరిశ్రమ గడిచిన వారంలో యూఎస్ ప్రైవేట్ అంతరిక్ష సంస్థకు పలు భారీ ద్రవ ఆక్సిజన్ నిల్వ ట్యాంకులను ఎగుమతి చేసింది. దీంతో ఓ ముఖ్యమైన మైలురాయిని అధిగమించింది. 37 మీటర్ల పొడవు, 6 మీటర్ల వ్యాసం, 200 టన్నులు బరువు కలిగిన ఈ భారీ నిల్వ ట్యాంక్, వీఆర్వీ ఇంజినీరింగ్, క్రయోజెనిక్ టెక్నాలజీని అభివృద్ధి చేయడంలో సంస్థ ప్రతిభను చాటి చెప్పింది. అంతరిక్ష రంగం అవసరాలకు అనుగుణంగా భారీ క్రయోజెనిక్ నిల్వ ట్యాంకుల తయారీలో ప్రపంచవ్యాప్త గుర్తింపు వీఆర్వీకి దక్కింది. క్రయోజెనిక్ స్టోరేజ్ సొల్యూషన్స్‌లో తమ స్థానాన్ని పటిష్టం చేస్తూ, ఈ మైలురాయిని అధిగమించినందుకు తాము గర్విస్తున్నట్లు వీఆర్వీ ఇండస్ట్రీస్ ఎండీ జీఎల్ రంగ్నేకర్ పేర్కొన్నారు.

బలపడుతున్న అల్పపీడనం

- శుక్రవారం ఉదయం వాయుగుండంగా మారే అవకాశం
- పశ్చిమ వాయవ్య దిశగా పయనం
- 3న తుపానుగా బలపడే సూచన
- ఒకట్రెండు చోట్ల మోస్తరు వర్షాలకు అవకాశం
- అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశం
- పంట కోతలు, ఆ తర్వాత జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలని వెల్లడి
- ఒక్క రైతు కూడా నష్టపోకూడదని స్పష్టీకరణ



సాక్షి, విశాఖపట్నం/సాక్షి, అమరావతి : ఆగ్నేయ బంగాళాఖాతం, దక్షిణ అండమాన్ సముద్ర ప్రాంతాల్లో కేంద్రీకృతమై ఉన్న తీవ్ర అల్పపీడనం మరింత బలపడి శుక్రవారం ఉదయానికి వాయుగుండంగా మారనుంది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా ప్రయాణిస్తోందని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇది మరింత బలపడి 3వ తేదీ మధ్యాహ్నానికి నైరుతి బంగాళాఖాతానికి చేరుకొని తుపానుగా మారనుంది. మరోవైపు.. నైరుతి బంగాళాఖాతం, దాన్ని ఆనుకొని దక్షిణ శ్రీలంకపై సగటు సముద్రమట్టానికి 5.8 కిలోమీటరలఎత్తు వరకూ ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉంది. తుపాను ప్రభావం కోస్తా తీరం వెంబడి ఉండే అవకాశం ఉంది. దీని ప్రభావంతో రానున్న రెండు రోజుల పాటు కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే సూచనలున్నట్లు వెల్లడించారు.

రైతులకు అధికారులు అందుబాటులో ఉండాలి

తుపాను హెచ్చరికల నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, రైతులకు అందుబాటులో ఉండాలని వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ ఆదేశించారు. ఖరీఫ్ వరి పంట కోతలు ముమ్మరంగా జరుగుతున్నందున.. కోతలు, ఆ తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. కోతల్లో, కొనుగోళ్ల సమయంలో ఒక్క రైతు కూడా నష్టపోకూడదని చెప్పారు. ఆయన గురువారం వ్యవసాయాధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఖరీఫ్‌లో తక్కువ వర్షపాతం నమోదైనందున క్షేత్రస్థాయి సిబ్బంది లక్ష్యం మేరకు పంట కోత ప్రయోగాలపై దృష్టి పెట్టాలన్నారు. జియో కోఆర్డినేట్‌లతో కూడిన యాప్‌లో ప్రైమరీ వర్కర్, పర్యవేక్షక అధికారి, ఇన్సూ్యరెన్స్ కంపెనీ కోఆబ్జర్వర్ల సంతకాలతో పూర్తి స్థాయి సమాచారాన్ని రియల్ టైమ్‌లో నమోదు చేస్తేనే పంటల బీమాకు అర్హత వస్తుందని తెలిపారు. ఈ క్రాప్ నమోదుకు ఖరీఫ్‌లో ఇచ్చిన మార్గదర్శకాలే రబీలోనూ వర్తిస్తాయన్నారు. త్వరగా కోతకు వచ్చే శనగ, మినుము, మొక్క జొన్న పంటలను త్వరగా ఈ క్రాప్ ద్వారా నమోదు చేయాలని సూచించారు. వచ్చే 3, 4 రోజుల్లో కురిసే వర్షాలను సద్వినియోగం చేసుకునేందుకు రైతులకు అవసరమైన విత్తనాలను అందించాలని సూచించారు. శనగ విత్తనాల కోసం డిసెంబర్ 15 లోగా ఇండెంట్ పెట్టాలన్నారు. దేశంలోనే మొదటిసారిగా మన రాష్ట్రంలోనే గ్యాప్ సర్టిఫికేషన్‌ను అమలు చేస్తున్నందున, ఎక్కువ మంది లబ్ధి పొందేలా కృషి చేయాలని తెలిపారు. ఉత్తమ ప్రమాణాలను పొందిన ఉత్పత్తులకు గిరాకీ పెరిగేలా వివిధ మాధ్యమాల ద్వారా వినియోగదారులకు సమాచారం అందించాలన్నారు.

విశాఖలో ‘ఫైనాన్షియల్ హబ్’ ఏర్పాటుకు వినతి

- సీఎం వైఎస్ జగన్‌కు మంత్రి ధర్మాన లేఖ
- ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరిన మంత్రి



సాక్షి, అమరావతి : ఉత్తర కోస్తా జిల్లాల్లో అభివృద్ధిని ప్రోత్సహించేందుకు విశాఖపట్నంలో ‘ఫైనాన్షియల్ హబ్’ ఏర్పాటు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గురువారం లేఖ రాశారు. ఉత్తర కోస్తా జిల్లాల అభివృద్ధికి ఇటీవల ఉత్తర్వులు జారీ చేసినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన ధర్మాన.. రాష్ట్రంలో మానవాభివృద్ధి సూచీలో వెనుకబడిన జిల్లాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. రాష్ట్ర విభజన (2014) తర్వాత విశాఖపట్నం కాస్మోపాలిటన్ నగరంగా ఎదిగిందని, అత్యధిక సంఖ్యలో కార్పొరేషన్లు, ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలకు కేంద్రమైందని పేర్కొన్నారు. ఫైనాన్షియల్ హబ్ కోసం విశాఖపట్నంలో 100 ఎకరాలు కేటాయించాలని సీఎంను అభ్యర్థించారు. ఈ ప్రాంతంలో అన్ని షెడ్యూల్డ్ బ్యాంకులు, ఇతర లీడ్ బ్యాంకులు, ఆర్థిక సంస్థల జోనల్ హెడ్‌క్వార్టర్స్ వస్తాయన్నారు. వీటితోపాటు ఆర్థిక సేవల సంస్థలు, ప్రముఖ న్యాయ సంస్థలు, రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ కార్యాలయం కూడా ఏర్పాటు చేయాలని మంత్రి కోరారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు మద్దతుగా విశాఖపట్నంలో రిజర్వు బ్యాంకు ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖను కోరాలని విజ్ఞప్తి చేశారు.


‘సోషల్ రెస్పాన్సిబిలిటీ అథారిటీ’ నెలకొల్పండి

విశాఖ ప్రాంతంలో అత్యధిక కంపెనీలు ఉన్నాయని, కంపెనీ సెక్రటరీలు, చార్టర్డ్ అకౌంటెంట్ సంస్థలు సైతం సేవలు అందిస్తున్నాయని మంత్రి ధర్మాన తెలిపారు. వీటికి అనుబంధంగా రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన ‘కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అథారిటీ’ని ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. రాష్ట్రంలోని అన్ని కార్పొరేట్లు ఏటా దాదాపు రూ.1,000 కోట్లను సీఎస్ఆర్ ఫండ్స్ ఇస్తున్నాయని, విశాఖలోని కార్పొరేషన్లు, కంపెనీలు అందించే సీఎస్ఆర్ నిధులు కూడా ఈ అథారిటీకి వస్తాయని సూచించారు. ఈ నిధులను సీఎం రిలీఫ్ ఫండ్ తరహాలో వినియోగించవచ్చన్నారు.

అబ్బురపరుస్తున్న నేవీ రిహార్సల్స్

ఈ నెల 4న నేవీ డే వేడుకలు

బీచ్‌రోడ్డు: డిసెంబర్ 4న నేవీ డేను పురస్కరించుకొని విశాఖ తీరంలో తూర్పు నావికదళం నిర్వహిస్తోన్న రిహార్సల్స్ చూపరులను అబ్బురపరుస్తున్నాయి. భారీ యుద్ధనౌకలు, స్పీడ్ బోట్లు, ఫైటర్ జెట్స్, యుద్ధ విమానాలు తీరంలో గురువారం తమ ప్రతిభను ప్రదర్శించాయి. హెలికాప్టర్ ద్వారా ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించటం, తీవ్రవాదులు దాడులను ఎదుర్కోవడాన్ని ప్రదర్శించారు. యుద్ధనౌకలు ఒకదానిపై మరొకటి బాంబుల వర్షం కురిపించుకున్నాయి. అనంతరం హాక్స్, ఫైటర్ జెట్స్ తీరంలో బాంబులను వెదజల్లుతూ అలరించాయి. అంతలోపే ఆకాశం నుంచి కొందరు జాతీయ పతాకం, నేవీ పతాకంతో పారాచూట్ ద్వారా కిందికి దిగడం ఆకట్టుకుంది. డిసెంబర్ 4న జరగనున్న వేడుకలకు శనివారం ఫైనల్ రిహార్సల్స్ చేయనున్నారు. కాగా, 4న జరగనున్న నేవీ డే వేడుకలకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ హాజరై నేవీ సిబ్బంది చేసే విన్యాసాలను వీక్షిస్తారు.


విశాఖ తీరంలో తూర్పు నావికాదళం నిర్వహిస్తున్న రిహార్సల్స్

చేటు చేసే మీడియా అది

- ఎల్లో మీడియాపై సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి ధ్వజం
- ఒక వ్యక్తిని నిలబెట్టేందుకు పది మీడియా సంస్థల యత్నం

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): రాష్ట్రంలో ఓ వర్గం మీడియా చేస్తున్న దుష్ప్రచారం ప్రజలకు చేటు చేస్తుందని ఏపీ సంస్కృత అకాడమి చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి ధ్వజమెత్తారు. వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రజలకు ఎంతగా మేలు చేస్తున్నా, ఎల్లో మీడియా ప్రభుత్వంపై అసత్య కథనాలతో పాఠకులను పక్కదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తోందని తెలిపారు. ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం గుంటూరులోని పెన్షనర్స్ భవన్‌లో ‘తెలుగు మీడియా గమనం–గమ్యం’ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు వీవీఆర్ కృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో లక్ష్మీపార్వతి మాట్లాడుతూ 1994లో ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి, ఆయన అల్లుడు చంద్రబాబుకు అధికారాన్ని కట్టబెట్టడంలో ఈనాడు, ఆంధ్రజ్యోతి, మరికొన్ని పత్రికలు ప్రధాన పాత్ర పోషించాయని చెప్పారు. వైఎస్ జగన్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు, సంస్కరణలు, వినూత్న విధానాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నా, ఈ పత్రికలు విషం కక్కుతున్నాయని తెలిపారు. గత చంద్రబాబు ప్రభుత్వం ఏమీ చేయకపోయినా అద్భుతంగా చేశారని హడావుడి చేశాయన్నారు. కేవలం ఒక వ్యక్తిని, పార్టీని నిలబెట్టే తాపత్రయంతో దాదాపు 10 మీడియా సంస్థలు తీవ్రంగా పనిచేస్తున్నాయన్నారు. ఈ మీడియా కుయుక్తులను తిప్పికొట్టాలని ఇతర పత్రికలకు ఆమె పిలుపునిచ్చారు.


మాట్లాడుతున్న లక్ష్మీపార్వతి

ఆ మీడియా తీరు దారుణం : వీవీఆర్ కృష్ణంరాజు

ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి.ఆర్. కృష్ణంరాజు మాట్లాడుతూ తెలుగు మీడియాలోని ఒక వర్గం తీరు అత్యంత దారుణంగా, రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసేలా ఉందన్నారు. ఈ మీడియా సమాచార కాలుష్యాన్ని ఏపీ అంతటా వెదజల్లి, ప్రజల ఆలోచనలను కలుషితం చేస్తోందని చెప్పారు. ఏపీ అభివృద్ధి వైపు దూసుకెళ్తుండగా, చంద్రబాబు అనుకూల మీడియా మాత్రం రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకంజలో ఉందని అసత్య ప్రచారం చేస్తోందని వాపోయారు.

ఆ మీడియాకు చెదలు పట్టింది: న్యాయవాది సుందరరామశర్మ

సీనియర్ న్యాయవాది చుండూరు సుందరరామశర్మ మాట్లాడుతూ ఒక వర్గం మీడియాకు చెదలు పట్టాయని అన్నారు. పత్రికలు ప్రభుత్వాలకు వారధిలా ఉండాలని అన్నారు. కానీ కొందరికి కావాల్సిన విధంగా పత్రికలు నడుస్తున్నాయని చెప్పారు. గతంలో తప్పు చేస్తే ఎత్తిచూపడం, మంచి చేస్తే పట్టం కట్టేవారని చెప్పారు. ఈనాడు వచ్చిన దగ్గర నుంచి జర్నలిజంలో విలువలు తగ్గాయని ఆరోపించారు. సాక్షి పేపర్ రాకపోతే నాణానికి రెండో వైపు కనిపించేదికాదని అన్నారు. తెలుగు మీడియాలో ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఏబీఎన్, టీవీ–5 దుష్టచతుష్టయమని అన్నారు. ఈ మీడియా వైరస్‌కు ప్రజలు దూరంగా ఉండాలని చెప్పారు.

ప్రజలు చైతన్యం కావాలి : ఆచార్య డీఏఆర్ సుబ్రమణ్యం

నవ్యాంధ్ర ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ ఆచార్య డీఏఆర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ వాస్తవానికి తెలుగు మీడియా, దేశీయ మీడియా ఒకేలా ఉన్నాయని, ఒకరికే కొమ్ముకాస్తున్నాయని అన్నారు. ప్రజల్లోకి ఏం సమాచారం తీసుకెళ్లాలనేది వారే నిర్ణయిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు చైతన్యవంతులై అబద్దాలు, తప్పులు ఎక్కడున్నా పోలీసులకు ఫిర్యాదు చేయాలని, లేకపోతే అసత్య కథనాల ఒరవడి ఆగదని అన్నారు.




వివాహ వేడుకలలో కట్టే చీరలే దివ్యంగా వెలిగిపోతుంటాయి.
ఇక వాటికి అదనంగా మరో స్టయిల్‌ను కూడా జోడిస్తే..
ఆ వెలుగులు రెట్టింపు అవుతాయి.
పట్టు, వెల్వెట్, ఎంబ్రాయిడరీ దుపట్టా చీర మీదకు ధరించినా,
డ్రేపింగ్‌లో జత చేసినా ఆ స్టైల్ హుందాగా కనిపిస్తుంది.
ఈ వింటర్ సీజన్‌కి ప్రత్యేకంగా ఉండటమే కాదు చలి నుంచి రక్షణను కూడా ఇస్తుంది.
ఎవర్‌గ్రీన్‌గా ఉండే శారీ కట్టుకి
మహారాణి కళను తెచ్చే దుపట్టా స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తుంది.

డబుల్ అట్రాక్షన్




కాంట్రాస్ట్
శారీ కలర్, దుపట్టా కలరా పూర్తి కాంట్రాస్ట్ ఉన్నది ఎంచుకోవాలి. దీనివల్ల రెండూ భిన్నంగా, ఆకర్షణీయంగా కనిపిస్తాయి.





రంగు ఒకటే... డిజైన్ వేరు
సేమ్ కలర్ శారీ దుపట్టాను ఎంచుకున్నా ఎంబ్రాయిడరీ డిజైన్‌లో కాంబినేషన్స్ చూసుకోవాలి. చీర డిజైన్ హెవీగా ఉంటే, దుపట్టా డిజైన్ బ్రైట్‌గా ఉండేలా ప్లాన్ చేసుకోవాలి. పట్టు శారీ మీదకు డిజైనర్ దుపట్టాను ఎంచుకునేటప్పుడు ఈ జాగ్రత్తలు తీసుకోవాలి.

శాలువా స్టైల్
చీర మీదకు దుపట్టాను శాలువా మాదిరి కప్పుకున్నా ఈ సీజన్‌కి వెచ్చగా, బ్రైట్‌గా ఉంటుంది. అయితే, దుపట్టా గ్రాండ్‌గా ఉన్నది ఎంచుకోవాలి. ఇందుకు పట్టు, బ్రొకేడ్, ఎంబ్రాయిడరీ దుపట్టాలను చీరలను ఎంపికను బట్టి తీసుకోవాలి.

డ్రేపింగ్ దుపట్టా
చీరకట్టులో భాగంగా దుపట్టాను జత చేర్చి కట్టడం ఒక స్టైల్. ఈ కట్టును నిపుణుల ఆధ్వర్యంలో సెట్ చేయించుకోవాలి. ఈ కట్టుకు కూడా కాంట్రాస్ట్ కలర్స్ ఉండేలా చూసుకోవాలి.

---

* ధైర్యం

వ్యసనాల నుంచి వెలుగులోకి

పట్నాలో బ్యాంకు ఉద్యోగం చేస్తున్న రాఖీ శర్మ ఆ ఉద్యోగాన్ని వదిలేసి భర్త నడుపుతున్న రీహాబిలిటేషన్ సెంటర్‌ను తను స్వయంగా నిర్వహించడం మొదలుపెట్టింది. 5 వేల మంది ఇరవై ఏళ్ల లోపు పిల్లలను డ్రగ్స్ బారి నుంచి విముక్తి పొందేలా చేసింది. ఖైదీలలో మార్పు తీసుకురావడానికి కౌన్సెలింగ్స్ ఇస్తోంది. మహిళలు వ్యసనానికి ఎలా లోనవుతున్నారు, వారు ఆ వ్యసనాల నుంచి బయట పడటం ఎలా అనే అంశంపై పని చేస్తున్నాను' అని వివరిస్తోంది రాఖీ. వ్యసనాలకు గురైన వారు వాటినుంచి బయటపడి తిరిగి సంతోషకరమైన జీవనాన్ని పొందేందుకు ఆమె చేస్తున్న స్ఫూర్తిదాయక జీవన ప్రయాణం కీలక అంశాలు.

''ఒకరోజు అర్ధరాత్రి ఫోన్ కాల్ వచ్చింది. విషయం విని చాలా బాధ అనిపించింది. ఒక మహిళ బ్లేడ్‌తో ఒళ్లంతా కోసుకుంది. డ్రగ్స్ కారణంగా ఆమె వైవాహిక జీవితం దెబ్బతింది. మత్తు పదార్థాల నుంచి ఎలా బయటపడాలో ఆమెకు అర్థం కావడం లేదు. మహిళలు డీ–అడిక్షన్ సెంటర్లకు వెళ్లడం అనేది ఉందా.. అని నన్ను అడిగారు. మద్యపానం, డ్రగ్స్, గంజాయి వంటి వాటికి అలవాటు పడిన వ్యక్తులు తమ అలవాటును వదిలించుకోవడానికి సహాయం చేయడం కూడా ఒక ముఖ్యమైన పని. నా మౌనం–పని ఈ రెండింటితో ఈ సెంటర్‌ను 22 ఏళ్లుగా నడుపుతున్నాను. వేలాదిమంది ని మాదకద్రవ్య వ్యసనం బారి నుంచి బయటికి తీసుకువచ్చాను. ఒకప్పుడు తమ జీవితాలు అంధకారంలో ఉండి, అన్ని వైపులా నిరాశకు గురైన వారు ఇప్పుడు వారి కుటుంబాలతో జీవిస్తున్నందుకు సంతోషపడుతున్నాను.


రాఖీ శర్మ

■ బ్యాంకు ఉద్యోగాన్ని వదిలేసి..

పుట్టి పెరిగింది గురుగ్రామ్. కొన్నాళ్లు ఢిల్లీలోనే ఉన్నాను. జంషెడ్‌పూర్, కోల్‌కతాలలో చదువుకున్నాను. డాక్టర్ కావాలనుకున్నాను కాని బ్యాంక్ ఉద్యోగి అయిన నాన్న కోరిక మేరకు సీఏ చదివాను. పెళ్లయ్యాక పట్నా వచ్చాను. నేనూ బ్యాంకు ఉద్యోగం సంపాదించుకున్నాను. కానీ కుటుంబాన్ని, ఉద్యోగాన్ని ఏకకాలంలో నిర్వహించడం అంత సులభం కాదని కొన్ని రోజుల్లోనే అర్థమయ్యింది. అప్పటికే మా వారు డీ–అడిక్షన్ సెంటర్ నడుపుతున్నారు. కొన్నిరోజులు గమనించిన తర్వాత, బ్యాంకు ఉద్యోగాన్ని వదిలేశాను. నిజానికి డీ–అడిక్షన్ సెంటర్ ఎలా పనిచేస్తుంది, మత్తు పదార్థాల నుంచి వ్యసనపరులను ఎలా బయట పడేయాలో ఏమాత్రం తెలియదు. కానీ క్రమంగా నేర్చుకున్నాను.

■ కాల్చివేస్తానని బెదిరింపులు..

బీహార్‌లో డీ–అడిక్షన్ సెంటర్ నడపడం చాలా కష్టం. మాదకద్రవ్యాల వ్యసనాన్ని వదిలించుకోవడానికి ఎక్కువగా నేర నేపథ్యం ఉన్న వారు వస్తారు. మంచి కుటుంబాలకు చెందిన పిల్లలు డ్రగ్స్‌కు బానిసలైతే పరువు పోతుందనే భయంతో వారిని బీహార్ నుంచి వేరే చోటకు పంపేవారు. ఇక ఓల్డ్‌సిటీలో డీ అడిక్షన్ సెంటర్‌కు వచ్చిన వారిని నిలువరించడం పెద్ద సవాలుగా ఉండేది. అలాంటి వాళ్లు మా కేంద్రానికి వచ్చి కొడతామంటూ ఉద్రేకంతో వస్తుంటారు. ఆ సమయంలో వారిపై వారికి అదుపు ఉండదు. వారి అలవాట్లను అడ్డుకుంటే బెదిరింపులు ఉండేవి. 'బయటకు వెళ్లాక చూడు.. నిన్ను కాల్చేస్తాము'నేవారు. కేంద్రాన్ని మూసివేస్తామని బెదిరింపులు. కానీ నేనేం తప్పు చేయట్లేదు. భయమెందుకు?

■ జైలులో డ్రగ్స్ నుంచి మహిళా ఖైదీల వరకు...

పట్నాలోని బ్యూర్ జైల్లో ఖైదీల కోసం 10 ఏళ్లపాటు డీ–అడిక్షన్ క్యాంప్ నడిపాను. మహిళాఖైదీలతో ఈ క్యాంప్ స్టార్ట్ అయ్యింది. జైలులో ఓ బాలిక తన బట్టలు చింపుకుని బీభత్సం సృష్టించింది. అప్పుడు నన్ను పిలిచారు. ఆమెను చూడగానే ఆ అమ్మాయి డ్రగ్ అడిక్ట్ అని అర్థమైంది. తనకు డ్రగ్స్ అందుబాటులో లేకపోవడంతో ఆమె అలా ప్రవర్తించింది. అప్పుడు ఇక్కడ ఖైదీలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో జైలు ఐజీకి నివేదించాను. ఐజీ అభ్యర్థన మేరకు జైలులో మూడు రోజుల పాటు డీ–అడిక్షన్ క్యాంపు నిర్వహించారు. శిబిరంలో 1000 మందికి పైగా ఖైదీలు పాల్గొన్నారు. వందలాది మంది ఖైదీలు మాదకద్రవ్యాల నుండి విముక్తి పొందారు.

■ నిషేధం తర్వాత..

ఒక డ్రగ్ మానేస్తే మరో మందు వాడటం మొదలు పెడతారు. బీహార్‌లో మద్య నిషేధం తర్వాత ఈ ట్రెండ్ కనిపించింది. ఇప్పుడు ప్రజలు గంజాయి, ఇతర డ్రగ్స్ ఎక్కువగా తీసుకుంటున్నారు. అయితే డ్రగ్స్‌కు బానిసలైన వ్యక్తులు మద్యం కంటే వారి వ్యసనం నుండి బయటపడటం చాలా కష్టం. నిషేధం కారణంగా, ప్రజలు డీ–అడిక్షన్ సెంటర్‌లకు రావడం మానేశారు. ఆ తర్వాత జిల్లా ఆసుపత్రుల్లో డీ–అడిక్షన్ కోసం 15 ప్రత్యేక పడకలను అందించేందుకు కృషి చేశాం. ఆ తర్వాత ఈ విషయంలో వైద్యులకు శిక్షణ కూడా ఇచ్చాం. 5 వేల మంది పిల్లలు మాదకద్రవ్యాల నుండి విముక్తి పొందారు.

■ మహిళల కోసం..

చాలా మంది మహిళలు తమ కుటుంబ సభ్యులకు తెలియకుండానే డ్రగ్స్ అలవాటు నుంచి బయటపడేందుకు వస్తుంటారు. మహిళల కోసం ప్రత్యేక డీ–అడిక్షన్ సెంటర్ కూడా ఉంది. చాలా మంది మహిళలు తమ గుర్తింపును దాచుకుంటారు, కొందరు తమ కుటుంబ సభ్యులకు తెలియకుండా ఇక్కడకు వస్తారు.

ఓ మహిళ భర్త దుబాయ్‌లో ఉన్నాడు. అక్కడి నుంచి ఖరీదైన మద్యం తెచ్చేవాడు. ఆమె తన బిడ్డతో ఇంట్లో ఒంటరిగా ఉంటూ మద్యం సేవించి క్రమంగా దానికి బానిసయ్యింది. పట్టించుకునేవారెవరూ లేకపోవడంతో ఆమె బిడ్డ చదువుకు దూరమయ్యాడు. దాంతో డీ–అడిక్షన్ సెంటర్‌కి వెళ్లి, కొన్ని సెషన్స్ తర్వాత నార్మల్‌గా మారింది.

అదేవిధంగా పట్నాలోని ఓ ఉన్నత కుటుంబానికి చెందిన ఓ మహిళ డ్రగ్స్‌కు బానిసైంది. ఆమె ఎంబీఏ చేసింది. తల్లి చైనాలో, సోదరుడు అమెరికాలో ఉన్నారు. ఆమె వైవాహిక జీవితం బాగోలేదు. విడాకుల తర్వాత ఆమె డిప్రెషన్‌లోకి వెళ్లిపోయింది. డీ–అడిక్షన్ సెంటర్‌కు వచ్చేటప్పటికి ఆమె శరీరంపై చాలా కోతలు ఉన్నాయి. బ్లేడుతో తానే కోసుకుని ఆనందించేది. కొన్నినెలల చికిత్స తర్వాత ఆమె సాధారణ స్థితికి వచ్చింది.

బీహార్‌కు చెందిన ఓ ఐఏఎస్ అధికారి మద్యానికి బానిసయ్యాడు. ఎంత ప్రయత్నించినా ఆ వ్యసనాన్ని వదులుకోలేకపోతున్నాడు. భార్య ప్రోద్బలంతో ఆ ఐఏఎస్ డీ–అడిక్షన్ సెంటర్‌లో చికిత్స తర్వాత తన వ్యసనాన్ని విడిచిపెట్టాడు. చాలా మంది డాక్టర్లు, ఇంజినీర్లు డీఅడిక్షన్ సెంటర్ కు వచ్చి డ్రగ్స్ అలవాటు నుండి విముక్తి పొందారు.'' అంటూ తను చేస్తున్న సేవ గురించి వివరించే రాఖీశర్మ ఎందరికో స్ఫూర్తిదాయకం.

వీధి బాలలు, అనాథలు, వదిలి వేయబడిన పిల్లలు ఎక్కువగా మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారారు. అలాంటి పిల్లల కోసం ప్రత్యేక కేంద్రాన్ని ప్రారంభించాం. వీధి బాలల కార్యక్రమాన్ని కూడా నిర్వహించాం. 30–35 మంది పిల్లలకు భోజనం, పానీయం, విద్య అన్ని ఏర్పాట్లు ఉన్న చోట ఈ కేంద్రానికి వసతి కల్పించే సామర్థ్యం కల్పించాం.



వంటిల్లు

బఠాణితో బ్రేక్‌ఫాస్ట్...
క్యాబేజ్‌కి ఎగ్‌తో దోస్తీ... పప్పులోకి చిక్కుళ్లు.
ఊహకందని అరటికారం...
మన వంటింటి చమత్కారం

కూరలు అవే రుచులే వేరు



అరటి కాయ కారం పొడి

కావలసినవి: **అరటికాయలు** – మూడు; **పసుపు** – 1/2 టీ స్పూను; **ఉప్పు** – రుచికి సరిపడా; **మినప్పప్పు** – రెండు టీ స్పూన్లు; **పచ్చిశనగ పప్పు** – టీస్పూను; **ధనియాలు** – 2 టేబుల్ స్పూన్లు; **ఎండుమిర్చి** – ఐదు; **మిరియాలు** – టీస్పూను; **ఎండు కొబ్బరి తురుము** – నాలుగు టీస్పూన్లు; **కరివేపాకు** – ఐదు రెమ్మలు; **ఇంగువ** – చిటికెడు; **నూనె** – నాలుగు టీస్పూన్లు; **ఆవాలు** – అరటీస్పూను.

తయారీ: స్టవ్ వెలిగించి మీడియం మంట మీద అరటికాయలను కాల్చాలి. ● చక్కగా కాలాక మంట మీద నుంచి తీసి చల్లారాక తొక్కతీసేసి, సన్నగా తురిమి పక్కన పెట్టుకోవాలి. ● ఇప్పుడు స్టవ్ మీద బాణలిపెట్టి టీస్పూను మినప్పప్పు, పచ్చి శనగపప్పు, ధనియాలు, ఎండు మిర్చి, మిరియాలు, ఎండు కొబ్బరి తురుము, మూడు రెమ్మల కరివేపాకు, ఇంగువ వేసి దోరగా వేగాక, చల్లారనిచ్చి పొడిచేసి పెట్టుకోవాలి. ●స్టవ్ మీద బాణలిపెట్టి నూనె వేయాలి. ● వేడెక్కిన తరువాత మిగిలిన మినప్పప్పు, ఆవాలు, కరివేపాకు వేసి వేయించాలి. ● చిటపటలాడాక అరటికాయ తురుము, పసుపు, రుచికి సరిపడా ఉప్పువేసి వేయించాలి. ● తరువాత మసాలా పొడి వేసి కలిపి మూతపెట్టి, సన్న మంట మీద ఐదు నిమిషాలు మగ్గనిస్తే అరటి కాయ పొడి రెడీ.



క్యాబేజ్ ఎగ్ భుర్జి

కావలసినవి: **క్యాబేజీ తురుము** – రెండు కప్పులు; **నూనె** – మూడు టేబుల్ స్పూన్లు; **ఉల్లిపాయ తరుగు** – అరకప్పు; **అల్లం వెల్లుల్లి పేస్టు** – ఒకటిన్నర టీస్పూన్లు; **పచ్చిమిర్చి** – చిన్నవి ఆరు(సన్నగా తరగాలి); **ధనియాల పొడి** – అరటీస్పూను; **పసుపు** – అరటీస్పూను; **కారం** – ముప్పావు టీస్పూను; **గుడ్లు** – నాలుగు; **ఉప్పు** – రుచికి సరిపడా; **కొత్తిమీర తరుగు** – రెండు టేబుల్ స్పూన్లు.

తయారీ: స్టవ్ మీద మందపాటి బాణలి పెట్టి నూనె వేసి వేడెక్కిన తర్వాత ఉల్లిపాయ తరుగు వేసి వేయించాలి. ● ఉల్లిపాయ వేగాక, అల్లం వెల్లుల్లి పేస్టువేసి వేయించాలి. ● అల్లం వెల్లుల్లి పేస్టు పచ్చివాసన పోయిన తరువాత పచ్చిమిర్చి తరుగు వేయాలి. ● మిర్చి వేగిన తరువాత ధనియాలపొడి, కారం, పసుపు, క్యాబేజీ తరుగు, రుచికి సరిపడా ఉప్పు వేసి కలిపి బాణలి మీద మూతపెట్టి సన్న మంట మీద మగ్గనివ్వాలి. ● గుడ్లసొనను ఒక గిన్నెలో వేసి బీటర్ లేదా ఫోర్క్‌తో కలిపి పక్కన పెట్టాలి. ● క్యాబేజీ ఉడికి దగ్గర పడుతున్నప్పుడు గుడ్ల సొనవేసి కలుపుతూ వేయించాలి. ● చక్కగా వేగిన తర్వాత కొత్తిమీర చల్లుకుని దించేయాలి. ● రోస్టెడ్ బ్రెడ్, చపాతీ, రోటీలోకి ఇది మంచి సైడ్ డిష్.



గ్రీన్ పీస్ ఊతప్పం

కావలసినవి: **పచ్చిబఠాణీ** – కప్పు; **సూజీ రవ్వ** – కప్పు; **బియ్యప్పిండి** – మూడు టీస్పూన్లు; **పచ్చిమిర్చి** – మూడు; **అల్లం** – అరంగుళం ముక్క; **కొత్తిమీర తరుగు** – రెండు టీస్పూన్లు; **జీలకర్ర** – టీస్పూను; **పెరుగు** – అరకప్పు; **వంటసోడా**– 1/2 టీ స్పూను; **ఉప్పు** – రుచికి సరిపడా; **నూనె** – ఊతప్పం కాల్చడానికి తగినంత.

తయారీ: మిక్సీజార్‌లో పచ్చిబఠాణీ, పచ్చిమిర్చి, అల్లం, కొత్తిమీర, జీలకర్ర, రుచికి సరిపడా ఉప్పు వేసి తగినంత నీటిని వేస్తూ గ్రైండ్ చేయాలి. ● ఇప్పుడు ఒక పెద్ద గిన్నె తీసుకుని సూజీ రవ్వ, బియ్యప్పిండి, గ్రైండ్ చేసిన బఠాణీ పేస్టు, పెరుగు కలిపి నానబెట్టాలి. ● అరగంట తరువాత రుచికి సరిపడా ఉప్పు, వంటసోడా, కొద్దిగా నీళ్లు పోసుకోని గరిట జారుడుగా కలుపుకోవాలి. ● పెనం వేడెక్కాక కొద్దిగా నూనె వేసి రెండు గరిటలు పిండి వేసి రొట్టెలా వేసుకోవాలి. దాని మీద సన్నగా తరిగిన ఉల్లిపాయ, క్యారట్, క్యాప్సికమ్ ముక్కలు వేసి మూత పెట్టి మంట తగ్గించాలి. ● ఓ నిమిషం తర్వాత మూత తీసి ఊతప్పాన్ని తిరగేసి మరో అర స్పూన్ నూనె వేసి రెండోవైపు కూడా కాల్చుకుంటే గ్రీన్‌పీస్ ఊతప్పం రెడీ. చట్నీ, సాంబార్‌తో చాలా బావుంటుంది.



చిక్కుడు కాయ పప్పు

కావలసినవి: **చిక్కుడు కాయలు** – పావు కేజీ; **పెసరపప్పు** – అరకప్పు; **పసుపు** – పావు టీస్పూను; **పచ్చి కొబ్బరి తురుము** – అరకప్పు; **ఎండుమిర్చి** – నాలుగు; **జీలకర్ర** – టీస్పూను; **కరివేపాకు** – నాలుగు రెమ్మలు; **ఆవాలు** – పావు టీస్పూను; **నూనె** – తగినంత; **మినప్పప్పు** – టీస్పూను; **ఉప్పు** – తగినంత.

తయారీ: పెసరపప్పుని కడిగి కుకర్ గిన్నెలో వేయాలి. ● దీనిలో కప్పునీళ్లు, పసుపు, 1/2 టీస్పూను ఉప్పు వేసి మూతపెట్టి రెండు విజిల్స్ రానివ్వాలి. ● చిక్కుడు కాయలను కడిగి ఈనె తీసి ముక్కలు చేసుకోవాలి. ● తగినన్ని నీళ్లు, చిటికెడు ఉప్పు వేసి రెండు విజిల్స్ వచ్చేవరకు ఉడికించి పక్కన పెట్టుకోవాలి. ● పచ్చికొబ్బరి, జీలకర్ర, కరివేపాకు, ఎండు మిర్చిని మిక్సీ జార్‌లో వేసి కొద్దిగా నీళ్లపోసి పేస్టు చేయాలి. ● ఉడికిన పెసరపప్పులో.. చిక్కుడు ముక్కలు, నూరుకున్న మసాలా పేస్టు, ఉప్పువేసి కలపాలి. ● ఒక పాత్రలో నూనె వేసి వేడెక్కిన తర్వాత ఆవాలు, మినప్పప్పు వేసి చిటపటలాడాక మిగతా కరివేపాకు వేసి వేయించి అందులో పప్పు మిశ్రమాన్ని కలిపితే చిక్కుడుకాయ పప్పు రెడీ. అన్నం, చపాతీ, రోటీల్లోకి చాలా బావుంటుంది.

● టెక్.. టాక్

నూబియా జెడ్ 50 ఎస్ ప్రో



సైజ్: 6.78 అంగుళాలు; రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్
రిజల్యూషన్: 1260×2800 పిక్సెల్స్; బ్యాటరీ: 5100 ఎంఏహెచ్;
బరువు: 228.00 గ్రా. కలర్స్: బ్లాక్ కాఫీ, ఖాకీ అండ్ మిర్రర్ ఆఫ్ లైట్

ఒప్పో ప్యాడ్ ఎయిర్ 2



డిస్‌ప్లే: 11.40 అంగుళాలు; ఫ్రంట్ కెమెరా: 8–మెగా పిక్సెల్స్
ర్యామ్: 6జీబీ; ఓఎస్: ఆండ్రాయిడ్ 13; స్టోరేజ్: 128జీబీ
రిజల్యూషన్: 2408×1720 పిక్సెల్స్; బ్యాటరీ: 8000 ఎంఏహెచ్

'బార్డ్'కు కొత్త ఫీచర్

తమ ఏఐ చాట్‌బాట్ 'బార్డ్' నాణ్యతను మెరుగుపరచడంపై ఎప్పటికప్పుడు దృష్టి పెడుతోంది గూగుల్. వీడియో కంటెంట్‌ను రెగ్యులర్‌గా ఉపయోగించే యూజర్‌లకు ఉపయోగపడే కొత్త ఫీచర్‌ని తీసుకువచ్చింది. దీని ద్వారా నిర్దిష్టమైన యూట్యూబ్ వీడియోలకు సంబంధించిన సమాచారం తెలుసుకోవచ్చు.



ఉదా: 'హౌ టు మేక్ ఆలివ్ ఆయిల్ కేక్' వీడియోను చూస్తున్నప్పుడు 'ఎన్ని గుడ్లు అవసరం అవుతాయి?' లాంటి ప్రశ్నలు ఎన్నో అడగవచ్చు. 'బార్డ్'కు సంబంధించి గూగుల్ ప్రకటించిన కొత్త అప్‌డేట్‌లలో టీనేజర్‌లకు మ్యాథ్స్ ఈక్వేషన్‌కు సంబంధించి సహాయం చేసే ఫీచర్ కూడా ఉంది.

సోనీ ఇన్-కెమెరా అథెంటిసిటీ టెక్నాలజీ

ఏఐ మానిప్యులేటెడ్ ఇమేజ్‌లపై పోరాటంలో భాగంగా సోనీ ఎలక్ట్రానిక్స్ నాన్-ప్రాఫిట్ న్యూస్ ఆర్గనైజేషన్స్ అసోసియేటెడ్ ప్రెస్, కెమెరా బిట్స్‌తో కలిసి 'ఇన్-కెమెరా అథెంటిసిటీ' టెక్నాలజీపై పనిచేస్తోంది. ఈ టెక్నాలజీ త్వరలో సోనీ కెమెరాలలోకి అందుబాటులోకి రానుంది. న్యూ ఇన్-కెమెరా అథెంటిసిటీ టెక్నాలజీని పరీక్షించడంలో రెండో రౌండ్ పూర్తయింది. ఈ టెక్నాలజీ ద్వారా ఫేక్ చిత్రాలు, వీడియోలను కనిపెట్టవచ్చు.



లేబర్ ఆఫ్ లవ్



ప్రతిఫలం, ప్రయోజనం, ధనం ఆశించకుండా ఆత్మసంతృప్తి కోసం చేసే పనులు కొన్ని ఉంటాయి. ఇలాంటి సమయంలో వాడే మాట... లేబర్ ఆఫ్ లవ్.

ఉదా: రవి వుడ్ నెవర్ వేస్ట్ హిజ్ టైమ్ ఆన్ ఏ లేబర్ ఆఫ్ లవ్. హీ ఈజ్ వోల్లీ ఇంట్రెస్టెడ్ ఇన్ మేకింగ్ మనీ.

ఆఫ్ ది కఫ్

ఏమీ ఆలోచించకుండా, ఎలాంటి ప్రిపరేషన్ లేకుండా మాట్లాడే సమయంలో స్పాంటేనియస్‌గా, క్యాజువల్‌గా మాట్లాడిన సందర్భంలో వాడే మాట....ఆఫ్ ది కఫ్.

ఉదా: నీరజ్ ఈజ్ నోన్ ఫర్ హిజ్ ఆఫ్ ది కఫ్ ట్వీట్స్ దట్ అఫెన్ స్పార్క్ వైడ్-స్ప్రెడ్ కంట్రావర్సీ.

● గేమింగ్



జాంబీల జాడ కోసం...

జాంబీలు ప్రపంచాన్ని ఆక్రమించారు. ఎటు చూసినా భయం రాజ్యమేలుతోంది. ఏ క్షణాన ఏం జరుగుతుందో తెలియదు. ఈ కల్లోల పరిస్థితి గురించి తెలుసుకోవాలంటే 'ది డే బిఫోర్'లోకి వెళ్లాల్సిందే. ఎన్నో వాయిదాల తరువాత మల్టీ ప్లేయర్ వోపెన్ వరల్డ్ సర్వైవల్ హారర్ వీడియో గేమ్ 'ది డే బిఫోర్' ఈ నెల 7న విడుదల కానుంది. గతంలో వచ్చిన 'గేమ్‌ప్లే' ట్రైలర్ గేమ్ బేసిక్ మెకానిక్స్ గురించి సూచనప్రాయంగా చెప్పింది. మొదట్లో ఈ గేమ్ గురించి ప్రకటించినప్పుడు స్టీమ్ మోస్ట్ విష్ జాబితాలో కనిపించింది.

ఇంజిన్: అన్‌రియల్ ఇంజిన్5
ప్లాట్‌ఫామ్ విండోస్ మోడ్స్: మల్టీప్లేయర్

● సక్సెస్ స్టోరీ


అనునయ్ సూద్

ప్రయాణ ప్రేమికుడైన అనునయ్ సూద్ 30 దేశాల వరకు వెళ్లివచ్చాడు. చిన్న వయసులోనే ట్రావెలింగ్ అండ్ ఫోటోగ్రఫీ రంగంలో పెద్ద పేరు తెచ్చుకున్నాడు నోయిడాకు చెందిన అనునయ్ సూద్. వ్లోగ్స్, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌తో సోషల్ మీడియాలో పాపులర్ అయిన అనునయ్ సూద్ ట్రావెల్ ఇన్‌ఫ్లూయెన్సర్‌గా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవార్డ్‌లు అందుకున్నాడు. ట్రావెల్ ఇన్‌ఫ్లూయెన్సర్‌గా స్విట్జర్లాండ్ టూరిజం, విజిట్ సౌదీ, న్యూజిలాండ్ టూరిజం... మొదలైన సంస్థలతో కలిసి పనిచేస్తున్నాడు...

ప్రయాణ పాఠాలతో...

'నాకు ట్రావెలింగ్ అంటే ఎందుకు ఇష్టం అంటే ట్రావెల్ చేయకుండా ఉండలేను కాబట్టి' నవ్వుతూ అంటాడు అనునయ్ సూద్. ఇంజినీరింగ్ చేసిన అనునయ్ కొంత కాలం ఉద్యోగం చేశాడు. జీతం రాగానే ఆ బడ్జెట్‌లో ఏదో ఒక ట్రిప్ ప్లాన్ చేసేవాడు. ప్రయాణ మాధుర్యాన్ని మరింతగా ఆస్వాదించడానికి ఉద్యోగానికి రాజీనామా చేసి ఫ్లెక్సిబుల్ ప్రాజెక్ట్స్‌లో పనిచేశాడు. సాహసకృత్యాలను ఇష్టపడే వారి కోసం ట్రెక్ ఆర్గనైజింగ్ కమ్యూనిటీని స్టార్ట్ చేశాడు. ఈ కమ్యూనిటీలో గైడ్, టీమ్ లీడర్‌గా వ్యవహరించాడు.

అనునయ్ ప్రతి ప్రయాణాన్ని కొత్త జీవితంతో పోల్చుతాడు.

ప్రయాణ జ్ఞాపకాలను ఛాయా చిత్రాలలో భద్రపరిచే క్రమంలో ట్రావెల్ ఫొటోగ్రఫీలో కూడా నైపుణ్యం సాధించాడు. ట్రావెలింగ్, ఫొటోగ్రఫీపై ఉన్న ఇష్టాన్ని మిళితం చేసి డిజిటల్ కంటెంట్ క్రియేటర్‌గా విజయం సాధించాడు. ఆ తరువాత 'మెటా-సోషల్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారాడు. 'మెటా-సోషల్' అనేది పెర్‌ఫార్మెన్స్ అండ్ మార్కెటింగ్ సొల్యూషన్ కంపెనీ.

'ట్రావెలింగ్‌పై నాకు ఉన్న ఇష్టాన్ని కమర్షియలైజ్ చేసుకోవాలనుకోలేదు' అంటున్న అనునయ్ 'ప్రాజెక్ట్ ఘర్' పేరుతో హోమ్‌స్టే సర్వీస్ వెంచర్‌ను స్టార్ట్ చేసే ఆలోచనలో ఉన్నాడు.

ఇప్పటి వరకు 30 దేశాల వరకు వెళ్లి వచ్చిన అనునయ్ 'ఫొటోగ్రఫీ విజన్, ట్రావెలింగ్‌పై ప్యాషన్ ఉంటే సాధారణ ప్రదేశాల నుంచి కూడా అసాధారణ అందాలను వీక్షించవచ్చు. ట్రావెల్ ఫొటోగ్రఫీపై మనకు విజన్ ఉంటే ఖరీదైన కెమెరాలతో పనిలేదు' అంటున్నాడు అనునయ్ సూద్.

కొత్తదారులలో...

ప్రయాణ క్రమంలో ప్రకృతి నుంచి, సామాజిక బృందాల నుంచి నేర్చుకున్న పాఠాలు ఎన్నో ఉంటాయి. దృష్టి విశాలం కావడానికి, చురుగ్గా ఉండడానికి, సృజనాత్మకంగా ఆలోచించడానికి ప్రయాణాలు ఉపయోగపడతాయి. కొత్త దారులు కొత్త ఆలోచనలకు దారి తీస్తాయి.
– అనునయ్ సూద్

యువర్స్



అవును... ఇది నిజమే!

* చైనాలోని లెహే లెడు వైల్డ్‌లైఫ్ జూ అనేది రివర్స్ జూ. ఈ జూలో విజిటర్‌లు లాక్ చేయబడిన వాహనంలో తిరుగుతుంటే జంతువులు మాత్రం స్వేచ్ఛగా విహరిస్తుంటాయి
* డ్యూక్ యూనివర్శిటీకి చెందిన న్యూరోసర్జన్లు, న్యూరో సైంటిస్ట్‌లు మెదడు సంకేతాలను పదాలుగా మార్చగలిగే 'స్పీచ్ ప్రోస్థటిక్'ను రూపొందించారు. 256 మైక్రోస్కోపిక్ సెన్సర్‌లతో కూడిన ఈ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ నాడీ సంబంధిత రుగ్మతలతో బాధపడే వారికి కమ్యూనికేషన్ విషయంలో సహాయపడుతుంది.
* జపాన్‌లో 'హొక్కాయిడో' అనే లొకేషన్ ఉంది. ఇక్కడ మంచు, ఇసుక, సముద్రం పక్క పక్కనే కనిపిస్తాయి.

● ఆర్ట్ అండ్ కల్చర్

ఫ్యూచర్ టెన్స్



కాలంతో పాటు సాంకేతికత కూడా మారుతుంది. సాంకేతికతతో పాటు చూసే దృశ్యం కూడా మారుతుందని చెప్పే ఈ కార్టూన్‌ను టర్కీ కార్టూనిస్ట్ హికామీ డెమిర్సీ గీశాడు. అంకారా యూనివర్శిటీ నుంచి సాహిత్యంలో పట్టా పుచ్చుకున్నాడు హికామీ. కార్టూన్, యానిమేషన్‌లలో మంచి పేరు తెచ్చుకున్న హికామీ ఎన్నో యానిమేషన్ ఫిల్మ్‌లకు స్క్రీన్‌రైటర్‌గా పనిచేశాడు. 'ఐలాండ్ ఆఫ్ హరైజన్' అనే యానిమేషన్ ఫిల్మ్‌కు డైరెక్టర్. రెండు కార్టూన్ ఆల్బమ్‌లను తీసుకువచ్చిన హికామీ జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో అవార్డ్‌లు అందుకున్నాడు. సమకాలీన సామాజిక విషయాలు మాత్రమే కాదు భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ఊహాజనిత చిత్రాలు గీయడం అంటే కూడా హికామీకి ఇష్టం. ఇక్కడ కనిపిస్తున్న కార్టూన్ అలాంటిదే.

● మ్యూజిక్ వరల్డ్

స్వీట్ ట్యూన్ ట్విన్ సిస్టర్స్

ట్విన్ సిస్టర్స్ సుకృతి, ప్రకృతి కకర్‌లకు సంగీతం బాల్యం నుంచి సుపరిచితం. తల్లి మ్యూజిక్ టీచర్. అక్క ప్రొఫెషనల్ సింగర్. ఎనిమిది సంవత్సరాల వయసులో సంగీత ప్రపంచంలో తొలి అడుగులు వేశారు. పాపులర్ హిట్స్‌తో సింగర్స్‌గా బాలీవుడ్‌లో మంచి పేరు తెచ్చుకున్నారు.

అక్క ఆకృతి సంగీతంలో తమకు స్ఫూర్తి అని చెబుతారు. అలా అని అక్కను అనుకరించకుండా తమదైన ముద్ర కోసం ప్రయత్నించి విజయం సాధించారు ప్రకృతి.

'మొదట్లో ప్రశంసలను మాత్రమే ఆస్వాదించే వాళ్లం. విమర్శలను దూరంగా పెట్టేవాళ్లం. అయితే సంగీత పరిశ్రమలో ప్రశంసలతో పాటు విమర్శలు కూడా సహజం అనే వాస్తవం తెలుసుకున్నాను. నిర్మాణాత్మక విమర్శలు ముఖ్యం. ద్వేషపూరిత విమర్శలతో ట్రోలింగ్ చేయడం తగదు' అంటుంది ప్రకృతి.

వంద వరకు లైవ్ షోలు చేసిన ఈ సిస్టర్స్ 'ప్రతి షో ఒక పాఠం నేర్పుతుంది' అంటారు.

'ప్రపంచవ్యాప్తంగా మ్యూజిషియన్‌లు లైవ్ షోలకు ప్రాధాన్యత ఇస్తారు. మేము కూడా అంతే. ఆన్‌లైన్‌లో కంటే ప్రేక్షకుల సమక్షంలో వారి ప్రతిస్పందనలు, ప్రశంసలు, చప్పట్లు ఆస్వాదిస్తూ లైవ్ షో చేయడంలో ఎంతో మజా ఉంటుంది. ఇక ఇండిపెండెంట్ మ్యూజిక్ మాలాంటి వారికి ఎంతో ఉపయోగపడుతుంది. యువ సంగీతకారులు తమను నిరూపించుకోవడానికి ఇండిపెండెంట్ మ్యూజిక్ సహాయపడుతుంది' అంటుంది సుకృతి.


సుకృతి, ప్రకృతి

సినిమా


● నాగార్జున


● వెంకటేష్


● విష్ణు విశాల్, రజనీకాంత్


● రవితేజ


● మహేశ్‌బాబు

సంక్రాంతికి సై

సంక్రాంతి పండగ అంటే సినిమాల పండగ కూడా. పండగ వసూళ్లను దండుకోవడానికి సంక్రాంతి మంచి సమయం. అందుకే 'సంక్రాంతికి సై' అంటూ తమ సినిమాలను విడుదల చేస్తుంటారు. 2024 సంక్రాంతి పండగకి మరో నెలకు పైగా సమయం ఉన్నా అప్పుడే ఇండస్ట్రీలో సంక్రాంతి జోష్ కనిపిస్తోంది. ఈసారి పండగకి దాదాపు అరడజను స్ట్రయిట్ తెలుగు, దాదాపు ఐదు డబ్బింగ్ చిత్రాలతో సినిమాల జోరు బాగానే కనిపించనుంది. సినీ లవర్స్‌కి పండగకి దాదాపు పది చిత్రాలు రానున్నాయి. ఆ చిత్రాల గురించి తెలుసుకుందాం.

● 'సోగ్గాడే చిన్నినాయనా' (2016), 'బంగార్రాజు' (2022) వంటి చిత్రాలతో సంక్రాంతి రేసులో నిలిచి, విజయం అందుకున్నారు నాగార్జున. 'నా సామి రంగ' చిత్రంతో ఈసారి మళ్లీ సంక్రాంతి బరిలో నిలుస్తున్నారు. ఈ చిత్రం ద్వారా కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ దర్శకునిగా పరిచయమవుతున్నారు. ఇందులో నాగార్జున ఫుల్ మాస్ లుక్‌లో కనిపిస్తారు. ఆయన మాట తీరు, యాక్షన్ సీక్వెన్సులు అన్నీ కొత్తగా, స్టైలిష్‌గా ఉంటాయి. నాగార్జున పుట్టిన రోజు (ఆగస్టు 29) సందర్భంగా విడుదల చేసిన నాగార్జున లుక్, గ్లింప్స్ ఈ విషయాన్ని స్పష్టం చేశాయి. 'ఈ పండక్కి నా సామి రంగ' అంటూ గ్లింప్స్ చివర్లో నాగార్జున చెప్పిన డైలాగ్ వైరల్ అవుతోంది. ఆయన కెరీర్‌లో 99వ సినిమాగా 'నా సామి రంగ' రూపొందుతోంది. శ్రీనివాసా చిట్టూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అయితే ఈ సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటించలేదు కానీ, సంక్రాంతికి రిలీజ్ పక్కా అని విడుదలైన గ్లింప్స్ స్పష్టం చేస్తోంది.

●●●

● 'సైంధవ్' సినిమాతో వెంకటేశ్ సంక్రాంతి బరిలో దిగుతున్నారు. శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'సైంధవ్'. వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న ఈ సినిమా జనవరి 13న విడుదల కానుంది. వెంకటేశ్ కెరీర్‌లో 'సైంధవ్' 75వ చిత్రం కావడంతో అటు ఇండస్ట్రీ వర్గాల్లో ఇటు ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన ఆసక్తి నెలకొంది. పైగా ఆయన నటిస్తున్న తొలి పాన్ ఇండియన్ సినిమా ఇదే కావడం విశేషం. ఫ్యామిలీ, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందుతోంది. 'సైంధవ్' చిత్రాన్ని ఈ డిసెంబర్ 22న రిలీజ్ చేయనున్నట్లు తొలుత మేకర్స్ ప్రకటించారు. అయితే ప్రభాస్ 'సలార్' చిత్రాన్ని అదే రోజు రిలీజ్ చేయనున్నట్లు ఆ చిత్రబృందం ప్రకటించడంతో సంక్రాంతి బరిలో దిగారు వెంకటేశ్.

●●●

● గ్యాప్ ఇవ్వకుండా వరుస సినిమాలతో దూసుకెళుతున్నారు రవితేజ. ఈ దసరాకి 'టైగర్ నాగేశ్వరరావు'గా వెండితెరపై కనిపించారు. సంక్రాంతికి 'ఈగల్' చిత్రంతో బరిలో దిగడానికి రెడీ అయ్యారు. రవితేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న చిత్రం ఇది. ఇందులో కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా జనవరి 13న విడుదల కానుంది. అయితే ఆ తేదీకి విడుదలవుతుందా? వాయిదా పడుతుందా అనే చర్చ వినిపిస్తోంది. కానీ చెప్పిన తేదీకి పక్కా వస్తామంటూ రిలీజ్ కౌంట్ డౌన్ మొదలు పెట్టారు మేకర్స్. రవితేజ కెరీర్‌లోనే 'ఈగల్' వినూత్నమైన యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతోందని, ఇందులో రవితేజ శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తారని చిత్రయూనిట్ పేర్కొంది.

●●●

● ఈ సంక్రాంతికి ప్రేక్షకులకు గుంటూరు కారం ఘాటు చూపించడానికి 'గుంటూరు కారం'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు హీరో మహేశ్‌బాబు. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. ఇందులో శ్రీలీల, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ సినిమా జనవరి 12న విడుదల కానుంది. ఈ చిత్రంలో మహేశ్‌బాబు పక్కా మాస్ లుక్‌లో కనిపించనున్నారని ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్స్, గ్లింప్స్ చెబుతున్నాయి.


● విజయ్, మృణాల్


● తేజ సజ్జా

● 'ఖుషి' వంటి హిట్ సినిమా తర్వాత విజయ్ దేవరకొండ నటిస్తున్న తాజా చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. ఈ చిత్రానికి పరశురామ్ దర్శకుడు. 'గీత గోవిందం' (2018) వంటి హిట్ మూవీ తర్వాత విజయ్–పరశురామ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఫ్యామిలీ స్టార్'. ఇందులో మృణాల్ ఠాకూర్ హీరోయిన్. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం సంక్రాంతి పోటీలో నిలవనుంది. అయితే ఈ చిత్రం సంక్రాంతికి విడుదల కావడం లేదనే చర్చ తాజాగా ఫిల్మ్‌నగర్ వర్గాల్లో జరుగుతోంది. ఒకవేళ సంక్రాంతికి విడుదల కాకపోతే మార్చిలో రిలీజ్ కానుందనే టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో జరుగుతోంది. అక్కడి షెడ్యూల్ పూర్తయ్యాక తర్వాతి షెడ్యూల్ చిత్రీకరణకు అమెరికాకు బయలుదేరనుంది యూనిట్. దాదాపు నెలరోజులకు పైగా అక్కడి లొకేషన్స్‌లో షూటింగ్ జరపనున్నారట. సంక్రాంతికి ఇంకా నెలన్నరే ఉంది. కానీ 'ఫ్యామిలీ స్టార్' షూటింగ్‌కి దాదాపు అంతే సమయం పడుతుందట. అందుకే ఈ చిత్రం సంక్రాంతి బరిలో నిలుస్తుందా? లేదా అనే చర్చ జరుగుతోంది.


●●●

● ఈ సంక్రాంతి బరిలో స్టార్ హీరోలు దిగుతుంటే నేనూ వస్తున్నానంటున్నాడు యువ హీరో తేజ సజ్జా. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'హను–మాన్'. 'జాంబీ రెడ్డి' వంటి హిట్ మూవీ తర్వాత తేజ సజ్జా, డైరెక్టర్ ప్రశాంత్ వర్మ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం ఇది. అమృతా అయ్యర్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రం వరలక్ష్మీ శరత్ కుమార్ కీలక పాత్ర చేశారు. కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా విడుదల పలుమార్లు వాయిదా పడి, చివరికి సంక్రాంతి సందర్భంగా జనవరి 12న రిలీజ్ కానుంది.

డబ్బింగ్ కూడా..

పండగకి స్ట్రయిట్ చిత్రాలతో పాటు అనువాద చిత్రాలు కూడా వస్తుంటాయి. ఈసారి రజనీకాంత్ సినిమాతో పాటు జోరుగా బరిలో నిలవనున్న అనువాద చిత్రాలేవో తెలుసుకుందాం.

● 'జైలర్' సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకున్న రజనీకాంత్ 'లాల్ సలాం'తో పొంగల్ (సంక్రాంతి) బరిలో దిగుతున్నారు. ఆయన కుమార్తె ఐశ్వర్య దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో విష్ణు విశాల్, విక్రాంత్ సంతోష్ హీరోలుగా నటిస్తున్నారు. ఇందులో స్టార్ క్రికెటర్ కపిల్ దేవ్, జీవితా రాజశేఖర్ కీలక పాత్రల్లో కనిపిస్తారు. సుభాస్కరన్ నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతికి విడుదల కానుంది. ● ధనుష్, ప్రియాంకా అరుళ్ మోహనన్ జంటగా నటిస్తున్న చిత్రం 'కెప్టెన్ మిల్లర్'. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని జి.శరవణన్, సాయి సిద్ధార్థ్ నిర్మిస్తున్నారు. పీరియాడికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న ఈ మూవీ సంక్రాంతి సందర్భంగా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. ● శివ కార్తికేయన్ హీరోగా రకుల్ ప్రీత్‌సింగ్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'అయలాన్'. ఆర్. రవికుమార్ దర్శకత్వంలో ఆర్‌డీ రాజా నిర్మిస్తున్న ఈ సినిమా కూడా సంక్రాంతికి రిలీజవుతోంది. ● తమన్నా, రాశీ ఖన్నా లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'అరణ్మనై 4'. స్వీయ దర్శకత్వంలో 'అరణ్మనై' ఫ్రాంచైజీలో భాగంగా సుందర్ .సి తెరకెక్కిస్తోన్న ఈ చిత్రం పొంగల్‌కి రిలీజ్ కానుంది.


● ధనుష్


● శివ కార్తికేయన్

వచ్చే ఏడాది ది గోట్ లైఫ్


● పృథ్వీరాజ్

పృథ్వీరాజ్ సుకుమారన్ హీరోగా నటించిన చిత్రం 'ది గోట్ లైఫ్' (ఆడు జీవితం). హాలీవుడ్ యాక్టర్ జిమ్మీ జీన్ లూయిస్, అమలాపాల్, కేఆర్ గోకుల్, అరబ్ యాక్టర్స్ తాలిబ్ అల్ బలూషి, రిక్ అబే ఇతర కీలక పాత్రల్లో నటించారు. బెన్యామిన్ రాసిన 'గోట్ డేస్' నవల ఆధారంగా ఆస్కార్ విన్నింగ్ డైరెక్టర్ బ్లెస్సీ తెరకెక్కించారు. విజువల్ రొమాన్స్ నిర్మాణ సంస్థ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది. ''1990వ దశకంలో జీవనోపాధిని వెతుక్కుంటూ కేరళ నుంచి విదేశాలకు వలస వెళ్లిన నజీబ్ అనే యువకుడి జీవిత కథను ఈ చిత్రంలో చూపించబోతున్నాం. పూర్తి స్థాయిలో ఎడారి నేపథ్యంలో వాస్తవ ఘటనల ఆధారంగా రూపుదిద్దుకుంటున్న సినిమా ఇది'' అని యూనిట్ పేర్కొంది.

సక్సెస్‌ను హ్యాండిల్ చేయడం కష్టం


● సుధీర్

''బుల్లితెర షోలకు టీఆర్పీ రేటింగ్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. కానీ సినిమాలకైతే దర్శకుల భవిష్యత్, నిర్మాత డబ్బులు, వినోదాన్ని ఆశించి థియేటర్స్‌కు వచ్చే ప్రేక్షకులు.. ఇలా చాలా విషయాలు ఆలోచించాలి. నా 'గాలోడు' సినిమా అంత పెద్ద సక్సెస్ అవుతుందని ఊహించలేదు. ఫెయిల్యూర్‌ను హ్యాండిల్ చేయడం సులభమే. కానీ సక్సెస్‌ను హ్యాండిల్ చేయడం కష్టం'' అన్నారు 'సుడిగాలి' సుధీర్. అరుణ్ విక్కిరాల దర్శకత్వంలో 'సుడిగాలి' సుధీర్ హీరోగా రూపొందిన చిత్రం 'కాలింగ్ సహస్ర'. విజేష్ తయాల్, చిరంజీవి పమిడి, వెంకటేశ్వర్లు నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా 'సుడిగాలి' సుధీర్ మాట్లాడుతూ– ''కాలింగ్ సహస్ర' కథ చెప్పినప్పుడు ఇందులోని ఓ పాయింట్ కొత్తగా అనిపించింది. నా కెరీర్‌లో ఇది ప్రయోగాత్మక సినిమా'' అని చెప్పుకొచ్చారు.

మెకానిక్ రెడీ


● మణి సాయితేజ, అనిల్

మణి సాయితేజ, రేఖ నిరోషా జంటగా ముని సహేకర దర్శకత్వం వహించిన చిత్రం 'మెకానిక్'. నాగ మునెయ్య (మున్నా) నిర్మించారు. ఈ సినిమాని తెలుగు తమిళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ నెల 15న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. కాగా ఈ మూవీ టీజర్‌కు సంబంధించిన పోస్టర్‌ను డైరెక్టర్ అనిల్ రావిపూడి రిలీజ్ చేసి, సినిమా హిట్టవ్వాలన్నారు.

ఊహించని మలుపులు


● శ్రీ విద్య

పృథ్వీ కృష్ణ, శ్రీ విద్య జంటగా శ్రావణ భాస్కర్ రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం 'ఎయిమ్'. ఎంఎస్‌రావు, సుధాకర్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెలలో రిలీజ్ కానుంది. ''ఈ చిత్ర కథలో పలు మలుపులు ఉన్నాయి. పి. గోపాల్ రెడ్డి స్వరపరచిన ఐదు పాటలు బాగుంటాయి. తల్లిదండ్రులకు.. ముఖ్యంగా యువ తరానికి నచ్చేలా ఈ చిత్రం ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది.

సాక్షి బిజినెస్
శుక్రవారం
1-12-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	87	66,988
నిఫ్టీ ▲	37	20,133

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	14,147	▽ 111
డోజోన్స్	35,658	▲ 228
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,454	▲ 30
డాక్స్	16,194	▲ 49
షాంఘై	3,030	▲ 8
నికాయ్	33,487	▲ 166

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	62,607
బంగారం (22 క్యారట్)	62,357
వెండి (కిలో)	75,934

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.57	84.24
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.25	107.64
€	యూరో	ఎస్‌బీఐ	90.00	93.09
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.85	57.56
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.17	56.53
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	54.31	56.78
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.28	22.91
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.81	23.60
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.56	12.63

దాతృత్వ హీరోల్లో నీలేకని, కామత్..

ఫోర్బ్స్ ఆసియా లిస్టులో చోటు




న్యూఢిల్లీ: ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని, డీఎల్ఎఫ్ గౌరవ చైర్మన్ కేపీ సింగ్, జిరోధా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ వంటి దిగ్గజాలు సంపదను సమాజ శ్రేయస్సు కోసం కూడా గణనీయంగా ఉపయోగిస్తున్నారు. ఫోర్బ్స్ మ్యాగజైన్ విడుదల చేసిన 17వ ఆసియా దాతృత్వ హీరోల జాబితా (15 మంది)లో వారు చోటు దక్కించుకున్నారు. తాను విద్యాభ్యాసం చేసిన ఐఐటీ బాంబేకి 1999 నుంచి ఇప్పటివరకు నీలేకని రూ.400 కోట్లు విరాళంగా ఇచ్చారు. 2020లో డీఎల్ఎఫ్ చైర్మన్ హోదా నుంచి తప్పుకున్న సింగ్ (92 ఏళ్లు).. కంపెనీలో నేరుగా ఉన్న వాటాలను విక్రయించగా వచ్చిన రూ.730 కోట్లను దాతృత్వ కార్యకలాపాలకు కేటాయించారు. జిరోధా కామత్ (37 ఏళ్లు) 'డబ్ల్యూటీఎఫ్ ఈజ్' పేరిట వ్యాపార దిగ్గజాలతో నిర్వహించే యూట్యూబ్ పాడ్‌కాస్ట్ సిరీస్ ద్వారా స్వచ్ఛంద సేవా సంస్థలకు రూ. కోటి వరకు విరాళాలు అందచేస్తున్నారు.

టాటా టెక్ సూపర్ హిట్.. గాంధార్ ఆయిల్ ఘనం

న్యూఢిల్లీ: టాటా టెక్నాలజీ షేరు లిస్టింగ్ రోజే భారీ లాభాలు పంచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర (రూ.500)తో పోలిస్తే 140% ప్రీమియంతో రూ.1,200 వద్ద లిస్టయ్యింది. ఒక దశలో 180% ఎగసి రూ.1,400 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి 163% లాభపడి రూ.1,314 వద్ద స్థిరపడింది. వెరసి ఈ ఏడాది(2023) లిస్టింగ్ రోజు అత్యధిక లాభాలు పంచిన షేరుగా రికార్డు సృష్టించింది. కంపెనీ విలువ రూ.52,940 కోట్లుగా నమోదైంది.

గాంధార్ సెంచరీ...

గాంధార్ ఆయిల్ రిఫైనరీ షేరు ఘనంగా లిస్టయ్యింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర (రూ.169)తో పోలిస్తే 75% ప్రీమియంతో రూ.295 వద్ద




టాటా టెక్ (ఎడమవైపు), గాంధార్ ఆయిల్ లిస్టింగ్‌లో పాల్గొన్న కంపెనీల ప్రతినిధులు

లిస్టయ్యింది. ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపడంతో ట్రేడింగ్‌లో మరింత దూసుకెళ్లింది. ఒక దశలో 104% ర్యాలీ చేసి రూ.345 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. మార్కెట్ ముగింపు సమయంలో అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో లాభాలు కొంతమేర తగ్గాయి. చివరికి 78% లాభంతో రూ.301.50 వద్ద ముగిసింది. బీఎస్‌ఈలో మొత్తం 29.06 లక్షల షేర్లు చేతులు మారాయి. కంపెనీ మార్కెట్ విలువ రూ.2,951 కోట్లుగా నమోదైంది.

ఫెడ్ ఫినా.. ప్చ్!

ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ షేరు లిస్టింగ్‌లో నిరాశపరిచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర (రూ.140)తో పోలిస్తే 1.50% డిస్కౌంట్‌తో రూ.138 వద్ద లిస్టయ్యింది. ప్రారంభంలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో లిస్టింగ్ నష్టాలు భర్తీ చేసుకొంది. ఒక దశలో 6% ర్యాలీ చేసి రూ.148 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. లాభాల స్వీకరణతో చివరికి ఇష్యూ ధర రూ.140 వద్దే ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.5,378 కోట్లుగా నమోదైంది.

మూడోరోజూ మార్కెట్ ముందుకే...

ఒడిదుడుకులున్నా స్వల్ప లాభాలు



ముంబై: స్టాక్ సూచీలు గురువారం స్వల్పంగా లాభపడి మూడోరోజూ ముందడుగేశాయి. అయిదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలకు సంబంధించిన ఎగ్జిట్ పోల్స్, దేశీయ క్యూ2 జీడీపీ వృద్ధి రేటు, అక్టోబర్ ద్రవ్యలోటు డేటా వెల్లడి నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. అమెరికా మార్కెట్లలో నెలకొన్న బలహీన సంకేతాలు సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి. ట్రేడింగ్‌లో 460 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 87 పాయింట్లు పెరిగి 66,988 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 37 పాయింట్లు బలపడి 20,133 వద్ద నిలిచింది. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు నవంబర్ నెలవారీ డెరివేటివ్‌ల గడువు ముగింపు కావడంతో ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఫార్మా, కన్జూమర్, రియల్టీ, పారిశ్రామిక, క్యాపిటల్ గూడ్స్, కన్జూమర్ షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు ఒకశాతం మేర లాభపడ్డాయి. బ్యాంకులు, యుటిలిటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఆసియాలో చైనా, హాంగ్‌కాంగ్ స్టాక్ సూచీలు లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు సానుకూలంగా ట్రేడయ్యాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 5 పైసలు బలహీనపడి 83.37 వద్ద స్థిరపడింది.

జీడీపీ.. టాప్‌గేర్!

- క్యూ2లో భారత్ వృద్ధి 7.6 శాతం
- అంచనాలను మించి పరుగు
- ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న దేశంగా హోదా
- తయారీ రంగం దూకుడు
- వ్యవసాయం.. 'బలహీనం'

న్యూఢిల్లీ: భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు 2023–24 ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన రెండవ త్రైమాసికంలో (జూలై–సెప్టెంబర్) అంచనాలను మించి 7.6 శాతంగా నమోదయ్యింది. చైనా వృద్ధి రేటు ఇదే కాలంలో 4.9 శాతంగా నమోదుకావడంతో ప్రపంచంలో తన వేగవంతమైన ఎకానమీ హోదాను సైతం భారత్ మరోసారి ఉద్ఘాటించింది. సమీక్షా త్రైమాసికంలో తయారీ, మైనింగ్, సేవలు చక్కటి పనితీరును ప్రదర్శించాయి. వ్యవసాయ రంగం మాత్రం బలహీన ఫలితాన్ని నమోదుచేసుకుంది. మొదటి త్రైమాసికంలో భారత్ ఎకానమీ వృద్ధి రేటు 7.8 శాతంగా నమోదయ్యింది. రెండవ త్రైమాసికంలో ఈ రేటు 6.5 శాతానికి పరిమితం అవుతుందన్న అంచనాలను మించి పటిష్ఠ ఫలితం నమోదుకావడం పట్ల ఆర్థికవేత్తలు, విశ్లేషకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, గత ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో వృద్ధి 6.2 శాతం కావడం గమనార్హం. 2022–23లో భారత్ జీడీపీ వృద్ధి రేటు 7.2 శాతం. 2023–24లో ఈ రేటు 6.5 శాతంగా ఉంటుందని ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) అంచనావేస్తోంది.

7.6 శాతం వృద్ధి అంటే..

2011–12 ధరల ప్రకారం (ఈ సంవత్సరం బేస్‌గా ద్రవ్యోల్బణం సర్దుబాటు చేసిన రియల్ ఎకానమీ వృద్ధి) 2022–23 ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో భారత్ ఎకానమీ విలువ రూ.38.78 లక్షల కోట్లు. 2023–24 ఇదే కాలంలో (సమీక్షా కాలంలో) ఈ విలువ రూ.41.74 లక్షల కోట్లుగా నమోదయ్యింది. అంటే వృద్ధి రేటు 7.6 శాతమన్నమాట. ఇక ద్రవ్యోల్బణం సర్దుబాటు చేయకుండా కరెంట్ ప్రైస్ ప్రాతిపదిక చూస్తే, ఇదే కాలంలో జీడీపీ వృద్ధి రేటు (నామినల్) రూ.65.67 లక్షల కోట్ల నుంచి రూ. 71.66 లక్షల కోట్లకు ఎగసింది. అంటే నామినల్ వృద్ధి రేటు 9.1 శాతంగా ఉంది. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకూ చూస్తే... రియల్ జీడీపీ విలువ రూ.76.22 లక్షల కోట్ల నుంచి రూ. 82.11 లక్షల కోట్లకు ఎగసింది. అంటే ఆరు నెలల్లో వృద్ధి రేటు 7.7 శాతంగా నమోదయ్యింది. ఇక ఇదే సమయంలో నామినల్ రేటు 8.6 శాతంగా ఉంది.



ఎకానమీ పటిష్టతకు ప్రతిబింబం



ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న పరీక్షా కాలంలో ఎదురవుతున్న సవాళ్లను భారత్ ఆర్థిక వ్యవస్థ పటిష్ట స్థాయిలో తట్టుకుని నిలబడుతోందని తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మరిన్ని అవకాశాలను సృష్టించేందుకు, పేదరికాన్ని త్వరితగతిన నిర్మూలించడానికి, మన ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి, వేగవంతమైన వృద్ధిని కొనసాగించడానికి కట్టుబడి ఉన్నాము.

– ప్రధాని నరేంద్ర మోదీ

రంగాల వారీగా వృద్ధి తీరు ఇలా...

వస్తువులు, సేవల ఉత్పత్తికి సంబంధించి గ్రాస్ వ్యాల్యూ యాడెడ్ (జీవీఏ)విలువల ప్రకారం... జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) రంగాల వారీగా విడుదల చేసిన ఫలితాలు పరిశీలిస్తే...

తయారీ: మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిలో దాదాపు 78 శాతం వాటా కలిగిన ఈ రంగంలో వృద్ధి భారీగా 13.9 శాతంగా నమోదయ్యింది. 2022 ఇదే కాలంలో అసలు వృద్ధిలేకపోగా 3.8 శాతం క్షీణత నమోదయ్యింది.

గనులు, తవ్వకాలు: ఈ రంగంలో 0.1 శాతం క్షీణత సమీక్ష కాలంలో 10 శాతం వృద్ధిలోకి మారింది.

విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా, ఇతర యుటిలిటీ సేవలు: వృద్ధి రేటు 6.1 శాతం నుంచి 10.1 శాతానికి ఎగసింది.

నిర్మాణం: వృద్ధి రేటు 5.7 శాతం నుంచి 13.3 శాతానికి ఎగసింది.

వ్యవసాయం: ఎకానమీలో దాదాపు 15 శాతం వాటా ఉన్న ఈ కీలక రంగంలో వృద్ధి రేటు (2022 ఇదే కాలంతో పోల్చిచూస్తే) 2.5 శాతం నుంచి 1.2 శాతానికి తగ్గింది.

ఫైనాన్షియల్, రియల్టీ, ప్రొఫెషనల్ సేవలు: 7.1% నుంచి వృద్ధి 6 శాతానికి పడిపోయింది.

అల్ట్రాటెక్ చేతికి కేశోరామ్ సిమెంట్

- షేర్ల మార్పిడి ద్వారా ఒప్పందం
- కేశోరామ్ వాటాదారులకు షేర్లు
- ప్రతీ 52 షేర్లకు 1 అల్ట్రాటెక్ షేరు



కోల్‌కతా: సిమెంట్ రంగ దిగ్గజం అల్ట్రాటెక్.. కేశోరామ్ ఇండస్ట్రీస్‌కు చెందిన సిమెంట్ బిజినెస్‌ను కొనుగోలు చేయనుంది. ఇందుకు ఏవీ బిర్లా గ్రూప్ దిగ్గజం షేర్ల మార్పిడి ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దీంతో బీకే బిర్లా గ్రూప్ కంపెనీ కేశోరామ్ ఇండస్ట్రీస్ వాటాదారులకు అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లను జారీ కానున్నాయి. రుణాలుసహా సుమారు రూ. 7,600 కోట్ల విలువలో కేశోరామ్ సిమెంట్ కొనుగోలుకి అల్ట్రాటెక్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. కాగా.. షేర్ల మార్పిడి డీల్ ప్రకారం సిమెంట్ బిజినెస్‌ను విడదీసేందుకు బోర్డు అనుమతించినట్లు కేశోరామ్ ఇండస్ట్రీస్ పేర్కొంది. ఒప్పందంలో భాగంగా కేశోరామ్ వాటాదారులకు తమ వద్దగల ప్రతీ 52 షేర్లకుగాను 1 అల్ట్రాటెక్ సిమెంట్ షేరు లభిస్తుంది.

కేశోరామ్ సామర్థ్యం..

ప్రస్తుతం కేశోరామ్ సిమెంట్ కర్ణాటక(సేడమ్), తెలంగాణ(బసంత్‌నగర్)లలో రెండు సమీకృత ప్లాంట్లను కలిగి ఉంది. వీటి సామర్థ్యం వార్షికంగా 10.75 మిలియన్ టన్నులు(ఎంటీపీఏ). మహారాష్ట్ర(సోలాపూర్)లో 0.66 ఎంటీపీఏ ప్యాకింగ్ యూనిట్‌ను సైతం నిర్వహిస్తోంది. గతేడాది(2022–23) సిమెంట్ బిజినెస్ టర్నోవర్ రూ. 3,534 కోట్లుగా నమోదైంది. ఇక అల్ట్రాటెక్ ప్రపంచంలోనే సిమెంట్ తయారీకి మూడో భారీ కంపెనీగా నిలుస్తోంది. ప్రస్తుత సామర్థ్యం 137.85 ఎంటీపీఏకాగా.. కొనసాగుతున్న విస్తరణ పూర్తయితే 160 ఎంటీపీఏకు చేరుతుంది.

ఈ వార్తలతో అల్ట్రాటెక్ షేరు 3.2% ఎగసి రూ. 9,004 వద్ద ముగిసింది. కేశోరామ్ ఇండస్ట్రీస్ షేరు 5% జంప్‌చేసి రూ. 139 వద్ద స్థిరపడింది.

అక్టోబర్‌లో 'మౌలికం' అదుర్స్

వృద్ధి రేటు 12.1 శాతం



న్యూఢిల్లీ: ఎనిమిది రంగాల గ్రూప్‌నకు సంబంధించిన మౌలిక పరిశ్రమ వృద్ధి రేటు అక్టోబర్‌లో భారీగా 12.1%గా (2022 ఇదే నెలతో పోల్చితే) నమోదైంది. బేస్ ఎఫెక్ట్, కొన్ని రంగాలు రెండంకెల్లో భారీ వృద్ధిని నమోదుచేసుకోవడం దీనికి కారణం. బొగ్గు (18.4%), స్టీల్ (11%), సిమెంట్ (17.1%), విద్యుత్ (20.3%) రంగాల ఉత్పత్తి వృద్ధి రెండంకెల్లో నమోదైంది. ఎరువుల రంగం వృద్ధి రేటు 5.3%. క్రూడ్ (1.3%), సహజ వాయువు (9.9%), రిఫైనరీ ప్రొడక్టు రంగాలు (4.2%) కూడా ఉన్న ఈ గ్రూప్ వెయిటేజ్ మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ)లో దాదాపు 40%.

సాక్షి స్పోర్ట్స్



భారత్ 12 - కెనడా 0

మహిళల జూనియర్ హాకీ వరల్డ్ కప్‌ను భారత జట్టు భారీ విజయంతో మొదలు పెట్టింది. ఏకపక్షంగా సాగిన తొలి మ్యాచ్‌లో భారత్ 12–0 గోల్స్ తేడాతో కెనడాను చిత్తుగా ఓడించింది. చిలీలోని శాంటియాగోలో జరుగుతున్న ఈ టోర్నీలో మ్యాచ్ అర్ధ భాగం ముగిసే సరికి 4–0తో ముందంజలో నిలిచిన భారత్ తర్వాతి అర్ధ భాగంలో మరో 8 గోల్స్ కొట్టడం విశేషం. భారత్ తరఫున ముంతాజ్ ఖాన్ ఏకంగా నాలుగు గోల్స్‌తో (26వ నిమిషం, 41వ ని., 54వ ని., 60వ ని.) చెలరేగగా...దీపిక సోరెంగ్ (34వ నిమిషం, 50వ ని., 54వ ని.), అన్ను (4వ నిమిషం, 6వ ని., 39వ ని.) చెరో మూడు గోల్స్ సాధించారు. దీపిమోనికా టోపో (21వ ని.), నీలమ్ (45వ ని.) ఒక్కో గోల్ కొట్టారు. తమ తర్వాతి మ్యాచ్‌లో శుక్రవారం జర్మనీతో భారత్ తలపడుతుంది.

నజ్ముల్ హుస్సేన్ శతకం

- రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లా 212/3
- కివీస్‌తో తొలిటెస్టు



సిల్హెట్: న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ నిలకడ ప్రదర్శించింది. మ్యాచ్ మూడో రోజు గురువారం ఆట ముగిసే సమయానికి బంగ్లా 3 వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ శంతో (193 బంతుల్లో 104 నాటౌట్; 10 ఫోర్లు) అజేయ సెంచరీతో జట్టును నడిపించగా, ముష్ఫికర్ రహీమ్ (43 నాటౌట్), మోమినుల్ హక్ (40) రాణించారు. ప్రస్తుతం బంగ్లా 205 పరుగుల ఆధిక్యంలో ఉంది. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 266/8తో ఆట కొనసాగించిన న్యూజిలాండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 317 పరుగులకు ఆలౌటైంది. దీంతో కివీస్‌కు 7 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. కెప్టెన్ టిమ్ సౌతీ (35) చివర్లో కీలక పరుగులు సాధించాడు. బంగ్లాదేశ్ బౌలర్లలో తైజుల్ ఇస్లామ్ నాలుగు, మోమినుల్ హక్ మూడు వికెట్లు పడగొట్టారు.

హర్మన్‌ప్రీత్ నాయకత్వంలో...

5 దేశాల టోర్నీకి భారత హాకీ జట్టు



న్యూఢిల్లీ: యూరోప్‌లో పటిష్టమైన నాలుగు అగ్ర శ్రేణి జట్లతో తలపడేందుకు ఐదు దేశాల టోర్నీలో భారత్ బరిలోకి దిగనుంది. ఇందులో పాల్గొనే 24 మంది సభ్యుల భారత జట్టును గురువారం హాకీ ఇండియా (హెచ్ఐ) ప్రకటించింది. హర్మన్‌ప్రీత్ సింగ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. స్పెయిన్‌లో వలెన్సియాలో డిసెంబర్ 15నుంచి 22 వరకు ఈ టోర్నీ జరుగుతుంది. భారత్‌తో పాటు స్పెయిన్, జర్మనీ, ఫ్రాన్స్, బెల్జియం ఇందులో పోటీ పడుతున్నాయి.

జట్టు వివరాలు: హర్మన్‌ప్రీత్ సింగ్ (కెప్టెన్), పీఆర్ శ్రీజేశ్, కృషన్ బహదూర్ పాఠక్, సూరజ్ కర్కేరా, జర్మన్‌ప్రీత్, జుగ్‌రాజ్, అమిత్ రోహిదాస్, వరుణ్ కుమార్, సుమీత్, సంజయ్, నీలమ్ సంజీప్, యశ్‌దీప్, వివేక్ సాగర్, నీలకంఠ శర్మ, రాజ్‌కుమార్, షంషేర్, రవిచంద్ర సింగ్, మన్‌దీప్ సింగ్, అభిషేక్, సుఖ్‌జీత్, లలిత్ ఉపాధ్యాయ్, కార్తి సెల్వమ్, దిల్‌ప్రీత్, ఆకాశ్‌దీప్.



మూడు ఫార్మాట్లకు రుతురాజ్

రాహుల్‌కు వన్డే పగ్గాలు

- టి20లకు సూర్య కొనసాగింపు
- రోహిత్, కోహ్లిలకు విశ్రాంతి
- సాయి సుదర్శన్, రింకూలకు ఛాన్స్

న్యూఢిల్లీ: వచ్చే నెల దక్షిణాఫ్రికా పర్యటనలో ఆడే మూడు ఫార్మాట్లకు భారత జట్లను ఎంపిక చేశారు. సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో జరుగుతున్న టి20 సిరీస్‌లో జట్టును నడిపిస్తున్న సూర్యకుమార్ యాదవ్‌ను సఫారీలోనూ కెప్టెన్‌గా కొనసాగిస్తున్నారు. ఈ పొట్టి ఫార్మాట్‌లో జడేజాకు వైస్ కెప్టెన్సీ అప్పజెప్పారు. వన్డే జట్టుకు కేఎల్ రాహుల్‌ను కెప్టెన్‌గా నియమించారు. ఈ రెండు జట్లకూ భారత టాప్‌స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, కోహ్లిలు విశ్రాంతి తీసుకున్నారు. దీంతో వన్డేల్లో ఇద్దరు కొత్త ముఖాలు బి. సాయి సుదర్శన్, రింకూ సింగ్‌లకు టీమిండియాకు ఆడే అవకాశమిచ్చారు. మిడిలార్డర్‌లో డాషింగ్ బ్యాటర్ సంజూ సామ్సన్, స్పిన్నర్ చహల్‌లకు వన్డే జట్టులో తిరిగి చోటు లభించగా, రుతురాజ్ గైక్వాడ్ లక్కీఛాన్స్ కొట్టేశాడు. పూర్తిస్థాయిలో మూడు ఫార్మాట్లకూ ఎంపికయ్యాడు. సీమర్ ముకేశ్‌కూ ఇలాంటి అవకాశమే లభించింది. హైదరాబాద్ స్పీడ్‌స్టర్ సిరాజ్‌ను టి20, టెస్టులకు ఎంపిక చేసినప్పటికీ వన్డేల నుంచి తప్పించారు. సఫారీలో ముందుగా భారత్ డిసెంబర్ 10, 12, 14తేదీల్లో మూడు టి20లు... 17, 19, 21 తేదీల్లో మూడు వన్డేల సిరీస్‌లో పాల్గొంటుంది. చివరగా 26 నుంచి 30 వరకు తొలిటెస్టు, జనవరి 3 నుంచి 7వరకు జరిగే రెండో టెస్టుతో పర్యటన ముగుస్తుంది.



రాహుల్

సిరీస్ వేటలో బౌలర్లపై భారం!

- నేడు భారత్, ఆస్ట్రేలియా నాలుగో టి20
- మరో విజయంపై టీమిండియా దృష్టి
- ఆత్మవిశ్వాసంతో ఆసీస్
- రా.గం.7 నుంచి స్పోర్ట్స్18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

రాయ్‌పూర్: పరుగుల వరద పారిన భారత్, ఆస్ట్రేలియా సిరీస్‌లో మరో సమరానికి రంగం సిద్ధమైంది. ఇరు జట్లు నేడు జరిగే నాలుగో టి20లో తలపడనున్నాయి. భారత్ ఇప్పటికే 2–1తో ఆధిక్యంలో ఉండగా, ఈ మ్యాచ్‌లో గెలిస్తే సిరీస్ సొంతమవుతుంది. అయితే గత పోరులో ఆసీస్‌నుంచి ఎదురైన ప్రతిఘటనను చూస్తే ఇది అంత సులువు కాదు. మ్యాక్స్‌వెల్ సహా పలువురు ఆసీస్ కీలక ఆటగాళ్లు స్వదేశానికి వెళ్లిపోవడంతో జట్టు కాస్త బలహీనపడగా...దీనిని భారత్ సానుకూలంగా మార్చుకుంటే సిరీస్ గెలవచ్చు.

ముకేశ్ పునరాగమనం...

గత మ్యాచ్‌లో ఆడిన జట్టునుంచి పలు మార్పులతో భారత్ బరిలోకి దిగే అవకాశం ఉంది. తన పెళ్లి కోసం మూడో మ్యాచ్‌కు దూరమైన పేసర్ ముకేశ్ కుమార్ తిరిగొచ్చాడు. దీంతో గత మ్యాచ్‌లో చెత్తబౌలింగ్ వేసిన ప్రసిధ్ కృష్ణను పక్కనబెట్టొచ్చు. అలాగే శ్రేయస్ అయ్యర్ నాలుగు, ఐదో టి20ల కోసం జట్టులోకి రావడంతో తిలక్‌వర్మ బెంచ్‌కే పరిమితం కానున్నాడు. దీంతో పాటు అదనంగా జట్టులో చేరిన దీపక్ చహర్‌ను కూడా ఆడించే అవకాశం ఉంది. చహర్‌ను ఎంచుకుంటే అర్ష్‌దీప్‌ను పక్కన పెడతారు. స్పిన్నర్ బిష్ణోయ్ మాత్రం మెరుగ్గా ఆడుతుండటంతో అతని స్థానానికి ఢోకా లేదు. అయితే బ్యాటింగ్ విషయంలో ఎలాంటి సందేహం లేదు కాబట్టి ఈ సారైనా గెలిపించాల్సిన భారం బౌలర్లదే. భారీ స్కోర్లు నమోదవుతున్న మ్యాచ్‌లలో మెరుగైన బౌలింగ్‌తోనే మ్యాచ్‌ను కాపాడుకోవచ్చు. బ్యాటింగ్‌లో రుతురాజ్ అద్భుత ఫామ్‌తో తానేంటో చూపించగా, సూర్యకుమార్ తన స్థాయిని ప్రదర్శిస్తున్నాడు. ఇషాన్ కిషన్ ఫర్వాలేదనిపించగా...యశస్వి కూడా మరో మ్యాచ్‌లో జోరు చూపించాల్సి ఉంది. అన్నింటికి మించి హైదరాబాదీ తిలక్ వర్మ చెలరేగడం కీలకం. ఈ సిరీస్‌లో ఇంకా అతని ముద్ర కనిపించలేదు.

హెడ్ మినహా...

ఆరుగురు ఆటగాళ్లు ఇప్పటికే ఆసీస్‌కు వెళ్లిపోవడంతో ఆసీస్ జట్టు మొత్తం కొత్తకొత్తగా కనిపిస్తోంది. వరల్డ్ కప్‌లో ఆడిన ట్రవిస్ హెడ్ ఒక్కడే సిరీస్‌లో కొనసాగేందుకు నిర్ణయించుకున్నాడు. వేడ్ బ్యాటింగ్ పదును గత మ్యాచ్‌లో కనిపించగా, టిమ్ డేవిడ్ అంచనాలను అందుకోలేకపోతున్నాడు. షార్ట్, హార్డీ, మెక్‌డెర్మట్‌లాంటి బ్యాటర్లు ఏమాత్రం ప్రభావం చూపిస్తారనేది సందేహమే. బౌలింగ్‌లో కూడా బెహ్రన్‌డార్ఫ్ ఒక్కడే ఆకట్టుకున్నాడు. ఎలిస్, సంఘా విఫలం కాగా, కొత్త ఆటగాడు క్రిస్ గ్రీన్ ఎలా ఆడతాడనేది ఆసక్తికరం. ఓవరాల్‌గా ఆసీస్ మరీ పటిష్టంగా కనిపించకపోయినా... పోరాడే తత్వం ఉన్న జట్టు సభ్యులంతా ఎలాంటి సమయంలోనైనా టీమిండియాను ఇబ్బంది పెట్టగలరు.



తుది జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), యశస్వి, రుతురాజ్, ఇషాన్ కిషన్, అయ్యర్, రింకూ సింగ్, అక్షర్, బిష్ణోయ్, చహర్, అవేశ్, ముకేశ్.

ఆస్ట్రేలియా: వేడ్ (కెప్టెన్), హార్డీ, హెడ్, షార్ట్, మెక్‌డెర్మట్, డేవిడ్, క్రిస్ గ్రీన్, డ్వార్‌షుయిస్, ఎలిస్, బెహ్రన్‌డార్ఫ్, సంఘా.

పిచ్, వాతావరణం

సాధారణ బ్యాటింగ్ వికెట్ కాబట్టి మరోసారి భారీ స్కోర్లు ఖాయం. టాస్ గెలిస్తే ఛేజింగ్‌కు మొగ్గుచూపొచ్చు. ఈ గ్రౌండ్‌లో గతంలో ఒకే ఒక అంతర్జాతీయ మ్యాచ్, అదీ వన్డే జరిగింది. ఇది తొలి టి20 కానుంది. మ్యాచ్ రోజు వర్షసూచన లేదు.

సెమీస్‌లో శివ, పంఘాల్

షిల్లాంగ్: భారత స్టార్ బాక్సర్లు శివథాపా, అమిత్ పంఘాల్ జాతీయ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. ఆరుసార్లు ఆసియా చాంపియన్‌షిప్ మెడలిస్ట్ శివథాపా 63.5 కేజీల విభాగం క్వార్టర్ ఫైనల్లో 5–0తో శశాంక్ ప్రధాన్ (ఢిల్లీ)పై అలవోక విజయం సాధించాడు. అమిత్ పంఘాల్ 51 కేజీల కేటగిరీలో 5–0తో మొహమ్మద్ ఆరిఫ్ (జమ్మూకశ్మీర్)పై ఎదురులేని పంచ్‌లతో గెలుపొందాడు. సంజీత్ (92 కేజీలు) కూడా 5–0తో 2018 కామన్వెల్త్‌గేమ్స్ కాంస్య పతక విజేత నమన్ తన్వర్ (రైల్వేస్)పై ఏకపక్ష విజయం సాధించాడు. శుక్రవారం జరిగే సెమీఫైనల్లో సంజీత్... విక్కీ (ఆలిండియా పోలీస్)తో, శివథాపా... వంశాజ్‌తో, పంఘాల్... అంకిత్ (రైల్వేస్)తో తలపడతారు.

క్వార్టర్స్‌లో గాయత్రి జోడీ

లక్నో: హైదరాబాద్ మేటి షట్లర్లు గాయత్రి గోపీచంద్–ట్రెసా జాలీ సయ్యద్ మోడి బ్యాడ్మింటన్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. గురువారం జరిగిన మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో నాలుగో సీడ్ గాయత్రి–ట్రెసా జాలీ జోడీ 21–9, 21–5 భారత్‌కే చెందిన ధన్య–రిధి కౌర్ జంటపై నెగ్గింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కిరెడ్డి–సుమీత్ రెడ్డి ద్వయం 9–21, 17–21తో మూడో సీడ్ నరు షినొయా–క్యోహె యమాషిటా (జపాన్) జోడీ చేతిలో ఓడింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో ప్రియాన్షు రజావత్ 21–18, 11–6తో భారత్‌కే చెందిన సతీశ్ కుమార్‌పై ఆధిక్యంలో ఉండగా... ప్రత్యర్థి రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరిగాడు. దీంతో ప్రియాన్షు క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు.

టి20 ప్రపంచకప్‌కు ఉగాండా క్వాలిఫై

జింబాబ్వే చేజారిన అవకాశం

విండోక్ (నమీబియా): వచ్చే ఏడాది జరిగే టి20 ప్రపంచకప్‌కు ఆఫ్రికా దేశం ఉగాండా అర్హత సాధించింది. ఏ ఫార్మాట్‌లోనైనా సీనియర్ వరల్డ్ కప్‌కు ఉగాండా క్వాలిఫై కావడం ఇదే తొలిసారి. ఆఫ్రికా రీజియన్ క్వాలిఫయర్ టోర్నీలో భాగంగా గురువారం జరిగిన తమ ఆఖరి మ్యాచ్‌లో ఉగాండా 9 వికెట్ల తేడాతో రువాండాను చిత్తు చేసింది. రువాండా 18.5 ఓవర్లలో 65 పరుగులకే కుప్పకూలగా...ఉగాండా 8.1 ఓవర్లలో వికెట్ నష్టానికి 66 పరుగులు సాధించింది.

ఆఫ్రికా రీజియన్ నుంచి మొత్తం 7 జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన టీమ్‌లకు వరల్డ్ కప్ ఆడే అవకాశం లభిస్తుంది. ఈ మొత్తం జట్లలో అన్నింటికంటే ఎక్కువ అనుభవం ఉన్న, ఫేవరెట్‌గా బరిలోకి దిగిన జింబాబ్వే మాత్రం ముందంజ వేయలేకపోవడం విశేషం. 5 విజయాలతో నమీబియా ఇప్పటికే అర్హత సాధించగా రెండో స్థానం కోసం ఉగాండా, జింబాబ్వే మధ్య పోటీ నడిచింది. ఉగాండా ఓడితే జింబాబ్వేకు అవకాశం దక్కేది. అయితే ఉగాండా టోర్నీలో ఐదో విజయం (మొత్తం 10 పాయింట్లు) సాధించగానే జింబాబ్వేకు దారులు మూసుకుపోయాయి. తర్వాత జరిగిన తమ చివరి మ్యాచ్‌లో 110 పరుగుల తేడాతో కెన్యాను ఓడించినా లాభం లేకపోయింది. లీగ్ దశలో జింబాబ్వే నాలుగు మ్యాచ్‌లు గెలవగలిగినా...నమీబియాతో పాటు అనూహ్యంగా ఉగాండా చేతిలోనే ఓడటంతో ఆ జట్టు లెక్క మారిపోయింది. క్వాలిఫయింగ్ టోర్నీలో విఫలం కావడంతో 2023 వన్డే వరల్డ్ కప్‌కు దూరమైన జింబాబ్వే ఇప్పుడు 2024 టి20 ప్రపంచకప్‌లో పాల్గొనలేకపోతోంది.



క్లుప్తంగా...

నూజివీడు ఎంఐజీ టౌన్‌షిప్‌లో ప్లాట్లు

- ఈనెల 31 వరకు బుక్ చేసుకునే అవకాశం

సాక్షి, అమరావతి: మధ్య ఆదాయ వర్గాల వారికి అనువుగా నూజివీడులో ఎంఐజీ జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లో అభివృద్ధి చేసిన ప్లాట్లకు దరఖాస్తు గడువును పొడిగించినట్టు సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడు పట్టణంలోని ఎంఆర్ అప్పారావు కాలనీ మ్యాంగో గార్డెన్ రీసెర్చ్ సెంటర్‌ను ఆనుకుని 40.78 ఎకరాల విస్తీర్ణంలో 150, 200, 250 చదరపు గజాల వైశాల్యంలో 393 ప్లాట్లను ప్రభుత్వ అనుమతులు, మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేశామన్నారు. ప్లాట్లకు అధిక డిమాండ్, ప్రజల అభ్యర్థన మేరకు దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెలాఖరు వరకు పొడిగించినట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 10 శాతం ప్లాట్లు రిజర్వు చేశామని కమిషనర్ తెలిపారు. వీరికి ధరలో 20 శాతం రాయితీ కూడా కల్పించామన్నారు. నూజివీడు నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల కోసం ఐదు శాతం ప్లాట్లు కేటాయించామన్నారు. ప్లాట్ ధరలో 10 శాతం చెల్లించి బుక్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వివరాలకు https://migapdtcp.ap.gov.in లేదా https://crda.ap.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చని, మరిన్ని వివరాలకు 0866-2527124లో సంప్రదించాలని సూచించారు.

లైంగిక దాడి బాధితులకు 'నిర్భయ' నిధులు

- అన్ని రాష్ట్రాలకు కేంద్రం లేఖ

సాక్షి, అమరావతి: లైంగిక నేరాలకు గురైన బాధిత బాలికల పట్ల ప్రత్యేక శ్రద్ధతో చర్యలు చేపడుతున్నట్లు కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ విషయమై అన్ని రాష్ట్రాల మహిళా శిశు సంక్షేమ శాఖలకు కేంద్ర మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ ఇంద్ర మల్లో గురువారం లేఖ రాశారు. లైంగిక నేరాలకు గురైన బాధితుల్లో 13–18 ఏళ్ల మధ్య వయసున్న బాలికలు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. సామాజిక కారణాలతో ఈ బాధితులు గర్భధారణ సమయంలోను, ఆ తర్వాత కాలంలోను సకాలంలో సహాయం, సహకారం పొందలేకపోతున్నారన్నారు. అటువంటి వారికి నిర్భయ ఫండ్‌నుంచి ఆర్థిక సాయం అందించాలని సూచించారు. మార్గదర్శకాలను www.wcd.nic.in,https://missionvatsalya.wcd.gov.inలో ఉంచినట్లు పేర్కొన్నారు.

మృగాడికి 20 ఏళ్ల జైలు

- ఒంగోలు పోక్సో కోర్టు తీర్పు

ఒంగోలు : మైనర్‌పై అత్యాచారానికి పాల్పడిన కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ ఒంగోలు పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎంఏ సోమశేఖర్ గురువారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2020 ఏప్రిల్‌లో కరోనా వ్యాప్తి కారణంగా విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించారు. ఈ సమయంలో దర్శి మండలానికి చెందిన 11 ఏళ్ల బాలిక ఇంటి వద్ద ఉండగా తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లారు. అదే గ్రామానికి చెందిన చాగంటి వెంకటేశ్వరరెడ్డి బాలికను మభ్యపెట్టి తన ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఘటనపై అప్పటి దర్శి ఏఎస్‌ఐ సాయిరెడ్డి కేసు నమోదు చేయగా డీఎస్పీ కేవీ ప్రకాశరావు విచారణ చేపట్టి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ యనమల వెంకటేశ్వర్లు వాదించారు. జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించడంతో పాటు, బాధితురాలికి రూ.50 వేలు పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థను కోర్టు ఆదేశించింది.

ఇక పోలీసు అధికారుల పల్లె నిద్ర

అసాంఘిక శక్తుల ఆట కట్టించడమే లక్ష్యం

- శాంతిభద్రతల పరిరక్షణ కూడా
- సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా
- ఎస్సై నుంచి ఉన్నతాధికారుల వరకు రోజుకో ఊరిలో గ్రామ సభల నిర్వహణ
- సమస్యలు తెలుసుకొని ప్రత్యేక యాప్‌లో డేటా నమోదు
- చిత్తూరు జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్‌గా మొదలు
- ఆ తర్వాత రాష్ట్రమంతా అమలు చేసే అవకాశం



సాక్షి, అమరావతి: మరికొద్ది నెలల్లో రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అసాంఘిక శక్తుల ఆట కట్టించడానికి పోలీసు శాఖ సిద్ధమవుతోంది. శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా కార్యాచరణను మరింత వేగవంతం చేస్తోంది. ముఖ్యంగా సమస్యాత్మక గ్రామాలపై నిఘాను మరింత పటిష్టం చేయనుంది. అందుకోసం పోలీసు అధికారులు 'పల్లె నిద్ర' కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఇందులో భాగంగా ఎస్సై స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు రోజుకో పల్లెలో గ్రామ సభ నిర్వహించి గ్రామస్తులతో విస్తృతంగా చర్చిస్తారు. అలాగే ఆ గ్రామాల్లోని సమస్యలను కూడా తెలుసుకుంటారు. గ్రామంలో అసాంఘిక శక్తులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. గ్రామాలవారీగా డేటాను సేకరించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. రాష్ట్రంలో ముందుగా చిత్తూరు జిల్లాలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టనున్నారు. ఇప్పటికే పోలీసు స్టేషన్ల వారీగా పల్లె నిద్రకు గ్రామాలను గుర్తించారు. చిత్తూరు జిల్లా తర్వాత రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అమలు చేయాలని భావిస్తున్నారు.

పోలీసుస్టేషన్ల వారీగా పల్లెనిద్ర..

పోలీసుస్టేషన్ల వారీగా అధికారులు 'పల్లె నిద్ర' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని గ్రామస్తులకు వివరిస్తారు. జైలు నుంచి విడుదలై వచ్చినవారిపై ప్రత్యేక నిఘా పెట్టడంతోపాటు స్థానికేతరులపై కూడా ఓ కన్నేసి ఉంచుతారు. అనంతరం ఆ గ్రామంలోనే నిద్రిస్తారు. ముఖ్యంగా జిల్లాలవారీగా సమస్యాత్మక గ్రామాల జాబితాను రూపొందిస్తున్నారు. ఆ గ్రామాల్లో ఎస్పీ, అదనపు ఎస్పీ స్థాయి అధికారులు పల్లె నిద్ర చేపడతారు. తొలిగా కార్యక్రమం చేపట్టనున్న చిత్తూరు జిల్లాలో సాధారణ గ్రామాలు 1,169, సమస్యాత్మక గ్రామాలు 597 ఉన్నట్టుగా గుర్తించారు. నియోజకవర్గాలవారీగా అయితే చిత్తూరులో 48, జీడీ నెల్లూరులో 75, పూతలపట్టులో 74, పుంగనూరులో 123, పలమనేరులో 132, కుప్పంలో 76, నగరిలో 76 సమస్యాత్మక గ్రామాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వారానికి రెండు గ్రామాల చొప్పున పల్లె నిద్ర నిర్వహించాలని నిర్ణయించారు.

యాప్ ద్వారా డేటా సేకరణ..

వివిధ కేటగిరీలుగా గ్రామాల వారీగా పోలీసు అధికారులు సమాచారాన్ని సేకరిస్తారు. ఆ డేటాను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. ఆ డేటా స్థానిక పోలీసు స్టేషన్ నుంచి జిల్లా ఎస్పీ కార్యాలయం వరకూ అందుబాటులో ఉంటుంది. శాంతిభద్రతల పరిరక్షణ కోసం చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, ఏదైనా సమస్య తలెత్తినా, ఘటన జరిగినా వెంటనే స్పందించి కార్యాచరణకు ఉపక్రమించేందుకు ఈ డేటా ఉపయోగపడనుంది.

శాంతిభద్రతల పరిరక్షణ.. అసాంఘిక శక్తుల కట్టడి..



అసాంఘిక శక్తులను కట్టడి చేయడంతోపాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసమే ఈ పల్లె నిద్ర కార్యక్రమాన్ని రూపొందించాం. ఇందులో మొత్తం పోలీసు యంత్రాంగం భాగస్వామ్యమవుతుంది. ప్రతి గ్రామానికి సంబంధించి పూర్తి సమాచారాన్ని అందుబాటులో ఉంచేందుకు ప్రత్యేక యాప్‌ను రూపొందించాం. దీంతో ప్రస్తుతం ఉన్న పోలీసు అధికారులకే కాదు.. తర్వాత బదిలీపై వచ్చే అధికారులకు కూడా డేటా ఉపయోగపడుతుంది. శాంతిభద్రతల పరిరక్షణ కోసం తగిన మార్గనిర్దేశం కూడా చేస్తాం.

– రిశాంత్‌రెడ్డి, ఎస్పీ, చిత్తూరు జిల్లా

పేదల సుఖసంతోషాలే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం అభినందనీయం
- 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్
- అందుకోసం ప్రత్యేక ప్రణాళికలు
- పేదల అభ్యున్నతి కోసం 17 రకాల పథకాలు
- వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా.. వర్చువల్‌గా మాట్లాడిన ప్రధాని మోదీ



వర్చువల్‌గా మాట్లాడుతున్న ప్రధాని నరేంద్రమోదీ

ప్రధానితో మాట్లాడుతున్న మహిళా రైతు రమణమ్మ, చిత్రంలో ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి

సింగరాయకొండ: పేద ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని, అందుకు ఏపీ ప్రభుత్వం అందిస్తున్న సహాయ, సహకారాలు అభినందనీయమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. 2047 సంవత్సరం నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందిస్తు న్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల అభ్యున్నతి కోసం 17 రకాల పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. ఆయా పథకాల గురించి అందరికీ తెలిసేలా చేయడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ముఖ్య ఉద్దేశమని వివరించారు. కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రకాశం జిల్లా కనిగిరి మండలం చాకిరాల పంచాయతీ భూతంవారిపల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు కొమ్మాలపాటి వెంకట రమణమ్మతో ప్రధాని మోదీ వర్చువల్‌గా మాట్లాడారు. డ్రోన్ ద్వారా సాంకేతిక పద్ధతిలో చేస్తున్న వ్యవసాయం ద్వారా ఆమెకు కలిగిన లబ్ధిని, అనుభవాలను చెప్పాలని మోదీ కోరారు. రమణమ్మ మాట్లాడుతూ తాను ఎంఏ బీఈడీ చదివానన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాల ద్వారా డ్రోన్ ద్వారా వ్యవసాయం చేస్తున్నానని తెలిపారు. అందుకోసం ఆచార్య రంగా యూనివర్సిటీలో 12 రోజుల పాటు శిక్షణ పొందానన్నారు. ఈ విధానం ద్వారా తక్కువ ఖర్చుతో వ్యవసాయం చేసుకుంటున్నానని, నీటి అవసరం కూడా బాగా తగ్గిందని ఆమె చెప్పారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ ప్రతి రైతూ సాంకేతిక పద్ధతిలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. అలాగే సింగరాయకొండ మండలంలోని పాకల గ్రామంలోని మరికొంతమందితోనూ ప్రధాని మోదీ వర్చువల్‌గా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం కూడా తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నదని కొనియాడారు. అనంతరం 24 స్వయం సహాయ గ్రూపులకు రూ.4.80 కోట్ల విలువైన బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులు అందించారు. పారిశుధ్య పనులు చేస్తున్న క్లాప్ మిత్రలను సత్కరించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం చేశారు. ఆయుష్మాన్ భారత్ కార్డులను లబ్ధిదారులకు అందించారు. ఉజ్వల భారత్ పథకంలో భాగంగా గ్యాస్ కనెక్షన్లను లబ్ధిదారులకు ఉచితంగా అందజేశారు. డ్రోన్ వినియోగంలో శిక్షణ పొందిన రమణమ్మకు లైసెన్స్ పత్రాన్ని అందజేశారు. కలెక్టర్ దినేష్‌కుమార్, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రోగ్రాం జిల్లా ఇన్‌చార్జి ఎం.రామచంద్రుడు, జేసీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లోనూ పశు వైద్యసేవలు

- రైతు భరోసా కేంద్రాల్లో రూ.24 కోట్ల విలువైన మందులు
- ప్రతీ ఆర్బీకేకు రూ.33 వేల విలువైన 105 రకాల మందులు
- రూరల్ లైవ్‌స్టాక్ యూనిట్లుగా 'ఆర్బీకే'లు
- రూ.16.90 కోట్ల విలువైన లిక్విడ్ నైట్రోజన్ కంటైనర్లు



సాక్షి, అమరావతి: మూగ, సన్న జీవాలకు మెరుగైన, నాణ్యమైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను మరింతగా పటిష్టపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గతంలో పశువులకు ఏ చిన్న సమస్య వచ్చినా మండల కేంద్రంలో ఉండే పశు వైద్యశాలలు, డిస్పెన్సరీలకు పరుగులెత్తాల్సి వచ్చేది. దీనివల్ల సకాలంలో వైద్యసేవలు పొందలేక పాడి రైతులు పడరాని పాట్లు పడేవారు. గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన ఆర్బీకేలను రూరల్ లైవ్‌స్టాక్ యూనిట్లుగా తీర్చిదిద్దడంతో పాడి రైతుల వెతలకు చెక్ పడింది. రాష్ట్రంలో మొత్తం 10,778 ఆర్బీకేలుండగా.. 7,272 ఆర్బీకేల పరిధిలో పాడి సంపద అధికంగా ఉంది. వీటిలో 4,652 ఆర్బీకేల్లో గ్రామ పశు వైద్య సహాయకులు, మిగిలిన ఆర్బీకేల్లో రూరల్ లైవ్‌స్టాక్ యూనిట్ల (ఆర్ఎల్‌యూ) సిబ్బంది సేవలందిస్తున్నారు. రేషనలైజేషన్ అనంతరం 1,896 ఆర్బీకేల పరిధిలో వీఏహెచ్ఏలు అవసరమని గుర్తించగా.. ఆ పోస్టుల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ జారీ చేశారు.

ప్రతి ఆర్బీకేలో 105 రకాల మందులు

పాడి సంపద ఉన్న ప్రతి ఆర్బీకేలో రూ.10 వేల విలువైన ట్రెవీస్ (ఇనుప చట్రాల)ను ఏర్పాటు చేశారు. కృత్రిమ గర్భోత్పత్తి కోసం పశు వీర్యాన్ని నిల్వ చేసేందుకు వీలుగా రూ.16.90 కోట్ల విలువైన లిక్విడ్ నైట్రోజన్ కంటైనర్లను ఆర్బీకేల్లో అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రతి ఆర్బీకేలో 105 రకాల మందులను అందుబాటులో ఉంచుతున్నారు. మూడేళ్లలో ఆర్బీకేల ద్వారా రూ.24.30 కోట్ల విలువైన మందులను పంపిణీ చేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి ప్రత్యేకంగా రూ.24 కోట్ల విలువైన మందులను అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేశారు.

ప్రతి ఆర్బీకేలో రూరల్ లైవ్ స్టాక్ యూనిట్



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఆర్బీకేల ద్వారా నాణ్యమైన సేవలందించేందుకు కృషి చేస్తున్నాం. ప్రతి ఆర్బీకేను ఓ రూరల్ లైవ్‌స్టాక్ యూనిట్‌గా తీర్చిదిద్దాం. మూడేళ్లలో రూ.24.30 కోట్ల విలువైన మందులను పంపిణీ చేస్తే.. ఈ ఏడాది ప్రత్యేకంగా రూ.24 కోట్ల విలువైన మందులను అందుబాటులో ఉంచుతున్నాం.

– డాక్టర్ సీదిరి అప్పలరాజు, పశు సంవర్ధక శాఖ మంత్రి

క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు

ఆర్బీకేల ద్వారా పశువులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేస్తున్నారు. జబ్బుపడిన జంతువులకు ప్రథమ చికిత్స అందించడంతో పాటు రైతుల ఇంటి గుమ్మం వద్దనే రోగ నిరోధక టీకాలు వేస్తున్నారు. నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇనాఫ్ ట్యాగ్‌లు వేస్తున్నారు. ప్రతి మూగ జీవానికి హెల్త్ కార్డులు ఇస్తున్నారు. కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా ఆర్థిక చేయూత అందిస్తున్నారు. ప్రతి వారం పశువైద్యులు ఆర్బీకేలను సందర్శిస్తూ వీహెచ్ఏల సహాయంతో సేవలందిస్తున్నారు.

మహిళాభివృద్ధికి మోదీ కృషి

- కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్
- సత్యసాయి జిల్లాలో 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'లో పాల్గొన్న మంత్రి
- 'నాసన్'లో అభివృద్ధి పనులపై సమీక్ష



కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి బుగ్గన

గోరంట్ల: దేశంలో మహిళల అభివృద్ధికి మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. ఆమె గురువారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రావత్, అజేయ్‌జైన్‌తో కలిసి శ్రీసత్యసాయి జిల్లా గోరంట్లలో పర్యటించారు. గోరంట్ల బాలుర ఉన్నత పాఠశాలలో కలెక్టర్ అరుణ్‌బాబు అధ్యక్షతన జరిగిన 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'లో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ... ఆయుష్మాన్ భారత్, పీఎం గరీబ్ కళ్యాణ్ అన్న యోజన, పీఎం ఆవాస్ యోజన, పీఎం ఉజ్వల యోజన, పీఎం విశ్వకర్మ, పీఎం కిసాన్, కిసాన్ క్రెడిట్ కార్డ్, పోషణ్ అభియాన్, జల్ సహా 10 ప్రభుత్వ పథకాల గురించి విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా మహిళలకు లబ్ధి కలిగేలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగంపై స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. 15,000 మంది మహిళలకు డ్రోన్లు అందజేస్తామన్నారు. ఇందుకోసం రానున్న రెండు ఆర్థిక సంవత్సరాల్లో కేంద్రం రూ.1,261 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద 1.57 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టామన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డు ద్వారా జిల్లాలో 27 వేల మందికి లబ్ధి కలిగిందన్నారు. అనంతరం ఉజ్వల 2.0 పథకం లబ్ధిదారులకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి గ్యాస్ కనెక్షన్, స్టౌ అందజేశారు. ఆ తర్వాత నిర్మలా సీతారామన్ పాలసముద్రం సమీపంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ నార్కోటిక్స్ (నాసన్)లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై ఆ సంస్థ, జిల్లా అధికారులతో సమీక్షించారు.

అర్హులకు పథకాలందించడమే వికసిత్ భారత్ లక్ష్యం

ప్రచార వాహనాన్ని ప్రారంభించిన గవర్నర్ జస్టిస్ అబ్దుల్‌నజీర్



వికసిత్ భారత్ సంకల్పయాత్ర ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న గవర్నర్ అబ్దుల్‌నజీర్

చిలకలపూడి (మచిలీపట్నం): అర్హులైన ప్రతి ఒక్కరికీ కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందాలని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్‌నజీర్ అన్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం మండల పరిధిలోని సుల్తానగరం సుమ కన్వెన్షన్ హాలులో గురువారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర డిజిటల్ ప్రచార వాహనాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి ఉజ్వల యోజన, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి తదితర పథకాలకు సంబంధించిన ప్రదర్శన శాలలను పరిశీలించారు. గవర్నర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్టాత్మక సంక్షేమ పథకాలు, వాటి ప్రయోజనాలు అర్హులైన ప్రజలందరికీ చేరవేయడం వికసిత్ భారత్ సంకల్పయాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక మాట్లాడుతూ ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్‌చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి, గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ లక్ష్మీశా, కలెక్టర్ పి.రాజాబాబు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తాతినేని పద్మావతి పాల్గొన్నారు.

కాఫర్ డ్యామ్‌ను పరిశీలించిన కేంద్ర బృందం



ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద సాయిల్ టెస్టింగ్ చేస్తున్న శాస్త్రవేత్తల బృందం

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు పనుల్లో ఎగువ కాఫర్ డ్యామ్ పటిష్టతను సీఎస్ఎంఆర్ఎస్ (సెంట్రల్ సాయిల్ అండ్ రాక్ మెటీరియల్ స్టేషన్) ఢిల్లీకి చెందిన బృందం సభ్యులు పరిశీలించారు. గురువారం ఈ బృందం సభ్యులు క్షేత్రస్థాయిలో నాణ్యతా ప్రమాణాలపై నమూనాలు సేకరించారు. గత సంవత్సరం వరదల సమయంలో ఎగువ కాఫర్ డ్యామ్ నుంచి సీఫేజ్ రావడం, దీని నిర్మాణం గడువు కూడా ముగియడంతో పటిష్టతపై క్షుణ్ణంగా పరిశీలన జరుపుతున్నారు. బృందం సభ్యులైన శాస్త్రవేత్తలు సత్యజిత్ రాయ్, డాక్టర్ శ్రీనయ్యజకుల, ఎస్‌హెచ్ హరిదేవ్, డాక్టర్ మనీష్ గుప్త, ల్యాబ్ అసిస్టెంట్ శివ్ చరణ్ బృందంలో ఉన్నారు. ప్రాజెక్టు ఈఈ మల్లికార్జునరావు, డీఈ శ్రీనివాసరావు, మెగా ఇంజనీరింగ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆ రైతులను ఆదుకుంటాం

- యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులతో సీఎస్ సమీక్ష



సాక్షి, అమరావతి : వైఎస్సార్ జిల్లా తుమ్మలపల్లిలో ఏర్పాటు చేసిన యురేనియం ప్లాంట్‌కు భూములిచ్చిన రైతులను ఆదుకోవడంతో పాటు ప్లాంటు పరిసర గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఆ కంపెనీతో పాటు ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని సీఎస్ డా.కేఎస్ జవహర్‌రెడ్డి స్పష్టం చేశారు. యురేనియం ప్లాంటుకు సంబంధించిన వివిధ అంశాలపై గురువారం తన క్యాంపు కార్యాలయంలో యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీఎండీ డా.సీకే అసనానితో పాటు సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. సీఎస్ మాట్లాడుతూ వేల్పుల, మబ్బు, చింతలపల్లి.రచ్చకుంటపల్లి, భూమయ్యగారిపల్లి, తుమ్మలపల్లి, కేకే కోట్ల, కానం గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. డా.సీకే అసనాని మాట్లాడుతూ 2022–23లో యూసీఐఎల్ తరఫున కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) కింద ఆయా గ్రామాల్లో రూ.2 కోట్లకు పైగా ఖర్చు చేసి వివిధ మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. సమావేశంలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ప్రారంభం



బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎండీ ఇట్టిరా డేవిస్, బ్యాంకు ప్రతినిధులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): దేశంలోని 26 రాష్ట్రాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఏపీలో తొలి బ్రాంచ్‌ని విజయవాడ, బెంజిసర్కిల్‌లో గురువారం ప్రారంభించింది. హోటల్ డీవీ మానర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ ఇట్టిరా డేవిస్ మాట్లాడుతూ విజయవాడలో ప్రారంభించిన శాఖలతో కలిపి ఇప్పటికి 700 శాఖలు ఏర్పాటు చేసినట్లయిందన్నారు. సూక్ష్మ, చిన్నస్థాయి సంస్థలకు రూ.10 లక్షల నుంచి రూ.10 కోట్ల వరకు, గృహాలకు రూ.5 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో రాజమండ్రి, విశాఖపట్నంలలో తమ శాఖలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

మూడు రాజధానులే ప్రధాన అజెండా

1,159వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: మూడు రాజధానులే ప్రధాన అజెండాగా ఎన్నికలకు వెళ్లాలని వైఎస్సార్‌సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి 5 కోట్ల మంది రాష్ట్ర ప్రజల తరఫున విజ్ఞప్తి చేస్తున్నామని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,159వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో గురువారం పలువురు మాట్లాడారు. విశాఖ వేదికగా పరిపాలనా రాజధాని ఏర్పాటు చేయడం అన్ని వర్గాల సమానాభివృద్ధి కోసమేనని కులవాదులు గుర్తుంచుకోవాలని, అభివృద్ధి అంతా ఒకే ప్రాంతంలో కేంద్రీకరిస్తే మిగిలిన ప్రాంతాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. బాబును కాపాడేందుకు కులవాదులు చేస్తున్న కుయుక్తులు ఫలించవన్నారు. 85 శాతం ఓటు బ్యాంకు ఉన్న బహుజనులు కన్ను తెరిస్తే.. గత ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడిన పార్టీలు రాబోయే ఎన్నికల్లోనూ డిపాజిట్లు దక్కించుకోలేవని హెచ్చరించారు. నాయకులు బేతపూడి రాజేంద్ర కుమార్, న్యాయవాది పెరికే వరప్రసాద్, మాదిగాని గురునాథం, పులి దాసు, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

రూ. 577 కోట్లతో కొత్త ఆస్పత్రుల భవనాలు

ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్ రెడ్డి

రాయచోటి: రాష్ట్రంలో పేద, మధ్యతరగతి వర్గాలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో సీఎం జగన్ రూ.577 కోట్లతో నూతన ఆసుపత్రుల భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టారని ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్ రెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి భవనాలను స్థానిక ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నాబార్డ్ నిధులతో 168 ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీలు, జిల్లా ఆసుపత్రులు, స్పెషాల్టీ ఆసుపత్రుల నిర్మాణాలు చేపట్టినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు డిసెంబర్‌లో అన్ని నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నా మన్నారు. ఇప్పటికే వంద భవనాలను పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చామని, రూ.20 కోట్లు పైబడి నిర్మాణాలు జరుగుతున్న కొన్ని ఆసుపత్రుల భవనాలను జనవరికల్లా పూర్తి చేస్తామన్నారు. ఇవేకాకుండా నూతనంగా రూ. 577 కోట్ల నాబార్డ్ నిధులతో ఆసుపత్రుల భవన నిర్మాణ పనులు టెండర్ దశలో ఉన్నాయని, త్వరలోనే నిర్మాణాలను ప్రారంభించి నిర్ణీత సమయంలోపు పూర్తి చేస్తామని చెప్పారు.

స్టేట్‌బ్యాంకులో 7 కేజీల బంగారం మాయం

- బ్యాంకు సిబ్బంది చేతివాటం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బ్యాంకు ఆర్ఎం రాజు
- బంగారం విలువ రూ. 4 కోట్ల 70 లక్షల పైమాటే



ఫిర్యాదు చేస్తున్న స్టేట్‌బ్యాంకు ఆర్ఎం రాజు, బ్రాంచి మేనేజర్ రాధాకృష్ణ

గార: శ్రీకాకుళం జిల్లా గార మండల కేంద్రంలోని స్టేట్‌బ్యాంకులో రూ. 4 కోట్ల 70 లక్షల విలువైన సుమారు 7 కిలోల బంగారం మాయమైన ఘటనలో బ్యాంకు సిబ్బందే సూత్రధారులని తెలుస్తున్నది. స్థానిక సీఐ ఎన్.కామేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు బ్యాంకులో 2,500 మంది బంగారం తనఖా పెట్టిన ఖాతాదారులుండగా, వీరిచ్చిన బంగారానికి ఒక్కో ఖాతాకు ఒక్కో బ్యాగు సిద్ధం చేస్తారు. ఈ బ్యాగుల్లో తొలుత 86 మాయమయ్యాయని అధికారులు గుర్తించారు. అయితే వీటిలో 26 బ్యాగులను అకౌంటెంట్ స్వప్నప్రియ మూడు రోజుల కిందట బ్యాంకు అధికారులకు అందించినట్లు తెలిసింది. మిగిలిన 60 బ్యాగుల వివరాల ఆధారంగా 7 కేజీల బంగారం ఆభరణాలు మాయమయ్యాయని నిర్ధారించారు. అయితే బంగారాన్ని బ్యాంకులో అందించిన అకౌంటెంట్ ఉరిటి స్వప్నప్రియ ఆత్మహత్య చేసుకోవడంతో.. బ్యాంకు సిబ్బంది పాత్రపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో నలుగురు బ్యాంకు సిబ్బందిపై అనుమానం ఉందని గురువారం బ్యాంకు రీజనల్ మేనేజర్ రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, నవంబర్ 24వ తేదీన బంగారం మాయమైందన్న ఆరోపణలు రాగా.. ఇప్పటివరకు అధికారులు పూర్తిస్థాయిలో తనిఖీ చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. దీనిపై ఆర్ఎం రాజును ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా దాట వేస్తుండడం గమనార్హం. బ్యాంకులో ఖాతాదారులు తనఖా పెట్టిన బంగారం మాయమయ్యే సమయంలో లాక్‌రూంలో ఉన్న సీసీ పుటేజీలే ఈ కేసు దర్యాప్తులో కీలకం కానున్నాయని పోలీసులు చెబుతున్నారు. ఇన్‌చార్జి డీఎస్పీ విజయకుమార్, శ్రీకాకుళం ఒకటో పట్టణ సీఐ ఎన్.సన్యాసినాయుడు, బ్యాంకు ఆర్ఎం రాజు, గార బ్రాంచి మేనేజర్ సీహెచ్ రాధాకృష్ణను విచారిస్తున్నారు.

రూ.1.8 కోట్ల విలువైన సెల్ ఫోన్లు స్వాధీనం

తిరుపతి క్రైమ్: తిరుపతి జిల్లా పరిధిలో పోగొట్టుకున్న కోటి 8 లక్షల రూపాయలు విలువచేసే 600 సెల్ ఫోన్లను రికవరీ చేశామని జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి తెలిపారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారికోసం మొబైల్ హంట్ వాట్సప్ 949017873 అప్లికేషన్ సేవల ద్వారా వచ్చిన ఫిర్యాదులను స్వీకరించామన్నారు. ఈ విధంగా గతంలో జిల్లా వ్యాప్తంగా ఆరు విడతల్లో రెండు కోట్ల 93 లక్షల రూపాయలు విలువ చేసే 1,630 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

వేడుకగా వీరభద్రేశ్వరుని రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కంప్లి: హరపనహళ్లి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద నుంచి వీరభద్రేశ్వరుని రథోత్సవం బుధవారం సాయంత్రం 6 గంటలకు జరిగింది. వీరభద్రేశ్వరుని అలంకరించిన పల్లకీలో స్వామిని ప్రతిష్ఠించి సకల వాయిద్యాలతో రథం చుట్టు ప్రదక్షిణలు జరిపి మూర్తిని రథం వద్దకు తీసుకుని వెళ్లి ప్రతిష్ఠించారు. చుట్టు పక్కల గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైభవంగా గంగాంబిక తెప్పోత్సవం


అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

కంప్లి: హగరిబొమ్మనహళ్లి తాలూకా హంపసాగరలో చారిత్రక గంగాంబిక తెప్పోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గంగాంబిక ఉత్సవ మూర్తిని అలంకరించిన తెప్పకు పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు అంబిగర పాలాక్షమ్మ సంప్రదాయక పూజలు జరిపారు. అంతకుముందు వివిధ కళా బృందాలతో గ్రామ శివార్లలోని తుంగభద్ర నది వరకు ప్రముఖ వీధులగుండా ఊరేగించారు.

ఆలయానికి వంట సామగ్రి పంపిణీ


వంట సామగ్రిని అందిస్తున్న మహిళలు

కంప్లి: ప్రభుత్వం అందించిన గృహలక్ష్మి పథకం నుంచి తమ ఖాతాలో పడిన సొమ్ముతో ఏదైనా సహాయం చేయాలని తీర్మానించి కూడ్లిగిలోని 18వ వార్డు అమరదేవరగుడ్డ మహిళలు శారదమ్మ, కొట్రమ్మ, శారద, వి.వీరమ్మ తదితరులు అమరేశ్వర, బసవేశ్వర దేవస్థానానికి కానుక రూపంలో వంట సామగ్రిని సమర్పించారు.

సక్రమంగా విధుల నిర్వహణకు సూచన


దేవేంద్రమ్మకు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న ఆర్టీసీ అధికారులు

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటక రోడ్డు రవాణా సంస్థ రాయచూరు విభాగంలో అధికారులు, సిబ్బంది, కార్మికులు సక్రమంగా విధులు నిర్వహించాలని ఆర్టీసీ డీసీ చంద్రశేఖర్ పేర్కొన్నారు. రాయచూరు ఆర్టీసీ డివిజనల్ కంట్రోలర్ల సంఘం పదాధికారుల పదగ్రహణ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థను లాభాల బాటలో నడిపించేందుకు కృషి చేయాలని కోరారు. ఆర్టీసీ డివిజన్‌లో కంట్రోలర్‌గా విధులు నిర్వహిస్తున్న దేవేంద్రమ్మను సన్మానించారు. ఈసందర్భంగా శ్రీశైలప్ప తదితరులున్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీ

రాయచూరు రూరల్: నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లోని స్కానింగ్ యంత్రాలను జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి సురేంద్రబాబు తనిఖీ చేశారు. గురువారం వివిధ నర్సింగ్ హోంలు, క్లినిక్‌లు, ఇతర ఆస్పత్రుల పని తీరును సమీక్షించి రోగులకు తక్కువ ధరకే స్కానింగ్ సేవలు అందజేయాలని యాజమాన్యాలకు సూచించారు.

ఆ ఆరోపణలు అవాస్తవం


మాట్లాడుతున్న డాక్టర్ గంగాధరగౌడ

బళ్లారి రూరల్: తనపై వచ్చిన లైంగిక ఆరోపణలు అవాస్తవమని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ గంగాధరగౌడ స్పష్టం చేశారు. గురువారం శిక్షకర భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. తాను ఓ మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలు నిజం కాదని తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. గత వారం ట్రామాకేర్ సెంటర్‌లో ఇద్దరు మహిళా కాంట్రాక్ట్ సిబ్బంది రోగుల ముందే పోట్లాడుకొని ఆసుపత్రి పరువు తీశారని వచ్చిన ఫిర్యాదుతో వారిద్దరిని విధుల నుంచి తొలగించామన్నారు. దీనికి ప్రతీకారంగా కాంట్రాక్ట్ సిబ్బంది నేత్రావతి, పార్వతి సూపరింటెండెంట్ శివునాయక్‌పైన, తనపైన లైంగిక వేధింపుల ఆరోపణలు చేసి కేసు పెట్టారన్నారు. ఇందులో నిజాలు లేవని, ఆసుపత్రిలోని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తే వాస్తవాలు తెలుస్తాయన్నారు. చట్టంపై తనకున్న గౌరవంతో ఎలాంటి విచారణకైనా పూర్తిగా సహకరిస్తానన్నారు.

సమాజోద్ధారకుడు కనకదాసు




బళ్లారిలో కనకదాసు ప్రతిమకు పూజ చేసిన మంత్రి, ఎమ్మెల్యే తదితరులు, కనకదాసు చిత్రపటానికి పూజలు చేసిన కేఆర్‌పీపీ నాయకులు, విమ్స్‌లో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్ డాక్టర్ గంగాధరగౌడ

- జయంత్యుత్సవ వేడుకల్లో అతిథులు
- వాడవాడలా భక్తిశ్రద్ధలతో పూజలు

సాక్షి,బళ్లారి: సాక్షాత్తు మహావిష్ణువునే ప్రసన్నం చేసుకున్న కనకదాసు గొప్ప సమాజోద్ధారకుడని అతిథులు కొనియాడారు. గురువారం కనకదాసు జయంతిని పురస్కరించుకుని నగరంలో ఏర్పాటు చేసిన జయంతి కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఆచరించారు. కుమారస్వామి ఆలయ సమీపంలో ప్రతిష్ఠించిన కనకదాసు ప్రతిమకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, కేఆర్‌పీపీ నాయకులు బీ.వీ.శ్రీనివాసరెడ్డి, జిల్లాధ్యక్షుడు దమ్మూరు శేఖర్‌లతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అన్ని పార్టీలకు చెందిన నేతలు కనకదాసు ప్రతిమకు పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. ఆ తర్వాత రాఘవ కళామందిరంలో కనకదాసు జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా, సీనియర్ న్యాయవాది ఎర్రెగౌడ, కురుబ సమాజ ప్రముఖులు మోహన్, గాదిలింగనగౌడ, నగర మాజీ ఉపమేయర్ శశికళ కృష్ణమోహన్, కణేకల్లు మల్లయ్య, రామలింగప్ప, బెణకల్లు బసవరాజు, బీ.ఎం.పాటిల్, అంజి పాల్గొన్నారు.

కలబుర్గిలో పోలీసుల లాఠీఛార్జి

కనకదాసు జయంత్యుత్సవ వేడుకల్లో పరస్పరం ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటన చోటు చేసుకుంది. గురువారం కనకదాసు జయంతి సందర్భంగా కలబుర్గిలో నిర్వహించిన కార్యక్రమంలో కనకదాసు చిత్రపటాన్ని నగరంలో ఊరేగిస్తుండగా కొందరు యువకుల మధ్య వాగ్వాదం జరిగి ఒకరిపై మరొకరు చేయి చేసుకునే పరిస్థితి ఏర్పడటంతో పెద్దలు జోక్యం చేసుకున్నా సద్దుమణగకపోవడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి లాఠీఛార్జి చేసి చెదరగొట్టారు.

జిల్లాలో పార్టీని బలోపేతం చేస్తాం

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బళ్లారితో పాటు 8 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేయనున్నట్లు కేఆర్‌పీపీ జిల్లా అధ్యక్షుడు దమ్మూరు శేఖర్ పేర్కొన్నారు. ఆయన బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కనకదాస జయంతిలో పూజలు నిర్వహించిన అనంతరం జిల్లాధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. తనపై నమ్మకంతో పార్టీ జిల్లాధ్యక్షుడుగా బాధ్యతలు అప్పగించడంపై హర్షం వ్యక్తం చేశారు. సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తామన్నారు. అనంతరం కనకదాస ప్రతిమ వరకు ర్యాలీగా వచ్చి పూలమాలలు వేశారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీ.వీ.శ్రీనివాసరెడ్డి, 10వ వార్డు కార్పొరేటర్ కోనంకి తిలక్, పార్టీ నాయకులు గోనాళ రాజశేఖరగౌడ, ఉమారాజ్, వెంకటరమణ, హంపీ రమణ, హుండేకర్ రాజేష్, మల్లికార్జున ఆచార్, మున్నాభాయ్ పాల్గొన్నారు.

కనకదాసు అందరికీ ఆదర్శనీయుడు

బళ్లారి రూరల్: సాధువు, సత్పురుషుడు భక్త కనకదాసు అందరికీ ఆదర్శనీయుడని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ గంగాధరగౌడ తెలిపారు. విమ్స్, కనక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శిక్షకర భవన్‌లో ఏర్పాటు చేసిన కనకదాసు జయంతి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కనకదాసు సామాజిక, అద్వైత, ఆధ్యాత్మిక బోధనలు, కీర్తనలు సర్వసమాజానికి మార్గాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్స్‌పాల్ డాక్టర్ కృష్ణస్వామి, డాక్టర్ బసవరాజ్ పాటిల్ కనకదాసు విశిష్టతను తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఖాసా సోమశేఖర్, ట్రామా కేర్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ శివునాయక్, డాక్టర్ సురేష్, దంత వైద్య కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్స్‌పాల్ డాక్టర్ దనుజ, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనకదాసు జీవితం అనుసరణీయం

రాయచూరు రూరల్: సమాజంలో దాసుల్లోకెల్ల కనకదాసు అత్యుత్తముడని, ఆయన జీవిత విధానాన్ని మనం అలవర్చుకోవాలని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ పేర్కొన్నారు. గురువారం గంజ్ సర్కిల్ వద్ద కనకదాసు ప్రతిమకు ప్రజా ప్రతినిధులు, అధికారులు పూజలు చేశారు. కనకదాసు చిత్రపటాన్ని ఊరేగించారు. వీరశైవ కళ్యాణమంటపంలో కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో మానవుడు సన్మార్గంలో పయనించాలని దారి చూపిన మహనీయుడన్నారు. నగర ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్, గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ, జెడ్పీ సీఈఓ రాహుల్ పాండే తుకారం, ఎస్పీ నిఖిల్, కురుబ సమాజ స్వాగత సమితి అధ్యక్షుడు బసవరాజ్, వేణుగోపాల్, హనుమంతులున్నారు. లింగసూగూరులో ఎంపీ రాజా అమరేశ్వర నాయక్, ఎమ్మెల్యే వజ్జల్ మానప్ప, మాన్విలో ఎమ్మెల్యే హంపయ్య నాయక్, సింధనూరులో ఎమ్మెల్యే హంపనగౌడ బాదర్లి కనకదాసు జయంతిలో పాల్గొన్నారు.

ఘనంగా కనకదాసు జయంతి

హొసపేటె: దాస శ్రేష్ఠ కనకదాస జయంతిని గురువారం నగరంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అభయ హస్త ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో కనకదాస చిత్రపటానికి జిల్లాధికారి దివాకర్ పూజ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఊరేగింపును ఆలయం వద్ద నుంచి ప్రారంభించి ప్రముఖ వీధుల ద్వారా పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులోని కనకదాసు సర్కిల్ వరకు ఊరేగింపుగా నిర్వహించారు. ఊరేగింపులో వీరగాసె, పూజ కుణిత, కంసాలె, కీలు కుదెరె, మూకీ చిత్రాలతో పాటు వివిధ బృందాలు చూపరులను ఆకట్టుకున్నాయి. అనంతరం మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న ఒడిదొడుకులను అరికట్టేందుకు కనకదాసు నిరంతంగా తన కీర్తనల ద్వారా ప్రజలను చైతన్యపరిచారన్నారు. జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు, ఎస్పీ శ్రీహరిబాబు, అదనపు జిల్లాధికారి అనురాధ, సమాజ పెద్దలు, వివిధ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కంప్లిలో..

కంప్లి: తాలూకా యంత్రాంగం ఆధ్వర్యంలో తాలూకా కార్యాలయంలో గురువారం కనకదాస జయంతిని జరిపారు. కనకదాస చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రముఖులు కనకదాసు గురించి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాజ్, సమాజ ప్రముఖులు పాల్గొన్నారు.


రాయచూరులో జరిగిన కనక జయంతిలో అవార్డులు అందుకున్న సమాజ సేవకులు


రాయచూరులో కనక జయంతి ఊరేగింపులో పాల్గొన్న వేషధారులు, వాయిద్య కళాకారులు


హొసపేటెలో కనక జయంతిని ఆచరిస్తున్న అధికారి దివాకర్, సమాజ పెద్దలు తదితరులు


కంప్లిలోని తహసీల్దార్ కార్యాలయంలో కనక జయంతిని ఆచరిస్తున్న అధికారులు, ప్రముఖులు

డ్రైవర్, క్లీనర్‌ను ఢీకొన్న లారీ

- డ్రైవర్ మృతి, క్లీనర్‌కు తీవ్రగాయాలు
- గుంతకల్లు వద్ద ప్రమాదం
- బాధితులు బళ్లారివాసులు


సంఘటనా స్థలం, ప్రసాద్ మృతదేహం

గుత్తి రూరల్: గుంతకల్లు పరిధిలో గుత్తి మండలంలోని కొజ్జేపల్లి– రజాపురం గ్రామాల మధ్య 67వ నంబర్ హైవేపై గురువారం వేకువజామున లారీ ఢీకొని ప్రసాద్ (48) అనే లారీ డ్రైవర్ మృతి చెందగా మల్లికార్జున అనే క్లీనర్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన ప్రసాద్, మల్లికార్జునలు లారీ డ్రైవర్, క్లీనర్‌లుగా పనిచేస్తూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలో నెల్లూరు నుంచి బొగ్గు లోడ్‌తో బళ్లారికి బయలుదేరారు. అయితే గుత్తి మండలం కొజ్జేపల్లి గ్రామ శివారులో లారీకి కప్పిన టార్పాలిన్ జారిపోయింది. దీంతో లారీని రోడ్డు పక్కన ఆపి రోడ్డుపై నిలబడి టార్పాలిన్‌ను బిగిస్తున్న సమయంలో గుంతకల్లు వైపు వెళ్తున్న లారీ వీరిద్దరినీ ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ ప్రసాద్ తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందగా క్లీనర్ మల్లికార్జున తీవ్రంగా గాయపడ్డాడు.

లారీని పట్టుకున్న స్థానికులు

వారిని ఢీకొన్న లారీ ఆగకుండా వెళ్లిపోవడంతో గమనించిన స్థానికులు లారీని వెంబడించి గుంతకల్లు మండలం గొల్లలదొడ్డి గ్రామం వద్ద పట్టుకున్నారు. తీవ్రంగా గాయపడిన క్లీనర్ మల్లికార్జునను చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తరువాత అనంతపురం పెద్దాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ స్టేషన్‌కు తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లాకప్‌డెత్ కేసులో ఎస్‌ఐతో సహా ముగ్గురిపై ఎఫ్‌ఐఆర్

శ్రీనివాసపురం: ముళబాగిలు తాలూకా నంగలి పోలీస్ స్టేషన్‌లో జరిగిన లాకప్‌డెత్ కేసులో ఎస్‌ఐతో సహా ముగ్గురు పోలీస్ సిబ్బందిని సస్పెండ్ చేసి వారిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. వివరాలు..ఓ చోరీ కేసుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లికి చెందిన బాలాజీ అనే వ్యక్తిని విచారణ కోసం సెప్టెంబర్ 17న స్టేషన్‌కు తీసుకు వచ్చారు. సీనియర్ అధికారుల దృష్టికి కూడా తేకుండా వేర్వేరు ప్రాంతాల్లో ఉంచి విచారణ చేశారు. అయితే పోలీస్ కస్టడీలో ఉండగానే అక్టోబర్ 1న బాలాజీ మరణించాడు. ఉన్నతాధికారుల దృష్టికి తేకుండా నిందితుడిని విచారణకు పిలుచుకు రావడం, కర్తవ్య లోప ఆరోపణలపై ఎస్పీ ఎం.నారాయణ నంగలి స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ సింగ్, కానిస్టేబుళ్లు మంజునాథ్, మహంతేష్ పూజారి అనే ముగ్గురిని సస్పెండు చేసి వీరిపై ఎఫ్‌ఐఆర్ కూడా దాఖలు చేశారు.

పీడీఓ ఆత్మహత్యాయత్నం

హుబ్లీ: మొబైల్‌లో వీడియా రికార్డు చేస్తూనే ఓ పీడీఓ విషం తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన గురువారం వెలుగు చూసింది. ధార్వాడ తాలూకా యరకొప్ప జీపీ పీడీఓ నాగరాజ్ ఆత్మహత్యయత్నానికి పాల్పడిన వ్యక్తి. ఈయన వీడియో రికార్డు చేస్తూ మల్లికార్జున అనే వ్యక్తి తనను చాలా ఇబ్బంది పెడుతున్నాడని వాపోయాడు. ఆయన ఇతర అధికారులకు కూడా ఇబ్బంది కల్గించారని పేరును చెబుతూనే తనను క్షమించాలని, తాను చనిపోతున్నానంటూ ఆ వీడియో చేస్తూనే విషం తాగాడు. అంతేగాక ఈ వీడియోను సోషల్ మీడియాలో షేర్ కూడా చేశాడు. ధార్వాడ–బెళగావి రోడ్డులో ఈ ఘటన చోటు చేసుకోగా, తీవ్రంగా అస్వస్థతకు గురైన నాగరాజ్ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై ధార్వాడ ఉపనగర పోలీసు స్టేషన్‌లో ఇంకా కేసు నమోదు కానట్లు తెలిసింది.

సెలవు రోజునా పాఠశాలపై మండిపాటు


ఆవరణలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

బళ్లారిటౌన్: రాష్ట్ర వ్యాప్తంగా గురువారం కనకదాసు జయంతి సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించినా సంగనకల్లు రోడ్డులోని విజ్డంల్యాండ్ పాఠశాలకు సెలవు ఇవ్వకుండా పాఠశాలను నడపడంపై పలువురు విద్యార్థులు తల్లిదండ్రులు మండిపడ్డారు. నగరంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు, వివిధ ప్రైవేట్ పాఠశాలలకు కూడా సెలవు ఉన్నా ఈ పాఠశాల మాత్రం ప్రత్యేకంగా తెరిచారని పలువురు తెలిపారు. దీనిపై పాఠశాల యజమానిని వివరణ కోరగా అథ్లెటిక్ క్రీడా పోటీలు, పరీక్షలు జరుగుతున్నందునే పాఠశాలను తెరిచినట్లు తెలిపారు. తాము ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేశామన్నారు.

నకిలీ వైద్యుడు అరెస్ట్


క్లినిక్‌పై దాడి చేసిన అధికారులు, పోలీసులు

హొసపేటె: విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకా శివపుర గ్రామంలో నివాసముంటున్న నకిలీ వైద్యుడిని కూడ్లిగి పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఎస్.మహ్మద్ రఫీ అనే వ్యక్తి తన వద్ద ఎలాంటి వైద్య విద్యాభ్యాస సర్టిఫికెట్ లేకుండా ఇంట్లోనే క్లినిక్ నడుపుతున్నాడు. తాను వైద్యుడినని గ్రామంలో చెప్పుకొంటూ వైద్య వృత్తిని కొనసాగిస్తున్నాడు. ఈ విషయంపై సమాచారం అందుకొన్న కూడ్లిగి తాలూకా వైద్యాధికారి ప్రదీప్ కూడ్లిగి పోలీస్ స్టేషన్‌లో నకిలీ వైద్యునిపై ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఆధ్వర్యంలో నకిలీ వైద్యుని క్లినిక్‌పై పోలీసులు దాడి చేసి నకిలీ వైద్యుడిని అదుపులో తీసుకొని క్లినిక్‌లో ఉన్న మందులను, సిరంజిలను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయంపై కూడ్లిగి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రకాష్ తెలిపారు.

జిల్లాలో 2,388 మందికి హెచ్‌ఐవీ


మాట్లాడుతున్న డీహెచ్‌ఓ డాక్టర్ రమేష్‌బాబు

బళ్లారిఅర్బన్: జిల్లాలో 2017 నుంచి అక్టోబర్ 2023 వరకు మొత్తం 6,82,567 మందికి ఐసీటీసీ కేంద్రాల ద్వారా కౌన్సిలింగ్ చేసి రక్త పరీక్షలు చేయగా వీరిలో 8 మంది చిన్నారులతో సహా 2,388 మందికి హెచ్‌ఐవీ సోకినట్లుగా నిర్ధారణ అయినట్లు డీహెచ్‌ఓ డాక్టర్ రమేష్‌బాబు తెలిపారు. గురువారం నగరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాలోని రెండు ఏఆర్‌టీ కేంద్రాలు, 7 లింక్ ఏఆర్‌టీ కేంద్రాలు పని చేస్తున్నాయన్నారు. 1988 నుంచి 4218 మంది వ్యాధికి బలయారన్నారు. వ్యాధి నిర్మూలనే ధ్యేయంగా ఆరోగ్య శాఖ కృషి చేస్తోందన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఇంద్రాణి మాట్లాడుతూ జిల్లాలోని హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నిర్వహణ యూనిట్ రాష్ట్రంలో ఆదర్శమైందన్నారు. 2022లో అత్యుత్తమ డ్యాప్‌కో అనే రాష్ట్ర స్థాయి ప్రశస్తి లభించిందన్నారు. ఈ దిశలో వ్యాధి నివారణకు ఎన్నో జాగృతి, అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు.

ఎయిడ్స్ కట్టడికి జాగృతి అవసరం


మాట్లాడుతున్న డాక్టర్ జగదీష్

కోలారు: ఎయిడ్స్, హెచ్‌ఐవీ వైరస్ నియంత్రణకు ప్రజలను జాగృతపరచాల్సిన అవసరం ఉందని జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖాధికారి డాక్టర్ జగదీష్ తెలిపారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైరస్ నుంచి ప్రబలే హెచ్‌ఐవీ వ్యాధి కష్టపడి పని చేసే యువత, గర్భిణులకు ఎక్కువగా సోకే అవకాశం ఉందన్నారు. జిల్లాలో 2023–24లో ఏప్రిల్ 2023 నుంచి అక్టోబర్ 2023 వరకు 60,333 మందిని పరీక్షించి 229 మంది హెచ్‌ఐవీ బాధితులను కనుగొన్నట్లు తెలిపారు. 16,296 మంది గర్భిణులను పరీక్షించగా, వారిలో 13 మందికి హెచ్‌ఐవీ సోకినట్లు తేలిందన్నారు. విశ్వ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని డిసెంబర్ 1న ప్రభుత్వ అతిథిగృహం నుంచి జాగృతి జాతాను ప్రారంభించి 11.30 గంటలకు టి.చెన్నయ్య రంగమందిరంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు కాళమ్మదేవి సర్కిల్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తారన్నారు. హెచ్‌ఐవీ నియంత్రణకు ఆరోగ్య శాఖ నుంచి పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ జి.ప్రసన్న కుమార్, ఐసీటీసీ జిల్లా సూపర్‌వైజర్ డీఎం హేమలత పాల్గొన్నారు.

వివాదాస్పద కమాను పనులు వద్దు


నగరసభ సమావేశంలో మాట్లాడుతున్న నేతలు


ఆందోళనకారులను శాంతింపజేస్తున్న పోలీసులు

రాయచూరు రూరల్: నగరంలోని సూపర్ మార్కెట్ వద్ద ఉన్న కాటే దర్వాజ కమాను నిర్మాణ పనులను నిలిపివేయాలని బీజేపీ నేతలు నగరసభ కమిషనర్ గురుసిద్దయ్యను ఒత్తిడి చేశారు. గురువారం నగరసభ కార్యాలయంలో ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్, మాజీ ఎమ్మెల్యే ఏ.పాపారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎన్.శంకరప్ప, బీజేపీ నాయకులు శంకర్‌రెడ్డి, రమానంద్ యాదవ్, విజయ రాజేశ్వరి, రవీంద్ర మాట్లాడారు. ఆ స్థలం పురాతన కాలం నుంచి ప్రజలు సంచరించే ప్రదేశమన్నారు. పురాతత్వ శాఖకు చెందిన స్థలం, వక్ఫ్ బోర్డుకు చెందినదని పేర్కొనడం తగదన్నారు. సూపర్ మార్కెట్ నుంచి తీన్ కందిల్ వరకు ఏకముఖ జన, వాహన సంచారానికి వీలు కల్పించాల్సింది పోయి నేరుగా కమాను నిర్మాణాన్ని నిలిపేయాలని కోరారు. నగరసభ కమిషనర్ గురుసిద్దయ్య స్పందిస్తూ ఈ విషయంపై జిల్లాధికారితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంతవరకు కమాను నిర్మాణ పనులను నిలిపి వేస్తామని హామీనివ్వడంతో గొడవ సద్దుమణిగింది.

బీజేపీ నేతల ఆందోళన

అంతకు ముందు కాటే దర్వాజ కమాను నిర్మించడం తగదంటూ బీజేపీ నేతలు ఆందోళనకు దిగారు. గురువారం కాటే దర్వాజ కమాను వద్ద బీజేపీ నేతలు శివరాజ్ పాటిల్, పాపారెడ్డి, శంకరప్ప, శంకర్‌రెడ్డి, రమానంద్ యాదవ్, శివ బసప్ప మాలిపాటిల్, నాగరాజ్ బాల్కి, నరసరెడ్డి, రాఘవేంద్ర, కనకవీడు, మహేంద్ర రెడ్డి, రవీంద్రలు ఆందోళన చేపట్టగా ముస్లిం యువకులు మూకుమ్మడిగా తరలి రావడంతో 15 నిమిషాల పాటు గందరగోళం నెలకొంది. పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టడానికి నానాయాతన పడ్డారు. డీఎస్పీ సత్యనారాయణ, సీఐలు నాగరాజ్, మహ్మద్, ఎస్ఐలు వైశాలి, మంజునాథ్, శ్రీనివాస్ శాంతింపజేశారు. నగరంలో శాంతి నెలకొందని, ఇలాంటి అక్రమ కట్టడాలకు అవకాశం కల్పించరాదని జిల్లాధికారిని కోరారు.

ఘనంగా రాజ్యోత్సవం


చిత్రపటాలకు కరవే పదాధికారుల పుష్పాంజలి

బళ్లారిఅర్బన్: జయ కరునాడు వేదిక జిల్లా అధ్యక్షులు యూసుఫ్ ఆధ్వర్యంలో గురువారం మోతి బ్రిడ్జిపైనున్న పార్కు పక్కన వేదికపై జెండాను ఆవిష్కరించి రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఏటా నవంబర్ 1 నుంచి 30 వరకు కన్నడిగులు రాజ్యోత్సవం జరుపుకోవడం సహజమేనన్నారు. అంతకు ముందు భువనేశ్వరి దేవి, మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూజలు నిర్వహించి కన్నడ పతాకాన్ని ఎగరవేశారు. వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఎస్.సతీష్, జిల్లా పదాధికారులు దేవరాజు, మోకా ఆది, మోకా హొన్నూరుస్వామి, నంజుండయ్య, రాజశేఖర్ యాదవ్, పద్మ, శారద, శోభారాణి, ఎస్.ఏంజలిన్, రామాంజిని, శంకర్ పాల్గొన్నారు.

సముదాయ భవనం నిర్మించరూ..


వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: తాలూకాలోని వడ్లూరులో సముదాయ భవనం నిర్మించాలని జైభీమ్ నవ చైతన్య సంఘం డిమాండ్ చేసింది. గురువారం జెడ్పీ కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో అధ్యక్షుడు రాజు మాట్లాడారు. గ్రామంలో నివసిస్తున్న 70 కుటుంబాలు శుభకార్యాలు చేసుకోడానికి సముదాయ భవనం నిర్మించాలని కోరుతూ జెడ్పీ అధికారి ప్రకాష్‌కు వినతిపత్రం సమర్పించారు.

వైద్య శిబిరాల లబ్ధి పొందండి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నిజాముద్దీన్

రాయచూరు రూరల్ : గ్రామాల్లో నిర్వహించే ఉచిత దంత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని యరగేర సహకార సంఘం అధ్యక్షుడు నిజాముద్దీన్ పేర్కొన్నారు. ఆయన గురువారం యరగేరలో ఏఎంఈ దంత వైద్య కళాశాల, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, యరగేర సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దంత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి శిబిరాల ద్వారా దంత రక్షణ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

పోలీసులను తోసేసి నిందితుడు పరారీ

హుబ్లీ: నగరంలోని ప్రధాన ఫ్యామిలీ కోర్టుకు నిందితుడిని హాజరు పరిచి తిరిగి హుబ్లీ జైలుకు తీసుకెళుతుండగా నిందితుడు పరారైన ఘటన గురువారం జరిగింది. దాండేలిలోని అంబెవాడికి చెందిన అహమ్మద్ ఖాన్ పరారైన నిందితుడు. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఆయనను కోర్టుకు తీసుకొచ్చారు. కోర్టు నిందితుడిని డిసెంబర్ 22 వరకు హుబ్లీ జైలులో ఉంచాలని ఆదేశించింది. కాగా విద్యానగర శిరూర్ పార్క్ వద్ద నిందితుడు బందోబస్తుగా ఉన్న పోలీసు సిబ్బందిని తోసేసి పరారైనట్లు విద్యానగర పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వంచనకు పాల్పడ్డ నిందితుడి అరెస్ట్

హుబ్లీ: స్వైపింగ్ మిషన్ ద్వారా ఆర్థిక మోసానికి పాల్పడిన నిందితుడిని గురువారం నగర సైబర్ క్రైం పోలీసులు మైసూరులో అరెస్ట్ చేశారు. పరారైన నిందితుడు స్వైపింగ్ మిషన్లను సరఫరా చేసే మంగళూరుకు చెందిన మహమ్మద్ ఆసీఫ్ కాగా ఇటీవల స్వైపింగ్ మిషన్ ద్వారా వంచించిన కేసులో సీఐ బీకే. పాటిల్ సారథ్యంలోని బృందం నిందితుడిని గాలిస్తూ మైసూరుకు వెళ్లింది. వంచనకు వినియోగించిన రెండు భారత్ పే స్వైపింగ్ మిషన్లు, రెండు మొబైళ్లు, ఒక ఏటీఎం కార్డును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వైపింగ్ మిషన్ తీసుకున్న నిందితుడు దాని ద్వారా విదేశీయుల ఏటీఎం కార్డుల రహస్య వివరాలను వినియోగించి కార్డుదారుల యజమానులే వస్తువులను కొనుగోలు చేసినట్లు మోసం చేసి డబ్బులను బదలాయించుకొని పరారయ్యాడు. కాగా ఈ కేసులో పరారీలో ఉన్న ఇతర నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.